


ఈనాడు

విజయవాడ 1-2-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 172

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఈనాడు



విజయవాడ 1-2-2026 ఆదివారం సిటీ సంపుటి 52 . సంచిక 172

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 8-00 పేజీలు 18+28 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

నేడే కేంద్ర బడ్జెట్



- సుస్థిరాభివృద్ధి, తయారీకి ప్రోత్సాహం, ఉద్యోగ కల్పనపై దృష్టికి అవకాశం
- ద్రవ్య క్రమశిక్షణకు, సంస్కరణలకు ప్రాధాన్యం దక్కుతుందని అంచనా
- వరుసగా తొమ్మిదోసారి ప్రవేశపెట్టనున్న నిర్మల
- మొరార్జీ దేశాయ్ తర్వాత అత్యధిక సార్లు పెట్టిన ఘనత సాధించనున్న మంత్రి

దిల్లీ: సుస్థిరాభివృద్ధిని కొనసాగిస్తూ.. సంస్కరణలను పరుగులు పెట్టించే లక్ష్యంతోపాటు అంతర్జాతీయ ఒత్తిళ్లను, సుంకాలను తట్టుకునే చర్యలకు ప్రాధాన్యమిస్తూ 2026-27 సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ఆదివారం పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఉదయం 11 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బడ్జెట్‌ను లోక్‌సభకు సమర్పించనున్నారు. వరుసగా తొమ్మిదోసారి ఆమె బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆదివారం బడ్జెట్‌ను (మిగతా 3లో)

అంబటి నోట మురికి మాటలు

సీఎం చంద్రబాబుపై తీవ్ర అసభ్య, అసహ్య పదజాలంతో దూషణ

- గుంటూరులో ఫ్లెక్సీ తొలగించేందుకు వెళ్తూ దారిలో వీరంగం
- రాంబాబు నివాసం, కార్యాలయంపై తెదేపా శ్రేణుల దాడి, పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు

రాత్రి అంబటిని అరెస్టు చేసిన పోలీసులు


కారులో వెళ్తూ సీఎం చంద్రబాబుపై అసభ్యకరంగా మాట్లాడుతున్న అంబటి రాంబాబు


అంబటిని అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా వైకాపా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి రెచ్చిపోయారు. ఈసారి అన్ని హద్దులూ మీరిపోయి మురికి భాషతో విరుచుకుపడ్డారు. ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబుపై రాయడానికి వీలుకాని తీవ్ర అసభ్య, అసహ్య పదాలు, బూతులతో దూషణలకు పాల్పడ్డారు. ఆగ్రహించిన కూటమి శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు దిగాయి. గుంటూరు సిద్ధార్థ నగర్‌లో శనివారం సాయంత్రం అంబటి రాంబాబు ఇల్లు, కార్యాలయంపై దాడి చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. అతనిపైనా దాడి చేశారు. రాష్ట్రవ్యాప్తంగానూ కూటమి శ్రేణుల నుంచి ఆగ్రహావేశాలు (మిగతా 2లో)


గుంటూరులోని అంబటి ఇంటిని చుట్టుముట్టిన కూటమి శ్రేణులు, జనం

జోగి నోరూ అదే తీరు

లోకేశ్‌కు చిప్ దెబ్బతిందంటూ దూషణ 2లో

వైకాపా హయాంలోనే.. కల్తీ నెయ్యి నిర్ధారణ

- అయినా సరఫరాదారులపై చర్యల్లేవు • పైగా అవే సంస్థల కొనసాగింపు
- నెయ్యి నమూనాలను సీఎఫ్‌టీఆర్‌ఐకు పంపాలని వైవీ సుబ్బారెడ్డి ఆదేశాలు
- అది కల్తీ నెయ్యేనని స్పష్టం చేసిన సీఎఫ్‌టీఆర్‌ఐ
- అభియోగపత్రం, నిందితుల రిమాండ్ రిపోర్టుల్లో ప్రస్తావించిన సిట్
- దర్యాప్తులోని అంశాలపై మరోసారి చర్చ..

ఈనాడు, అమరావతి: కలియుగ వైకుంఠం, పరమ పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా జరుగుతోందని వైకాపా హయాంలోనే నిర్ధారణైనా సరే.. సంబంధిత సరఫరాదారులపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోలేదు సరికదా ఆ సంస్థలనే యథాతథంగా కొనసాగించారని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నిగ్గు తేల్చింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీ, భోలే బాబా డెయిరీలు సరఫరా చేస్తున్న నెయ్యిలో వెజిటబుల్ ఆయిల్స్ కలిసి ఉన్నాయని, అది కల్తీ నెయ్యేనని స్పష్టం చేస్తూ ప్రతిష్ఠాత్మక సీఎఫ్‌టీఆర్‌ఐ (సెంట్రల్ ఫుడ్ టెక్నోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్), మైసూరు 2022 ఆగస్టు 3న తితిదేకు నివేదిక ఇచ్చినప్పటికీ దాన్ని తొక్కిపెట్టేసి.. ఏ ఒక్క సరఫరాదారుపైనా చర్యలు తీసుకోలేదని స్పష్టం చేసింది. అంతే కాకుండా కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారని పరీక్షల్లో తేలిన తర్వాత కూడా భోలేబాబా డెయిరీకి కిలో రూ.329 చొప్పున 1.07 లక్షల



కిలోలు సరఫరా చేసేందుకు 2022 ఆగస్టు 29న సరఫరా ఆర్డరు ఇచ్చారని పేర్కొంది. దాని ప్రకారం 2022 అక్టోబరు 28 వరకూ భోలేబాబా డెయిరీ తిరుమలకు నెయ్యి సరఫరా చేసిందని వెల్లడించింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీలు 2024 వరకూ సరఫరాదారులుగా కొనసాగాయని వివరించింది. తాజాగా దాఖలు చేసిన తుది అనుబంధ అభియోగపత్రంలోనూ, అంతకుముందు కోర్టుకు సమర్పించిన పలువురు నిందితుల రిమాండ్ రిపోర్టుల్లోనూ సిట్ (మిగతా 3లో)

నెయ్యిలో ముమ్మాటికీ జంతువుల కొవ్వు కలిసింది

- ఎన్‌డీడీబీ నివేదికలో, సిట్ ఛార్జ్‌షీట్‌లో స్పష్టంగా ఉంది
- సీఎం చంద్రబాబు తన బాధ్యతగా వాస్తవాలు చెప్పారు
- 2022లో సీఎఫ్‌టీఆర్‌ఐ నివేదికపై ఏం చేశారో సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి చెప్పాలి
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజం

3లో


అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తున్నాం

- పట్టణాల్లో ప్రత్యేకంగా సైకిల్ ట్రాక్‌ల ఏర్పాటు ఆలోచన
- ఐదేళ్ల వైకాపా పాపాలు ఒకేరోజు కడగలేను
- ప్రతినెలా 9న గ్రామాలకు వెళ్లి తప్పులు లేని భూరికార్డులు అందిస్తా
- చిత్తూరు జిల్లా తులసినాయనపల్లె సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, చిత్తూరు: గత ఎన్నికల్లో ప్రజలు సైకిల్‌కు ఓటేశారని.. ఇప్పుడు అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పర్యావరణ హితం కోసం అందరూ సైకిళ్లు కొనుగోలు చేసి తొక్కాలని పిలుపునిచ్చారు. సైక్లింగ్ కోసం పట్టణాల్లో ప్రత్యేకంగా ట్రాక్‌లు ఏర్పాటుచేసే ఆలోచన ఉందని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లాలోని సొంత నియోజకవర్గం కుప్పంలో మూడురోజుల పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు రెండోరోజైన శనివారం గుడుపల్లె మండలం బెగ్గిలిపల్లికి వెళ్లి విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. తర్వాత గ్రామంలోని మునెమ్మ, చిన్నతాయమ్మ, వెంకటరామప్పకు పింఛన్లు అందజేసి వారి కుటుంబ స్థితిగతులు తెలుసుకున్నారు.

ఈ-సైకిల్‌పైనే సభకు..

శాంతిపురం మండలం శివపురంలోని స్వగృహానికి చేరుకున్న చంద్రబాబు.. అక్కడి నుంచి ఈ-సైకిల్‌పై ర్యాలీగా తుమ్మిశి పంచాయతీలోని తులసినాయనపల్లెలో ఏర్పాటు చేసిన సభ(ప్రజావేదిక) వద్దకు వచ్చారు. 2.60 కి.మీ.మేర ఈ-సైకిల్‌ను తొక్కుకుంటూ వేదిక వద్దకు చేరుకున్నారు. సూపర్ సైకిళ్లుగా వాటికి పేరు పెట్టారు. 24 గంటల్లో కుప్పం నియోజకవర్గంలో 5,555 ఈ-సైకిళ్లను రాయితీపై ప్రజలకు పంపిణీ చేసి రికార్డు సృష్టించిన సందర్భంగా 'గిన్నిస్ వరల్డ్ రికార్డ్సు' సంస్థ ప్రతినిధి (మిగతా 3లో)


శివపురంలోని నివాసం నుంచి ఈ-సైకిల్‌ను తొక్కుకుంటూ సభావేదిక వద్దకు వస్తున్న సీఎం

ఈపీఎఫ్ గరిష్ఠ వేతన పరిమితి పెంపు?

కేంద్ర కార్మికశాఖ పరిశీలనలో ప్రతిపాదనలు

ఈనాడు, హైదరాబాద్: వేతన జీవులకు ఈపీఎఫ్ గరిష్ఠ వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ పథకాల్లో ఒకే వేతన పరిమితి అమలు చేయాలనీ భావిస్తోంది. సుదీర్ఘకాలంగా కనీస వేతన పరిమితి పెంచాలన్న కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. బడ్జెట్‌లో లేదంటే త్వరలో వడ్డీ ఖరారుకు జరిగే సెంట్రల్ బోర్డు ట్రస్టీల సమావేశంలో కేంద్రం ఈ మేరకు ప్రకటన చేసే అవకాశాలున్నాయి. అదేసమయంలో కనీస పింఛను పెంచే అంశంపైనా ప్రతిపాదనలు కొలిక్కి వచ్చినట్లు సమాచారం. ఈపీఎఫ్‌వో చందాదారులకు ప్రస్తుతమున్న కనీస పింఛను రూ.వెయ్యి నుంచి రూ.2-3 వేలకు పెంచే విషయాన్నీ పరిశీలిస్తోంది.

కంప్యూటర్ దీదీ.. దీదీకా దుకాణ్

గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు కేంద్రం కొత్త పథకం

- ప్రయోగాత్మకంగా గుంటూరు జిల్లా తాడికొండ మండలంలో అమలు
- డిగ్రీ, ఇంజినీరింగ్ చదివిన యువతకు అవకాశం

ఈనాడు – అమరావతి


తాడికొండ పంచాయతీలో ఏర్పాటుచేసిన కంప్యూటర్ దీదీ కేంద్రం

గ్రామీణ మహిళలకు డిజిటల్ ఉపాధి, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'కంప్యూటర్ దీదీ-దీదీకా దుకాణ్' పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. పైలట్ ప్రాజెక్టు కింద దేశవ్యాప్తంగా 5 రాష్ట్రాల్లో ఈ పథకాన్ని అమలు చేయగా.. అందులో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తాడికొండ మండలం ఉంది. యునిసెఫ్, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కేంద్రం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. 18-29 ఏళ్ల మధ్య వయసు ఉండి డిగ్రీ, ఇంజినీరింగ్, ఆపై ఉన్నత విద్య చదివిన యువతులు, మహిళల్ని ఈ పథకానికి ఎంపిక చేయనున్నారు. పైలట్ ప్రాజెక్టు కింద 2,500 మంది మహిళల్ని లక్షాధికారు (లఖ్‌పతి దీదీ)లుగా తయారుచేయాలన్నది లక్ష్యం. ఇది విజయవంతమైతే జాతీయ గ్రామీణ జీవనోపాధుల కార్యక్రమం (ఎన్‌ఆర్ఎల్ఎం) కింద ఈ పథకాన్ని (మిగతా 5లో)

అంబటి నోట మురికి మాటలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమయ్యాయి. అంబటిపై తక్షణమే చర్య తీసుకోవాలన్న డిమాండ్లతో ఎక్కడికక్కడ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. గుంటూరు జిల్లా తెదేపా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు, నల్లపాడు ఎస్సై కె.రామకృష్ణ చేసిన ఫిర్యాదుల మేరకు నమోదైన కేసుల్లో.. అంబటిని శనివారం రాత్రి 10.45 గంటల సమయంలో పోలీసులు అరెస్టు చేశారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీపై గుంటూరు అమరావతి రోడ్డులోని గోరంట్ల వద్ద 'మహాపాపం' పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్దకు శుక్రవారం వెళ్లిన మాజీ మంత్రి అంబటి రాంబాబు.. దాన్ని 24 గంటల్లో తొలగించాలని, లేకపోతే తామే తొలగిస్తామని హెచ్చరించారు. శనివారం ఉదయం రాంబాబు గోరంట్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి, ఫ్లెక్సీ ఉన్న రోడ్డులో కారులో వెళ్తుండగా, తెదేపా శ్రేణులు అడ్డుకున్నాయి. ఆగ్రహించిన రాంబాబు కారులోంచే బూతులు అందుకున్నారు. 'కొట్టమను.. కొట్టమను చూస్తాను నా కొడుకులను, రండిరా నా కొడకల్లారా రండిరా' అంటూ పదేపదే విరుచుకుపడ్డారు. ఆ సమయంలో రాంబాబుతో పాటు కారులో ఉన్నవారు తీసిన వీడియోల్లో ఈ బూతులన్నీ రికార్డయ్యాయి. ఈ అసహ్య, అసభ్య దూషణలపై కూటమి శ్రేణుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. కారుపై కర్రలు, పిడిగుద్దులతో దాడి చేశాయి. అక్కడి నుంచి వెళ్లిపోవాలని పోలీసులు రాంబాబుకు చెబుతున్నా వినిపించుకోకుండా.. మళ్లీ బూతులతో రెచ్చగొట్టారు. ఆయన కారులోంచి దిగేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. చివరకు అద్దాన్ని కిందకు దించి, చంద్రబాబుపై మురికి భాష వాడారు. అసభ్యంగా దూషించారు. తుదకు పోలీసులు అతన్ని అక్కడి నుంచి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది. కాసేపటికి అంబటి మురికి మాటలు సామాజిక మాధ్యమాలు, మీడియాలో ప్రసారం కావడంతో తీవ్ర దుమారం రేగింది. రాంబాబును అరెస్టు చేయాలంటూ తెదేపా శ్రేణులు డిమాండ్ చేశాయి.

కుక్క కూడా భయపడదంటూ కవ్వింపు

ఈ ఘటన జరిగాక అంబటి రాంబాబు సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 'చంద్రబాబు నాయుడిని తిట్టేశానంట. చంద్రబాబు, లోకేశ్ కలసి రాంబాబును ఇవాళ అరెస్టు చేసేయాలంట. చేసుకోండి. ఇప్పుడే కాదు, ఎప్పటి నుంచో సిద్ధంగా ఉన్నా. నీ రెడ్‌బుక్‌ను నా కుక్క కూడా లెక్కచేయదని చెప్పా. అరెస్టుకు సిద్ధంగా ఉన్నా. బెయిల్‌కు కూడా వెళ్లను. అరెస్టు చేస్తారని తెలుసు. పారిపోను. నా ఇంట్లోనే ఉంటా. మీరొచ్చి అరెస్టు చేయడమేంటయ్యా? తీసుకెళ్లండి, వెళ్లిపోతాను. ఈ రకంగా అన్యాయమైన, అక్రమమైన అరెస్టులు చేస్తారా మీరు? ఆ క్షణంలో నేను అన్న మాటలను ఆసరాగా తీసుకుని చంద్రబాబు చర్చించుకున్నాడంట! వెంటనే అరెస్టు చేయమన్నారంట! నా ఇంటి దగ్గర బలగాలను పెట్టారు. ఐ డోంట్ కేర్. మరోసారి చెబుతున్నా చంద్రబాబుకు, చంద్రబాబు కొడుక్కి! మీ రెడ్‌బుక్‌కి నా ఇంట్లో కుక్క, తోటలో ఉన్న రెండు కుక్కలు కూడా భయపడవ్. అరెస్టులకు సిద్ధపడే రాజకీయాల్లో ఉండాలని నిర్ణయించుకున్నా. ఇవాళ దొరికాననుకుంటున్నారు, కానీ దొరకలేదు. ఇంతమంది పోలీసులు ఉన్నారు కదా.. ఒక్కరి (నిరసనకారులనుద్దేశించి) దగ్గరి నుంచైనా రాడ్డు తీసుకున్నారా? కర్ర తీసుకున్నారా వెనక్కి? తీసుకోలేదు. నన్ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెడితే, రిమాండ్ విధిస్తే వెళ్తాను. జైల్లో ఉంటా. నీ సంగతి తేలుస్తాను చంద్రబాబు గుర్తుపెట్టుకో. భయపడేవాడు కాదు ఈ అంబటి రాంబాబు' అని ఆగ్రహంతో ఊగిపోయారు.

తెలుగు మహిళపై దాడి

అంబటి వ్యాఖ్యలను నిరసిస్తూ తెలుగు మహిళ నాయకురాలు లంకా మాధవి ఆయన ఇంటి వద్దకు వెళ్లి చెప్పు చూపించి నిరసన తెలిపారు. అక్కడే ఉన్న వైకాపా మహిళలు ఆమెను వెంబడించి కొట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగు మహిళలు, కార్యకర్తలు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, గల్లా రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున చీపుర్లు, కోడిగుడ్లతో వచ్చి నిరసన తెలిపారు. రాంబాబు బయటకు వచ్చి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అతనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంబటి ఫ్లెక్సీలను కర్రలతో కొడుతూ నిరసన తెలిపారు.

భగ్గుమన్న కూటమి శ్రేణులు

చంద్రబాబుపై అంబటి మురికి భాషపై ఎన్డీయే భాగస్వామ్య పార్టీల శ్రేణులు భగ్గుమన్నాయి. తెలుగు తమ్ముళ్లు, మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఇలా అన్నివర్గాల వారు రాంబాబు నివాసం, కార్యాలయంపై దాడిచేశారు. ఇల్లు, కార్యాలయం అద్దాలు, ఫర్నిచర్, ఏసీలు ధ్వంసమయ్యాయి. ఐదు కార్ల అద్దాలు పగిలాయి. ఆ సమయంలో రాంబాబు తన ఇంట్లో వైకాపా కార్యకర్తలతో కలసి ఉండగా, బయట పోలీసులు కాపలాగా ఉన్నారు. ఆందోళనకారులు కాసేపటికి రాంబాబు వైపు దూసుకెళ్లారు. పోలీసులు అడ్డుకున్నా, అతనిపై చేయిచేసుకున్నారు. కర్రలతో ఉన్న కొందరు వైకాపా కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పోలీసులు.. తెదేపా నేతలను బయటికి పంపించి గేట్లు వేసేశారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో దివ్యాంగులు వచ్చి నిరసన తెలిపారు. అంబటి గంజాయి మత్తులో నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలో అంబటికి సంఘీభావం తెలిపేందుకు వస్తున్న ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంను తెదేపా శ్రేణులు అడ్డుకున్నాయి. రాంబాబుతో పాటు వైకాపా నేతల కార్లు 5 ధ్వంసమయ్యాయి. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి వరకు అంబటి ఇల్లు, కార్యాలయం వద్ద ఆందోళన కొనసాగింది.





గుంటూరులోని అంబటి ఇంటి వద్ద తెదేపా కార్యకర్తల ఆగ్రహంతో ధ్వంసమైన వాహనం ● అంబటిని అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్న పోలీసులు



తన ఇంట్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో వైకాపా నేత అంబటి రాంబాబు

అల్లర్లు సృష్టించేందుకు 4 నెలలుగా యత్నం

- ఎస్పీకి తెదేపా నేతల ఫిర్యాదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అనుచిత వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై కేసు పెట్టి, అరెస్టు చేయాలని తెదేపా గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు డిమాండ్ చేశారు. తెదేపా నాయకులతో కలసి ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన సానుకూలంగా స్పందించారు. అనంతరం మాణిక్యరావు మీడియాతో మాట్లాడుతూ 'అంబటి రాంబాబు నాలుగు నెలలుగా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు. అనేకమందిని తిడుతూ రెచ్చగొడుతున్నారు. అతని బూతులకు రెచ్చిపోయి రాష్ట్రంలో అల్లర్లు జరిగితే ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలని కుట్ర పన్నుతున్నార'ని ఆరోపించారు. తెదేపా నేతలు డేగల ప్రభాకర్, చిట్టాబత్తిన చిట్టిబాబు మాట్లాడుతూ కొన్ని రోజులుగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న అంబటిని పోలీసులు ఎప్పుడో అరెస్టు చేసి ఉండాల్సిందన్నారు.

● రాంబాబు.. చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశాక తన వాహనంలో ముందుకు వెళ్తుండగా, ఆయన వాహనాన్నే అనుసరిస్తున్న మరో వాహనం వేగంగా వెళ్తూ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధిని ఢీకొట్టింది. ఆ విలేకరి కింద పడిపోయారు. అతనికి గాయాలైనా పట్టించుకోకుండా, వీడియో తీస్తూ వెళ్లిపోయారు.



ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేస్తున్న గుంటూరు జిల్లా తెదేపా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు తదితరులు

అంబటి అసభ్య వ్యాఖ్యలపై పెల్లుబికిన ఆగ్రహం

- భగ్గుమన్న మంత్రులు, తెదేపా నేతలు
- తక్షణమే అరెస్టు చేయాలని.. క్షమాపణ చెప్పాలని డిమాండ్

ఈనాడు, అమరావతి-న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం), పెనుకొండ, టెక్కలి, యలమంచిలి, గుత్తి, టి.నగర్: సీఎం చంద్రబాబును దూషించిన వైకాపా నేత అంబటి రాంబాబును వెంటనే అరెస్టు చేయాలని పలువురు నేతలు కోరారు. వైకాపా నేత బజారు రౌడీలా మాట్లాడుతుంటే.. జగన్ మౌనం పాటిస్తూ బూతుల సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అల్లకల్లోలం సృష్టించాలన్న జగన్ అండ్ కో కుట్రలో భాగమే అంబటి వ్యాఖ్యలని ఆరోపించారు.

ప్రజలు పాతాళానికి తొక్కినా... వైకాపాకు బుద్ధిరాలేదు

– రామ్మోహన్‌నాయుడు, కేంద్రమంత్రి

తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తున్న అంబటి రాంబాబు.. సీఎం చంద్రబాబుపై దూషణలకు దిగడం హేయం. ఇటువంటి ప్రవర్తన కారణంగానే జనం తిరస్కరణకు గురై 11 సీట్లకు పరిమితమైన వైకాపా.. ఇంకా అదే పంథాను కొనసాగిస్తుండటం దురదృష్టకరం. ప్రజలు పాతాళానికి తొక్కినా ఆ పార్టీకి బుద్ధిరాలేదు.

అంబటికి అసలైన సినిమా చూపిస్తారు

– పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్రమంత్రి

'అంబటి రాంబాబుకు అసలైన సినిమా ఏంటో చూపిస్తారు. 24 గంటల్లో రియాక్షన్ ఎలా ఉంటుందో చూస్తారు. మళ్లీ ఎవరూ ఇలా బరితెగించి మాట్లాడకుండా చట్టప్రకారం సరైన ట్రీట్‌మెంట్ ఉంటుంది' అని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రాంబాబు బరితెగించి సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

జగన్ కుట్ర: కొల్లు రవీంద్ర, ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి

వైకాపా నేతలు మదమెక్కి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో అశాంతిని రగిల్చేలా అంబటి లాంటి వారిని జగన్‌రెడ్డి రోడ్డుపైకి వదిలారు. అంబటి వ్యాఖ్యలకు సభ్యసమాజం సిగ్గుపడుతోంది. వైకాపా నేతల బరితెగింపు వ్యాఖ్యల వెనక జగన్ కుట్ర ఉంది.

అంబటి క్షమాపణ చెప్పాలి: బీసీ జనార్దన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి

అంబటి రాంబాబు తక్షణమే క్షమాపణ చెప్పాలి. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక వైకాపా బూతుల దాడికి దిగుతోంది. కల్తీ నెయ్యి కేసులో అడ్డంగా దొరికిన వైకాపా.. డైవర్షన్ రాజకీయాలకు తెరతీస్తోంది. కూటమి ప్రభుత్వ సహనాన్ని తక్కువగా అంచనా వేయవద్దు.

ప్రజలు సహించరు: ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ మంత్రి

సీఎం చంద్రబాబుపై అంబటి అనుచిత వ్యాఖ్యలు దారుణం. సీఎం పదవిలో ఉన్న వ్యక్తిని దూషించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. అంబటి బహిరంగ క్షమాపణ చెప్పాలి. రాజకీయ విమర్శలు హద్దు దాటితే ప్రజలు సహించరు.

వైకాపాను నిషేధించాలి: సవిత, బీసీ సంక్షేమశాఖ మంత్రి

సీఎం చంద్రబాబును దూషించడం క్షమించరాని నేరం. సంస్కార హీనుడైన అంబటి రాంబాబును తక్షణమే అరెస్టు చేయాలి. తల్లి, చెల్లి, మహిళలంటే జగన్‌కు గౌరవం లేదు. జగన్, వైకాపా నాయకులు రాజకీయాలకు అనర్హులు. తక్షణమే వైకాపాను ఎన్నికల సంఘం నిషేధించాలి. వైకాపా నాయకులంతా చంద్రబాబుకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలి.

నీచ రాజకీయాలకు నిదర్శనం: వాసంశెట్టి సుభాష్, కార్మిక శాఖ మంత్రి

అంబటి వ్యాఖ్యలు వైకాపా నీచ రాజకీయాలకు నిదర్శనం. వైకాపా నాయకులు చిందులు తొక్కుతూ, నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. బాధ్యతాయుతంగా ఉండటం మానేసి, బజారు భాషతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటు.

జగన్ అండ్ కో కుట్రలు: డీబీవీ స్వామి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి

ఎన్నికల్లో వైకాపాకు ప్రజలు వాతలు పెట్టినా ఆ పార్టీ నేతల్లో మార్పు రాలేదు. సీఎం చంద్రబాబుపై అంబటి జుగుప్సాకర వ్యాఖ్యలు చేయడం హేయం. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు జగన్ అండ్ కో కుట్రలు పన్నుతున్నారు.

సహించేది లేదు...: ఎం.రాంప్రసాద్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి

అధికారం కోల్పోయిన అసహనంతో గొడవలు పెట్టుకోవడం, నోటికి వచ్చినట్లు మాట్లాడటం వైకాపా నేతలకు అలవాటైంది. గతంలో పోలీసులను, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించిన చరిత్ర అంబటిది. ఇలాంటి వ్యాఖ్యలను సహించేది లేదు.

బుద్ధి మారలేదు: గొట్టిపాటి రవికుమార్, విద్యుత్‌శాఖ మంత్రి

సీఎం చంద్రబాబును ఉద్దేశించి అంబటి చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం. కల్తీ నెయ్యి వ్యవహారంలో దొరికిన వైకాపా.. డైవర్షన్ రాజకీయాలు చేస్తోంది. అందులో భాగంగా అంబటి అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయనకు వయసు పెరిగింది కానీ బుద్ధి మారలేదు.

దిగజారుడుకు పరాకాష్ఠ: కె.అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి

చంద్రబాబుపై అంబటి రాంబాబు చేసిన అసభ్య వ్యాఖ్యలు వైకాపా దిగజారుడుకు నిదర్శనం. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చూస్తూ ఊరుకోం. రాంబాబు వ్యాఖ్యలు హేయమైనవి.. కఠినచర్యలు తప్పవు.

సమాజంలో చోటు లేదు: నిమ్మల రామానాయుడు, జలవనరులశాఖ మంత్రి

నోటికొచ్చినట్లు మాట్లాడిన అంబటి రాంబాబుకు సభ్య సమాజంలో చోటు లేదు. ఆయనకూ తల్లిదండ్రులు ఉన్నారు.. వారిపై ఎవరైనా ఇలాంటి దూషణలకు పాల్పడితే అంబటి సహించగలరా? వెంటనే సీఎం చంద్రబాబు కుటుంబానికి క్షమాపణ చెప్పాలి. జగన్ కనుసన్నల్లోనే అంబటి సహా వైకాపా నేతలు అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు.

కనీస ఇంగితజ్ఞానం లేదు: టీజీ భరత్, పరిశ్రమలశాఖ మంత్రి

అంబటి రాంబాబు వ్యాఖ్యలు చూస్తే వైకాపా వారికి కనీస ఇంగిత జ్ఞానం లేదని అర్థమవుతోంది. సీఎంను ఉద్దేశించి ఇష్టానుసారంగా బూతులు మాట్లాడితే మేమంతా మౌనంగా ఉండాలా? థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తే అంబటి రాంబాబుకు మాటలు సరిగా వస్తాయి. వైకాపాను పూర్తిగా నిషేధించాలి.

ప్రజలే బుద్ధి చెబుతారు: నారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి

సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయి. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి. ఎన్నికల్లో ఓడిపోయినా వైకాపా నేతల తీరు మారలేదు. వారికి ప్రజలే బుద్ధి చెబుతారు.

వైకాపాకు రాజకీయాల్లో ఉండే అర్హత లేదు

– నాదెండ్ల మనోహర్, పౌరసరఫరాల శాఖ మంత్రి

రాష్ట్ర రాజకీయాల్లో ఉండే అర్హతను వైకాపా కోల్పోయింది. నీచ వ్యాఖ్యలు చేస్తూ రోజురోజుకూ వైకాపా నేతలు దిగజారుతున్నారు. అంబటి తక్షణమే క్షమాపణలు చెప్పాలి. వైకాపా పోకడలు చూసి ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. ఈసారి కనీసం ఒక్క సీటూ లేకుండా చేస్తారు.

అంబటిని బహిష్కరించాలి: కందుల దుర్గేశ్, పర్యాటకశాఖ మంత్రి

అంబటి రాంబాబూ నీది మనిషి జన్మేనా? నీచంగా మాట్లాడితే ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం. సీఎం చంద్రబాబు జోలికి వస్తే తాటతీస్తాం. ఇకపై నిజమైన సినిమా చూపిస్తాం. అంబటిని రాజకీయాల నుంచి బహిష్కరించాలి.

అంబటిని జగన్ సమర్థిస్తున్నారా?: సత్యకుమార్, వైద్యారోగ్యశాఖ మంత్రి

ప్రజాస్వామ్య విలువలు పాటించకుండా.. అహంభావంతో అంబటి చేసిన వ్యాఖ్యలు వైకాపా నైజానికి, ఆ పార్టీ నేతల వికృత చేష్టలకు దర్పణం. అంబటి వ్యాఖ్యలను జగన్ సమర్థిస్తున్నారా? ఈ ఘటనపై జగన్ స్పందించాలి.

తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని కించపరిచారు

– పల్లా శ్రీనివాసరావు, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న దార్శనికుడిని అంబటి రాంబాబు తన దూషణలతో అవమానించారు. చంద్రబాబుపై అతను చేసిన వ్యాఖ్యలు తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి. మా నాయకుడిని దూషించడం అంటే కోట్ల మంది తెలుగు బిడ్డల గౌరవాన్ని కించపరచడమే. అంబటి బహిరంగ క్షమాపణ చెప్పే వరకు విశ్రమించం.

ఉద్రిక్తతల నడుమ రాంబాబు అరెస్టు

- రాత్రి వరకూ కార్యాలయం వద్ద భారీ భద్రత

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబుపై మురికి వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత అంబటి రాంబాబును తీవ్ర ఉద్రిక్తతల నడుమ శనివారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఆరు గంటల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అతి కష్టమ్మీద వజ్ర వాహనంలో అతన్ని నల్లపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. వాహనంలోకి ఎక్కించే క్రమంలో కూటమి కార్యకర్తలు పెద్దఎత్తున కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. పెద్దఎత్తున నినాదాలు చేస్తూ రాంబాబును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు అంబటి కార్యాలయం గేటు లోపలికి వజ్ర వాహనాన్ని తీసుకెళ్లి, గదిలో నుంచి రక్షణ మధ్య తీసుకొచ్చి నేరుగా వాహనంలోకి ఎక్కించి తరలించారు. అతనితో పాటు వైకాపా నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్, యువజన విభాగం నాయకులు కళ్లం హరికృష్ణారెడ్డి, మరో ఇద్దరు మహిళా నాయకులను కూడా వజ్ర వాహనంలోనే స్టేషన్‌కు తరలించారు. అంబటి కార్యాలయంలో పదుల సంఖ్యలో ఉన్న వైకాపా నేతలను పోలీసులు బస్సులో బయటకు తరలించారు.

● అంబటి అరెస్టు సమయంలో, తర్వాత కూడా ఉద్రిక్తత కొనసాగింది. జనాన్ని పోలీసులు అక్కడి నుంచి బలవంతంగా తరలించాల్సి వచ్చింది. కొందరు నిరసనకారులు వజ్ర వాహనంపైకి ఎక్కగా, కొందరు రాళ్లు రువ్వారు. అరెస్టు తర్వాత కూడా తెదేపా శ్రేణులు అక్కడే ఉండడంతో పోలీసులు ఆ ప్రాంతంలో కొద్దిసేపు విద్యుత్తు సరఫరా నిలిపేశారు. అదే సమయంలో వైకాపా కార్యకర్తలు అంబటి కారుకు నిప్పుపెట్టినట్లు పోలీసులు తెలిపారు.

సాయంత్రం నుంచి ఉత్కంఠ

సాయంత్రం 5 గంటలకు విలేకరుల సమావేశంలో రాంబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, తర్వాత కూటమి శ్రేణులు ఆయన ఇల్లు, కార్యాలయాల వద్ద దాడికి పాల్పడిన నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసి అంబటిని అతని కార్యాలయంలోనే ఉంచారు. నిరసనకారులు లోపలికి వెళ్లేందుకు తీవ్రంగా యత్నించినా, అడ్డుకున్నారు.

ఈ రెండు కేసుల్లో అరెస్టు..

రాంబాబుపై నల్లపాడు పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. గుంటూరు జిల్లా తెదేపా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఇచ్చిన ఫిర్యాదుపై ఒకటి, పోలీసు విధులకు ఆటంకం కలిగించారని ఎస్సై ఇచ్చిన ఫిర్యాదుపై మరో కేసు పెట్టారు.

● 'గుంటూరులోని చిల్లీస్ సెంటర్ వద్ద రోడ్డుపై వెళ్తున్న ప్రజలను శనివారం ఉదయం అంబటి రాంబాబు భయభ్రాంతులకు గురిచేస్తూ తెదేపా కార్యకర్తలను చంపుతానని బెదిరించారు. బూతులతో తిడుతూ ఇక్కడ ఉంటే అంతు చూస్తానని అలజడి సృష్టించారు. చంద్రబాబును అసభ్యంగా దూషించారు. రాష్ట్రంలో అల్లర్లు, గొడవలు సృష్టించేలా కుట్ర పన్నారు. ముఖ్యమంత్రి పరువుకు భంగం కలిగేలా తిట్టినందున అంబటితో పాటు అతని వెంట ఉన్న వైకాపా కార్యకర్తలపై చర్యలు తీసుకోవాల'ని మాణిక్యరావు ఫిర్యాదులో కోరారు. దీనిపై పోలీసులు అంబటితో పాటు వైకాపా కార్యకర్తలపై బీఎన్ఎస్ 126(2), 196(1), 352, 351(2), 292 రెడ్ విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

పోలీసు అధికారి ఫిర్యాదుతో..

నల్లపాడు ఎస్సై కె.రామకృష్ణ ఫిర్యాదు మేరకు అంబటిపై మరో కేసు పెట్టారు. 'రాంబాబు చిల్లీస్ సెంటర్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెదేపా శ్రేణులు కట్టిన ఫ్లెక్సీని చింపడానికి ప్రయత్నించారు. ఉదయం 11.40 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగిస్తూ కారును రోడ్డుకు అడ్డంగా పెట్టడంతో ఇబ్బంది ఏర్పడింది. అక్కడే వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల బందోబస్తు విధుల్లో ఉన్న నేను, మా సిబ్బంది రోడ్డుపై కారు ఆపొద్దని, ప్రజలకు ఆటంకం కలిగించొద్దని చెప్పినా వినలేదు. 'ఏంట్రా మీరు చెప్తే నేను వినాలా. నేను కారును రోడ్డు మీద నుంచి తీయను' అంటూ మా విధులకు ఆటంకం కలిగించారు. కారులోంచి దిగే ప్రయత్నం చేస్తూ బలంగా కారు డోర్ నెట్టడంతో నాకు తగిలింది. అనంతరం మా సిబ్బందితో కలసి ఆయన్ను అక్కడి నుంచి పంపించేశాన'ని పేర్కొన్నారు. తమ విధులకు ఆటంకం కలిగించి, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించినందుకు రాంబాబుపై చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు సీఐ వంశీధర్ 126(2), 132 బీఎన్ఎస్ సెక్షన్ల కింద రాంబాబు ఏ1గా కేసు నమోదు చేశారు.



వైకాపా కార్యకర్తలను తరలిస్తున్న పోలీసులు

రాంబాబుపై చర్యలు తప్పవు

హోంమంత్రి వంగలపూడి అనిత



నక్కపల్లి, పెదనందిపాడు, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబును దారుణంగా దూషించిన వైకాపా నేత అంబటి రాంబాబుపై కేసు నమోదు చేస్తామని, చట్టప్రకారం చర్యలు తప్పవని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టీకరించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం సారిపల్లిపాలెంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఆమె వీడియో ప్రకటన విడుదల చేశారు. 'మీకంటే వయసులో పెద్ద అయిన సీఎం గురించి నీచాతినీచంగా, విద్వేషపూరితంగా మాట్లాడుతూ.. విధ్వంసం సృష్టించడానికి, శాంతి భద్రతలను విచ్ఛిన్నం చేయడానికి పన్నుతున్న పన్నాగం చూస్తుంటే.. మిమ్మల్ని ఏ జాతిలోకి తీసుకోవాలో తెలియడం లేదు' అని అన్నారు. 'ఆలయానికి వెళ్లి ప్రెస్‌మీట్ పెట్టి వెళ్లిపోతానని పోలీసుల అనుమతి పొందిన రాంబాబు... ఫ్లెక్సీలు తొలగించడానికి వెళ్తుంటే అక్కడ తెదేపా అభిమానులున్నారని, లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని పోలీసులు స్పష్టంచేసినా వారినీ దారుణంగా దూషించారు. సీఎం చంద్రబాబుపై నీచంగా మాట్లాడారు' అని అన్నారు.

రాంబాబును తరిమికొట్టాలి

– కొండపల్లి శ్రీనివాస్, మంత్రి

సీఎం చంద్రబాబుపై నీచమైన వ్యాఖ్యలు చేసిన రాంబాబును తరిమికొట్టాలి. ఇలాంటి దూషణలతో భావితరాలకిచ్చే సందేశం ఏమిటి? ప్రజాప్రతినిధి అంటే గౌరవప్రదంగా, ఆదర్శప్రాయంగా ఉండాలి.

నీట్ పీజీ రౌండ్-3 కౌన్సెలింగ్ పునఃప్రారంభం

ఈనాడు, అమరావతి: నీట్ పీజీ-2025కు సంబంధించిన మూడో రౌండ్ కౌన్సెలింగ్‌ను మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) పునఃప్రారంభించింది. ఈ దశలో కొత్త రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించడంతోపాటు.. అదనపు సీట్లు కూడా చేర్చినట్లు వెల్లడించింది. 50 శాతం ఆల్ ఇండియా కోటా (ఏఐక్యూ) సీట్లు, 100 శాతం డీమ్డ్ యూనివర్సిటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, ఏఎఫ్ఎంఎస్‌ల పరిధిలోని పీజీ కోర్సులకు ఈ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. తాత్కాలిక షెడ్యూలు ప్రకారం ఎంపికల నమోదుకు ఫిబ్రవరి 1వ తేదీన ఉదయం 11.55 గంటల వరకు, ఛాయిస్ లాకింగ్‌కు ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 12 గంటల నుంచి 2వ తేదీ వరకు గడువు ఇచ్చింది. సీట్ల కేటాయింపు, ఫలితాల ప్రకటన 3న, కేటాయించిన కళాశాలల్లో రిపోర్టింగ్‌కు 4 నుంచి 11వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు.

అంబటిపై దాడిని ఖండిస్తున్నా: జగన్

- రక్షణ కల్పించాల్సిన పోలీసులు దాడులకు కాపలా కాశారు



ఈనాడు, అమరావతి: 'అంబటి రాంబాబుపై తెదేపా కార్యకర్తలు గూండాల్లా హత్యాయత్నం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. మీ దుర్మార్గాలను ప్రశ్నిస్తే దాడులు, హత్యాయత్నాలు చేస్తారా' అని ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ సీఎం జగన్ శనివారం 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. 'తిరుమల లడ్డూ ప్రసాదానికి వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు, పందికొవ్వు కలిసిందంటూ మీరు చేసిన కుట్ర.. దేశంలోని ప్రతిష్ఠాత్మక ఎన్‌డీడీబీ, ఎన్‌డీఆర్ఐ ల్యాబ్‌లు ఇచ్చిన నివేదికలతో పూర్తిగా భగ్నమైంది. మీ తప్పులను దాచిపెట్టేందుకు మళ్లీ కొత్త కుట్రలకు తెరలేపుతున్నారు. దాంట్లో భాగమే ఈ దాడులు. నిజాలు బయటకొచ్చాయని తట్టుకోలేక హింసకు దిగుతారా? చట్టం, న్యాయమన్న పదాలకు అర్థంలేకుండా, మీరు ఆటవిక రాజ్యాన్ని సృష్టించారు. చంద్రబాబూ మీ ఆదేశాలతోనే రాంబాబు ఇంటిపైకి తెదేపా రౌడీలు వెళ్లారు. ఈ దుర్మార్గాన్ని అడ్డుకోవాల్సిన పోలీసులు.. దాడులకు కాపలా కాసినట్లుగా ప్రవర్తించడం దారుణం. మా పార్టీ సీనియర్ నాయకులపై వరుసగా దాడులు జరుగుతున్న నేపథ్యంలో గవర్నర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతున్నా' అని జగన్ పేర్కొన్నారు.

జోగి నోరూ అదే తీరు

- లోకేశ్‌కు చిప్ దెబ్బతిందంటూ దూషణ

ఈనాడు, అమరావతి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: మాజీ మంత్రి, వైకాపా నేత అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుపై మురికి మాటలతో రెచ్చిపోగా.. అదే కోవలో ఆ పార్టీకి చెందిన మరో మాజీ మంత్రి జోగి రమేష్... మంత్రి లోకేశ్‌పై అసభ్య పదజాలంతో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కల్తీ మాటలతో తెదేపా కల్తీగా మారింది. మంత్రి లోకేశ్‌కు చిప్ దెబ్బతింది. బుద్ధి తక్కువ రాజకీయాలు మానుకోవాలి. ఏడాదిన్నరలోనే రాష్ట్రాన్ని నాశనం చేశారు. తిరుపతి లడ్డూలో కల్తీ అంటూ చేసిన ప్రచారాన్ని సిట్ నిగ్గు తేల్చింది. తెదేపా నాయకులకు మంచి బుద్ధిని ప్రసాదించాలని పూజా కార్యక్రమాలు నిర్వహించా" అంటూ జోగి రమేష్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇంకా పత్రికలో రాయలేని భాషలో లోకేశ్‌ను దూషించారు. ఇబ్రహీంపట్నం ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం పూజలు నిర్వహించిన అనంతరం జోగి రమేష్ మీడియాతో మాట్లాడారు. "తెదేపా కల్తీ నాయకత్వంలో నడుస్తోంది. తిరుపతి లడ్డూ కల్తీ అన్నావు, పరకామణి కేసు అన్నావు. కల్తీ మద్యం అని కేసు పెట్టావు. కల్తీ మద్యం కేసుపై మాట్లాడుకోవడానికి చంద్రబాబు, లోకేశ్ రండి. సొంత సిట్ వేసుకొని నన్ను జైల్లో పెట్టి రాక్షసానందం పొందారు" అంటూ పేట్రేగి మాట్లాడారు.

అంబటిని వైకాపా నుంచి సస్పెండ్ చేయాలి

'ఎక్స్'లో భాజపా ఆంధ్రప్రదేశ్ శాఖ

ఈనాడు, అమరావతి: తెదేపా కార్యకర్తలను, సీఎం చంద్రబాబును ఉద్దేశించి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు అత్యంత హేయమైనవని.. జుగుప్సాకరమైనవి. మంత్రిగా పనిచేసిన వ్యక్తి కనీస రాజకీయ సంస్కారం, హుందాతనం మరచి అనుచిత వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం. ఈ ఘటన ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. అంబటిని వైకాపా వెంటనే సస్పెండ్ చేయాలి. లేకపోతే ఇది ఆ పార్టీ సంస్కృతిగా ప్రజలు భావించాల్సి వస్తుంది.

గ్రహం అనుగ్రహం

1-2-2026 ఆదివారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, శుక్ల పక్షం
పూర్ణిమ: తె. 4-17 తదుపరి బహుళ పక్ష పాడ్యమి
పుష్యమి: రా. 12-48 తదుపరి ఆశ్లేష
వర్జ్యం: ఉ. 9-27 నుంచి 10-59 వరకు
అమృత ఘడియలు: సా. 6-39 నుంచి 8-12 వరకు
దుర్ముహూర్తం: సా. 4-21 నుంచి 5-06 వరకు
రాహుకాలం: సా. 4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.6.36; సూర్యాస్తమయం: సా.5.51
మాఘ పూర్ణిమ

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	27.0
అనంతపురం	15.7	33.2
కడప	18.0	30.0
కర్నూలు	19.0	33.0
రాజమహేంద్రవరం	19.0	33.5
విశాఖపట్నం	19.8	29.8
గుంటూరు	20.0	31.0
తాడేపల్లిగూడెం	20.0	32.0
విజయవాడ	20.2	29.4
ఒంగోలు	20.6	30.3
నెల్లూరు	20.7	31.5
శ్రీకాకుళం	21.0	29.0

అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

అందజేసిన ధ్రువపత్రాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్, సైకిళ్లను అసెంబ్లింగ్ చేసిన ఇ-మోటరాడ్ సంస్థ ప్రతినిధులకు సీఎం అందజేశారు. 'లిమ్కా బుక్ ఆఫ్ రికార్డు'లోనూ ఇది నమోదైనట్లు ప్రకటించారు. ప్రజావేదిక సమీపంలోనే కుప్పం నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం సభలో ప్రసంగించారు. ఆ తర్వాత వివిధ సంస్థలు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. పీ4లోని బంగారు కుటుంబాలు, మార్గదర్శులుగా ఉన్న అదానీ ఫౌండేషన్, మేఘా ఇంజినీరింగ్, టీవీఎస్ మోటార్స్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడారు.

మహిళలతో ముఖాముఖి

'వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమంలో భాగంగా ఫ్రాంటియర్ మార్కెట్, మన రోవర్ సంస్థల నుంచి లబ్ధి పొందిన మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. సంబంధిత కంపెనీల ప్రతినిధులు.. డ్వాక్రా సభ్యులను ఏవిధంగా ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామో సీఎం చంద్రబాబుకు వివరించారు. అనంతరం కుప్పం నియోజకవర్గంలో.. రూ.675.24 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చిన సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్నారు. ఆదివారం తుమ్మిశిలో తెదేపా శ్రేణులతో సమావేశమై మూడు రోజుల పర్యటనను ముగించుకుని హైదరాబాద్‌కు వెళ్తారు.




సభకు హాజరైన ప్రజలు ★ ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

కొత్త విషయాలు అందిపుచ్చుకోవడం నా జీన్స్‌లోనే ఉంది

సభలో చంద్రబాబు మాట్లాడుతూ..'ఆవిష్కరణలకు నేను ప్రాధాన్యం ఇస్తా. కొత్త విషయాలు అందిపుచ్చుకోవడం నా జీన్స్‌లోనే ఉంది. ఈ-సైకిల్ తొక్కవద్దని భద్రతా సిబ్బంది చెప్పినా వారిని వారించా. అది ఎలా పనిచేస్తుందో తెలుసుకున్నా. నా ఆలోచనలు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. నూతన ఆలోచనలు చేస్తుంటా. కుప్పంలో ప్రారంభించిన ఈ-సైకిల్ భారతదేశ చరిత్రను మార్చే దిశగా దూసుకెళ్తుంది" అని వివరించారు. బస్సు ఎక్కితే బస్టాండ్ వరకే వెళ్తామని.. అదే సైకిల్ ఎక్కితే ఎక్కడికైనా దూసుకెళ్లవచ్చని సరదాగా వ్యాఖ్యానించారు. 'దేశంలోనే అత్యధిక పెన్షన్ మన రాష్ట్రమే ఇస్తోంది. కర్ణాటకలో నెలకు రూ.392 కోట్లు, తమిళనాడులో రూ.315 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అదే మనం నెలకు రూ.2,730 కోట్లు పెన్షనర్లకు చెల్లిస్తున్నాం. వాట్సప్ ద్వారా 800 పౌరసేవలు అందిస్తున్నాం. పింఛన్‌కు ఎవరు డబ్బులు అడిగినా, దురుసుగా ప్రవర్తించినా ఐవీఆర్ఎస్‌లో సమాచారం చెప్పండి. బాగా పనిచేసిన వాళ్లను అభినందిస్తా. సరైన దారిలో లేని వాళ్లను గాడిలో పెడతా. ప్రభుత్వ సేవల విషయంలో మీరు నాకు సరైన సమాధానం చెప్పినప్పుడే నేను మంచి నిర్ణయాలు తీసుకోగలను' అని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఇప్పటికీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం సరైందనే ఆయన అంటున్నారు

'ఐదేళ్లు రాష్ట్రాన్ని వైకాపా నాయకులు భ్రష్టు పట్టించారు. భూమిమీద హక్కు మీది. . దానిపై జగన్ ఫొటో ఎందుకు? ఇప్పటికీ ఆయన తన విధానమే మంచిదని అంటున్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టం సరైందని చెబుతున్నారు. పొలాల్లో తన చిత్రం శాశ్వతంగా ఉండాలని గెలాక్సీ గ్రానైట్ రాళ్లు వేసి అందులో ఆయన ఫొటో ముద్రించుకున్నారు. భూమికి సంబంధించి వివాదాలు ఉంటే రైతులు హైకోర్టుకు వెళ్లాలని ఆయన చట్టంలో చెప్పారు. అందుకే ఆ చట్టాన్ని రద్దు చేశాం. గత ప్రభుత్వం ఐదేళ్లలో చేసిన పాపాలు ఒకేరోజు కడగలేను. కొంత సమయం పడుతుంది. కొందరి భూములు 22ఏలో పెట్టారు. అదే సాకుతో పలువురు అధికారులు తప్పుడు వివరాలు నమోదు చేశారు. అన్నీ ప్రక్షాళన చేస్తున్నా. ప్రతినెలా 9వ తేదీన నేను ఒక గ్రామానికి వెళ్లి తప్పులు లేని భూమి రికార్డులు రైతులకు అప్పగిస్తా. క్యూఆర్ కోడ్‌ను పాసుపుస్తకాలపై ముద్రిస్తున్నాం. రికార్డులు మార్చడానికి వీలులేకుండా బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ప్రవేశపెడుతున్నాం. కుప్పంలో సంజీవని ప్రాజెక్టును అమలు చేస్తున్నాం. ప్రజలకు 42 వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం. నియోజకవర్గంలో రక్తహీనత, మధుమేహం, రక్తపోటు బాధితులు అధికంగా ఉన్నారు. ఎవరెవరికి ఏయే సమస్యలున్నాయో తెలుసుకుని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈ ఏడాది నుంచే రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టుకు శ్రీకారం చుడతాం. సంజీవని ప్రాజెక్టు దేశానికే ఆదర్శమవుతుంది' అని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.




ఈ-సైకిళ్ల పంపిణీకి సంబంధించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్సు ధ్రువపత్రాన్ని చంద్రబాబుకు అందిస్తున్న నిర్వాహకులు ★ చిత్తూరుజిల్లా బెగ్గిలిపల్లిలో చిన్నతాయమ్మకు పింఛన్ పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి

నేడే కేంద్ర బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశపెట్టనుండటం ఇదే తొలిసారి.

◆ దేశీయ డిమాండులో స్తబ్ధత, ద్రవ్యోల్బణం గరిష్ఠాల నుంచి ఓ మాదిరి స్థాయికి చేరడం, అంతర్జాతీయ అనిశ్చితి, భౌగోళిక ఉద్రిక్తతలు, కమాడిటీ రేట్లలో హెచ్చుతగ్గులు, ప్రధాన బ్యాంకుల ద్రవ్య లభ్యతలో అసమానతల వంటివి బడ్జెట్ అంచనాలపై ప్రభావం చూపే అవకాశముంది.

◆ స్థానికంగా వినియోగాన్ని పెంచాల్సిన ఒత్తిడిని ప్రభుత్వం ఎదుర్కొంటోంది. ఉపాధి అవకాశాలనూ పెంచాల్సి ఉంది. ద్రవ్యలోటును తగ్గించాల్సి ఉంది. మరోవైపు ఆదాయ పన్ను, జీఎస్టీల్లో కోతలతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడింది. ఇవి ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే అంశంలో ఆర్థిక మంత్రికున్న అవకాశాలను పరిమితం చేస్తున్నాయి.

◆ అంతర్జాతీయ అనిశ్చితి కారణంగా తలెత్తిన పరిస్థితుల నేపథ్యంలో సరికొత్త అభివృద్ధి పథాన్ని ఆవిష్కరించడం ఆర్థిక మంత్రికి అతి పెద్ద సవాలే.

◆ అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించడం కఠిన పరీక్షే. రూపాయి పతనం కారణంగా విదేశీ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లో అమ్మకాలు జరుపుతున్నారు.

పెట్రో ఆదాయంపై ఆధారపడతారా..

ప్రభుత్వానికి పాలిచ్చే ఆవులా మారిన పెట్రో రంగాన్నే మళ్లీ ఆదాయం పెంచుకోవడానికి ఆర్థిక మంత్రి నిర్మల ఎంచుకుంటారా అనే అభిప్రాయాన్ని నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. అయితే అంతర్జాతీయంగా పెట్రో ధరలు పెరుగుతుండటంతో ఈ రంగంలోనూ పరిమిత అవకాశాలే ఉన్నాయంటున్నారు. డీజిల్, పెట్రోలుపై ఎక్సైజ్ సుంకాన్ని పెంచే అవకాశముంది. అయితే ఆ భారాన్ని వినియోగదారులపై మోపకపోవచ్చు.

పెట్టుబడుల ఆకర్షణకు ప్రయత్నం..

నిబంధనలను సరళీకరించి నిర్మాణాత్మక సంస్కరణల ద్వారా దేశీయ, విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ఆర్థిక మంత్రి ప్రాధాన్యమిచ్చే అవకాశముంది.

◆ ఆర్థిక ఒత్తిడులున్నా వ్యయాల విషయంలో వెనక్కి తగ్గకపోవచ్చని అంటున్నారు. ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాంలకు కొత్త పథకాలను ప్రకటించవచ్చు.

◆ మూల ధన వ్యయాన్ని పెంచే చర్యలు చేపట్టవచ్చు. రైల్వేలు, పునరుత్పాదక ఇంధన వనరులు, విద్యుత్తు పంపిణీ, రక్షణ, పట్టణ రవాణా రంగాలకు ప్రాధాన్యం దక్కే అవకాశముంది. రాష్ట్రాలకు రుణ రహిత వడ్డీలను పెంచవచ్చు.

◆ చిన్న పరిశ్రమల ప్రోత్సాహకానికి క్రెడిట్ గ్యారంటీ కేటాయింపులను పెంచవచ్చు.

◆ గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజీ, విద్యుత్తు రవాణా, దేశీయంగా శుద్ధ ఇంధన పరికరాల తయారీకి ప్రాధాన్యం లభించవచ్చు.

పన్నుల్లో మార్పులు తక్కువే..

పన్నుల్లో భారీ మార్పులు ఉండకపోవచ్చని అంటున్నారు. ప్రత్యక్ష పన్నుల స్థిరీకరణపై ప్రభుత్వం దృష్టి సారించిన నేపథ్యంలో కార్పొరేట్ పన్నులను పెద్దగా కదిలించకపోవచ్చు. అయితే వినియోగాన్ని పెంచేందుకు వ్యక్తిగత ఆదాయ పన్నులో స్వల్ప ఊరట కల్పించవచ్చని భావిస్తున్నారు.

వరుసగా రికార్డు

నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇది తొమ్మిదోసారి. ఇప్పటి వరకూ మాజీ ప్రధాని మొరార్జీ దేశాయ్ అత్యధికంగా 10 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అయితే ఆయన వరుసగా ప్రవేశపెట్టలేదు. వేర్వేరు సమయాల్లో అందించారు. మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం మొత్తం 9 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. కానీ ఆయన వరుసగా చేయలేదు.

◆ నిర్మలా సీతారామన్ మరో అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఆమె 2019 మే 31న ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. 2026 జనవరి 31 నాటికి ఆమె ఈ పదవిలో 6 ఏళ్ల 8 నెలలు పూర్తి చేసుకున్నారు. గతంలో సి.డి.దేశ్‌ముఖ్ సుమారు 6 ఏళ్ల 2 నెలలపాటు నిరంతరాయంగా ఆర్థిక మంత్రిగా పని చేశారు.

వైకాపా నాయకుల చిందులు సిగ్గుచేటు

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో చుక్క నెయ్యి లేని, కేవలం నెయ్యి వాసన మాత్రమే వచ్చే రసాయనాన్ని తిరుమల శ్రీవారి లడ్డూలో వినియోగించినట్లు తేలితే.. సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందంటూ వైకాపా నాయకులు రోడ్లపై చిందులు వేయడం సిగ్గుచేటని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. గుంటూరు జిల్లా తెనాలిలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నెయ్యి పేరుతో వినియోగించిన పదార్థంలో ఎక్కడా నెయ్యి లేదని సిట్ నివేదిక స్పష్టం చేసిందన్నారు. వైకాపా ప్రభుత్వంలో 60 లక్షల కిలోల నెయ్యి పేరుతో రసాయన మిశ్రమాన్ని స్వామివారి లడ్డూ, మహాప్రసాదంలో వినియోగించారని, రూ.233 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దర్యాప్తులో ఎక్కడా క్లీన్‌చిట్ లేదని, వైకాపా నాయకులు ఆ పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించడం, ముఖ్యమంత్రిపై నోరు పారేసుకోవడం తగదని మండిపడ్డారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో న్యాయస్థానం పర్యవేక్షణలో పారదర్శకంగా దర్యాప్తు చేయిస్తుందని చెప్పారు.

మీ ఆదాయమే కాదు.. పేదల సంపాదననూ పెంచాలి

- పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సూచన

ఈనాడు, చిత్తూరు: పారిశ్రామికవేత్తలు ఆదాయాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టడమే కాకుండా సామాజిక బాధ్యత కింద పేదల సంపాదననూ పెంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ప్రభుత్వానికి ఎంత బాధ్యత ఉందో కార్పొరేట్ సంస్థలు, వ్యాపారులకూ అంతే బాధ్యత ఉందని గుర్తుంచుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆదాయ అసమానతలు లేని రాష్ట్రంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఆదాయం కొందరి వద్దే ఉందని.. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి అంతా కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై 'హెల్త్ స్కోర్' ఇస్తామన్నారు. చిత్తూరు జిల్లాలోని సొంత నియోజకవర్గం కుప్పంలో రెండో రోజు శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. శాంతిపురం మండలం తుమ్మిశిలో పీ4, వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. పరిశ్రమల్లో ఉత్పత్తిని ప్రారంభించడంపై పారిశ్రామికవేత్తలు ఇచ్చిన ప్రకటనలను ఈ సందర్భంగా వారికి సీఎం గుర్తు చేశారు. కొందరు ఆలస్యమయ్యే అవకాశం ఉందని చెప్పగా అలా కుదరదని స్పష్టం చేశారు. విద్యుత్తు సౌకర్యం కావాలని పలువురు కోరగా రెస్కో అధికారులను పిలిచి నెల-రెండు నెలల్లో పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే ఎస్పీడీసీఎల్ సహకారం తీసుకోవాలన్నారు. ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్‌ను.. ఆదివారం ఉదయానికి వచ్చి తనను కలవాలని ఆదేశించారు. పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడంలో గంట కూడా ఆలస్యం చేయొద్దని హెచ్చరించారు. జాప్యం జరిగితే అధికారులపై చర్యలు తీసుకుంటానని చంద్రబాబు స్పష్టం చేశారు.

వెనుదిరిగి చూసుకునే పరిస్థితి ఉండదు..

'డ్వాక్రా మహిళల్లో 99.8 శాతం మంది తీసుకున్న రుణం ఠంచనుగా చెల్లిస్తున్నారు. అందుకే వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలని భావిస్తున్నాం. ఏఐనూ మహిళలు సమర్థంగా వినియోగించుకోవాలి. బ్యాంకర్లు అప్పులు ఇవ్వడానికి ముందుకు రావాలి. ఎవరికైనా మొదటి రూ.10 లక్షలు సంపాదించడం కష్టం.. ఆ తర్వాత రూ.కోటి ఆదాయానికి చేరుకోవడం మరికొంత కష్టం. ఈ మొత్తం సంపాదిస్తే అనంతరం వెనుదిరిగి చూసుకునే పరిస్థితి ఉండదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు. . బ్యాంకర్లు ఇచ్చే రుణంలో 95 శాతం మొత్తానికి హామీగా ఉంటున్నాయి' అని చంద్రబాబు గుర్తు చేశారు. 'భవిష్యత్తులో కృష్ణపట్నం- రామాయపట్నం నౌకాశ్రయాలను అనుసంధానించి రవాణా సదుపాయాన్ని మెరుగుపరుస్తాం. రాష్ట్రంలో నీటి కొరత అన్నదే లేకుండా చూస్తాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. జనాభా పెరుగుదలకు సంబంధించి మార్చి 1న పాలసీ విడుదల చేస్తామని.. కుప్పం నుంచే ఈ విధానానికి శ్రీకారం చుడతామన్నారు.

బంగారు కుటుంబాల పర్యవేక్షణకు బంగారుమిత్రలు

బంగారు కుటుంబాల పర్యవేక్షణకు కుప్పంలో మేఘా ఇంజినీరింగ్, అదానీ ఫౌండేషన్, టీవీఎస్ మోటార్స్ సంస్థలు బంగారుమిత్రలను నియమించుకున్నాయని.. ఇది అభినందనీయమని సీఎం అన్నారు. 500-700 కుటుంబాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దీన్ని అమలు చేస్తామన్నారు.

నెయ్యిలో ముమ్మాటికీ జంతువుల కొవ్వు కలిసింది

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజం



ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వాడిన నెయ్యిలో ముమ్మాటికీ జంతువుల కొవ్వు కలిపారని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. జంతువుల కొవ్వు, వెజిటబుల్ ఆయిల్స్ కలిశాయని ఎన్‌డీడీబీ ల్యాబ్ 2024 జులై 12, 16వ తేదీల్లో తితిదేకి ఇచ్చిన నివేదికల్లో స్పష్టంగా పేర్కొందన్నారు. అదే విషయాన్ని సిట్.. అనుబంధ ఛార్జిషీట్‌లోనూ 35వ పేజీలో ప్రస్తావించిందన్నారు. తితిదేకి సరఫరా చేసిన నెయ్యిలో పంది, గొడ్డు కొవ్వు, చేప నూనె కలవలేదని సిట్ ఎక్కడా చెప్పలేదని, అయినా వైకాపా నాయకులు వారికి క్లీన్‌చిట్ ఇచ్చినట్లుగా సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కేశవ్ శనివారం తెదేపా కేంద్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆ నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసినట్టుగా ఎన్‌డీడీబీ ల్యాబ్ నివేదికలో పేర్కొన్న అంశాన్నే.. ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పట్లో ఎన్డీయే సమావేశంలో చెప్పారని, దాన్నే ఇప్పుడు సిట్ ధ్రువీకరించిందని కేశవ్ తెలిపారు. 'వైకాపా నాయకులు చేసిన అపచారాన్ని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత స్వామి వారి భక్తుడిగా, ముఖ్యమంత్రిగా చంద్రబాబుపై ఉంది. 2022లో తితిదేకి సరఫరా అవుతున్న నెయ్యి శాంపిళ్లను మైసూరులోని సీఎఫ్‌టీఆర్‌ఐకి పంపగా.. కల్తీని నిర్ధారించింది. ఆ నివేదికను నాటి తితిదే పాలకమండలి ఎందుకు తొక్కిపెట్టిందో అప్పటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, అదనపు ఈవో ధర్మారెడ్డి చెప్పాలి' అని పయ్యావుల డిమాండ్ చేశారు.

సిగ్గు పడకపోగా, సంబరాలేంటి?

శ్రీవారికి అంతటి మహాపచారం చేసినందుకు వైకాపా నాయకులు సిగ్గుతో తలదించుకుని, క్షమాపణలు కోరాల్సిందిపోయి, ఏ తప్పూ జరగలేదని ప్రజల్ని భ్రమింపజేయాలని చూస్తున్నారని కేశవ్ మండిపడ్డారు. 'నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని దేశంలోనే ప్రతిష్ఠాత్మక ల్యాబ్ నిర్ధారిస్తే.. అలాంటిదేమీ జరగలేదని ప్రచారం చేస్తున్నారు. ఎన్‌డీడీబీ నివేదికలోని అంశాలనే ముఖ్యమంత్రి ప్రజాక్షేత్రంలో పెడితే. . ఆయనేదో చెప్పరాని విషయం చెప్పినట్టుగా వైకాపా నాయకులు మాట్లాడుతున్నారు. అది ప్రజలకు తెలియాల్సిన విషయం. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఎన్‌డీడీబీ తేల్చిన విషయాన్ని సిట్ నిర్ధారిస్తుంటే.. సంబరాలు, యజ్ఞాలు, యాగాలు చేయడానికి వైకాపా నాయకులకు సిగ్గుండాలి' అని ఆయన దుయ్యబట్టారు.

నిబంధనలు సడలించడమే అక్రమాలకు పునాది

'2014-19 మధ్య చంద్రబాబు తిరుపతికి అత్యంత ప్రాధాన్యమిచ్చారు. లడ్డూ నాణ్యత తగ్గొద్దన్న ఉద్దేశంతో కమిటీ వేసి, నెయ్యి కొనుగోలు నిబంధనల్ని పటిష్ఠం చేశారు. 2019లో జగన్ సీఎం అయ్యాక మరో కమిటీ వేసి ఈ నిబంధనలన్నీ సడలించారు. అక్కడే అక్రమాలకు పునాది పడి, కల్తీ మొదలైందనడానికి ఆధారాలున్నాయి' అని పయ్యావుల పేర్కొన్నారు. వైకాపా నాయకులు దాన్నొక ఆర్థిక లావాదేవీగా చూశారే తప్ప, దేవుడికి అర్పించే సేవగా భావించలేదని మండిపడ్డారు. '2022లో సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న భోలేబాబా డెయిరీ ప్రతినిధులను పిలిచి ప్రతి కిలో నెయ్యికి రూ.25 చొప్పున కమీషన్ అడిగాడు. మొత్తం రూ.240 కోట్ల కుంభకోణం జరిగింది. రూ.4 కోట్లు చిన్నప్పన్న ఖాతాలోకి వెళ్లాయి. అక్కడి నుంచి ఎవరి ఖాతాల్లోకి వెళ్లింది? నగదు రూపంలో ఎంతిచ్చారో తేలాలి. ఇప్పటిదాకా దర్యాప్తు ఒక కోణంలో మాత్రమే చేశారు. తప్పు జరిగినట్లు తేలినందున దానికి బాధ్యులెవరు? అంతిమంగా దాన్ని నడిపించెందెవరో తేల్చాలి. ఇందుకు లోతైన, శాఖాపరమైన దర్యాప్తు చేపట్టాల'ని కేశవ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కుప్పం పర్యటన నుంచి తిరిగొచ్చాక తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు

వేంకటేశ్వరస్వామిపై నమ్మకం లేదని జగన్ చాలా సందర్భాల్లో చెప్పకనే చెప్పారు. సీఎంగా ఉన్నప్పుడు ఎప్పుడూ సతీసమేతంగా తిరుమల వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించలేదు. అన్యమతస్థులు సంతకం చేసి గుడిలోకి వెళ్లాలన్న నిబంధన పాటించలేదు. ఇప్పుడు సంతకం పెట్టాల్సి వస్తుందని తిరుమలకు వెళ్లడమే లేదు. స్వామివారిపై జగన్‌కు ఏ అభిప్రాయమున్నా, మాకు అభ్యంతరం లేదు. కానీ దేవుడిని రాజకీయాల్లోకి లాగి భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు' అని పయ్యావుల హెచ్చరించారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే నెయ్యి కల్తీ

వైకాపా నేత బొత్స సత్యనారాయణ



విజయనగరం బాబామెట్ట, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం వల్లే నెయ్యి కల్తీ జరిగిందని, అప్పటి తితిదే ఈవోపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైకాపా నేత, శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్సీ సురేష్‌బాబుతో కలిసి శనివారం ఆయన విజయనగరంలో మాట్లాడారు. 'లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి ఆరోపించడం దురదృష్టకరం. ఇటీవల సింహాచలం దేవస్థానంలోనూ నెయ్యి కల్తీ జరిగినట్లు వార్తలు రాగా, చర్యలు తీసుకోవాలని మేం కోరలేదు. ప్రతిదీ రాజకీయం చేయకూడదు' అని పేర్కొన్నారు.

వైకాపా హయాంలోనే.. కల్తీ నెయ్యి నిర్ధారణ

(మొదటి పేజీ తరువాయి)

ఈ విషయాల్ని ప్రస్తావించింది. కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నారని తెలిసినా తర్వాత కూడా చర్యలు తీసుకోకుండా ఆ సంస్థలనే కొనసాగించారంటే ఆంతర్యమేంటి?

తితిదే ప్రొక్యూర్‌మెంట్ విభాగం జీఎంగా కొనసాగిన సుబ్రమణ్యం 2022 మే 20న అప్పటి పాలకమండలి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని తిరుమలలోని ఆయన క్యాంప్ ఆఫీస్‌లో కలవగా.. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, వైష్ణవి డెయిరీ, భోలేబాబా డెయిరీలు సరఫరా చేస్తున్న నెయ్యి నమూనాల్ని మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐకు పంపించి నాణ్యత పరీక్షలు చేయించాలని, ఆ ఫలితాలను తనకు చెప్పాలని ఆదేశించారు. సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ఆయా డెయిరీలు ట్యాంకర్లు, టిన్‌ల ద్వారా సరఫరా చేస్తున్న నెయ్యి నుంచి నమూనాలు సేకరించి... 2022 జూన్‌లో సీఎఫ్‌టీఆర్ఐకు పంపించారు. 2022 ఆగస్టు 3న నివేదికిచ్చిన ఆ సంస్థ.. బేటా సిటోస్టెరోల్ పరీక్షల ప్రకారం ఈ నమూనాల్లో వెజిటేబుల్ ఆయిల్స్ కలిసి ఉన్నాయని, అది కల్తీ నెయ్యేనని తేల్చి చెప్పింది. అయితే ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో కానీ.. సంబంధిత సరఫరా సంస్థలపై ఏ చర్యలు లేకుండా పోయాయి.

కల్తీ నిర్ధారణయ్యాక ఏడాది పాటు ఛైర్మన్ హోదాలోనే సుబ్బారెడ్డి..

◆ తితిదే నెయ్యి సరఫరా టెండరు షరతుల్లోని 50వ నిబంధన ప్రకారం.. కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్నట్లు తేలితే ఆయా సంస్థలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారించాలి. ఆ సంస్థల నుంచి సరఫరా నిలిపివేయించాలి. వాటిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలి. ఈఎండీ, సెక్యూరిటీ డిపాజిట్లు జప్తు చేయాలి. అయితే ఇవేవి జరగలేదు.

◆ సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక అందిన సమయంలో తితిదే ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి, ఈవోగా ధర్మారెడ్డి ఉన్నారు. ఆ నివేదిక అందిన తర్వాత కూడా దాదాపు ఏడాది పాటు సుబ్బారెడ్డి, రెండేళ్ల పాటు ధర్మారెడ్డి అవే హోదాల్లో కొనసాగారు. అయినా సరే కల్తీ నెయ్యి సరఫరా చేస్తున్న సంస్థలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? వాటినే ఎందుకు కొనసాగించారు? అనేది నిగ్గు తేల్చకుండానే సిట్ దర్యాప్తు ముగింపు చేయటం విస్మయం కలిగిస్తోంది.

◆ నెయ్యి నమూనాలను నాణ్యత పరీక్షల కోసం సీఎఫ్‌టీఆర్ఐకు పంపించాలని ఆదేశించిన సుబ్బారెడ్డి.. వాటి ఫలితాల గురించి ఆరా తీయకుండా ఉంటారా? ఆయనకు తెలియకుండా ఉండటం సాధ్యమేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

లంచమివ్వటానికి నిరాకరించిన మరునటి రోజే ఫిర్యాదు..

◆ భోలేబాబా డెయిరీ డైరెక్టర్ పొమిల్ జైన్ 2022 మే 15న అప్పటి తితిదే ఛైర్మన్ సుబ్బారెడ్డి పీఏ కదురు చిన్నప్పన్నను దిల్లీలో కలవగా.. నెయ్యి సరఫరా టెండరు లభించాలంటే కిలోకు రూ.25 చొప్పున లంచమివ్వాలని డిమాండు చేశారు. అందుకు పొమిల్ జైన్ నిరాకరించటంతో 2022 మే 16న భోలేబాబా డెయిరీపై ఓ ఫిర్యాదును చిన్నప్పన్న.. సుబ్బారెడ్డికి ఇవ్వగా.. దాన్ని ఆయన అప్పటి ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రమణ్యంకు అందజేసి విచారించాలని నిర్దేశించారు. దానిపై విచారణ అవసరం లేదంటూ సుబ్రమణ్యం ముగించేశారు. అంటే లంచమివ్వటానికి నిరాకరించిన మరుసటి రోజే. . భోలేబాబాపై ఫిర్యాదు ఇవ్వటం గమనార్హం.

◆ భోలేబాబాపై విచారణ అవసరం లేదని జీఎం సుబ్రమణ్యం తేల్చేసిన తర్వాత 4 రోజులకు... అంటే 2022 మే 20న వైవీ సుబ్బారెడ్డి.. సుబ్రమణ్యంను పిలిపించి నెయ్యి నమూనాలను సీఎఫ్‌టీఆర్ఐకు పంపించి నాణ్యత పరీక్షలు చేయించాలని ఆదేశించారు.

◆ సీఎఫ్‌టీఆర్ఐకు నెయ్యి నమూనాలు పంపి నాణ్యత పరీక్షలు చేయించాలని సుబ్బారెడ్డి ఆదేశించిన 5 రోజుల వ్యవధిలోనే అంటే 2022 మే 25న కమీషన్ ఏజెంట్ వీపీ శ్రీనివాసన్, మరొకరితో పాటు భోలేబాబా డైరెక్టర్ పొమిల్ జైన్ వెళ్లి వైవీ సుబ్బారెడ్డిని కలిశారు. పీఏ చిన్నప్పన్న కిలోకు రూ.25 చొప్పున లంచం అడుగుతున్నారని వివరించారు. ఏడాది లోపు తమ ప్లాంటులో తనిఖీలు చేయొద్దని విన్నవించారు. ఈ విషయాలన్నీ నిందితుల రిమాండ్ రిపోర్టుల్లో స్పష్టంగా పేర్కొన్న సిట్. ఆ తర్వాత ఏం జరిగిందనేదానిపై లోతుగా దర్యాప్తు చేయకుండా వదిలేసింది.

◆ భోలేబాబా డెయిరీ ఉత్తమ తయారీ, నిర్వహణ విధానాలు అవలంబించట్లేదంటూ 2022 జులై 25న ఆ సంస్థను డిస్క్వాలీఫై చేశారు. ఆ తర్వాత కూడా ఆ సంస్థకు అదనంగా సరఫరా ఆర్డర్లు ఇచ్చారు. దీని గుట్టు కూడా సిట్ విప్పలేదు.

ఈనాడు

నీతికి నిలబడి... నిజాయతీగా...

మనది కాని దానిమీద మనసుపడటం- మనలో దాగిఉండే బలమైన బలహీనత. పైగా దాన్ని దక్కించుకునేందుకు ధర్మం తప్పి ప్రవర్తించడం- తెగింపు. అది మనిషితనానికి ముగింపు. ఆ తరహా దుష్టచింతనతో గొప్పవారిని సైతం లోబర్చుకుంటుంది లోభం. అదొక రోగం. మయసభ మహావైభవాన్ని చూసి సుయోధనుడికి కన్నుకుట్టింది. లోలోపల లోభం పుట్టింది- 'సర్వ రత్నాకరైక ప్రశస్త రత్నపుంజములకు ఆస్పదము ధర్మపుత్రు గృహము' అని విలపిస్తుంటే 'అంతకన్నా అయిదురెట్లు సంపద నీది. రాజసూయయాగం తలపెట్టరాదా... మరో గొప్పసభ కట్టరాదా?' అన్నాడు తండ్రి. దుర్యోధనుడి బాధ- తనకు లేదని కాదు, పాండవులకు కూడా చేకూరిందని. ఇలాంటివారు మనలోనూ చాలామందే ఉంటారు. అది కలియుగ లక్షణం. 'పరులసొమ్ము కోసం ఎగబడటం మహాపాపం... అది దొంగల స్వభావం' అని హెచ్చరించాయి- నారద భక్తిసూత్రాలు. దాన్ని అరిషడ్వర్గాల్లో ఒకటిగా చేర్చాయి- ధర్మశాస్త్రాలు. 'అలాంటి జన్మలు నిరర్థకాలు. వారంతా అపార్థీకృతజన్ములు' అంది మహాభారతం- అరణ్యపర్వంలో. దురాశవల్ల మనసు కలతపడి 'ఎప్పుడు చింతా తాపంబునొందు' అని హెచ్చరించింది శాంతిపర్వంలో.

మహాభారతమే కాదు, విశ్వామిత్రుడి ఉదంతంలో రామాయణం, కార్తవీర్యుడి కథ ద్వారా భాగవతం దీన్నే బోధించాయి. ముని కాకముందు విశ్వామిత్రుడు ఒక రాజ్యానికి ప్రభువు. భారీసైన్యంతో ఊరేగుతూ వశిష్ఠమహర్షి ఆశ్రమానికి వెళ్లాడు. భూపాలుడు వచ్చాడనే గౌరవంతో వశిష్ఠుడు మొత్తం పరివారానికి... 'యస్యయస్య యథాకామం షడ్రసైస్యభిపూజితం' ఎవరి రుచులకు తగినట్లు వారికి మహత్తరమైన విందు చేశాడు. అంత గొప్పగా, వేగంగా విందు ఏర్పాట్లు ఎలా జరిగాయని విశ్వామిత్రుడు ఆరాతీశాడు. శబల అనే కామధేనువు కారణమని తేలింది. తనది కాకపోయినా గోవును సొంతం చేసుకోవాలనిపించింది విశ్వామిత్రుడికి. 'విలువైన వస్తువులు రాజు దగ్గరుంటేనే క్షేమం... 'రత్నహారీచ పార్థివః' అన్న తర్కంతో బలవంతంగా లాక్కోబోయి భంగపడ్డాడు. ఇదే కథ కార్తవీర్యుడిది. అక్కడ మహర్షి- జమదగ్ని, గోవు- సుశీల. 'లజ్జను(సిగ్గును) బాపు, శీలము కలంబు చెడు- ఈ ముజ్జగమైన త్రిప్పు, తుదిముట్టవు దా ధనకాంక్ష ఏరికిన్' అన్న కవికర్ణ రసాయనకర్త సంకుసాల నృసింహకవి మాట వారి విషయంలో నిజం అయింది.

భారత భాగవత రామాయణాల ఈ సందేశాన్నే- 'పరుష వర్తనకు ఉనికి లోభంబు' అన్నాడు రాజశేఖరచరిత్రలో మాదయగారి మల్లన. మొపాస ప్రసిద్ధకథ 'ది నెక్లెస్'లోని 'మటిల్ద లోజెల్' పాత్ర గుర్తుందా! పాపం పదిమందిలో ధనవంతురాలిగా కనిపించాలన్న కోరికతో పక్కింటామె హారాన్ని అరువు తీసుకుని పోగొట్టుకుంటుందామె. నిజాయతీకి కట్టుబడిన ఆ దంపతులు పదేళ్లపాటు దుర్భర వేదనకోర్చి అనుభవించిన పైసాపైసా కూడబెట్టి మొత్తానికి అదే తరహా పసిడి హారాన్ని కొని పక్కింటామెకు అందచేస్తారు. జీవచ్ఛవంలా మారిపోయిన మటిల్డాను చూసి నేనిచ్చింది అసలైన నగ కాదు, నకిలీది. 'కాకిబంగారం' అంటుంది పక్కింటామె. మిగిలిన కథను మన ఊహకు వదిలేస్తాడు రచయిత. 'అరువు సొమ్ము బరువు చేటు' అన్న సూక్తి ఎంత బరువైనదో తెలిసి మనం నివ్వెరపోతాం. ఈ కథలన్నింటి సారాంశంతోపాటు 'పరుల సొమ్ము నాగుపాము పడగపై మణి' అన్న సూక్తిని జీర్ణించుకున్న చెన్నైలోని ఓ పారిశుద్ధ్య కార్మికురాలు పద్మ- రోడ్డుపై చెత్త ఊడుస్తుంటే దొరికిన 45 సవర్ల బంగారాన్ని నేరుగా పాండీబజార్ పోలీస్ స్టేషన్లో అప్పగించారు. ఆ నగల విలువ ఎన్ని లక్షల రూపాయలు అయినా- అవి తనవి కావనుకుందామె. అదే సంచి మరెవరికైనా దొరికుంటే...!



నేలకోత, ఎడారీకరణ, కాలుష్యం... ఇవన్నీ కలిసి సామూహిక ఆత్మహత్యకు కొత్త విధానంగా మారాయి. అడవులనూ, చెరువులనూ, నదులనూ ఆఖరికి సముద్రాలనూ కాపాడుకుంటేనే జీవవైవిధ్యమైనా, మనిషి భవిష్యత్తయినా... పదిలంగా ఉంటుంది.

– జెరాల్డ్ డ్యూరెల్, వన్యప్రాణి సంరక్షకుడు

ఏది హింస?

'అహింసా పరమోధర్మః' అన్నారు పెద్దలు. అంటే హింస చేయకుండా ఉండటమే గొప్ప ధర్మమని అర్థం. హింస అంటే శారీరకంగా బాధించడమో, చంపడమో అని మాత్రమే అర్థంకాదు. ఎదుటివారిని మానసికంగా క్షోభకు గురిచేసినా అది హింస కిందకే వస్తుంది. శరీరానికి బాణాలు గుచ్చుకున్నా ఉపాయంతో తీసి వేయవచ్చు, ఆ గాయాలు మందులతో కొంత కాలానికి మానతాయి. అదే కఠినంగా మాట్లాడిన మాటలు హృదయాన్ని తాకితే వాటిని ఏ విధంగానూ తొలగించలేం. గుండెకైన గాయాలు నిరంతరం బాధిస్తూ ఉంటాయి. కనుక పరుషంగా మాట్లాడటమూ హింసే. గౌతమ బుద్ధుడు, గాంధీజీ వంటి మహనీయులు అహింసా ధర్మాన్ని తాము ఆచరించడమే కాక విస్తృతంగా ప్రచారం చేశారు.

ధర్మవిషయాలు తెలుసుకోవడానికి మిథిలా నగరంలో ధర్మవ్యాధుడి దగ్గరికి వెళ్లాడు కౌశికుడు. ఆయన మాంసం అమ్మడం చూసి ఆశ్చర్యపోతాడు. 'ధర్మాత్ముడిగా ప్రసిద్ధుడైన నువ్వు ఇలా మాంసం అమ్మడం జీవహింస కాదా?' అని ప్రశ్నిస్తాడు.



అందుకు ధర్మవ్యాధుడు- తానెప్పుడూ జీవహింసకు పాల్పడనని, ఇతరులు చంపి తెచ్చిన జంతువుల మాంసాన్ని కొని, కొద్ది లాభంతో ఇలా విక్రయించి, ధర్మ మార్గంలో ప్రవర్తిస్తూ, మనశ్శాంతితో జీవిస్తున్నానని, అదే తన జీవిత పరమార్థమని సమాధానమిస్తాడు. తరవాత కౌశికుడికి అనేక ధర్మ విషయాలు ఉపదేశించి, అప్పుడు అహింసా స్వరూపం గురించి వివరిస్తాడు. ఇది హింస, ఇది అహింస అని ఎవరూ స్పష్టంగా చెప్పలేరని, అలా నిర్వచించడం సాధ్యం కాదని అంటాడు. ఎందుకంటే- పండ్లు, దుంపలు, ధాన్యాలు, కూరగాయలు మొదలైనవన్నీ మనుషులకు ఆహారంగా ఏర్పరిచింది ఈ సృష్టి. వాటికి మాత్రం ప్రాణం లేదా? మొక్కల నుంచి తీసిన కొద్దిరోజులకు అవి ఎండిపోతున్నాయంటే వాటికి ప్రాణం ఉందనే కదా అర్థం? నాగలితో భూమిని దున్నేటప్పుడు, మనిషి నడిచేటప్పుడు, వాహనాల కింద... ఎన్ని ప్రాణులు చనిపోవడంలేదు? అది హింస కాదా? అని ప్రశ్నిస్తాడు. భూమి మీద, నీటిలో లెక్కలేనన్ని ప్రాణులుంటాయి. కాబట్టి అన్ని పనుల్లోనూ ఎంతో కొంత హింస జరగక తప్పదు. హింస అసలే చేయకుండా మనిషి జీవితం సాగదు. కొందరు ఈ విషయాలు గమనించక తాము అహింసా వ్రతులమని భ్రమ పడుతుంటారు. ఆఖరికి కందమూల, ఫలాలకు కూడా ప్రాణం ఉంటుంది కాబట్టి మునులు కూడా అహింసావ్రతులని చెప్పడానికి వీలులేదు... అని ధర్మవ్యాధుడు కౌశికుడికి ఉపదేశిస్తాడు. మాంస విక్రయం తరతరాలుగా తమ వృత్తి అని, ఎవరి వృత్తులు వారు నిర్వహించడం దోషం కాదని చెబుతాడు.

కాబట్టి లోకంలో నూటికి నూరుశాతం జీవహింస చేయనివారు ఒక్కరైనా ఉండరు. అయినప్పటికీ వీలైనంత వరకు ప్రాణి హింస చేయకుండా, ఎవరినీ నొప్పించకుండా జీవయాత్ర సాగించగలిగితే అదే అహింసా విధానమవుతుంది. అదే జీవిత పరమావధి కూడా.

– డాక్టర్ కండ్లకుంట నరసింహమూర్తి

అంతర్యామి



లక్ష్యం సమ్మిళిత అభివృద్ధి!

'వికసిత్ భారత్-2047' కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. దేశంతోపాటు తామూ అభివృద్ధి చెందాలనేది సామాన్యుల తాపత్రయం. ఒకనాడు కూడు, గూడు కోసం పోరాటం. ఇప్పుడు నాణ్యమైన జీవనం కోసం ఆరాటం. ఏటా ఒక మెట్టయినా పైకెదగాలన్న ఆశలకు ప్రభుత్వం అండగా నిలవాలనేది సాధారణ జనం కోరిక. ఈ ప్రజాకాంక్షలకు నేటి బడ్జెట్‌లో ఎంతవరకు చోటు దక్కనుంది?

మన దేశంలో బడ్జెట్ అనగానే పన్ను రాయితీలు, ఉపశమనాల కోసం ప్రజలు ఎదురు చూస్తారు. ప్రభుత్వాలు మాత్రం ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల ఆధారంగా గణాంకాలను సర్దుబాటు చేస్తుంటాయి. ప్రజలు, పాలకులు ఇలాంటి సంప్రదాయ ఆలోచనల పరిధిని మించి ఆలోచించలేకపోతుండటంతో సంస్కరణలు పెద్దగా కనిపించడం లేదు. ఎన్నికల సంవత్సరాల్లో మినహాయించి మిగతా సమయాల్లో బడ్జెట్లన్నీ సాదాసీదాగానే సాగిపోతున్నాయి. అందుకే ఆర్థిక సంస్కరణలు మొదలైన కాలం నుంచి జీడీపీలో బడ్జెట్ పరిమాణం సగటున 20 శాతానికి మించలేదు. గణాంకాలు ఎంత ఘనంగా ఉంటున్నప్పటికీ, ఆర్థిక సంస్కరణల తరవాత వృద్ధిరేటు 6-7 శాతం మధ్యనే కొట్టుమిట్టాడుతోంది. ఈ వృద్ధిరేటు అభివృద్ధి చెందిన దేశాలకంటే ఎక్కువగా కనిపించినా, తమ జీవితాల్లో పెద్దగా మార్పులు రావట్లేదన్న భావన సగటు ప్రజానీకంలో నెలకొంది. దేశంలో ద్రవ్యోల్బణం అత్యల్ప స్థాయిలో ఉన్నట్లు యంత్రాంగం చెబుతోంది. మరోవైపు, భారతీయుల జీవితంలో ప్రధాన భాగమైన బంగారం, వెండి ధరలు అనూహ్యంగా ఉండటం ఆందోళనకరం.

దూరదృష్టితో విధానాలు

కుటుంబాల పొదుపు తగ్గుతుండగా, అప్పులు పెరుగుతుండటం ప్రజల ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది. అందుకే నాణ్యమైన జీవనం కోసం వేతన జీవులు మరిన్ని పన్ను మినహాయింపులను, సరళీకృత శ్లాబ్‌లను, టీడీఎస్ హేతుబద్ధీకరణను కోరుకుంటున్నారు. మరిన్ని ఉద్యోగాల కల్పన కోసం మౌలిక వసతులకు ఊతం, మూలధన వ్యయం పెంపు, పరిశ్రమలకు, ఎంఎస్ఎంఈలకు మద్దతు, నైపుణ్యాభివృద్ధి చేపట్టాలని యువత ఆశిస్తోంది. పీఎంకిసాన్ సాయం పెంపు, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధతను రైతులు కోరుకుంటున్నారు. గత పదేళ్లలో తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు సామాన్యుడి జీవనశైలి స్థిరత్వానికి దోహదం చేశాయి. కానీ, జీవితాల్లో గుణాత్మక మార్పులైతే రాలేదనే అభిప్రాయం ఉంది. అమెరికా, చైనా, జర్మనీల తరవాత భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. కానీ, ఆ దేశాల స్థాయిలో జీవన ప్రమాణాలు కరవవుతున్నాయి. ఆర్థిక పరిమాణంలో మనకంటే ఒకమెట్టు పైనున్న చైనా, జర్మనీలు ప్రపంచానికి రుణాలు ఇచ్చే స్థితిలో ఉన్నాయి. మనమింకా అప్పులు తీసుకునే స్థితిలోనే ఉన్నాం. డాలరుతో పోలిస్తే రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. తయారీ రంగానికి ఎన్ని ప్రోత్సాహకాలు ఇచ్చినా, దేశీయ అవసరాలకు తగినట్లుగా వస్తూత్పత్తి, ఉద్యోగ కల్పన జరగడం లేదు. ఉద్యోగాల్లో తయారీ, సేవల రంగం వాటా తగ్గిపోతోంది. ఇదే సమయంలో వ్యవసాయ రంగంపై ఆధార పడేవారి సంఖ్య పెరుగుతోంది. ఈ గణాంకాలు కొంత తిరోగమన పరిస్థితులను సూచిస్తున్నాయనేది ఆర్థిక వేత్తల అభిప్రాయం. ఇలాంటి పరిస్థితులను సరిదిద్దేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వాలి.

కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది జనగణన పూర్తిచేసి కొత్త గణాంకాలు వెల్లడించనుండటంతో ముందుముందు జనాభా సరళి ఎలా ఉండనుందనేది తెలుస్తుంది. ఇప్పటిదాకా అమలు చేస్తూ వచ్చిన కుటుంబ నియంత్రణ విధానంతో జనాభాలో చెప్పుకోదగిన మార్పులు కనిపిస్తున్నాయి. వయసులవారీ జనాభా, పరిమాణంలో చాలా మార్పులు వచ్చాయి. ఒకవైపు సంతాన సాఫల్యత, సగటు వయసు తగ్గుతోంది. మరోవైపు సగటు ఆయుర్దాయం పెరుగుతోంది. ఈ జనాభా పరమైన పరిణామాలతో కొన్ని రాష్ట్రాలకు కొత్త అవకాశాల ద్వారాలు తెరుచుకుంటున్నాయి. మరికొన్ని రాష్ట్రాలకు అవకాశాలు తగ్గిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. దీర్ఘకాలంలో ప్రభావం చూపించే ఇలాంటి మార్పులను ముందుగానే గ్రహించి, తదనుగుణమైన దూరదృష్టితో కూడిన విధానాలకు నేటి పద్దులో శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది.


ఆర్థిక సంఘం సిఫార్సులు ఎలా ఉండొచ్చు?

ఏప్రిల్ ఒకటి నుంచి 16వ ఆర్థిక సంఘం సిఫార్సులు అమల్లోకి రానున్నాయి. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత ఇది మూడో ఆర్థిక సంఘం. 14వ ఆర్థిక సంఘం కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 42శాతం వాటాను పంపిణీ చేయాలని సిఫార్సు చేసింది. 15వ ఆర్థిక సంఘం కూడా దాన్ని దాదాపుగా కొనసాగించింది. దీంతో కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక పొరపొచ్చాలు లేని పరిస్థితులు కొనసాగాయి. ఇప్పుడు 16వ ఆర్థిక సంఘం ఎలాంటి సిఫార్సులు చేస్తుందోనన్న ఆసక్తి కనిపిస్తోంది. ఈ సిఫార్సుల్లో ఒకశాతం అటూఇటైనా రాష్ట్ర ప్రభుత్వాల స్థితిగతులు తీవ్ర ఇక్కట్లకు లోనయ్యే ప్రమాదం ఉంటుంది. జనాభాతోపాటు, విభిన్న సామాజిక, ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సంఘాలు ఒక్కో రాష్ట్రానికి ఒక్కో వెయిటేజీ ఇచ్చి కేంద్ర వనరుల పంపిణీకి సిఫార్సు చేస్తుంటాయి. 16వ ఆర్థిక సంఘం వాటాలను తగ్గిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా మరింత నష్టపోయే ముప్పు ఉంటుంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన వీబీ-జీరాంజీ చట్టం అమలు కోసం అయ్యే ఖర్చులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వాటా 60:40గా మారింది. దీనివల్ల రాష్ట్రాలు ఏటా రూ.50వేల కోట్లమేర అదనపు ఆర్థిక భారం భరించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి వేళ ఆర్థికసంఘం సిఫార్సుల్లో ఏమాత్రం తేడాలు వచ్చినా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు మరింత క్షీణించే ప్రమాదం ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్‌లో రాష్ట్రాలకు ఆర్థిక వెసులుబాట్లు కల్పించాలి. క్షేత్ర స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను జోడెద్దులుగా నడిపించే ప్రణాళికలకు పెద్దపీట వేయాలి.



– చల్లా విజయభాస్కర్

ఫోన్లూ కంప్యూటర్లూ హ్యాక్ అవడం చూశాం. కానీ ఇప్పుడు జీవితంలో సంతోషమే హ్యాక్ అయిపోయిందంటున్నారు వివేక్ వాధ్వా, అలెక్స్ సాల్కెవర్ అనే రచయితలు. వీరిద్దరూ కలిసి రాసిన పుస్తకం 'యువర్ హ్యాపీనెస్ వజ్ హ్యాక్డ్: వై టెక్ ఈజ్ విన్నింగ్ ద బ్యాటిల్ టు కంట్రోల్ యువర్ బ్రెయిన్ అండ్ హౌ టు ఫైట్ బ్యాక్' టెక్నాలజీ తాలూకు చీకటి కోణాల్ని ఆవిష్కరిస్తుంది. మన మెదడును నియంత్రించే యుద్ధంలో టెక్నాలజీదే పైచేయిగా మారిందనీ, దాన్ని ఎదిరించి తిరిగి మనసును మనం ఎలా స్వాధీనంలోకి తెచ్చుకోవాలో చూడమనీ చెబుతుందీ పుస్తకం. ఒకరకంగా టెక్నాలజీ చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయామనీ అది మన సంతోషాన్ని లాక్కోవడమే కాదు, సంక్షేమానికీ తీరని హాని చేస్తోందని చెబుతున్నారు రచయితలు.



జాగ్రత్త... సంతోషం హ్యాక్ అవుతోందట!

మొబైల్ మనల్ని ప్రపంచంతో కనెక్ట్ చేయడమే కాదు, చేసే పని మీద నుంచి దృష్టి మళ్లిస్తుంది, అప్పటివరకూ ఏకాగ్రతతో లీనమై చేస్తున్న పనికి ఓ నోటిఫికేషన్‌తో బ్రేక్ పడుతుంది. ఫోన్ తెరిచి అది చూశాక తిరిగి ఆ పనిలో అదే స్థాయిలో నిమగ్నమవ్వాలంటే కనీసం 23 నిమిషాలు పడుతుందని ఒక అధ్యయనం చెబుతోంది. ఇలా రోజు మొత్తం మీద ఎన్ని నిమిషాలు వృథా అవుతాయి? ఆ తరవాత సమయం సరిపోక పనిని హడావుడిగా పూర్తిచేయడం వల్ల ఉత్పాదకత దెబ్బతింటుంది. బెయిన్ అండ్ కంపెనీ అనే సంస్థ చేసిన సర్వేలో చాలామంది మిడ్ లెవెల్ మేనేజర్లు వారానికి 21 గంటలు మీటింగులలో, మరో 11 గంటలు ఈమెయిల్స్‌కి సమాధానాలివ్వడంలో గడుపుతుండగా అసలు పనిచేసేది పదిహేను గంటలేనని తేలింది. ఈ నేపథ్యంలోనే వ్యక్తులు, కుటుంబ జీవితం, ఉత్పాదకతల మీద టెక్నాలజీ చూపుతున్న దుష్ప్రభావాల్ని ఈ పుస్తకంలో చర్చించారు. 'జీవితంలో అత్యంత ముఖ్యమైన కమ్యూనికేషన్ మాధ్యమం- ఇద్దరు వ్యక్తులు ముఖాముఖీ మాట్లాడుకోవడం. దానికే ఇప్పుడు అతి తక్కువ, లేదా అసలు సమయమివ్వక పోవడం చేస్తున్నాం' అంటారు రచయితలు.

సాంకేతికతలన్నీ మనిషి ప్రవర్తన ఆధారంగా డిజైన్ చేసినవి. మొదట లైకుల్లాంటి చిన్న చిన్న రివార్డులతోనూ; స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌ల బింజ్ వాచింగ్‌తోనూ మనిషి దానికి అలవాటు పడేలా చేస్తాయి. మనుషుల్ని డిస్పోజబుల్ ప్రొడక్ట్‌గా చూసే డేటింగ్ యాప్స్ లాంటివాటి వల్ల ప్రేమ పలుచనైపోతోంది. ఇరవైనాలుగ్గంటలూ ఆన్‌లైన్ కనెక్టివిటీ వల్ల టెక్నోస్ట్రెస్‌కి గురవుతున్నారు. భౌతిక ఆటలు, సోషలైజింగ్ స్థానాన్ని తెరలు ఆక్రమించాయి. స్క్రీన్‌టైమ్ వల్ల మొత్తంగా జీవనశైలి ప్రభావితమై అనారోగ్యాలకు దారితీస్తోంది. సంకేతాలను గుర్తించి వెంటనే స్పందించే మన మెదడు స్వభావాన్నే టెక్నాలజీ ఆయుధంలా వాడుకుంటోంది. దృష్టిని మళ్లిస్తూ మనుషుల్ని శ్రద్ధగా పనిచేయనీయకుండా నైపుణ్యాలను దెబ్బతీస్తోంది. ఇవన్నీ చెబుతున్న రచయితలు నిరాశావాదులేం కాదు. పుస్తకంలో రెండోసగాన్ని టెక్నాలజీ పట్ల సానుకూల దృక్పథంతో రాశారు. టెక్నాలజీ ప్రభావం నుంచి బయటపడటానికి ఆచరణీయ టెక్నిక్‌లను వివరించారు. మైండ్‌ఫుల్ యూసేజ్ ఒక్కటే దీనికి పరిష్కారమని చెబుతున్నారు. మనకు మనమే హద్దులు పెట్టుకుని, గ్యాడ్జెట్స్‌తో కన్నా మనుషులతో ఎక్కువ సమయం గడపడానికి ప్రాధాన్యమివ్వాలంటోందీ పుస్తకం. టెక్ కంపెనీలు, ప్రభుత్వాలు, ప్రజలు అందరూ కలిసి 'హ్యూమేన్ టెక్నాలజీ' అభివృద్ధికి కృషి చేయాలని ఆశిస్తోంది. స్మార్ట్‌ఫోన్‌కి బందీ అయిపోయిన వాళ్లు, అవ్వకూడదనుకునేవాళ్లు తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకమిది.

– మిహిర

బంధాలు పెళుసై... కుటుంబాలు ఛిద్రమై!

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలకు కుటుంబమే పునాది. నవతరం తమ జీవితాలను ఉన్నతంగా, అర్థవంతంగా మలచుకోవడానికి ఎక్కువశాతం కుటుంబమే వెన్నుదన్నుగా ఉంటుంది. ఒడుదొడుకులను తట్టుకునే ఆత్మస్థైర్యాన్ని అలవరచి కష్టనష్టాల్లో అండగా నిలబడుతుంది. ధగధగలాడే సూర్యుణ్ని ధూళిమేఘం కమ్మేసినట్లు, తరాలుగా సమాజ ప్రగతికి దారిదీపంగా నిలిచిన మన కుటుంబ వ్యవస్థను నేడు రకరకాల సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. దానివల్ల ఎక్కడ చూసినా అభద్రత, ఆవేదనలు జడలు విప్పుతున్నాయి!

ఉమ్మడి కుటుంబాలు ఇప్పుడు దాదాపుగా కనుమరుగయ్యాయి. పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలనే తాపత్రయంతో సంపాదనే ధ్యేయంగా తల్లిదండ్రులు ఉరుకులు పరుగుల జీవితాలకు అంకితమవుతున్నారు. తమను పట్టించుకునేవారెవరూ లేని ఒంటరితనంలో సెల్‌ఫోన్లలో మునిగిపోతూ కొందరు పిల్లలు తీవ్రమైన మానసిక సమస్యల్లో కూరుకుపోతున్నారు. ఇంట్లో దొరకని అనురాగాన్ని బయట వెతుక్కుంటూ మోసాలకు గురవుతున్నారు. మద్యం, జూదం లాంటి వాటికి అలవాటుపడి దారుణ నేరాలకు పాల్పడుతున్నారు. తాము అడిగినదానికి 'కాదు' అంటున్నారనో, లేదా డబ్బు ఆస్తుల కోసమో కన్నవారినే కడతేరుస్తున్నారు. తల్లిదండ్రులు-పిల్లల మధ్య అనుబంధాలు ఇలా సన్నగిల్లిపోతున్న కొద్దీ సామాజిక అశాంతి ప్రబలిపోతుంది. అది అంతిమంగా దేశాభివృద్ధిని దిగమింగేస్తుంది!

నచ్చిన వ్యక్తితో తన వివాహాన్ని నిరాకరిస్తున్నారని అధిక మోతాదులో మత్తుమందు ఇచ్చి తల్లిదండ్రులను కడతేర్చిందో కూతురు. ఈ విషాద ఘటన తాజాగా వికారాబాద్ జిల్లాలో జరిగింది. మొన్నటికి మొన్న కర్ణాటకలోని విజయనగర జిల్లాలో మరో ప్రబుద్ధుడు జన్మనిచ్చిన తల్లిదండ్రులతో పాటు, సోదరిని హతమార్చి ఇంట్లోనే పూడ్చిపెట్టేశాడు. జీవిత బీమా డబ్బుల కోసం తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లాలో ఇద్దరు సుపుత్రులు కన్నతండ్రిని పాముతో కాటేయించి కాటికి పంపారు. డబ్బు ఇవ్వలేదన్న కారణంతో వైఎస్సార్ కడప జిల్లాలో తల్లి పీకకోసి, ఆపై తాపీగా టీవీలో పాటలు వింటూ సేదతీరాడు ఓ కిరాతకుడు! తమకు నచ్చని వ్యక్తుల్ని ప్రేమిస్తున్నారనో, పెళ్లిచేసుకున్నారనో బిడ్డల ఉసురు తీస్తున్న తల్లిదండ్రులూ ఎంతోమంది ఉన్నారు. కుట్ర పూరితంగానో, వెర్రి ఆవేశంలోనో జన్మనిచ్చినవారిని, కన్నబిడ్డల్ని హతమార్చి ఎవరైనా బావుకునేదేంటి... కటకటాల్లో మగ్గిపోవడం, అందరి ఛీత్కారింపులు పొందడం తప్ప! అసలు తమ ఆకాంక్షల్ని, వాటిలోని నిజాయతీని తల్లిదండ్రులతో ధైర్యంగా చెప్పలేనప్పుడు, తమ సంతానం ఇష్టాయిష్టాల గురించి కనీస మాత్రం ఆలోచించలేనప్పుడు కుటుంబానికి అర్థమేముంటుంది?



అహంకారం, అపోహలు, చెడు వ్యసనాలు, ఆర్థిక సమస్యలు దంపతుల మధ్య మనస్పర్థలకు దారితీస్తున్నాయి. సోషల్ మీడియా పరిచయాలు అక్రమ సంబంధాలకు అంటుకడుతున్నాయి. పరస్పర నమ్మకం, సంయమనం లోపించిన బతుకుల్లో దారుణ హత్యలూ చోటుచేసుకుంటున్నాయి. వట్టి అనుమానంతో ఇటీవల హైదరాబాద్‌లో ఒకడు రోకలితో భార్య తలపై మోది చంపేశాడు. ఆపై ఆ సంగతిని సెల్‌ఫోన్‌లో స్టేటస్‌గా పెట్టుకున్నాడంటే అతని మెదడు ఎంతగా పుచ్చిపోయి ఉండాలి? మచిలీపట్నంలో మరో వ్యక్తి ప్రియురాలితో కలిసి కట్టుకున్న భార్య ఊపిరితీశాడు. పరాయి వ్యక్తుల మోజులో పడి భర్తల ప్రాణాలను బలిగొంటున్న కొందరు భార్యల విపరీత మనస్తత్వాలూ గగుర్పాటుకు గురిచేస్తున్నాయి. ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం 2023లో దేశవ్యాప్తంగా దాదాపు పద్నాలుగు వందల హత్యలకు అక్రమ సంబంధాలే కారణం. కుటుంబ కలహాల్లో మరో మూడువేల మంది కడతేరిపోయారు. ఇవన్నీ, మన కుటుంబ బంధాలు పతనమవుతున్న తీరుకు అద్దంపట్టేవే!

పుణ్యభూమి


క్షణికావేశంలో పెద్దలు దారుణాలకు పాల్పడుతుండటంతో పిల్లలు అనాథలవుతున్నారు. తల్లిదండ్రుల తగవులాటల మధ్య పెరుగుతున్న చిన్నారులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఆ పీడకలలు వారిని జీవితాంతం వెంటాడుతున్నాయి. ఒక్కోసారి స్వల్ప కారణాలూ ప్రాణాంతకమవుతున్నాయి. రొయ్యలు వండమంటే, భార్య కోడిగుడ్డు కూర చేసిందని తూర్పుగోదావరి జిల్లాలో ఓ వ్యక్తి గడ్డిమందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు. ఫోన్‌లో ఎక్కువగా మాట్లాడొద్దన్నందుకు అల్లూరి సీతారామరాజు జిల్లాలో భర్తపై భార్య గొడ్డలితో దాడికి తెగబడింది. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో దంపతులు సర్దుబాటుకు ససేమిరా అంటున్న పరిస్థితుల్లో విడాకుల కేసులు పెరుగుతున్నాయి. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర వంటి చోట్ల విడాకుల రేటు జాతీయ సగటును మించి ఉంటోంది. భారతదేశ కుటుంబ వ్యవస్థ గురించి విదేశాల్లో గొప్పగా చెప్పుకొంటుంటారు. మన వివాహ వ్యవస్థ మీద గౌరవంతో దాని గురించి తెలుసుకోవడానికి ప్రపంచంలో ఎంతోమంది ఆసక్తి చూపిస్తుంటారు. వారిలో కొందరు మన పద్ధతులను పాటించడానికీ ముందుకొస్తుంటారు. అలాంటిది దేశంలో పరిస్థితులు అంతకంతకూ దిగజారుతుండటమే దిగ్భ్రాంతపరుస్తోంది. వ్యక్తిని ఉన్నతుడిగా తీర్చిదిద్దే కుటుంబం బలంగా ఉండాలంటే- ఫ్యామిలీ కౌన్సెలింగ్‌కు ప్రాధాన్యమివ్వాలి. వివాహం తరవాత ఎదురయ్యే సవాళ్లను నిభాయించడంపై ముందుగానే అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు తప్పనిసరిగా ప్రతిరోజూ తమ పిల్లలకు కొంత సమయం కేటాయించి మంచి చెడులు తెలియజెప్పాలి. అన్నింటికన్నా ప్రధానంగా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు కుటుంబ విలువలను పరిచయం చేయాలి. మనిషిని ఉన్మత్తుడిగా మారుస్తున్న మద్యం, మత్తుమందుల వినియోగాన్ని కట్టడి చేయాలి. ఎప్పుడూ ఓట్ల లెక్కలేసుకుంటూ కూర్చోవడం కాకుండా నిజమైన సమాజ సంక్షేమం గురించి నాయకులు కాస్తన్నా పట్టించుకున్నప్పుడే ఇవన్నీ వాస్తవరూపం దాలుస్తాయి!

– వేణుబాబు మన్నం

శాటిలైట్లు కింద పడవా?

శాటిలైట్.. ఆకాశం నుంచి భూమికి సంబంధించిన ఫొటోలు తీస్తూ, ఇతర సమాచారమూ సేకరించి పంపిస్తుంటుంది. ఉపగ్రహాలుగానూ పిలిచే ఇలాంటివి భూమి చుట్టూ బోలెడు తిరుగుతున్నాయి. 'అలా ఆకాశంలో తిరిగే శాటిలైట్లు కింద పడిపోవా?' అనే సందేహం ఎప్పుడైనా వచ్చిందా? ఆకాశంలో ఏ ఆధారం లేకుండా శాటిలైట్లు ఎలా తిరుగుతాయో తెలుసుకుందాం.

గురుత్వాకర్షణ శక్తి గురించి తెలుసు కదా.. ఏ వస్తువునైనా తనవైపు లాక్కొనేలా భూమికి ఉండే శక్తి అది. ఏ వస్తువునైనా గాల్లో వదిలేస్తే కింద పడటానికి కారణమదే. మరి, ఆకాశంలో వదిలేసే శాటిలైట్ సంగతేంటి? గురుత్వాకర్షణ కారణంగా అది భూమిపై పడిపోవాలి కదా! నిజమే, గురుత్వాకర్షణ శక్తి శాటిలైట్‌ను కూడా భూమివైపు లాగుతూనే ఉంటుంది. అయితే.. గురుత్వాకర్షణ శక్తిని, తన ప్రయాణ వేగాన్ని సమతుల్యం చేసుకుంటూ, ఆ శక్తిని అధిగమించేందుకు అవసరమైన స్పీడ్‌తో శాటిలైట్ తన కక్ష్యలో తిరుగుతుంటుంది. మరి, శాటిలైట్లు ఒకదాన్ని మరొకటి ఎందుకు ఢీకొట్టవనే సందేహం వస్తుంది కదా! నిజానికి అలా జరిగే అవకాశం ఉంది. కానీ, శాటిలైట్‌ను ప్రయోగించినప్పుడు ఒక దానికొకటి ఢీకొనకుండా నివారించేందుకు ఒక స్థిరమైన కక్ష్యలో ఉంచుతారు. అందుకని ఢీకొట్టడం వంటి ఘటనలు చాలా అరుదే. ఉపగ్రహాలు తమ కక్ష్యలో చాలాకాలమే ఉంటాయి. 50 ఏళ్లకు పైగా పని చేసినవి కూడా ఉన్నాయి. చివరికి కాలంతీరిన శాటిలైట్‌ను జాగ్రత్తగా శ్మశానవాటికగా వ్యవహరించే కక్ష్యలోకి పంపుతారు. ఆ కక్ష్యలో తక్కువ గురుత్వాకర్షణ శక్తి ఉండటం వల్ల చాలా తక్కువ వేగమైనా సరిపోతుంది. భూమికి దగ్గరగా ఉండే ఉపగ్రహాలు బలమైన గురుత్వాకర్షణ శక్తిని అధిగమించేందుకు ఎక్కువ వేగంతో తిరుగుతుండాలి. చాలాదూరంలో ఉండే ఉపగ్రహాలపై గురుత్వాకర్షణ శక్తి ప్రభావం తక్కువగా ఉండటం వల్ల నెమ్మదిగా కదిలినా సరిపోతుందన్నమాట!



హాయ్! బుజ్జీ!!

– శ్రీజన్

అవునా.. కాదా..?

ఇక్కడ ఇచ్చిన వాక్యాలను చదివి అవునో, కాదో చెప్పండి చూద్దాం.

1. చంద్రుడు ఒక కృత్రిమ ఉపగ్రహం.
2. అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ.
3. ఒక రోజుకు 1440 నిమిషాలు.
4. క్రికెట్ మన జాతీయ క్రీడ.

జవాబు: 1.తప్పు 2.ఒప్పు 3.ఒప్పు 4.తప్పు

మూడు బైక్‌లపైకి దూసుకెళ్లిన లారీ
ఐదుగురి దుర్మరణం


వంతెనపై చెల్లాచెదురుగా మృతదేహాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: ఒడిశాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. రాంగ్‌రూట్‌లో మూడు ద్విచక్ర వాహనాలపై లారీ దూసుకెళ్లడంతో ఐదుగురు దుర్మరణం చెందారు. గంజాం జిల్లా బ్రహ్మపుర గుసానినువాగాం పోలీసుస్టేషన్ పరిధిలోని గుసానినువాగాం-హల్దియాపదర్ రైలు పైవంతెనపై ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. దక్షిణ మండల ఐజీ నితీ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం బ్రహ్మపుర నుంచి హల్దియాపదర్ వైపునకు పైవంతెన మీదుగా ఓ లారీ వెళ్తోంది. ఈ క్రమంలో అది రాంగ్‌రూట్‌లో మూడు ద్విచక్ర వాహనాలపై దూసుకెళ్లింది. దాంతో బైక్‌లపై ఉన్న సత్యనారాయణ పండా (42), జగన్ నాహక్ (20), రాకేష్ నాహక్ (21), సత్యనాథ్ బెజ్ (22), శిబరాం జెనా(35) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు.


విద్యార్థిని నిప్పుల్లో విసిరేసిన సహచరులు

చెన్నై (ఆర్కేనగర్), న్యూస్‌టుడే: తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లా కున్నత్తూర్ సమీపంలోని ఓ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థిపై సహచరులు దారుణానికి పాల్పడ్డారు. కాళ్లు చేతులు పట్టుకొని నిప్పుల్లో విసిరేశారు. తీవ్రంగా గాయపడిన ఆ విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తల్లి మాట్లాడుతూ... తన కుమారుడిని ఇద్దరు విద్యార్థులు నిప్పుల్లో పడేశారని వాపోయారు. తన కుమారుడు నల్లగా ఉన్నాడని, కులం పేరుతో తరచూ దూషించేవారన్నారు. ఆ విద్యార్థులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అమ్మ కౌగిలిలో ఆఖరి మజిలీ!

- రైలుకింద పడి తల్లి.. ఇద్దరు పిల్లల ఆత్మహత్య
- జీవితం భారంగా ఉంది... పిల్లల్ని వదలి వెళ్లలేక తీసుకెళ్తున్నానంటూ సూసైడ్ నోట్




చేతన రెడ్డి, విశాల్‌రెడ్డి ★ విజయరెడ్డి ★ చర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సీసీ ఫుటేజ్‌లో ఇద్దరు పిల్లలతో విజయరెడ్డి

ఈనాడు, హైదరాబాద్; రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: భార్యాభర్తలిద్దరు ఉద్యోగస్థులు.. వారికి ఇద్దరు పిల్లలు. చదువులో మెరికలు.. ఇంతలో ఏ కష్టమొచ్చిందో.. తనకీ జీవితం భారంగా ఉందని.. కుమార్తె, కుమారుడితో కలిసి తల్లి బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఇది. సికింద్రాబాద్ పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. హైదరాబాద్‌లోని బోడుప్పల్ పరిధి చెంగిచర్ల హరితవనం కాలనీలోని సొంతింట్లో విజయరెడ్డి(38)... కుమార్తె చేతన రెడ్డి(18), కుమారుడు విశాల్‌రెడ్డి(17), తల్లి పుష్పలతతో కలిసి నివసిస్తున్నారు. ఆమె భర్త సురేందర్‌రెడ్డి దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నారు. విజయరెడ్డి మాదాపూర్‌లోని ఐటీ కంపెనీలో టీమ్ లీడర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కుమార్తె పటాన్‌చెరులోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం, కుమారుడు ఘట్‌కేసర్‌లోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ.. అక్కడే హాస్టళ్లలో ఉంటున్నారు. విజయరెడ్డి ఉద్యోగానికి క్యాబ్‌లో వెళ్లి వచ్చేవారు. శుక్రవారం సాయంత్రం ఆమె తన సొంతకారులో ఇంటి నుంచి బయల్దేరుతుండగా.. ఆమె తల్లి క్యాబ్‌లో ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించగా ఆఫీసులో పని ఎక్కువగా ఉందని.. అందుకే తన కారులోనే వెళ్తున్నానని బదులిచ్చారు.

బంధువు మరణించారని అక్కడ చెప్పి..

కారులో ఇంటివద్ద నుంచి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరిన విజయరెడ్డి పటాన్‌చెరు, ఘట్‌కేసర్‌లలోని పిల్లలు ఉంటున్న హాస్టళ్లకు వెళ్లారు. తమ బంధువు మరణించారని వార్డెన్లకు చెప్పి పిల్లల్ని తీసుకెళ్లారు. కారులో ఇద్దరు పిల్లలతో కలిసి రాత్రి 11 గంటల సమయంలో చర్లపల్లి రైల్వేస్టేషన్ వద్దకు చేరుకున్నారు. 11.20 గంటలకు పార్కింగ్ ప్రాంతంలో వాహనం నిలిపి. . దాని తాళం కుమారుడి జేబులో ఉంచారు. ముగ్గురూ కలిసి రాత్రి 12 గంటలకు రైల్వేస్టేషన్ లోపలికి చేరారు. ప్లాట్‌ఫాం పైకి వచ్చి అక్కడి నుంచి రాత్రి 12.30 గంటలకు రైలుపట్టాల వెంట నడచుకుంటూ.. ఘట్‌కేసర్‌కు వెళ్లే మార్గంలోని కిలోమీటర్ నంబరు 207/2 ప్రాంతానికి చేరుకున్నారు. రైలుపట్టాలపైకి చేరాక ఆమె పిల్లలిద్దర్నీ దగ్గరకు తీసుకున్నారు. ఎదురుగా రైలు వస్తున్న శబ్దానికి పిల్లలిద్దరు భయపడటంతో కౌగిలించుకొని అక్కడే ఉండిపోయారు. అదేసమయంలో సనత్‌నగర్‌కు చెందిన గూడ్స్ రైలు లోకోపైలట్ సుశెన్ మహ్తో రైలు పట్టాలపై తల్లీపిల్లల్ని గుర్తించారు. హారన్ కొట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ముగ్గురూ మరింత దగ్గరగా హత్తుకొని కదలకుండా పట్టాలపైనే ఉన్నారు. రైలు ఢీకొని అక్కడికక్కడే మరణించారు. అనుమానాస్పద మరణాలుగా కేసు నమోదైంది. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. బాలుడి చొక్కా జేబులో లభించిన కారు కీ ఆధారంగా పార్కింగ్‌లోని కారును గుర్తించారు. ఆత్మహత్యకు ముందు విజయరెడ్డి.. పార్కింగ్ స్లిప్‌పై రాసిన సూసైడ్ నోట్ కారులో లభించింది. 'నేను జీవించలేను.. ఈ జీవితం చాలా భారంగా ఉంది. బతకాలని ప్రయత్నించినా.. బతకలేకపోతున్నా. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుంటున్నాం. పిల్లల్ని వదలి వెళ్లలేక నాతో పాటు తీసుకెళ్తున్నా. మా చావుకు ఎవరూ కారణం కాదు. అమ్మా.. నన్ను క్షమించు' అని ఆ నోట్‌లో ఉంది. విజయరెడ్డి భర్త సురేందర్‌రెడ్డి సొంతూరు ఏపీలోని నెల్లూరు. నాలుగు నెలల క్రితమే ఆయన నగరానికి వచ్చి భార్యాపిల్లలతో కొద్దిరోజులు గడిపి తిరిగి దుబాయ్ వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. కొద్దిరోజుల క్రితం విజయరెడ్డి ఇంట్లో పెంపుడు కుక్క చనిపోయిందని స్థానికులు తెలిపారు.

● ఘటన గురించి తెలిసి విజయరెడ్డి తల్లి పుష్పలత కన్నీరుమున్నీరుగా విలపించారు. 'నా కుమార్తెకు ఏ బాధా లేదు. ఇంట్లో ఎటువంటి గొడవల్లేవు. ఆర్థిక ఇబ్బందులూ లేవు. ఆమె ఎందుకు ఈ నిర్ణయం తీసుకుందో అర్థం కావట్లేదు' అని అన్నారు.

దర్శి మున్సిపల్ కమిషనర్ ఇంట్లో అనిశా తనిఖీలు
ఆదాయానికి మించి ఆస్తుల గుర్తింపు


పట్టుబడిన అక్రమ సంపాదన. చిత్రంలో మహేశ్వరరావు

దర్శి, న్యూస్‌టుడే: ప్రకాశం జిల్లాలోని దర్శి మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న యాదల మహేశ్వరరావు నివాసం, కార్యాలయంలో అవినీతి నిరోధకశాఖ అధికారులు శనివారం సోదాలు నిర్వహించారు. విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు వచ్చిన సమాచారంతో ఏకకాలంలో దర్శితో పాటు స్వగ్రామమైన సత్తెనపల్లి, నరసరావుపేటలోని ఆయన ఇళ్లల్లో, ఒంగోలులోని బంధువుల నివాసంలో తనిఖీలు చేశారు. నెల్లూరు అనిశా డీఎస్పీ రామకృష్ణుడు పర్యవేక్షణలో సోదాలు కొనసాగాయి. మహేశ్వరరావు తల్లి, భార్య, కుమారుడి పేర్ల మీద తొమ్మిది నివాస స్థలాలు, రెండు ఇళ్లు, 0.89 సెంట్ల వ్యవసాయ భూమి, రూ.2.6 లక్షల నగదు, 729 గ్రాముల బంగారం, 9.275 కిలోల వెండి, ఓ కారు, మూడు ద్విచక్రవాహనాలు ఉన్నట్లు గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులున్నాయని, పూర్తి వివరాలు లెక్క కట్టిన తర్వాత వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు. కమిషనర్‌ను అదుపులోకి తీసుకుని నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు చెప్పారు.

ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్ ముజామిల్ అరెస్టు


విలేకరుల సమావేశంలో టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ కులశేఖర్, ఇతర అధికారులు. చిత్రంలో స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్

ఈనాడు డిజిటల్, తిరుపతి-న్యూస్‌టుడే, తిరుపతి(మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ భారీ విజయాన్ని సాధించింది. అంతర్జాతీయ స్మగ్లర్, కర్ణాటకకు చెందిన మొహమ్మద్ ముజామిల్‌ను అరెస్టు చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం తిరుపతిలో టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు, ఎస్పీ శ్రీనివాస్, అదనపు ఎస్పీ కులశేఖర్ విలేకరులకు వెల్లడించారు. ముజామిల్ సాధారణ స్మగ్లర్ కాదు. ఇతని దందా హైటెక్ పద్ధతిలో సాగేది. ఎర్రచందనం దుంగలను రైతుల వద్ద కొనుగోలు చేసినట్లు పక్కాగా ప్రభుత్వ అనుమతులు, లైసెన్సులు సృష్టించేవాడు. ఆ పత్రాల ముసుగులో శేషాచలం అడవుల నుంచి అక్రమంగా తరలించిన నాణ్యమైన ఎర్రచందనాన్ని చైనాకు ఎగుమతి చేసేవాడు. ముజామిల్‌కు చైనాలోని ఓ కంపెనీతో నేరుగా సంబంధాలు ఉన్నాయి. చైనాకు చెందిన జోజో, భారత్‌లో ప్రతినిధిగా ఉన్న మైఖేల్‌తో కలిసి ఈ దందా నడిపేవాడు. బెంగళూరుకు చెందిన రవి ద్వారా స్థానిక స్మగ్లర్లు సయ్యద్ అబ్దుల్ లతీఫ్, వాజీద్‌ల నుంచి సరకు సేకరించి, దాన్ని విదేశాలకు తరలించి రూ.కోట్లు గడించేవాడు. ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఎర్రచందనం స్మగ్లర్ల కోసం టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు పర్యవేక్షణలో అదనపు ఎస్పీ కులశేఖర్ బృందం.. చిత్తూరు-నాయుడుపేట జాతీయ రహదారిలోని తనపల్లి క్రాస్ వద్ద శనివారం ముజామిల్‌ను అదుపులోకి తీసుకుంది.

● ముజామిల్‌పై గతంలో అనేక కేసులున్నాయి. 87 శాతం కేసుల్లో శిక్షలు ఖరారైనా, చట్టంలోని లొసుగులను వాడుకుంటూ, పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఎట్టకేలకు టాస్క్‌ఫోర్స్ వలపన్ని ఇతన్ని బంధించింది. ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించిన అదనపు ఎస్పీ కులశేఖర్, ఎస్పీ శ్రీనివాస్, ఇతర సిబ్బందిని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు.

కంప్యూటర్ దీదీ.. దీదీకా దుకాణ్

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టి దేశవ్యాప్తంగా 7 వేల బ్లాక్‌ల్లో 35 లక్షల మంది లఖ్‌పతి దీదీలను తయారు చేయాలనేది కేంద్ర ప్రభుత్వ సంకల్పం.

ఉచితంగా నాలుగు ల్యాప్‌టాప్‌లు

● కంప్యూటర్ దీదీ పథకం కింద ప్రతి పంచాయతీలో డ్వాక్రా మహిళలతో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) ఏర్పాటు చేయనున్నారు.

● ఇందుకోసం ఎంపిక చేసిన డ్వాక్రా సభ్యురాలికి ఉచితంగా నాలుగు ల్యాప్‌టాప్‌లు అందిస్తారు. ఫర్నిచర్ కొనుగోలుకు సెర్ప్ ద్వారా రుణం ఇప్పిస్తారు.

● సర్వీస్ సెంటర్ వారికి స్థిరమైన ఉపాధిగా మారేందుకు రెండేళ్లపాటు నెలకు రూ.6 వేల చొప్పున అందేలా వారిని పలు కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తారు. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని సేవల అనుమతి ఇస్తారు. డ్వాక్రా మహిళలకు అవసరమైన డిజిటల్ శిక్షణ ఇచ్చేందుకు అవకాశం కల్పించి, ప్రోత్సాహకం కూడా చెల్లిస్తారు.

● తాడికొండ మండలంలో మొత్తం 15 పంచాయతీల పరిధిలో 15 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారం క్రితం ఆరు పంచాయతీల పరిధిలో సీఎస్‌సీలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

డ్వాక్రా మహిళలతో దీదీ దుకాణ్‌లు

● డ్వాక్రా మహిళలతో పంచాయతీల వారీగా దీదీ దుకాణ్‌లు కూడా ఏర్పాటు చేయిస్తారు. పంచాయతీ జనాభా, అక్కడి ప్రజల కొనుగోలు శక్తి, సగటున కుటుంబ వ్యయం, మార్కెట్ వాటా వంటివి అంచనా వేసి అక్కడ ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేయాలో నిర్ణయిస్తారు.

● విక్రయానికి అవసరమైన సరకులు కొనుక్కోవడానికి రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు బ్యాంకు రుణం ఇప్పిస్తారు. ● విక్రయ విధానం, నాణ్యమైన సరకుల ఎంపిక, బ్రాండింగ్‌ను గుర్తించడం, ఆన్‌లైన్ ద్వారా తక్కువ ధరకు సరకుల కొనుగోలు, తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. వ్యాపారం లాభసాటిగా ఉండేందుకు మార్కెటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తారు. ● తాడికొండ మండలంలోని 15 పంచాయతీల్లో 50 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారితో 50 దుకాణాల్ని ఏర్పాటు చేయించారు.

రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త పోరాటం
అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ తీర్మానం


మాట్లాడుతున్న అశోక్ ధావలే. చిత్రంలో విజూ కృష్ణన్, సాగర్, కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు

ఈనాడు, అమరావతి; గుంటూరు(నెహ్రూనగర్), న్యూస్‌టుడే: రైతులకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు అశోక్ ధావలే తెలిపారు. గుంటూరులో నిర్వహిస్తున్న అఖిల భారత కిసాన్ సభ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో శనివారం జాతీయ కౌన్సిల్ పలు తీర్మానాలు చేసింది. అనంతరం అశోక్ ధావలే విలేకరులతో మాట్లాడారు. 'ఎన్డీయే ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. ఫిబ్రవరి 12న కార్మికసంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాం' అని చెప్పారు. ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ మాట్లాడుతూ.. 'గత 12 ఏళ్ల కాలంలో రైతులకు పంటరుణాల మాఫీ జరగలేదు. కార్పొరేట్ సంస్థలకు మాత్రం భారీగా రుణమాఫీ చేశారు. 2020లో దిల్లీలో రైతుల పోరాటం సందర్భంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని చెప్పిన కేంద్రం. . ఇప్పటికీ నెరవేర్చలేదు' అని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఔటర్ రింగ్ రోడ్డు పేరుతో భారీగా భూసేకరణకు సన్నాహాలు జరుగుతున్నాయని, 140 మీటర్ల వెడల్పుతో రోడ్డు అవసరమా? అని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో ఏఐకేఎస్ జాతీయ సహాయ కార్యదర్శి సాగర్, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ఎప్‌స్టీన్ ఫైళ్ల కలకలం

- పలువురు ప్రముఖుల పేర్ల ప్రస్తావన
- అతనితో మస్క్‌కు ఈమెయిల్ బంధం!
- మొత్తం 30 లక్షల పేజీల విడుదల
- మోదీ పేరు ప్రస్తావించడాన్ని ఖండించిన భారత్



ఎప్‌స్టీన్

న్యూయార్క్: ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ఫైళ్లు అమెరికాలో మళ్లీ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అనేక మంది ప్రముఖుల పేర్లు, ఫొటోలు, ప్రస్తావనలు ఇందులో ఉన్నాయి. అమెరికా ప్రభుత్వం 30 లక్షల 'ఎప్‌స్టీన్ ఫైల్స్‌'ను బయటపెట్టింది. వీటితో పాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలను విడుదల చేసింది. డిప్యూటీ అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ శుక్రవారం వీటిని విడుదల చేశారు. ఎప్‌స్టీన్ ఫైళ్ల (ట్రాన్స్‌పరెన్సీ) చట్టం కింద అమెరికా న్యాయ శాఖ వెబ్‌సైట్‌లో ఈ పత్రాలు, వీడియోలు, ఫొటోలు అందుబాటులో ఉంచారు. జైల్లో చనిపోయిన మిలియనీర్ ఫైనాన్షియర్ ఎప్‌స్టీన్ ఆధ్వర్యంలో మైనరు బాలికలపై జరిగిన లైంగిక వేధింపులకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నాయి. ఈ విషయంలో ఆయన ట్రంప్, బిల్ క్లింటన్, ఎలాన్ మస్క్, బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూలతో జరిపిన సంభాషణలున్నాయి.

■ తాజాగా విడుదల చేసిన ఫైళ్లలో ట్రంప్ పేరు వేలసార్లు వచ్చింది. ఎప్‌స్టీన్, ఆయన మిత్రులు.. ట్రంప్‌నకు సంబంధించిన వార్తలను షేర్ చేసుకున్నారు. ఆయన విధానాలు, రాజకీయాలపై వారు చర్చించుకున్నారు. ఆయన, ఆయన కుటుంబం గురించిన గాసిప్స్ వారి మధ్య చర్చకు వచ్చాయి. ట్రంప్‌ను కాపాడేలా కొన్ని ఫైళ్లను దాచారని వచ్చిన ఆరోపణలను అమెరికా న్యాయశాఖ ఖండించింది. గతంలో ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌నకు స్నేహం ఉండేదని, ఆ తర్వాత ఆయనతో విడిపోయారని వివరించింది.

■ మౌంట్‌బాటెన్ విండ్సర్ (బ్రిటన్ మాజీ యువరాజు ఆండ్రూ) పేరు ఈ ఫైళ్లలో వందలసార్లు ఉంది. కొన్ని సందర్భాల్లో వార్తల క్లిప్పింగుల్లో, కొన్నిసార్లు ఎప్‌స్టీన్ ఈమెయిల్ ప్రైవేటు సంభాషణల్లో, డిన్నర్ అతిథుల జాబితాల్లో ఉంది. ఎప్‌స్టీన్ ఫైళ్లలోని చిత్రాల్లో మహిళతో ఆండ్రూ ఉన్న చిత్రాలు బయటకు వచ్చాయి. గుర్తు తెలియని మహిళలు, అగ్గిన అపార్ట్‌మెంట్లు, హోటల్, విల్లాల్లో ఉన్న చిత్రాలు బయటకు వచ్చాయి.

■ బిలియనీర్ అధినేత ఎలాన్ మస్క్.. ఎప్‌స్టీన్‌తో జరిపిన ఈమెయిల్ సంభాషణ బయటకు వచ్చింది. మస్క్ రెండు సందర్భాల్లో ఎప్‌స్టీన్ ఐలాండ్‌ను సందర్శించాలని అనుకున్నట్లు ఉంది. అందులో ఆయన కరీబియన్ దీవుల పర్యటనకు వెళ్లడానికి ఆయనతో చర్చించినట్లు ఉంది. కరీబియన్ దీవుల్లో లైంగిక దోపిడీ జరిగినట్లు ఆరోపణలొచ్చాయి. 2013లో మస్క్.. కరీబియన్ దీవుల పర్యటనకు సంబంధించిన ప్రణాళిక వేసుకున్నట్లు ఉంది.

■ ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా పని చేసిన సమయంలో శ్వేతసౌధం వ్యూహకర్తగా ఉన్న స్టీవ్ బానన్.. ఎప్‌స్టీన్‌తో సంభాషించారు. 2019లో తనకు రోమ్ నుంచి విమానం ఏర్పాటు చేయగలరా అని ఎప్‌స్టీన్‌ను అడిగారు. తాను ఫ్రాన్స్‌లో ఉన్నానని, మావాళ్లు తీసుకొస్తారని, డిన్నర్‌కు రావాలని ఎప్‌స్టీన్ కోరారు. ఆ తర్వాత ఆ డిన్నర్‌కు బానన్ హాజరైందీ లేనిదీ తెలియలేదు.

■ అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా జనరల్ కౌన్సెల్ క్యాతీ రూమ్లర్‌తో ఎప్‌స్టీన్ పలుమార్లు సంభాషణలు జరిపారు. ట్రంప్‌ను మాఫియా తరహా వ్యక్తి అని డెమొక్రాట్లు ప్రచారం చేయకుండా చూడాలని రూమ్లర్‌కు ఎప్‌స్టీన్ ఒక ఈమెయిల్‌లో సూచించారు.

■ ఎప్‌స్టీన్ ఫైళ్లలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ పేరు ప్రస్తావనకు వచ్చింది. రష్యన్ మహిళతో ఆయన లైంగిక సంబంధాలు నెరిపారని.. అందువల్ల ఆయన సుఖవ్యాధుల బారిన పడ్డారని ఎప్‌స్టీన్ ఆరోపణలు చేశారు. ఆ తరువాత తనతో ఉన్న ఆరేళ్ల స్నేహాన్ని గేట్స్ తెంచుకున్నారని వెల్లడించారు. ఈ ఆరోపణలను గేట్స్ బృందం ఖండించింది.

■ భారతీయ దర్శకురాలు మీరా నాయర్ ఓ సినిమా కోసం లైంగిక ఆరోపణల కేసుల్లో దోషి అయిన మ్యాక్స్‌వెల్‌కు చెందిన టౌన్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరయ్యారని ఎప్‌స్టీన్ ఫైళ్లలో ఉంది.

చెత్త వదంతులు..: భారత్ ఖండన

ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై ఎప్‌స్టీన్ చేసిన వ్యాఖ్యలను చెత్త వదంతులుగా భారత్ అభివర్ణించింది. మోదీ పేరును ఎప్‌స్టీన్ ప్రస్తావించడం దేశానికి అవమానకరమని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా వ్యాఖ్యానించిన నేపథ్యంలో విదేశీ వ్యవహారాలశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. ఒక శిక్ష పడ్డ ఖైదీ చేసిన ఆరోపణలకు విలువ లేదని వ్యాఖ్యానించారు. '2017 జులైలో ప్రధాని మోదీ ఇజ్రాయెల్‌లో పర్యటించారన్న అంశం ఒక్కటి తప్ప ఎప్‌స్టీన్ ఈమెయిళ్లలో ఉన్నదంతా తప్పు. అదో చెత్త వదంతి' అని ఆయన స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీ తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తోందని భాజపా నేతలు సంబిత్ పాత్ర, అమిత్ మాలవీయ ధ్వజమెత్తారు.

గ్రామీణ మహిళలకు దన్నుగా కోట్‌జేవర్ బ్లూ పాటరీ



ఒకప్పుడు రాజుల నివాసాల్లో విలాస వస్తువులుగా ఉన్న బ్లూ పాటరీ (నీలిరంగు పాత్రలు) నేడు ఎంతోమంది గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు ఆధారం నిలుస్తున్నాయి. రాజస్థాన్‌లోని జైపుర్ సమీప కోట్‌జేవర్ గ్రామం ఈ బ్లూ పాటరీ కళతో అంతర్జాతీయ గుర్తింపు పొందుతోంది. స్థానిక మహిళలు అద్భుతమైన కళాఖండాలను సృష్టిస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. ఇందుకు కారణమైన శ్రీపర్ణ అనే మహిళా పారిశ్రామికవేత్త ప్రయాణం స్ఫూర్తిదాయకం. సాధారణ గృహిణిగా ఉంటూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమైన శ్రీపర్ణ ప్రభుత్వ పథకం 'రాజీవిక' ద్వారా తన జీవితాన్ని మార్చుకున్నారు. పదిమంది మహిళలతో కలిసి స్వయం సహాయక సంఘాన్ని ఏర్పాటు చేసి, బ్లూ పాటరీ యూనిట్‌ను ప్రారంభించారు. నేడు గ్రామంలో ఏడు స్వయం సహాయక బృందాలు ఉన్నాయి. సుమారు 60 మంది మహిళలు ప్రత్యక్షంగా, మరో 5 వేల మంది పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. విదేశీ పర్యాటకులు సైతం ఈ గ్రామానికి వచ్చి ఆర్డర్లు ఇస్తున్నారని శ్రీపర్ణ తెలిపారు.

గాజాపై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

30 మందికి పైగా పాలస్తీనియన్ల మృతి

డెయిర్ అల్-బలా: కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ గాజాపై ఇజ్రాయెల్ బలగాలు మళ్లీ విరుచుకుపడుతున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి ఆ దేశ సైన్యం నిర్వహించిన దాడుల్లో 30 మందికి పైగా పాలస్తీనియన్లు మృతి చెందారు. గాజా సిటీ, ఖాన్ యూనిస్ సహా పలు ప్రాంతాల్లో నివాసాలపై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. మృతుల్లో ఇద్దరు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. గాజా-ఈజిప్టు సరిహద్దుల్లోని రఫా క్రాసింగ్‌ను ఇజ్రాయెల్ తెరవనుందన్న వార్తల నేపథ్యంలో ఈ దాడి జరగడం గమనార్హం. గతేడాది అక్టోబరు 10న హమాస్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. అప్పటి నుంచి ఇజ్రాయెల్ దాడుల్లో దాదాపు 520 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది.



ఇజ్రాయెల్ దాడితో గాజాలో అలముకున్న పొగ

బలోచిస్థాన్‌లో 67 మంది ఉగ్రవాదుల హతం

కరాచీ: పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో ఉన్న 12 వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి నుంచి కొనసాగుతున్న ఏరివేత చర్యల్లో మృతిచెందిన ఉగ్రవాదుల సంఖ్య 67కి చేరింది. ఈ ఆపరేషన్లో 11 మంది సాధారణ పౌరులు, 10 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని బలోచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగతీ శనివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మరణించిన ఉగ్రవాదుల్లో బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీకి చెందినవారు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా సునేత్ర ప్రమాణం



ప్రమాణం అనంతరం సంతకం చేస్తున్న సునేత్ర పవార్

ముంబయి: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ దివంగత నేత అజిత్ పవార్ సతీమణి సునేత్ర పవార్ (62) శనివారం మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. ఈ పదవిని చేపట్టిన తొలి మహిళగా ఆమె ఖ్యాతి గడించారు. అధికార మహాయుతి కూటమిలో భాగమైన ఎన్సీపీ శాసనసభాపక్షం ఆమెను తమ నాయకురాలిగా ఎన్నుకుని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు లేఖను అందించింది. దానిని గవర్నర్ ఆచార్య దేవవ్రత్‌కు పంపారు. సునేత్రకు ఎక్సైజ్ శాఖ కేటాయించారు. ఆర్థిక శాఖను కేటాయించలేదు. ఆమెకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం అలుపెరుగకుండా పనిచేయడం ద్వారా ఆమె అజిత్ ఆశయాన్ని సాధిస్తారని విశ్వాసం వ్యక్తంచేశారు. సునేత్ర ప్రమాణంతో ఎన్సీపీ వర్గాల విలీనానికి విఘాతం కలిగినట్లు కనిపిస్తోంది.

మాకు సమాచారం లేదు: శరద్

పదవీ స్వీకార ప్రమాణం గురించి తమకు సమాచారమే లేదని, పత్రికల ద్వారానే దీనిని తెలిసిందని ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ అన్నారు. 'మమ్మల్నెందుకు విశ్వాసంలోకి తీసుకుంటారు? వాళ్ల పార్టీ వేరు, మా పార్టీ వేరు' అని వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 12న విలీనవర్గాల విలీనాన్ని ప్రకటించాలని స్వయంగా అజిత్ పవార్ నిర్ణయించారని, ఆయన ఆకాంక్ష నెరవేరుతుందని ఆశిస్తున్నామని చెప్పారు. నాలుగు నెలలుగా అజిత్ పవార్, జయంత్ పాటిల్‌లు విలీనం విషయంలో తమతో చర్చిస్తున్నారని, దురదృష్టకర విమాన ప్రమాద ఘటన ఆ ప్రక్రియకు విఘాతం కలిగించిందన్నారు. అజిత్‌ను తిరిగి తీసుకురాలేమని, ప్రస్తుత పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలన్నది చూడాలని వ్యాఖ్యానించారు.

అమెరికాలో మొదలైన తాత్కాలిక షట్‌డౌన్

- బడ్జెట్‌కు లభించని ఆమోదం



వాషింగ్టన్: అమెరికాలో తాత్కాలిక షట్‌డౌన్ మళ్లీ మొదలైంది. 2026 సంవత్సర బడ్జెట్టును సెనెట్ ఆమోదించి, హౌస్‌కు పంపింది. అది సోమవారానికి గానీ పరిశీలనకు రాదు. సెప్టెంబరు నెలాఖరు వరకు ప్రభుత్వ ఖర్చులకు అవసరమైన నిధులను మంజూరు చేయడానికి సెనెట్ సమ్మతించింది. దేశీయ భద్రత నిధులకు తాత్కాలికంగా పొడిగింపునిచ్చింది. వలసదారుల మీద కొత్త ఆంక్షలపై చర్చ నిమిత్తం కాంగ్రెస్‌కు రెండు వారాల గడువునిచ్చింది. మినియాపొలిస్‌లో భద్రతాధికారుల చేతిలో ఇద్దరు నిరసనకారులు ప్రాణాలు కోల్పోవడం, వారాంతంలో షట్‌డౌన్ అనివార్యంగా కనిపిస్తుండటంతో నిధుల ఖర్చుకు సంబంధించి సెనెట్ డెమోక్రాట్లతో అధ్యక్షుడు ట్రంప్ ఒక అవగాహనకు వచ్చారు. ఏజెంట్లను బట్టబయలు చేయడం, ఏదైనా ఘటనల్లో దర్యాప్తునకు సహకరించేందుకు స్థానిక అధికారులకు అనుమతి మంజూరుచేయడంపై చట్టాన్ని కాంగ్రెస్ పరిశీలించనంతవరకు విస్తృత బిల్లుకు తాము ఓటు వేయబోమని డెమోక్రాట్లు తేల్చిచెప్పేశారు. అమెరికా ఇప్పుడు 'బ్రేకింగ్ పాయింట్'ను చేరిందని సెనెట్ డెమోక్రాటిక్ నేత ఛక్ షూమర్ చెప్పారు. 71-29 ఓట్లతో ఆమోదం పొందిన బిల్లు ఇప్పుడు హౌస్‌కు వెళ్లినందువల్ల అక్కడ ఆమోదం పొందేవరకు తాత్కాలిక షట్‌డౌన్ తప్పదు. గత ఏడాది అమెరికా ఇలా 43 రోజులు షట్‌డౌన్‌లో ఉంది. చాలా ప్రభుత్వ విభాగాలకు నిధుల కేటాయింపు జరగకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఎంత బిజీగా ఉన్నా ఇవి తప్పనిసరి



మీరు ఎంత బిజీగా ఉన్నా ఈ ఐదు విషయాలు మరిచిపోకండి.
1. వారంలో మూడు రోజులు రన్నింగ్ చేయడం. 2. రెండు రోజులు కండరాల దృఢత్వం కోసం వ్యాయామాలు. 3. రోజూ ఏడు గంటల నిద్ర. 4. రోజూ వంద గ్రాముల ప్రొటీన్ తీసుకోవడం. 5. మూడు నెలలకోసారి ట్రెక్కింగ్.
– షాజన్ సామ్యూల్, మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్

కాంగో గనుల్లో ప్రమాదం.. 200 మంది మృతి

గోమా: తూర్పు కాంగోలోని రుబాయా గనుల్లో మట్టిచరియలు విరిగిపడి దాదాపు 200 మంది మృతి చెందారు. ఇందులో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. భారీ వర్షం కారణంగా బుధవారం ఈ గనుల్లో సొరంగాలు కుప్పకూలాయి. బురదలోనే ఇంకా కొన్ని మృతదేహాలు చిక్కుకుపోయి ఉన్నాయని ఈ గనులను నియంత్రిస్తున్న ఎమ్23 రెబెల్ అధికారవర్గాలు తెలిపాయి. క్షతగ్రాత్రులను స్థానిక ఆసుపత్రులకు తరలించామని పేర్కొన్నాయి. నిర్వహణ లోపం వల్లే పదే పదే కొండచరియలు విరిగిపడుతున్నాయని ఓ కార్మికుడు తెలిపారు. నియంత్రణ లేకుండా ప్రజలు ఎక్కడ పడితే అక్కడ ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా చేతులతో తవ్వుతున్న కారణంగానే ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు.

ఏప్రిల్ 30 నాటికి రామమందిర నిర్మాణం పూర్తి

ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ వెల్లడి

అయోధ్య: ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి సంబంధించిన అన్ని పనులూ ఏప్రిల్ 30 నాటికి పూర్తికానున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర తెలిపారు. "మందిర నిర్మాణ పనులు చేపడుతున్న ఎల్‌అండ్‌టీ, టాటా కన్సల్టెన్సీ సంస్థలు ఏప్రిల్ 30 నాటికి ఆలయ సముదాయం నుంచి వైదొలగనున్నాయి. ఆ సంస్థలకు చెందిన చిన్న బృందమొకటి ఆలయంలో పూర్తిచేసిన అన్ని నిర్మాణ పనుల నిర్వహణను మూడేళ్ల పాటు చూస్తుంది. ఏప్రిల్ 30 తర్వాత ఆలయానికి సంబంధించిన అన్ని హక్కులు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు చెందుతాయి" అని నృపేంద్ర మిశ్ర మీడియాకు తెలిపారు.

శాంతి చర్చలు సానుకూలం



- ఉక్రెయిన్ – రష్యా యుద్ధంపై ట్రంప్

ఇంటర్నెట్ డెస్క్: ఉక్రెయిన్- రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా అమెరికా తన దౌత్యపరమైన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. దీనిపై శ్వేతసౌధంలో విలేకరులతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడారు. "యుద్ధం ముగింపు దిశగా గణనీయమైన పురోగతి సాధిస్తున్నాం. శాంతి చర్చలు సఫలమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌లు ఒకరినొకరు తీవ్రంగా ద్వేషించుకుంటున్నారు. ఇది చర్చలకు అవరోధంగా మారింది. త్వరలోనే యుద్ధాన్ని ముగించే దిశగా ఓ ఒప్పందానికి దగ్గరగా వచ్చామని మేం భావిస్తున్నాం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. నాలుగేళ్లకు చేరువవుతున్న ఈ యుద్ధం. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో అమెరికా మధ్యవర్తిత్వం కీలకంగా మారింది. ఇటీవల అబుదాబీలో అమెరికా, రష్యా, ఉక్రెయిన్ ప్రతినిధుల మధ్య జరిగిన త్రైపాక్షిక సమావేశం తర్వాత శాంతి చర్చలు మరింత వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో రష్యా మరో అడుగు ముందుకేసి చర్చల కోసం జెలెన్‌స్కీని మాస్కోకు రావాలని అధికారికంగా ఆహ్వానించింది. మరోవైపు రష్యన్ దాడుల పర్యవసానంగా ఉక్రెయిన్‌లో విద్యుత్ సరఫరాకు కలుగుతున్న అంతరాయాలు జనజీవనాన్ని దుర్భరంగా మార్చాయి. ఉక్రెయిన్‌లోని పలు నగరాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఉక్రెయిన్ విద్యుత్ గ్రిడ్‌పై రష్యా చేసిన వరుస దాడుల కారణంగానే ఈ దుర్భర పరిస్థితి తలెత్తింది.


ఇజ్రాయెల్‌కు రూ.61,152 కోట్ల ఆయుధాలు

- అమెరికా కీలక నిర్ణయం
- సౌదీకి రూ.82,514 కోట్ల సైనిక సామగ్రి

వాషింగ్టన్: ఇరాన్‌పై అమెరికా దాడి చేయనుందన్న సంకేతాలు వెలువడుతున్న సమయంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్, సౌదీ అరేబియాలకు భారీగా ఆయుధాలను విక్రయించాలని ట్రంప్ యంత్రాంగం నిర్ణయించింది. ఇజ్రాయెల్‌కు రూ.61,152 కోట్ల విలువైన, సౌదీ అరేబియాకు రూ.82,514 కోట్ల విలువైన ఆయుధాలను సరఫరా చేయనున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ శుక్రవారం ప్రకటించింది. గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తున్న సమయంలో ఈ ప్రకటన చర్చనీయాంశమైంది. ఈ విక్రయ ఒప్పందంలో భాగంగా సౌదీ అరేబియాకు 730 పేట్రియాట్ క్షిపణులు, అందుకు సంబంధించిన సామగ్రి అందించనున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ ఆయుధాలు సౌదీ అరేబియా సైనిక దళాలతోపాటు ఇతర మిత్రదేశాల బలగాలకు రక్షణ కల్పిస్తాయని ఆ శాఖ పేర్కొంది. తాజా ఒప్పందంలో భాగంగా ఇజ్రాయెల్‌కు 30 అపాచీ హెలికాప్టర్లు, తత్సంబంధిత సామగ్రి, ఆయుధాలు అందించనుంది. "ఇజ్రాయెల్ భద్రతకు అమెరికా కట్టుబడి ఉంది. ఇజ్రాయెల్ స్వీయ రక్షణ సన్నద్ధతను బలోపేతం చేయడం వెనక అమెరికా కీలక ప్రయోజనాలు దాగి ఉన్నాయి" అని విదేశాంగ శాఖ తన అధికారిక ప్రకటనలో పేర్కొంది.

అప్పులు అడగటం సిగ్గుగా అనిపించింది

- పాక్ ప్రధాని వ్యాఖ్యలు



ఇస్లామాబాద్: తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటోన్న పాకిస్థాన్.. దీనినుంచి బయటపడేందుకు మిత్ర దేశాల వద్దకు వెళ్లి మరీ రుణాలు అడగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయాన్ని తాజాగా దేశ ప్రధాని షెహబాజ్ షరీఫే అంగీకరించారు. అప్పులు అడగటం తనకు సిగ్గుగా అనిపించిందని వ్యాఖ్యానించారు. ఇస్లామాబాద్‌లో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో దేశంలోని ప్రముఖ ఎగుమతిదారులు, వ్యాపారులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'నేను, ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ కలిసి రహస్యంగా చాలా దేశాల వద్దకు వెళ్లి అప్పులు అడిగాం. ఆ సమయంలో మాకు చాలా సిగ్గుగా అనిపించింది. రుణాలు తీసుకోవడం ఆత్మగౌరవానికి పెద్ద దెబ్బ. డబ్బులు ఇచ్చేవారు ఏం డిమాండు చేసినా సరే.. అడ్డు చెప్పలేని పరిస్థితి ఉంటుంది' అని షరీఫ్ అన్నారు. అయితే రుణాలు ఇచ్చే విషయంలో చాలా దేశాలు తమను నిరాశ పరచలేదన్నారు. పరిస్థితులతో సంబంధం లేకుండా పాక్‌కు మద్దతుగా నిలిచిన సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, చైనా వంటి మిత్ర దేశాలన్నింటికీ ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిపోవడంపై షరీఫ్ ఆందోళన వ్యక్తంచేశారు. మిత్ర దేశాల నుంచి అప్పులు కోరడంపై పాక్ ప్రధాని నిరాశ వ్యక్తంచేయడం ఇదేం తొలిసారి కాదు. సౌదీ అరేబియా ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చినప్పటికీ. . మరిన్ని రుణాలు అడగడం తనను ఇబ్బంది పెట్టిందని గతంలోనూ వ్యాఖ్యానించారు.

కనీవినీ ఎరుగని గందరగోళంలో దేశ ఆర్థికం

మోదీ పాలనపై కాంగ్రెస్ విమర్శ



దిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తి గందరగోళంగా మారిన నేపథ్యంలో పరిస్థితిని చక్కదిద్దే పరిష్కారాన్ని కేంద్ర ప్రభుత్వం చూపుతుందా అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం ప్రశ్నించారు. తప్పిదాలన్నిటినీ గత ప్రభుత్వంపై నెట్టి ఆ సాకుతో తన వైఫల్యాలను మోదీ కప్పి పుచ్చుకోలేరని, ఎందుకంటే గత పన్నెండేళ్లుగా ఆయన సర్కారే అధికారంలో ఉందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వ విధానాలు దేశాన్ని గతంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని ఆర్థిక గందరగోళంలోకి నెట్టేశాయని విమర్శించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనలో 7.4 శాతంగా ఉన్న ఉత్పాదకత వృద్ధి ప్రస్తుత ఎన్డీయే కాలంలో 3.54 శాతానికి పడిపోయిందని తెలియజేసే వీడియోను కూడా ఆయన తన పోస్టుకు జతచేశారు. 'భారత్‌లో తయారీ' ద్వారా 25% ఉత్పాదకత సాధిస్తామని ప్రభుత్వం ప్రకటించినా అది 13 శాతాన్ని మించలేదని తెలియజేసే వీడియోను కూడా ఆయన తన పోస్టుతోపాటు పంచుకున్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 92కు పడిపోయిన విషయాన్ని ఖర్గే ప్రస్తావించారు.

సోషల్ మీడియా.. 'చిన్నారుల మెదళ్లను తినేస్తుంది'

అమితాబ్ కాంత్



ఇంటర్నెట్ డెస్క్: దేశ యువత సోషల్ మీడియా విపరీత వాడకంపై ఆర్థిక సర్వే ఇటీవల తీవ్ర ఆందోళన వ్యక్తంచేసిన నేపథ్యంలో నీతిఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ స్పందించారు. ఈ డిజిటల్ వ్యసనం ఆర్థిక దుష్పరిణామాలకు దారితీస్తుందని, వయసుపరంగా నియంత్రించాల్సిన అవసరం ఉందన్న సూచనలతో ఆయన ఏకీభవించారు. 'సోషల్ మీడియాలో వయోపరిమితి అవసరమని ఆర్థిక సర్వే సూచనతో వందశాతం ఏకీభవిస్తున్నా. ఇది చిన్నారుల మెదళ్లను తీవ్రంగా దెబ్బతీస్తుంది. ఉత్పాదకతను, ఏకాగ్రతను తగ్గిస్తుంది. దీని ఫలితంగా దీర్ఘకాలంలో ఆన్‌లైన్‌లో ఉంటూ, వాస్తవిక ప్రపంచంలో కష్టపడి పనిచేయలేని తరం ఏర్పడుతుంది. ఇలా మనం వికసిత్ భారత్‌ను నిర్మించలేం. నిజానికి.. స్కూళ్లు, కాలేజీల్లో దీన్ని పూర్తిగా నిషేధించాలి' అని అమితాబ్ కాంత్ స్పష్టంచేశారు.

మమత సర్కారును కూకటి వేళ్లతో పెకలించండి

- అమిత్ షా పిలుపు



బ్యారక్‌పుర్ సభలో ప్రసంగిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా

సిలీగుడీ: పశ్చిమబెంగాల్‌లో మమత సర్కారును కూకటి వేళ్లతో పెకలించి దేశ భక్తులు, జాతీయ వాదుల ప్రభుత్వాన్ని స్థాపించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా శనివారం పిలుపునిచ్చారు. ఈ సంవత్సరం జరగనున్న పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో టీఎంసీకి టాటా బైబై చెప్పాలని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వంలో ఉన్నంత అవినీతి మరే రాష్ట్రంలో లేదని ఆయన మండిపడ్డారు. ఈ ప్రభుత్వం చొరబాటుదారులకు రక్షణ కల్పించి సామాజిక ఉద్రిక్తతలకు ఆజ్యం పోస్తోందని అన్నారు. సరిహద్దు భద్రతకు తాము తీసుకుంటున్న చర్యలకు మమత ప్రభుత్వం ఆటంకం కలిగిస్తోందని సిలీగుడీలో భాజపా కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ అమిత్ షా అన్నారు. "అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కంచె వేయడానికి బీఎస్ఎఫ్‌కు స్థలం కేటాయించాలని నేను పార్లమెంటులో కోరాను. దీనిపై మమతకు ఏడుసార్లు లేఖ రాశాను. మమత కార్యాలయానికి స్వయంగా వెళ్లినా ఆమె స్థలం కేటాయించలేదు" అని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో వివిధ వర్గాల మధ్య టీఎంసీ ప్రభుత్వం ఉద్రిక్తతలు సృష్టించి పబ్బం గడుపుకుంటోందని, రాష్ట్రంలో సమైక్యతకు విఘాతం కలిగిస్తోందని ఆయన విమర్శించారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో ఉత్తర బెంగాల్ ప్రాంతంలోని అన్ని స్థానాలకూ భాజపా కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. టీఎంసీ ప్రభుత్వ అవినీతితో, సిండికేట్ అరాచకాలతో ప్రజలు విసిగిపోయారన్నారు. మమతా బెనర్జీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రయోజనం పొందడం కోసం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తోందని, అవినీతిని వ్యవస్థీకృతం చేసిందని, సరిహద్దు భద్రతా చర్యలను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని అమిత్‌షా విమర్శించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని బ్యారక్‌పుర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఆయన.. తాము అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లో రాష్ట్రంలో సరిహద్దు వెంబడి కంచె వేస్తామని పునరుద్ఘాటించారు.

ఈశాన్య ప్రాంతాన్ని భారత ప్రధాన భూభాగంతో కలిపే చికెన్ నెక్ ప్రాంతాన్ని కోసేస్తామని దిల్లీలో కొందరు నినాదాలు చేశారని అమిత్ షా అన్నారు. "కొందరు చికెన్ నెక్‌ను కోసేస్తామని నినాదాలు చేశారు. సోదరా చికెన్ నెక్ ఏమన్నా మీ అబ్బ సొత్తా?" అని ఆయన ప్రశ్నించారు. అలాంటి నినాదాలు చేసిన వారిని తాము అరెస్టు చేయగా ఇండియా కూటమి నేతలు వారిని విడిపించే ప్రయత్నం చేశారని షా ఆరోపించారు.



'సేవ్ మణిపుర్' పేరిట ఆ రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో మైతేయ్ పౌర సమాజ సంస్థల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శాంతి ప్రదర్శనలో పాల్గొన్న ప్రజలు

నైజీరియాలో సాయుధమూక దాడులు

వేర్వేరు ఘటనల్లో 36 మంది మృతి

మైదుగురి: ఈశాన్య నైజీరియాలోని బోర్నో రాష్ట్రంలో సాయుధమూకలు జరిపిన రెండు వేర్వేరు దాడుల్లో దాదాపు 36 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారు. బోర్నోలోని సబోన్‌గరి పట్టణంలో సాయుధమూకలు జరిపిన కాల్పుల్లో కనీసం 25 మంది కార్మికులు మరణించారు. అంతకు కొద్ది గంటల ముందే సాయుధమూకలు సబోన్‌గరిలోని ఓ సైన్య శిబిరంలోకి చొరబడి కాల్పులు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడుల్లో 9 మంది సైనికులు, పౌర టాస్క్‌ఫోర్స్‌లోని ఇద్దరు సభ్యులు మరణించారని, మరో 16 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు.

చైనా-బ్రిటన్ మధ్య భారీ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం

లండన్: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ చైనాలో నిర్వహించిన మూడు రోజుల పర్యటన సందర్భంగా 220 కోట్ల పౌండ్ల విలువ చేసే ఎగుమతి ఒప్పందాలతోపాటు రానున్న ఐదేళ్ల కాలంలో కొన్ని కోట్ల పౌండ్ల పెట్టుబడులకు సంబంధించి అంగీకారం కుదిరింది. చైనా తమకు ప్రయోజనం కలిగించే అనేక వాణిజ్య అవకాశాలకు వీలు కల్పించిందని బ్రిటన్ ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. స్కాచ్ విస్కీపై సుంకాన్ని సగానికి తగ్గించి 5 శాతానికి పరిమితం చేయడం, బ్రాంప్టన్ బైకుల విక్రయం, ఆస్ట్రాజెనెకా ఫార్మస్యూటికల్ పెట్టుబడులు వంటి అనేక ప్రయోజనాలు అందించిందని తెలిపింది. మరోవైపు చైనాకు చెందిన ప్రసిద్ధ ఆటబొమ్మల సంస్థ పాప్‌మార్ట్ లండన్‌లో తన ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనుంది. అంతర్జాతీయ ఆటోమోటివ్ ఉత్పాదక సంస్థ 'చెరీ కమర్షియల్ వెహికల్స్'.. ఐరోపా ప్రాంతీయ ప్రధాన కార్యాలయాన్ని లివర్‌పూల్‌లో నెలకొల్పనుంది. అలాగే విద్యుత్ నిల్వ సదుపాయాల ఉత్పాదక సంస్థ హితియం.. 20 కోట్ల పౌండ్ల పెట్టుబడి పెట్టనుంది.

'రామ్‌సర్' జాబితాలోకి మరో రెండు చిత్తడి నేలలు

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని పట్నా పక్షుల సంరక్షణ కేంద్రం, గుజరాత్‌లోని ఛారీ ఢాండ్ ప్రాంతాలు రామ్‌సర్ క్షేత్రాల జాబితాలోకి చేరాయి. దీంతో భారత్‌లో రామ్‌సర్ గుర్తింపు పొందిన చిత్తడి నేలల సంఖ్య 98కి చేరింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు, చిత్తడి నేలల సంరక్షకులకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు. జీవ వైవిధ్యాన్ని, కీలక పర్యావరణ వ్యవస్థను పరిరక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ గుర్తింపులు పునరుద్ఘాటిస్తున్నాయన్నారు.

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
ఆదివారం ఫిబ్రవరి 1, 2026

నవదిన ప్రార్థన.. జనులకు సాంత్వన





విజయవాడలోని గుణదల కొండపై లూర్దు మాత 102వ మహోత్సవాల నవదిన ప్రార్థనలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు వేడుకలు జరుగుతాయని, ఇందుకు భక్తులను సంసిద్ధులను చేస్తామని మతపెద్దలు తెలిపారు.


- గుణదల(పటమట), న్యూస్‌టుడే

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

ఎలీప్ ఆధ్వర్యంలో రెండు వారాల నిర్వహణ

ఈనాడు, అమరావతి: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎలీప్ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ శిక్షణను రామవరప్పాడులోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 6 నుంచి రెండు వారాలు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయని ఎలీప్ అధ్యక్షురాలు కె.రమాదేవి తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు, పురుషులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చని సూచించారు. ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వ రాయితీలు, మార్కెటింగ్ టెక్నిక్స్, నూతన ఆలోచనా విధానాలు, డిజిటల్ మార్కెటింగ్, స్టార్టప్‌లను ఆరంభించడానికి ఉన్న అవకాశాలు, ఎంఎస్ఎంఈ, ఎన్ఎస్ఐసీ రిజిస్ట్రేషన్స్ వంటి అన్ని అంశాల మీద శిక్షణ తరగతుల్లో ఆయా రంగాల్లోని నిపుణులు వచ్చి అవగాహన కల్పిస్తారన్నారు. ఆసక్తి ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు 89789 88008, 89789 88002 నంబర్లలో సంప్రదించి, వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రంచనుగా పింఛను..



ఫిబ్రవరి 1 ఆదివారం కావడంతో కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలలో ప్రధానమైన వృద్ధాప్య, దివ్యాంగుల పింఛను జనవరి 31నే రంచనుగా వృద్ధుల చెంతకే వెళ్లి అందించింది. కానూరులోని సీనియర్ సిటిజన్ ఫోరం వృద్ధాశ్రమంలో ఉంటున్న 35 మంది వృద్ధులకు ఇలా పింఛను అందించగా వారు ఆనందం వ్యక్తం చేశారు. -ఈనాడు, అమరావతి

కొండ చుట్టూ అనకొండలు!

రైతుల అసైన్డ్ భూములు కొని మైనింగ్‌కు దరఖాస్తులు! ★ లోకాయుక్తలో ఫిర్యాదు.. ఫిబ్రవరి 2న విచారణ

ఈనాడు, అమరావతి

అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలకు అక్రమార్కులు పెద్దఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. కొత్తూరు తాడేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 206లోని దొండతిప్ప కొండ చుట్టూ 75 ఎకరాల వరకూ ఉన్న అసైన్డ్ భూములపై తాజాగా వీరి కన్ను పడింది. ఒక్కో ఎకరం రూ.45-55లక్షలకు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. ముందస్తుగా రైతులకు ఎకరాకు రూ.2-5లక్షల వరకూ బయానాగా ఇచ్చి.. వారి పేరిటే మైనింగ్‌కు అనుమతుల కోసం దరఖాస్తులు చేసేందుకు తెరవెనుక ప్రయత్నాలు ఆరంభించారు. గత వైకాపా హయాంలో ఇలా అసైన్డ్ భూములను తక్కువకు కొనేసి రూ.వందల కోట్ల విలువైన మట్టిని తవ్వుకుపోయారు. భూములను అగాధాలుగా మార్చేశారు. ఇప్పుడూ అదే మైనింగ్ మాఫియా తెరవెనుక ఉండి మళ్లీ అక్రమాలకు తెరతీస్తున్నారు. ★ దొండతిప్ప కొండ 60 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ కొండ మట్టిని కూడా ఊడ్చేసేందుకు ప్రస్తుతం మైనింగ్‌కు దరఖాస్తులు పెట్టుకున్నారు. ఇప్పటికే రెవెన్యూ, అటవీశాఖ అధికారులు దీనికి సంబంధించి సర్వేను పూర్తిచేసినట్లు తెలుస్తోంది. వారు ఎన్‌వోసీ ఇస్తేనే మైనింగ్ నుంచి అనుమతులొస్తాయి. ఇదే సమయంలో కొండ చుట్టూ ఉన్న అసైన్డ్ భూముల్లోనూ తవ్వకాల కోసం కొనుగోళ్లు చేస్తున్నారు. ప్రకృతి వనరుల విధ్వంసం జరుగుతోందంటూ లోకాయుక్తలో కొత్తూరు తాడేపల్లికి చెందిన మెండెం జమలయ్య ఫిర్యాదు చేయగా ఫిబ్రవరి 2న విచారణ జరగనుంది.

నామమాత్ర జరిమానాలేసి.. వదిలేస్తూ..

కొత్తూరు తాడేపల్లి పరిధిలోని సర్వే నంబరు 261లో ఆరు లారీలు, ఒక జేసీబీ పెట్టి.. అనుమతులు లేకుండా మట్టి తవ్వేస్తుంటే వారం కిందట రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. రెవెన్యూ, అటవీశాఖలు ఇచ్చిన ఎన్‌వోసీలను చూపించి తవ్వేయడంతో లారీలు, జేసీబీని అధికారులు సీజ్ చేశారు. కానీ లారీకి రూ.8వేల జరిమానా వేసి వదిలేశారు. ఒక లారీ మట్టినే రూ.15వేలకు అమ్ముతున్నారు. అందుకే ఇలా సీజ్ చేస్తుంటే అక్రమార్కులు అలా జరిమానా కట్టి విడిపించుకుపోయి మళ్లీ తవ్వుతున్నారు.



అనుమతులు రాకముందే దొండతిప్ప కొండ వద్ద పొక్లెయిన్‌తో మోహరించి..

రాజధాని అవసరాలకు..

ప్రభుత్వం చొరవ తీసుకుని రాజధాని పనుల కోసం ఈ రెవెన్యూ కొండల మట్టిని నేరుగా వాడుకోవచ్చు. కొత్తూరు తాడేపల్లి పరిధిలోని 60 ఎకరాల్లో ఉన్న దొండతిప్ప, ఆ పక్కనే జక్కంపూడి సర్వే నంబరు 88లోని వడ్ల కొండ.. ఈ రెండింటి నుంచే లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వస్తుంది.

నిమ్మకూరు ఏపీఆర్ పాఠశాలకు మహర్దశ

వసతిగృహానికి రూ.6 కోట్లు మంజూరు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: ఎన్టీఆర్ స్వగ్రామం కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గం నిమ్మకూరులోని ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ (ఏపీఆర్) పాఠశాల బాలుర వసతి భవన నిర్మాణానికి రూ.6కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిమ్మకూరులోని నందమూరి లక్ష్మయ్య, వెంకట్రావమ్మ సంస్మరణ గురుకుల వృత్తి విద్యా ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో ఒకప్పుడు సీటు దొరకడమే అదృష్టంగా భావించేవారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ ఈ విద్యాలయానికి తన సొంత భూమిని విరాళంగా ఇచ్చారు. ఇక్కడ చదివిన ఎందరో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న విద్యాలయంలో వసతి భవనాలు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నా వైకాపా ప్రభుత్వంలో కనీసం పట్టించుకున్న నాథుడు లేడు. ఇక్కడి సమస్యలపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక 'రామన్న బడి.. రాజసమేదండి' శీర్షికన మరోసారి కథనం ప్రచురితమైంది. సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఈ విద్యాలయ వసతిగృహానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించింది. రూ.6 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. సకల సదుపాయాలతో నూతన భవనం నిర్మించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నిమ్మకూరు గురుకుల పాఠశాలకు నిధులు మంజూరు చేయడంపై గ్రామస్థులు, పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. త్వరితగతిన వసతి భవన నిర్మాణాలు పూర్తయితే విద్యాలయానికి మళ్లీ పూర్వవైభవం రానుంది.

భూముల విలువల పెంపు

నేటి నుంచి అమలు

ఈనాడు, అమరావతి

భూముల విలువల పెంపు ఆదివారం నుంచి అమల్లోకి రానుంది. ఉమ్మడి జిల్లాలో కనిష్ఠంగా 2.3 నుంచి గరిష్ఠంగా 15శాతం వరకు ధరలు సవరించారు. ప్రస్తుతం అభివృద్ధి పథంలో ఉన్న ప్రాంతాలతో పోలిస్తే నగర, పట్టణ ప్రాంతాల్లో పెరుగుదల తక్కువగానే ఉంది. 1వ తేదీ ఆదివారం కావడంతో 2వ తేదీ నుంచి పెరిగిన ధరల ప్రకారం రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి.

పెరుగుదల ఇలా.. బందర్ రోడ్డుపై గజం విలువ రూ.1.15 లక్షల నుంచి రూ.1.20 లక్షలకు పెరిగింది. గజం రేటు రూ.85 వేలు ఉంటే రూ.90వేలకు పెరిగింది. ఏలూరు రోడ్డుపై గజం రూ.1.05 లక్షలు ఉంటే రూ.1.10లక్షలు పెరిగింది. పటమట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో అత్యల్పంగా రూ.2వేలు అత్యధికంగా రూ. 5వేల వరకు భూముల ధరలు పెరిగాయి. గ్రేటర్ పరిధిలో ఉన్న కానూరు, తాడిగడప, పోరంకి, యనమలకుదురు తదితర ప్రాంతాల్లో 10 నుంచి 15శాతం వరకు రేట్లు పెరిగాయి. సింగ్‌నగర్‌లో రూ.2వేలు, పాయకాపురంలో రూ.3వేలు, భవానీపురంలో రూ.4వేలు పెరుగుదల చూపించారు. బందర్‌లో నివాస స్థలాలు 5 నుంచి 12శాతం, వ్యవసాయ స్థలాలు 4నుంచి 14 శాతం వరకు పెరిగాయి. ★ ఓఆర్ఆర్ ప్రతిపాదిత ప్రాంతాల్లో రైతులు భూముల ధరలు పెంచాలని కోరుతూ అధికారులను ఆశ్రయించారు. తమ భూముల విలువలు పెరిగితే పరిహారం పెరుగుతుందని అధికారులను కోరారు.

నేటి నుంచి పెనుగంచిప్రోలులో తిరుపతమ్మ పెద్ద తిరునాళ్లు

పెనుగంచిప్రోలు, నందిగామ (న్యూస్‌టుడే): తెలుగు రాష్ట్రాల్లో పేరొందిన గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్ల మహోత్సవాలు ఆదివారం నుంచి జరగనున్నాయి. ఫిబ్రవరి 1న ఉదయం అఖండ జ్యోతి స్థాపన హోమగుండం వెలిగింపుతో తిరునాళ్ల ప్రారంభం అవుతాయి. స్థానిక శివాలయంలో అమ్మవారి దీక్ష స్వీకరించిన స్వాములు పూజలో పాల్గొంటారు. అనంతరం తిరుముడి సమర్పించి దీక్షలను విరమిస్తారు. దీక్షా స్వాములకు ఆలయ అధికారులు మునేరు ఒడ్డున ఉచిత అన్నసమారాధనకు ఏర్పాట్లు చేశారు.

నేడు కల్యాణం: తిరుపతమ్మ కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి 9:05 గంటలకు నిర్వహించనున్నారు. అమ్మవారి కల్యాణంలో గోపయ్య, తిరుపతమ్మ అమ్మవారి వంశీకులైన కాకాని, కొల్లా వంశీకుల నుంచి ఒక్కో జంట కల్యాణం పీటలపై కూర్చుంటారు. అదే విధంగా ఆలయ, పోలీస్, రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యే దంపతులు కల్యాణంలో ప్రాతినిధ్యం వహిస్తారు. పటిష్ఠమైన క్యూలైన్‌లు, ఇనుప బారికేడ్లను కట్టారు. 2వ తేదీన జలబిందెల మహోత్సవం, 3న ఉదయం పొంగళ్ల నివేదన, 4న దీవెన బండారు కార్యక్రమాలు నిర్వహిస్తారు.. 5న మహాపూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి. కల్యాణం వీక్షించేలా 20 భారీ ఎల్‌ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. సుమారు మూడు లక్షలు లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశారు.

ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా రైళ్ల రద్దు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: గుంతకల్ డివిజన్‌లో నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల దృష్ట్యా పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

★ 17247/17248 నర్సాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 21, 22 తేదీల్లో కదిరి, ధర్మవరం మధ్య రద్దు ★ 17215/17216 మచిలీపట్నం-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 21, 22 తేదీల్లో అనంతపురం-ధర్మవరం మధ్య రద్దు ★ 07189/07190 నాందేడ్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 20, 22 తేదీల్లో కదిరి, ధర్మవరం మధ్య రద్దు. ★ పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు ప్రయాణికుల సౌకర్యార్థం పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ★ 07507 మచిలీపట్నం-కాచిగూడ ప్రత్యేక రైలు ఈనెల ఒకటో తేదీన నడవనుంది. గుడివాడ, విజయవాడ, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, చర్లపల్లి స్టేషన్లలో ఆగుతుంది. ★04357 ఎర్నాకులం-వారణాసి మధ్య ఈ నెల 3న నడిచే ప్రత్యేక రైలు..త్రిసూర్, కోయంబత్తూర్, తిరుప్పూర్, ఈరోడ్, జోలార్‌పేట, కాట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, డోర్నకల్, వరంగల్, బెల్లంపల్లి, బలార్ష, నాగ్‌పూర్, ఇటార్సి, జబల్‌పూర్, ప్రగాగ్‌రాజ్ స్టేషన్లలో ఆగుతుంది.

కాల్వలకు 3,155 క్యూసెక్కుల నీరు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు శనివారం 3,155 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువకు 1,015, కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు 2,054, గుంటూరు ఛానల్‌కు 86 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాలువ నుంచి ఏలూరు కాల్వకు 511, కేఈబీ కాల్వకు 403, బందరు కాల్వకు 101 క్యూసెక్కుల మేర విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.9 అడుగులు ఉండగా, ఎగువ నుంచి 3,687 క్యూసెక్కులు వస్తోంది.

అంబటిపై.. భగ్గుమన్న తెదేపా శ్రేణులు

బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా పరిధిలో.. అంబటి రాంబాబు దిష్టిబొమ్మలు దహనం చేస్తూ.. చిత్రపటాలకు చెప్పుల దండలు వేసి.. తెదేపా శ్రేణులు.. తీవ్రస్థాయిలో తమ నిరసన గళం వినిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించినందుకు.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ తెదేపా శ్రేణులు నిరసన బాట పట్టాయి. అంబటి వెంటనే క్షమాపణలు చెప్పకపోతే.. తమ ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామంటూ హెచ్చరించారు. ★ నందిగామ గాంధీ సెంటర్‌లో అంబటి ఫొటోలను చెప్పులతో కొడుతూ తెదేపా నేతలు నిరసన తెలిపారు. దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం నందిగామ పోలీస్‌స్టేషన్‌లో అంబటి రాంబాబుపై తెదేపా నాయకులు ఫిర్యాదు చేశారు. ★ విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై గొల్లపూడి వన్‌సెంటర్ వద్ద తెదేపా శ్రేణులు నిరసనకు దిగాయి. రాంబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ★ విజయవాడ ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నల్ల కండువాలతో తెదేపా నేతలు నిరసన తెలిపారు. అనంతరం అంబటి చిత్రపటాలను మంటల్లో వేసి కాల్చారు. అనంతరం పటమట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయాలంటూ అంబటిపై ఫిర్యాదు చేశారు. ★ భవానీపురంలో అంబటి ఫ్లెక్సీకి చెప్పుల దండలు వేసి ఆందోళన చేపట్టారు. దిష్టిబొమ్మను దహనం చేశారు. చిత్రపటాలను చెప్పులతో కొడుతూ మహిళలు నిరసన తెలిపారు. ★ విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎంపీ కేశినేని చిన్నీ క్యాంపు కార్యాలయం వద్ద అంబటి ఫ్లెక్సీకి చెప్పుల దండలు వేసి.. దిష్టిబొమ్మ దహనం చేసి.. నిరసన వ్యక్తం చేశారు. ★ కంచికచర్ల వద్ద జాతీయ రహదారిపై అంబటి దిష్టిబొమ్మను కాళ్లతో తన్నుతూ తెదేపా కార్యకర్తలు నిరసన తెలిపి.. అనంతరం దహనం చేశారు.



విజయవాడ: ఎన్టీఆర్ సర్కిల్‌లో దిష్టిబొమ్మ దహనం చేస్తూ..



పెనుగంచిప్రోలు: ఎస్సై అర్జున్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కొమరవోలు డ్రెయిన్‌పై కన్ను

ఈనాడు, అమరావతి

- పూడిక తీత పనులు దక్కించుకునేందుకు దందా
- తమ మనిషికే ఇవ్వాలంటూ ఓ ప్రజాప్రతినిధి పట్టు

కొమరవోలు డ్రెయిన్ పూడిక తీత పనులపై ఓ ప్రజాప్రతినిధి కన్ను పడింది. రూ.కోట్ల విలువైన పనులు ఎలాగైనా తమ అనుచరులకే దక్కాలని కథ నడిపిస్తున్నారు. టెండర్లు పిలిచినా అకారణంగా రద్దు చేశారంటే ఆ ప్రజాప్రతినిధి ఒత్తిడి ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.

రూ.కోట్లు కొల్లగొట్టేందుకే..

✪ ముదినేపల్లి మండలం కోడూరు నుంచి గుడివాడ మండలం చౌటపల్లి, వేల్పూరు, బొమ్ములూరు, చినఎరుకపాడు, బిళ్లపాడు, రామనపూడి మీదుగా పామర్రు మండలం కొమరవోలు, జమీగొల్వేపల్లి మీదుగా పెదమద్దాలి వరకు 19.4 కి.మీ ఉంది. దీని పరిధిలో 40వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 2013 తర్వాత డ్రెయిన్ అభివృద్ధి లేక విపత్తుల సమయంలో పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ✪ దీంతో కూటమి సర్కారు పూడికతీతకు రూ.11కోట్లు మంజూరు చేసింది. పనులు చేసేందుకు కొన్ని నెలల కిందట అధికారులు టెండర్లు పిలిచారు. చాలా మంది గుత్తేదారులు పనులు చేసేందుకు బిడ్లు వేయడం ఆ ప్రజాప్రతినిధికి ఏమాత్రం నచ్చలేదు. ✪ తన అనుచరులకే ఇవ్వాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకురావడం మొదలుపెట్టారు. మిగిలిన గుత్తేదారులను టెండర్లు వేయకుండా చూసుకోమని అధికారులు చేతులెత్తేశారు. అయినా చాలా మంది టెండర్లు వేయడంతో ప్రజాప్రతినిధి ఆగ్రహంతో ఊగిపోయారు. అధికారులపై ఒత్తిడి తేవడంతో వారు సైతం కుంటిసాకులు చూపి అడ్డగోలుగా టెండర్లు రద్దు చేశారు. ✪ ప్రాజెక్టు కమిటీలో కీలకమైన వ్యక్తిగా ఉన్న ప్రజాప్రతినిధి అనుచరుడు ఎలాగైనా టెండర్ తమ వర్గం వారికే ఇప్పించేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. గతంలో టెండర్లు వేసిన గుత్తేదారులకు బిడ్లు వేయవద్దంటూ కమీషన్ల ఆశ చూపిస్తున్నారు. కమీషన్‌కు లొంగని వారిని బెదిరించైనా తప్పించాలనుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఎలాగైనా దక్కించుకునేలా..

✪ ప్రలోభాలకు కూడా గుత్తేదారులు తలొగ్గకుంటే లెస్ టెండర్ వేయించైనా కాంట్రాక్ట్ దగ్గించుకునేందుకు పావులు కదుపుతున్నారు. గతంలో, తాజాగా చంద్రయ్య డ్రెయిన్ నిర్వహణ పనుల కాంట్రాక్టు విషయంలో రాజకీయ రంగు పులుముకోవడంతో 20శాతం పైగా తక్కువ మొత్తానికి టెండర్లు వేశారు. ✪ అరకొరగా పనులు చేసి బిల్లులు తీసుకోవాలన్నది వీరి ఎత్తుగడ. ఈ డ్రెయిన్ పనుల విషయంలోనూ ఇదే విధానం అమలు చేస్తారని తెలుస్తోంది. ✪ దీనిపై ఇరిగేషన్ ఎస్ఈ మోహనరావు మాట్లాడుతూ..'నిబంధనల మేరకు టెండర్లు నిర్వహిస్తాం. సాంకేతిక ఇబ్బందులతో టెండర్ల ప్రక్రియ ఆలస్యమైంది. వేగంగా పూర్తి చేస్తాం' అని తెలిపారు.


కార్యశాలకు హాజరైన అనిల్ కుమార్, రిజిస్ట్రార్ సాయిసుధీర్, రత్నశీలా తదితరులు

'అపార్'తో అనేక ప్రయోజనాలు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో అపార్ ఐడీపై రాష్ట్ర స్థాయి కార్యశాల శనివారం వర్సిటీలో నిర్వహించారు. ఏపీ ఉన్నత విద్యామండలి అపార్ నోడల్ అధికారి పి. అనిల్ కుమార్ మాట్లాడుతూ.. 'వన్ నేషన్... వన్ ఐడీ'తో అపార్‌ను వివరించారని పేర్కొన్నారు. ఏపీ ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్‌పర్సన్ ఆచార్య కె. రత్నశీలా అపార్ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, అకడమిక్ లాభాలు, యూనిఫైడ్ డిజిటల్ ఐడెంటిటీ విధానాల గురించి వివరించారు. డిజిటల్ డిగ్రీ జారీ, సురక్షిత ధ్రువీకరణ తదితర అంశాల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. ఉన్నత విద్యలో డిజిటలైజేషన్, పారదర్శకత, రికార్డుల నిర్వహణ, కేంద్ర ప్రభుత్వ విధి విధానాల గురించి చర్చించారు. రిసోర్సుపర్సన్ రవి పాండే అపార్‌పై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా, విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ సాయి సుధీర్ పర్యవేక్షించారు. కార్యశాలకు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల స్వయం ప్రతిపత్తి, విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుంచి 130 మంది హాజరయ్యారు.

సైబర్ మోసాల నివారణకు అవగాహనే ఆయుధం: కలెక్టర్ లక్ష్మీశ

చిట్టినగర్, న్యూస్‌టుడే: సైబర్ మోసాల నివారణలో అవగాహనే ప్రధాన ఆయుధమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల, నక్ష ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సైబర్ సెక్యూరిటీ అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో ఆధునిక సాంకేతికత మన జీవితాలను సులభతరం చేస్తున్నప్పటికీ, అదే క్రమంలో సైబర్ నేరాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని అన్నారు. విద్యార్థులు సామాజిక మాధ్యమాలను 30 శాతం మాత్రమే తమ అవసరాలకు వినియోగిస్తున్నారని, మిగతా 70 శాతం వినియోగం ఇతర అంశాల కోసం వాడుతున్నారని అన్నారు. సైబర్ క్రైమ్ డీసీపీ కృష్ణప్రసన్న మాట్లాడుతూ.. ప్రత్యేకంగా ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు, ఈ-కామర్స్ కొనుగోళ్లు, సామాజిక మాధ్యమాల విషయంలో అప్రమత్తత అవసరమని చెప్పారు. డిజిటల్ అరెస్టు, టాస్క్ బేస్డ్, లోన్ యాప్, గిఫ్ట్, ఐడెంటిటీ థెఫ్ట్, క్రెడిట్ కార్డు మోసాలు గురించి వివరించారు. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు సైబర్ సురక్ష యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చారని వివరించారు. సైబర్ మోసాలపై యువత సమాజాన్ని చైతన్యవంతం చేయాలని సూచించారు. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే 1930 ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. సదస్సులో సైబర్ క్రైమ్ ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, కళాశాల కార్యదర్శి టి. శ్రీనివాస్, ఏవో వి. నారాయణరావు, ప్రిన్సిపల్ కృష్ణవేణి, కంప్యూటర్ విభాగాధిపతి నరేంద్ర, నక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రిషికేసింగ్, కో-వ్యవస్థాపకుడు రాహీ భాటియా, సౌత్‌కో-ఆర్డినేషన్ దారా కరుణశ్రీ, యశస్విని, ప్రతినిధులు అబ్దుల్ షమీ, మానస, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కంచె నిలిచేనా.. ఆపద ఆపేనా..


గుణదలలో ఈఎస్ఐ ఆస్పత్రి రోడ్డులో ఉన్న పుల్లేటికట్ట కాలువ రక్షణ కోసం వేసిన ఇనుప కంచె మెలికలు తిరిగిపోయి కాలువలోకి వాలిపోయింది. రాత్రివేళ వాహనదారులు అదుపు తప్పితే కాలువలోకి పడిపోయే ప్రమాదం ఉంది. దీనిని సరిచేయాలని వాహనదారులు కోరుతున్నారు. **- ఈనాడు, అమరావతి**

నిర్మాణ లోపాలు.. అడ్డుకున్నా ఆగట్లేదు!

జాతీయ రహదారిపై ప్రమాదాల పరంపర


మైలవరం మండలం బొర్రగూడెం వద్ద కనిపించని సూచికలు

మైలవరం, న్యూస్‌టుడే

ఇటీవల హైదరాబాదులో ఉద్యోగం చేసే తమ కుమార్తెను ఇబ్రహీంపట్నం వద్ద దింపేందుకు ద్విచక్ర వాహనంపై మైలవరం నుంచి బయలుదేరిన ఒక కుటుంబానికి తీవ్ర ఆవేదన మిగిలింది. జి. కొండూరు మండలం చెవుటూరు బైపాస్‌లో, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టిన సంఘటనలో భార్య మృతి చెందగా, కుమార్తె తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో నేటికీ చికిత్స పొందుతోంది. ఇది ఆ ఒక్క కుటుంబం పరిస్థితే కాదు.. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ సభ్యులను కోల్పోయిన ప్రతి బాధిత కుటుంబానిది.

చర్యలు ఫలించక..

వేగ నియంత్రణ లేని జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు పెరుగుతూనే ఉన్నాయి. జాతీయ రహదారి- 30పై ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. పేరుకు జాతీయ రహదారే అయినా.. నిర్మాణ లోపాలతో నాసిరకంగా మారింది. ఎగుడు దిగుడు, అనర్థకరమైన మలుపులు ప్రమాదాలకు హేతువుగా మారుతున్నాయి. నిత్యం ఎక్కడో చోట చిన్న ప్రమాదమైనా జరుగుతోందంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. వీటి నివారణకు పోలీసుల చర్యలు ఫలించడం లేదు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని ఇబ్రహీంపట్నం నుంచి మొదలయ్యే ఈ రహదారి తిరువూరు వరకు సుమారు 70 కి.మీ మేర జిల్లా పరిధిలోనే ఉంది.

డ్రమ్ములు బద్ధలవుతున్నాయి

జాతీయ రహదారులపై వేగ నియంత్రికలకు అవకాశం ఉండదు. కానీ ప్రమాదాలు పెరుగుతున్నందున రెండేళ్ల నుంచి గుర్తించిన బ్లాక్ స్పాట్లలో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్లాస్టిక్ డ్రమ్ములకు రేడియం స్టిక్కర్లు అతికించి నిలబెట్టడం, యూటర్న్‌ల వద్ద స్టాపర్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలకు ఉపక్రమించారు. అయితే ప్రమాద తీవ్రత తగ్గించడానికి అవి దోహదపడుతున్నా, రాత్రి వేళల్లో ఆ డ్రమ్ములు సైతం బద్ధలవుతున్నాయి. ఏడాది కాలంలో జరిగిన 90 వరకు ప్రమాదాల్లో 18 మంది వరకు మృతి చెందినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

ప్రాణాంతకంగా డివైడర్లు

రహదారి పొడవున పలు చోట్ల బైపాస్‌లను నిర్మించారు. ఆయా ప్రాంతాల్లో మధ్య డివైడర్లు కనీస ఎత్తు లేవు. పైగా రేడియం స్టిక్కర్లతో ఏర్పాటు చేసిన చిన్నపాటి కడ్డీలు దగ్గర కొచ్చే వరకు కనిపించడం లేదు. దాంతో రాత్రి వేళల్లో డివైడర్లను ఢీకొట్టి జరిగిన ప్రమాదాల్లో చాలా మంది క్షతగాత్రులయ్యారు. అందులో చెవుటూరు బైపాస్ ప్రధానంగా ఉంది. ప్రమాదాలకు నెలవుగా మారుతోంది.

పెళ్లి సంబంధాల కోసం చూస్తున్నారా
కమ్మ కుల అవివాహితులకు సువర్ణావకాశం

నేడు కమ్మ కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, కమ్మ కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బి బ్లాక్, 3వ అంతస్తులోని ఈనాడు కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వారు, సంబంధిత కుటుంబీకులు **నేడు (1 ఫిబ్రవరి 2026)** ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు క్రింద తెలిపిన ఫోన్ నెంబర్లకు సంప్రదించి వాట్సప్ ద్వారా పంపవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 92475 20500
ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు చర్యలు


రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే: యువత ఉద్యోగులు ఇచ్చే స్థాయికి ఎదగాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచించారు. గుంటుపల్లిలోని రూరల్ ఇండస్ట్రియల్ స్కిల్లింగ్ అంత్రప్రెన్యూర్‌షిప్ సెంటర్(రైజ్)ను ఆయన శనివారం కలెక్టర్ లక్ష్మీశతో కలిసి పరిశీలించి మహిళా పారిశ్రామికవేత్తలతో మాట్లాడారు. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామికవేత్త ఉద్భవించాలని, తద్వారా ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. నూతన పారిశ్రామికవేత్తలకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నేతృత్వంలో రైజ్ సెంటర్లలో ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, నైపుణ్య అభివృద్ధి, ఉపాధి సృష్టిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మహిళల్లో ఆర్థిక సాధికారత పెంపొందించేందుకు ప్రభుత్వం ఇప్పట్నే ప్రోత్సాహకానికి రూపకంగా రైజ్‌ను రూపొందించామన్నారు. ఏటా వెయ్యి మంది వ్యాపారవేత్తలుగా మార్చాలన్నదే లక్ష్యంగా రైజ్‌లో కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభతో మెరిసి.. విజేతలుగా నిలిచి..


విజేతలతో అతిథులు

సీతారాంపురం, న్యూస్‌టుడే: సీతారాంపురం కడియాలవారి వీధిలోని మదర్‌థెరిసా హైస్కూల్‌లో శనివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయి ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పది పాఠశాలల నుంచి విద్యార్థులు తలపడ్డారు. వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, క్విజ్‌లో పోటీలు జరిగాయి.

విజేతలు వీరే.. వ్యాసరచనా పోటీలో: ఎం. శ్రీజ (మదర్ థెరిసా), కె. రాకేష్‌రెడ్డి (నలంద), ఎస్. లక్ష్మీహాసిని (జీలార్డ్ సూర్య ఇంగ్లిష్ మీడియం స్కూల్), **చిత్రలేఖనం పోటీలో:** సాత్విక సుజాత(దీపి సిద్ధార్థ పబ్లిక్ స్కూల్), కె. చక్రవర్తి (మదర్ థెరిసా), ఎల్. హాసిని(ఎపీజేఏపీయం ఉన్నత పాఠశాల), **ఉపన్యాస పోటీలో:** ఎస్. రిషిమా(నలంద), పి. అనన్య (మదర్ థెరిసా), ఎండిపీస్ ఐశ్వర్య(దీపి సిద్ధార్థ పబ్లిక్ స్కూల్), **క్విజ్ పోటీలో:** కె. వైశాల్ (ఎస్‌ఏఎస్), ఎంఎల్ శ్రేష్ఠప్రసాద్ (దీపి సిద్ధార్థ), ఎం. సాయి(మదర్ థెరిసా) వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ఈ పోటీలకు జె.జగన్, వై. జాన్, పి. వాసంతిలు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. ముగింపు కార్యక్రమానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఓఎస్‌డీ వెంగా జోసి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి ఇ. చిట్టిబాబు, విశ్రాంత అధ్యాపకుడు జమ్ముల చౌదరయ్య, ఐటీ నిపుణుడు వై. గణేష్ అతిథులుగా విచ్చేసి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మదర్‌థెరిసా విద్యాసంస్థల అకడమిక్ డీన్ డి. ప్రసన్న, ఆఫ్రిన్ డీన్ ఎం. సోమలత, వై. పార్వతి పాల్గొన్నారు.

పోటీ పడ్డారు.. సత్తా చాటారు


బహుమతులు అందుకున్న వారితో ఉపాధ్యాయులు, న్యాయనిర్ణేతలు

తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలో శనివారం నిర్వహించిన ప్రతిభ పాటవ పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగా శోభారాణి తదితరులు బహుమతులు అందజేశారు. వ్యాసరచన- డి. తిరుపతిరావు, చిత్రలేఖనం- టీవీ హెచ్ సూర్యనారాయణ, ఉపన్యాసం- జి. కాశయ్య, క్విజ్- లోకేష్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పలువురు ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచనలో.. రాధాగుప్త(సిద్ధార్థ పాఠశాల) ప్రథమ, పి. అస్మీత్(సెయింట్ థెరెసా పాఠశాల) ద్వితీయ, సుప్రియ(సిద్ధార్థ పాఠశాల) తృతీయ స్థానం పొందారు. **చిత్రలేఖనంలో..** మొదటి బహుమతి బి. దివ్య(సెయింట్ థెరెసా పాఠశాల), రెండో బహుమతి జి. సరోవర్(లిటిల్ స్టార్ పాఠశాల), మూడో బహుమతిని పి. జాహ్నవి(వికాస్ పాఠశాల) సాధించారు. **ఉపన్యాసంలో..** జె. సృజన్(శ్రీశ్రీ టెక్నో స్కూల్) ప్రథమ, వి. సుష్మిత(సెయింట్ థెరెసా పాఠశాల) ద్వితీయ, సాయి జెస్విక్ రెడ్డి(శ్రీశ్రీ టెక్నో స్కూల్) తృతీయ స్థానాల్లో నిలిచారు. **క్విజ్‌లో..** మొదటి బహుమతి పి. ఆరాధ్య(వికాస్ పాఠశాల), రెండో బహుమతి ఒ. మహాలక్ష్మి(శ్రీశ్రీ టెక్నో స్కూల్) మూడో బహుమతిని శ్రీజశ్వంత్(జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల) సాధించారు.

తొలి ప్రయత్నంలోనే విజేత


భానుప్రకాష్‌కు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు ఈశ్వర్‌రావు, నగరాజకుమారి

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక రెండో వార్డుకు చెందిన నరహరిశెట్టి భానుప్రకాష్ తొలి ప్రయత్నంలోనే గ్రూపు-1 పరీక్షలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర పన్నుల సహాయ కమిషనర్‌గా ఎంపికయ్యారు. సీనియర్ న్యాయవాది, మాజీ ఏజీపీ నరహరిశెట్టి ఈశ్వర్‌రావు, చందు నగరాజకుమారి(టీచర్) దంపతుల కుమారుడు భానుప్రకాష్ ప్రాథమిక విద్యాభ్యాసం స్థానిక అవనిగడ్డలోని స్కూలులో పూర్తవగా, హైస్కూలు విద్య వెల్లూరు నవోదయ విద్యాలయంలో పూర్తిచేశారు. విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటరు, చెన్నైలో ఎంటెక్ చదివారు. దిల్లీలో సివిల్స్, హైదరాబాద్‌లో గ్రూపు-1 శిక్షణ తీసుకున్నారు. తన లక్ష్యం సివిల్స్ సాధించడమేనని భానుప్రకాష్ చెప్పారు.

ఆర్చరీ టోర్నీ విజేతల వెల్లడి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర, ఉమ్మడి కృష్ణా ఆర్చరీ సంఘాలు, ఎన్టీఆర్ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సంయుక్తంగా శనివారం స్థానిక ఐజీఎంసీ స్టేడియం ఫుట్‌బాల్ మైదానంలో నిర్వహించిన ఖేలో ఇండియా ఎన్టీపీసీ అమరావతి సిటీ ఓపెన్ ఆర్చరీ టోర్నీలో 200 మందికి పైగా ఆర్చర్లు పలు విభాగాల్లో తలపడ్డారు. ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బెవర వెంకటరమణ, కోశాధికారి చెరుకూరి కృష్ణకుమారి, ఉపాధ్యక్షుడు బొమ్మదేవర శ్రావణ్ కుమార్, శిక్షకులు నవీన్‌కుమార్, కె. వంశీకృష్ణ, విజయభరద్వాజ్, ఎం. జయలక్ష్మి పాల్గొని విజేతలకు బహుమతులు అందించి అభినందించారు.



గెలిచినవారితో అసోసియేషన్ ప్రతినిధులు

- రికర్వ్ పురుషుల విభాగంలో డి. ధనుష్, పి. రాజేష్, వి. రాఘవ కృష్ణ, మహిళల విభాగంలో కె. యుక్తశ్రీ, టి. భువనరాజేశ్వరి, టి. వైష్ణవి వరుస స్థానాల్లో నిలిచారు.
- రికర్వ్ బాలుర విభాగంలో సీహెచ్ అక్షయ మహదేవ్, ఎం. ఆరుష్‌రెడ్డి, ఏఎస్ కృష్ణ హస్తిక్, బాలికల విభాగంలో సీహెచ్ డాలీ శివానీ, కె. అభిలాష, డి. నిష్విత్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.
- కాంపౌండ్ మహిళల విభాగంలో బి. షణ్ముఖనాగసాయి, ఎ. కన్షిక, కె. రిషి కీర్తన, పురుషుల విభాగంలో ఇ. సాయి రాధాకృష్ణమూర్తి, పి. త్రినాథ్‌చౌదరి, కె. మంజునాథ్ తొలి మూడు స్థానాలు కైవసం చేసుకున్నారు.
- కాంపౌండ్ బాలికల విభాగంలో షేక్ తస్లీమ్, కె. జాహ్నవిరెడ్డి, బాలుర విభాగంలో షేక్ ముజామిల్, బీసీహెచ్ సుహాస్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.
- ఇండియన్ రౌండ్ మహిళల విభాగంలో కె. మోక్షితరెడ్డి, జె. ఐశ్వర్యసూర్య దీపిక, ఎ. ప్రీతి, పురుషుల విభాగంలో కె. వెంకట లోకేష్, షేక్ సాహెల్, జి. మహీధర్ వరుస స్థానాలు కైవసం చేసుకున్నారు.

28 నుంచి మహిళా ఉత్సవ్

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి మార్చి 3 వరకు మొగల్రాజపురం మధు గార్డెన్స్‌లోని మొగల్ హాలులో మహిళా ఉత్సవ్ నిర్వహించనున్నట్లు ఛైర్‌పర్సన్ ఎన్. విద్యాకన్నా, డైరెక్టర్ ఎ. పూర్ణిమ తెలిపారు. మొగల్రాజపురంలోని కార్యాలయంలో శనివారం వారు మీడియాతో మాట్లాడుతూ.. తమ వద్ద శిక్షణ తీసుకొని ఎంతో మంది మహిళలు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు అయ్యారని తెలిపారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ఉత్సవ్ నిర్వహిస్తున్నామని, నగర ప్రజలు సందర్శించాలని కోరారు.

22న చెన్నైలో శాంతి సందేశ సభ: కేఏ పాల్

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రపంచ శాంతి కోరుతూ ఫిబ్రవరి 22న చెన్నైలో శాంతి సందేశ సభ నిర్వహిస్తున్నట్లు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ తెలిపారు. శనివారం విజయవాడలోని ఒక హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాలుగా తాను చేస్తున్న సందేశాల క్రమంలో తిరిగి చెన్నైలో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రా, తెలంగాణలో తాను మీటింగ్‌ల కోసం పర్మిషన్ అడిగితే ఇవ్వడం లేదని, అందుకే చెన్నైలో పెడుతున్నట్లు తెలిపారు. ప్రపంచం, భారత్, వివిధ కులాలు, మతాల వారు శాంతియుతంగా ఉండాలని సూచించారు.

12న దేశవ్యాప్త సమ్మెతో కార్మికుల సత్తా చాటుతాం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలు చేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్లకు సేవలు చేస్తూ ప్రభుత్వం కార్మికులను విస్మరిస్తుందని మండిపడ్డారు. ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెతో కార్మికుల సత్తా తెలియజేస్తామని చెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఫిబ్రవరి 12న నగరంలోని రథం సెంటర్ నుంచి లెనిన్ సెంటర్ వరకు ప్రదర్శన, అనంతరం సభ జరగనుందని తెలిపారు. నగరంలోని మూడు నియోజకవర్గాల్లో రెండు రోజులపాటు జాతాలు జరుగుతాయని, కార్మిక సంఘాలన్నీ కలిసి విస్తృత ప్రచారం చేస్తామన్నారు. గత సమ్మె కంటే ఈసారి నగరంలో మరింత విస్తృతంగా జరగనుందన్నారు. ఫిబ్రవరి 3న బాలోత్సవ భవన్‌లో నగరంలోని కార్మికులతో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు కె.ఆర్. ఆంజనేయులు, ఎ. ఉదయ్‌కిరణ్, ఈశ్వర్, మరీదు ప్రసాద్‌బాబు, మునిశంకర్, షేక్ మీరావలి, లక్ష్మీనారాయణ, కె. దుర్గారావు, విజయ్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు నిరంతరం శ్రమ అవసరం


భాగం నిఖీలశ్రీ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : కృషి పట్టుదలతో నిరంతరం సాధన చేస్తే లక్ష్య సాధన కష్టతరం కాదని ఇబ్రహీంపట్నానికి చెందిన భాగం నిఖీలశ్రీ రుజువు చేశారు. శుక్రవారం రాత్రి ప్రకటించిన గ్రూపు- 1 ఫలితాల్లో సబ్ కలెక్టరు ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇటీవల తెలంగాణ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూపు- 1 ఫలితాల్లో కూడా స్థానికేతర కోటలో జిల్లా పంచాయతీ అధికారిగా ఎంపికై ప్రస్తుతం మహబూబ్ నగర్ జిల్లాలో శిక్షణ పొందుతున్నారు. ఈమె ఇబ్రహీంపట్నం డీఏవీ పాఠశాలలో పది వరకు, గొల్లపూడి నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటరు, హైదరాబాద్‌లోని నారాయణ ఐఏఎస్ అకాడమి కళాశాలలో డిగ్రీ చదివి కళాశాల టాపర్‌గా నిలిచారు. న్యూదిల్లీ ఇగ్నో నుంచి సామాజిక శాస్త్రంలో మాస్టరు డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈమె తండ్రి రాము ఇబ్రహీంపట్నంలో కాంట్రాక్టు పనులు చేస్తుంటారు. తల్లి గీత గృహిణి. నిఖీలశ్రీ మొదటి నుంచి ఐఏఎస్ కావాలనే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. రెండు సార్లు క్వాలీఫై కాలేదు. అయినప్పటికీ నిరాశ చెందకుండా నారాయణ ఐఏఎస్ అకాడమిలో బోధన విభాగంలో విధులు నిర్వహిస్తూ తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే గ్రూపు పరీక్షలకు సిద్ధమవుతూ లక్ష్యాన్ని సాధించారు. ప్రతి రోజు అకాడమిలో బోధన విధులు నిర్వహిస్తూనే.. రోజుకు ఆరేడు గంటల పాటు చదవడం వల్లనే ఆంధ్ర, తెలంగాణలో గ్రూపు-1 పరీక్షల్లో విజయం సాధించినట్లు నిఖీలశ్రీ తెలిపారు.

జగ్గయ్యపేట యువతికి గ్రూప్ 1 ఉద్యోగం


తల్లిదండ్రులతో అంగజాల వైష్ణవి

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీపీఎస్సీ శుక్రవారం విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో జగ్గయ్యపేటకు చెందిన అంగజాల వైష్ణవి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె షేర్‌మహమ్మద్‌పేట గ్రూప్ ఆలయాల గ్రేడ్-1 ఈవోగా పనిచేస్తున్నారు. ఆమె తండ్రి రవీంద్రబాబు ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్నారు. తల్లి శివకుమారి గృహిణి. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని ఆమె చెప్పారు.

ప్రజా చైతన్యంతోనే ప్రమాదాల నివారణ


సిబ్బందికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ట్రాఫిక్ డీసీపీ షీరీన్ బేగం, సంయుక్త రవాణా కమిషనర్ మోహన్

బెంజి సర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ప్రమాదాలు తగ్గాలంటే ప్రజల్లో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి... చైతన్యం రావాలని ట్రాఫిక్ డీసీపీ షిరీన్ బేగం అన్నారు. జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు సభ బెంజి సర్కిల్‌లోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు శిరస్త్రాణం, కారులో ప్రయాణించేటప్పుడు డ్రైవర్‌తో పాటు వెనుక సీట్లో కూర్చున్న వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడవద్దన్నారు. రవాణా శాఖ సంయుక్త కమిషనర్ ఎ. మోహన్ మాట్లాడుతూ... ప్రమాదాల రహిత జిల్లాగా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నామని, ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించి సహకరించాలని కోరారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, ఆర్టీవోలు ఆర్. ప్రవీణ్, కె. వెంకటేశ్వరరావు, రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం. రాజబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రోడ్డు భద్రత కార్యక్రమాలకు సహకరించిన కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, పోలీస్ అధికారులు, సిబ్బందికి ధ్రువపత్రాలు అందజేశారు.

విద్యుత్తు మీటర్ల రీడర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: విద్యుత్తు మీటరు రీడర్ల ఆందోళన ఉద్ధృతం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శనివారం ధర్నాచౌక్‌లో జరిగిన మీటర్ రీడర్ల రిలే దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ మూడు డిస్కంలలో సుమారు 4 వేల మంది మీటర్ రీడర్లు 10 సంవత్సరాలకు పైగా పనిచేస్తున్నారని తెలిపారు. వారికి వాలి వేతనాలతో రోడ్డునపడే పరిస్థితి ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చిన యాజమాన్యం, ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్ మీటర్ రీడర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎం. బాలకాశి మాట్లాడుతూ తక్షణం రీడర్ల ఉపాధి భద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, అర్హతల ఆధారంగా వారందరినీ విద్యుత్తు సంస్థలోనే కొనసాగించాలని కోరారు. అనంతరం ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఎల్. రామకృష్ణ, హజరత్ వలి, శివారెడ్డి, కిరణ్, పవన్, రాజు, క్రాంతి, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: స్నేహితుడిని కొట్టి కారు, ఐ ఫోన్ తీసుకుని పరారైన ముగ్గురు వ్యక్తులపై నేరం రుజువు కావడంతో వారికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ 8వ అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డి. లక్ష్మి శనివారం తీర్పు చెప్పారు. చిట్టినగర్‌కు చెందిన కర్నాటి ఫణీంద్రకు ఫేస్‌బుక్‌లో ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం రావినూతల గ్రామానికి చెందిన పుచ్చకాయల నరేష్ పరిచయమయ్యారు. ఇద్దరూ స్నేహితులయ్యారు. ఈ క్రమంలో 2020 అక్టోబరు 2న విజయవాడలో పరీక్ష ఉందని, దానికి స్నేహితులతో కలిసి వస్తున్నానని ఫణీంద్రకు నరేష్ చెప్పారు. హనుమాన్‌పేటలోని శ్రీనివాస లాడ్జిలో రూము తీసుకున్నారు. ఆ క్రమంలో అక్టోబరు 2 సాయంత్రం 5.30 గంటల సమయంలో ఫణీంద్ర లాడ్జికి వెళ్లగా అక్కడ నరేష్, అతని స్నేహితులు షేక్ అహ్మద్ అలియాస్ షబీర్, పర్శగాని వేణు అలియాస్ నాని ఉన్నారు. ఆ ముగ్గురు ఫణీంద్రపై దాడి చేసి అతని కారు, ఐ ఫోన్ తీసుకుని పారిపోయారు. దీనిపై కేసు నమోదు చేసిన గవర్నర్‌పేట పోలీసులు ఆ తరువాత రోజు నిందితులను అరెస్టు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్. జగదీష్ వాదించారు. మొత్తం 8 మంది సాక్షులను విచారించగా.. నిందితులు నరేష్, షేక్ అహ్మద్, వేణుపై నేరం రుజువు కావడంతో ఒక్కొక్కరికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10,500 చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

330 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు


పెనుగొలనులో వైద్య పరీక్షలు చేస్తున్న ఆకాష్

గంపలగూడెం, న్యూస్‌టుడే : పెనుగొలను పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం విజయవాడకు చెందిన పెద్దేశ్వరరావు హెల్త్ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 160 మందికి కంటి పరీక్షలు, 170 మందికి గుండె, రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధులకు చెందిన పరీక్షలు చేశారు. డాక్టర్ పి.ఆకాష్, కారుణ్య చక్రవర్తి పాల్గొని వైద్య పరీక్షలు చేయగా నంబూరి శ్రీనివాసరావు, పంతంగి వెంకట్రావు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

యువత వ్యసనాలకు బానిస కావొద్దు

జి.కొండూరు: యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ, పూర్తిగా చదువు, క్రీడలపైనే దృష్టి కేంద్రీకరించాలని ఎస్సై సతీష్ పేర్కొన్నారు. మండలంలోని చెవుటూరు శ్రీవాణి విద్యాసంస్థలో రిపబ్లిక్‌డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా యాంటీ ర్యాగింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర అంశాలను వారికి వివరించారు. కార్యక్రమంలో ఛైర్మన్ రవికుమార్, ప్రిన్సిపల్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రశంసలు

మైలవరం, న్యూస్‌టుడే : విద్యా విధానంలో వినూత్న మార్పులను సూచిస్తూ స్థానిక ఎస్వీఆర్ఈఎన్నార్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సరికొండ సతీష్ జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్నారు. సీబీఎస్ఈలో బోధనపై ఆయన చేస్తున్న పరిశోధనలో భాగంగా బోధనలో ఏఐ, చాట్‌బాట్ ఉపయోగించడం ద్వారా విద్యార్థుల్లో ప్రశ్నలను ఎదుర్కొనే సామర్థ్యం మెరుగవుతుందని ఆయన పరిశోధనా పత్రాల్లో పేర్కొన్నారు. శుక్రవారం బెంగళూరులో జరిగిన ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్ పెడగాజీ ఇన్నోవేటివ్ కాన్ఫరెన్స్‌లో ఆయన తన పరిశోధనా అంశాలను వివరించారు. ఈ మేరకు సీబీఎస్ఈ పూర్వ అకాడమిక్ డైరెక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఆయనకు జాతీయ స్థాయి ప్రశంసా పత్రం అందజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఎస్వీ.నివృత్‌రావు ఆయన్ను శనివారం అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందన: ◆ పశ్చిమ ఇబ్రహీంపట్నం వీధి చివర్లలో కంకర రాళ్లు, ఇసుక అడ్డుగా ఉన్నాయని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పారిశుద్ధ్య మేస్త్రీ మధు వాటన్నింటిని శనివారం అక్కడి నుంచి తీయించారు.

◆ కొండపల్లి పంచాయతీ రోడ్డుకు వెళ్లే దారిలో అడ్డుగా కాంక్రీట్ రోలర్‌ను తొలగించాలని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన వారు ఆ ప్రాంతంలోని సిమెంటు రహదారికి సంబంధించిన అన్ని వాహనాలు, వస్తువులను తొలగింపజేశారు.

? కొండపల్లి ఆరు పంపుల కూడలిలో అప్రోచ్ నిర్మించారు. కానీ అక్కడ వేగ నియంత్రణ ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. **- శ్రీనివాసరావు, కొండపల్లి** ✔ ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- వెంకటరత్నం, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్, కొండపల్లి** - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

నేత్ర దానం

గంపలగూడెం : మండల కేంద్రంలో మృతి చెందిన విశ్రాంత హెచ్ఎం కె.జయరామ్‌ప్రసాద్‌వర్మ(81) నేత్రాలను శనివారం విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి జి.కృష్ణారెడ్డి చొరవతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు అంగీకరించడంతో నిపుణులు ఇక్కడకు వచ్చి ఆయన కళ్లలో కార్నియాలు సేకరించి తీసుకెళ్లారు.

నూరు శాతం ఫలితాలు సాధించాలి


పది విద్యార్థులతో మాట్లాడుతున్న రమేష్‌బాబు తదితరులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : పదో తరగతి ఫలితాల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలని రెడ్డిగూడెం ఎంఈవో పి.రమేష్ బాబు విద్యార్థులకు సూచించారు. శనివారం కూనపరాజుపర్వ జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పది విద్యార్థుల కోసం రూపొందించిన వంద రోజుల ప్రణాళిక అమలుపై ప్రధానోపాధ్యాయుడు జి.ప్రసాద్, ఉపాధ్యాయులతో సమీక్షించారు. రెడ్డిగూడెం పంచాయతీ పరిధిలోని నక్కలగూడెం, వెంపటిగూడెం మండల పరిషత్ ఫౌండేషన్ పాఠశాలలను ఎంఈవో తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దృష్టి లోపం.. అధిగమించడమే లక్ష్యం

★ 2025లో పరీక్షలు చేసిన విద్యార్థులు- 7,200
★ అద్దాలు అవసరమైన వారు- 2,672
★ ఈ ఏడాది కంటి పరీక్షల సంఖ్య- 7,800
★ అద్దాలు అవసరమైన వారు- 3,325

ఇబ్రహీంపట్నం గ్రామీణం, కొండపల్లి, గుంటుపల్లి, న్యూస్‌టుడే

పాఠశాల విద్యార్థుల్లో దృష్టి లోపం ఎక్కువవుతోంది. ప్రాథమిక విద్యాస్థాయి నుంచే వీరిని కంటి సమస్యలు వేధిస్తున్నాయి. వీటిని సకాలంలో గుర్తించి నేత్ర పరీక్షలు చేయడం, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీ చేస్తోంది..


విద్యార్థికి నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యుడు

రెండు దశల్లో.. కూటమి ప్రభుత్వం బడి పిల్లల దృష్టి పరీక్ష కార్యక్రమాన్ని గతేడాది నుంచి రెండు దశల్లో నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తారు. మొదటి దశలో ఆరు నుంచి పది వరకు ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల్లో చదివే వారికి, రెండో దశలో మండల పరిషత్తు పాఠశాలల్లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు చదివే వారికి పరీక్షలు నిర్వహిస్తారు. అనుకున్న సమయంలో నేత్ర పరీక్షలు పూర్తి కాకపోతే కార్యక్రమాన్ని పొడిగించేందుకు ముందస్తుగానే ఏర్పాట్లు చేశారు.

పది మందిలో ఒకరికి..: నల్లబల్ల మీద రాసే అక్షరాలను విద్యార్థులు సరిగా చూడలేక పోతున్నట్లు వైద్యులు గుర్తించారు. ఇది ఒక్క బడిలో కొద్ది మంది సమస్యే కాదు. ప్రతి పది మందిలో ఒకరు దృష్టి లోపంతో బాధపడుతున్నారు. టీవీలు, చరవాణుల వినియోగం పెరుగుతుండటం పిల్లల కంటి చూపుపై ప్రభావం చూపుతోంది. రోజూ పోషకాహారం తినకపోవడం, ఏ- విటమిన్ లోపించడంతో ఎక్కువ మందిలో దృష్టి మసకబారుతోందని వైద్యులు గుర్తించారు. గతేడాది కంటే ఈ సంవత్సరం కంటి అద్దాలు అవసరమైన వారి సంఖ్య పెరగడం గమనార్హం.

ఉచితంగా అందిస్తాం

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు నియమించిన వైద్యులతో దృష్టి పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తాం.
- డాక్టరు ఈఎస్ మూర్తి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజరు

స్వర్ణాంధ్ర- 2047కు అనుగుణంగా కృషి


జ్యోతి వెలిగిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, పక్కన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : సంపూర్ణ అభియాన్ 2.0 లక్ష్యాలను సమర్థవంతంగా పూర్తి చేయాలని మైలవరం ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ అన్నారు. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాం..అభియాన్ 2.0 కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం మండల కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ జ్యోతి వెలిగించారు. ఎమ్మెల్యే అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. వెనుకబడిన గ్రామాలు, ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో 77 రోజుల కార్యక్రమాలను 2.0లో పొందుపరచారని చెప్పారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర- 2047 విజన్‌కు అనుగుణంగా కృషి చేయడం తప్పనిసరి అన్నారు. పోషణ, విద్య, వ్యవసాయం, ఆరోగ్యం వంటి రంగాల్లో వృద్ధి సాధించడమే దీని ప్రధాన ఉద్దేశమన్నారు. కొండపల్లి పురపాలికలో అమృత్- 2.0 పథకంలో ఇంటింటా కుళాయి ఏర్పాటు కానుందన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నిర్దేశిత లక్ష్యాలను అంకితభావంతో అధికారులు వ్యవహరించి ఫలితాలు సాధించాలని సూచించారు. సంపూర్ణ అభియాన్ గోడ పత్రికలను ఆవిష్కరించారు. పురపాలక సంఘ ఛైర్మన్ చిట్టిబాబు, మండల అధ్యక్షురాలు జ్యోత్స్న, అధికారులు పాల్గొన్నారు. కొండపల్లిలో రాజ్యలక్ష్మి సాద్ ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : గుంటుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ లక్ష్మీశ శనివారం సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. డీఈవో చంద్రకళ, హెచ్ఎం సౌందర్యరాణి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు, ఏ.కొండూరు మండలాల పరిధిలోని మందుల దుకాణాల యజమానుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా గజ్జల రాజగోపాలరావు, ప్రధాన కార్యదర్శిగా షేక్ మహబూబ్ పాషా, కోశాధికారిగా పసుమా.మహేష్, అనంతరం ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, జిల్లా అడ్వైజర్ సత్యమూర్తి ప్రసాద్ తదితరులను ఎన్నుకున్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని నూతన సభ్యులు తెలిపారు.


నూతన కార్యవర్గ సభ్యులు

విద్యార్థి దశ మరపురాని మధుర స్మృతి


అలరించిన విద్యార్థుల నృత్యరూపకం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే : గుంటుపల్లి డాన్‌బాస్కో ఉన్నత పాఠశాల 40వ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ జి.లక్ష్మీశ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు విద్యార్థి దశ మరపురాని మధుర స్మృతులను మిగుల్చుతుందని చెప్పారు. సామాజిక మాధ్యమాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాజిక సేవ కోసమే వినియోగించాలని కోరారు. అనంతరం పాఠశాల యాజమాన్యం కలెక్టర్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపీడీవో ఐజీ.మాథ్యూ, శాంతియాగుతోమాస్ లతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సజావుగా పింఛన్ల అందజేత


విజయవాడ ఆసుపత్రిలో ఇస్తూ..


గంపలగూడెంలో పింఛను సొమ్ము అందిస్తున్న కూటమి నాయకులు

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో శనివారం ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లను ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు పంపిణీ చేశారు. - న్యూస్‌టుడే యంత్రాంగం


ఎ.కొండూరు మండలం పాత రేపూడిలో..


తిరువూరులో ఎమ్మెల్యే శ్రీనివాసరావు..


రెడ్డిగూడెం ఎస్సీవాడలో..

ఆలయాల్లో విశేష పూజలు


మైలవరం కోదండ రామాలయంలో భక్తులు

ఊటుకూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే : శ్రీరామచంద్ర స్వామి జన్మదినం పురస్కరించుకొని ఊటుకూరు కోదండ రామాలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.


ఊటుకూరులో సీతారామచంద్ర స్వామి

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక శ్రీకోదండ రామాలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మహిళలు లలితా సహస్ర పారాయణం చేశారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని మెట్టగుట్టలో గజలక్ష్మి సమేత శేషాచల శ్రీనివాస స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్యామసుందరాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. గుడి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు, సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


మెట్టగుట్టలో శ్రీనివాస స్వామి

మైలవరం: స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుకళ్యాణ ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న భజన సప్తాహ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


మైలవరంలో సప్తాహం చేస్తున్న భజన బృందం


అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి



గొల్లపూడిలో అంబటి దిష్టిబొమ్మ దహనం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : సీఎం చంద్రబాబును దూషించినందుకు మాజీ మంత్రి అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కె.విజయబాబు అన్నారు. శనివారం నాగులూరులో తెదేపా నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు, ముఖ్యమంత్రిపై ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేస్తున్న అంబటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు పి.కిరణ్‌కుమార్ రెడ్డి, తెలుగు యువత మండల మాజీ అధ్యక్షుడు వి.వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

గొల్లపూడి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి అంబటి రాంబాబును అరెస్టు చేయాలని గొల్లపూడి గ్రామ తెదేపా నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. గొల్లపూడి మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే : మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడిన వ్యాఖ్యలను ఖండిస్తూ తిరువూరు పోలీస్ స్టేషన్‌లో తెదేపా నాయకులు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర ఆర్గానిక్ సర్టిఫికేషన్ ఆథారిటీ ఛైర్మన్ శావల.దేవదత్ తదితరులు పాల్గొన్నారు.


నాగులూరులో తెదేపా నాయకులతో కలిసి మాట్లాడుతున్న విజయబాబు


తిరువూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూ..

దివ్యాంగుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ


దివ్యాంగునికి ట్రై సైకిల్ అందిస్తున్న వాసు

గొల్లపూడి: గొల్లపూడికి చెందిన దివ్యాంగుడు చెంచు లక్ష్మణ్‌కు గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ నర్రా వాసు ఎలక్ట్రిక్ ట్రై సైకిల్‌ను శనివారం అందజేశారు. దివ్యాంగుల సంక్షేమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు.

శుభ్రత చర్యలు



స్థానిక ఆంజనేయ స్వామి ఆలయాన్ని మాజీ మంత్రి జోగి రమేష్ శనివారం సందర్శించారు. దీనికి స్పందించిన తెదేపా నాయకులు, ప్రజాప్రతినిధులు అదే దేవాలయాన్ని శనివారం శుభ్రం చేశారు. కొండపల్లి పురపాలిక ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా సీనియర్ నాయకుడు జంపాల సీతారామయ్య, నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

ఎంఈవోకు ఘన సన్మానం


వెంకట నరసింహారావును సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

జి.కొండూరు, న్యూస్‌టుడే : ఉద్యోగ విరమణ చేసిన మండల విద్యాశాఖాధికారి పజ్జూరు వెంకట నరసింహారావును శనివారం స్థానిక కార్యాలయంలో ఎంఈవో- 2 వీరాస్వామి, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మూర్తి, కిశోర్, రాము, హేమరాజు, శాంతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడికి..

గంపలగూడెం, న్యూస్‌టుడే : పెనుగొలనులో విశ్వహిందూ పరిషత్తు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్.యుగంధర్‌ను హిందూ సంఘాల ప్రతినిధులు శనివారం సత్కరించి అభినందించారు. వీహెచ్‌పీ, ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎ.క్రాంతికుమార్, కె.సూర్యప్రకాశ్, ఎన్.చినసత్యం బాబు, కె.నాగేశ్వరరావు, వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్..ప్రజాదరణ పొందిన గాయకుడు

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో శనివారం ప్రజా గాయకుడు గద్దర్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రామస్థులు, శిర్డీ సాయిబాబా సేవా కమిటీ సభ్యులు నివాళులర్పించారు. పేదల కష్టాలను కళ్లకు కట్టినట్లు ఆయన రాసిన అనేక పాటలు ప్రజాదరణ పొందాయని పలువురు వక్తలు అన్నారు.


పెనుగొలనులో గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

2018 Pearl White Honda City Superb Condition for Sale. Call: 98481 11659.

2022 AL 6 Tyres Tipper 4.5 Tones Wheel Base 2820 For Sale. 93919 89999.

BUSINESS SERVICES

BUSINESS OFFER

Established Hospital Wanted Partnership or Consultants Doctors. M.D., M.S., Ortho, Pediatric, Urology, Genaral Surgen at Vijayawada. ✆ 93936 09999.

EV Charging Business Opportunity: End to End Setup & Support. Earn from your location. Call: 9879872811

Hospital Lease/ Partnership
For Surgical Doctors
Fully Equipped Running Hospital with
➢ Modular Operation Theatres
➢ Color Doppler Ultra Sound Scan
➢ Laparoscopic and Complete Medical Equipment Setup with Nursing Staff Available for Plug and Play/ Lease/ Partnership at Suryaraopeta, Vijayawada
More Details please Contact
93936 09999

Promote Apex Solar Business with Just 3600/- Earn Daily Good Income + Get 6000/- Worth of Digital Marketing Course Free ✆ 9133752959.

Start Digital marketing, Mobile-Mktng, Bulksms, Bulk whatsapp, business, We help & guide invstmnt: 5L-15L. Ph: 90009 37601

స్త్రీ/పు చిన్నపెట్టుబడితో మీఆఫీసు ఇంటివద్దే కన్జ్యూమర్ ప్రోడక్ట్‌తో ఆన్‌లైన్ ప్రాఫిట్‌షేరింగ్ బిజినెస్ చేస్తూ, ప్రతివారం ఫిక్స్‌డ్‌ప్రాఫిట్+ జీతభత్యాలు పొందండి! 63095 72064/ 73862 75652

PACKERS & MOVERS

Tirumala Packers & Movers an ISO 9001:2015 Certified Co. Household Goods Shifting any Time any Where. ✆ 97043 64389.

SOLAR PRODUCTS

Radiant Solar-1 లక్ష సబ్సిడీ 0% డౌన్ పేమెంట్, 100% బ్యాంకులోన్. 30 సం. వారంటీ, 30 సం. సర్వీస్, 30 సం. జీరో కరెంట్ బిల్. ✆ 81431 25777.

BUILDING CONSTRUCTION

ARCHITECT & ENGINEERS

Rudra Planners ★ Building Plans, LRS, BPS Surveying Structural Elevation Designs, Vastu, TDR Bonds, Singnagar, Vijayawada. ✆ 79934 66464.

WATER PROOFING

Tarun Slab Leakage Works ★ 25 Yrs Exp. ★ 5 Yrs Warranty ★ Bathroom Leakage Grouting Epoxy Works. ✆ 94940 02285, 99516 07504.

EDUCATION

TUITIONS

English (Home& Online) Tutions Inter/ SSC for Top Marks Corporate Faculty Vijayawada Cont: 63015 60865

SPOKEN HINDI

Learn Online/Offline Spoken Hindi/ English, French & German Within 30 Days.100% Guarantee for all Ages. Free Demo.✆ 98495 42456

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

HOME TUITIONS

ప్రత్యూష (ఆన్‌లైన్ & హోమ్) ట్యూషన్స్ LKG to PG All Objective సబ్జెక్ట్స్. NEET, IIT ట్యూటర్స్‌కు. ✆ 92900 05677, 74165 35749

FINANCIAL SERVICES

We Provide Housing, Mortgage and Educational Loans at Low rate of Interest contact us to know more ✆ 99495 99498.

HEALTH & CARE

మద్యపానం మానేయడంఎలా? బరువు పెరుగుట, జాయింట్‌పెయిన్స్‌కు. విజయవాడ శ్రీరణంలాడ్జి, పాతబస్టాండ్ ఎదురుగా, బందర్ రోడ్, ప్రతినెల 2, 16 తేదీల్లో మందులు.

HOME NEEDS

MOSQUITO SCREENS

మెష్‌డోర్స్, కర్టెన్ రాడ్స్, కర్టెన్స్ కవర్బోర్డ్స్, UPVC విండోస్ బ్లైండ్స్, వాల్‌పేపర్, Anti Bird మెష్. ఇన్విజిబుల్ గ్రిల్స్, దుర్గా ప్రసాద్. 98495 69111.

PEST CONTROL

Tarun Pest ★25Yrs Exp. 5Yrs Warranty ★ Smell Less ★ Bayers Chemicals (Pest & Other Insects Control). ✆ 94940 02285, 99516 07504

ప్రియాంక పెస్ట్ & బాత్‌రూమ్ లీకేజ వర్క్స్ 30సం|| అనుభవం, 5సం|| గ్యారంటీ వాసనలేని బేయర్ కెమికల్స్‌తో చెదలు, బొద్దింకలు నివారించు సంస్థ ✆ 94924 82494, 93932 30136

PROFESSIONAL SERVICES

VAASTU

వాస్తు వాసుదేవరావు 51 సం|| అనుభవం గల పండితులచే వాస్తు సలహాలు లభించును. విజయవాడ. ఆగిన నిర్మాణాలు వాస్తు సరిచేయబడును. ✆ 90000 27027, 98482 36117.

PEOPLE CARE

OLD AGE HOME

నెస్ట్ కేర్ హోమ్ వృద్ధాశ్రమం, కానూరు. వృద్ధులకు, బెడ్ పేషెంట్లకు ఆహ్లాదకరమైన ఇంటి వాతావరణంలో మంచి ఆహారం, సేవలు కలవు. ✆ 98483 40496

REAL ESTATE

అమరావతి రాజధానిలో గల ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు, పొలాలు విజయవాడ- గుంటూరు మధ్య అన్ని వెంచర్లలో ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన. Ph: 77949 12324.

పెదఅవుటపల్లి గ్రామములో 18 సెంట్లు స్థలం, భవానీపురం VJA లో డబుల్ బెడ్‌రూమ్ అమ్మబడును. స్థలం బిల్డర్సుకూ యివ్వబడును. ✆ 99598 20464

గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, JKC రోడ్డు, IRR, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజా, మంగళగిరి, తాడికొండలోని ప్లాట్లు అమ్మేవారు ✆ 93999 55545.

విజయవాడ మరియు అమరావతి పరిసర ప్రాంతాలలో ఖాళీ స్థలాలు, పొలాలు కొనాలన్నా లేదా అమ్మాలన్నా సంప్రదించండి. 96424 64649.

రాజధాని అమరావతి ల్యాండ్ పూలింగ్‌లో గజం 5,000/-, 10,000/-, 23,000/- కమర్షియల్ ప్లాట్ 37 లక్షలు. 15,000/- రెంటు. లోను కలదు. 90523 45356.

గుంటూరు సిటీ, గోరంట్ల, రెడ్డిపాలెం, లాం, అగతవరప్పాడు, వెనిగండ్ల, నంబూరు, పెదకాకాని, కొప్పురావూరు, కంతేరు, కాజాలలో ప్లాట్లు అమ్మాలన్నా/ కొనాలన్నా సంప్ర. 73823 96677.

FLAT FOR SALE

KANURU

3BHK - 1470Sft North, 2BHK-1240Sft East, Full cupboards, ready to occupy at Srinivasa Residency, Near Sitapuram Colony, Aravapalli Purnaiah Veedi, Opposite Priya Foods, Poranki, VJA). Ph: 77028 76445.

3BHK న్యూడీలక్స్ ఫ్లాట్స్ అన్నీ సౌకర్యాలు గల, 100% బ్యాంక్‌లోన్‌తో గృహప్రవేశానికి సిద్ధంగా కలవు. బల్లెంవారివీధి, కానూరు. 97017 98726, 89196 79256

కానూరు, మురళీనగర్ బల్లెంవారివీధిలో అక్షయ మెడోస్‌నందు న్యూ 3 BHK (1400 Sft) ఫ్లాట్స్ అన్ని సౌతే 53 లక్షలు. 89195 70872, 96428 47736.

TADIGADAPA

Tadigadapa, VR Siddhartha Engg. College Opp: Padmaja nagar, Individual Floors 3BHK Flats 1800 S.Ft Sale. ✆ 94400 31268.

RAMAVARAPPADU

రామవరప్పాడు, బల్లెంవారివీధి, మెడ్సిన్ ఎదురు St. Anna స్కూల్ రోడ్డో,GF ఉత్తరం, 800 S.Ft., 2nd ఫ్లోర్, వెస్ట్ ఫేస్ 842 S.Ft. ✆ 7995769538

TADEPALLI

తాడేపల్లి మహేంద్ర ఎన్‌క్లేవ్ NRI Blockలో నెలకు 87,500/- అద్దెవచ్చు 4,500చ||అ|| విస్తీర్ణము, నార్త్ ఫేసింగ్ 3BHK ఫ్లాట్ 3rd ఫ్లోర్‌లో అన్నిసౌకర్యాలతో అమ్మకం. 94923 82233

SATYANARAYANAPURAM

VJA సత్యనారాయణపురం 1200 S.Ft., ప్రీమియం న్యూ 2BHK ఫ్లాట్స్ కార్ పార్క్, లిఫ్ట్, సిసిటీవి, జనరేటర్‌తో BRTS రోడ్ దగ్గరలో అమ్మకానికి కలవు. ✆ 91826 89909.


GENERAL

Ready to Occupy 237 Sq.yds, 4500 Sq.Ft, Lavish Triplex Villas at Golden Villas. Mustabada Road, 1min. Drive to West bypass, 7min. Drive to NTR University ✆ 94405 28023

3 BHK Premium Flats @Patamata
For S.Ft. Cost Rs. 5900/-
Each Floor one Flat
for Flat 2403 S.ft.
Wood Work. Ready to Move
✆ 99495 44424

Ready to Move in Geted Community 2,3,4 BHK Flats for Sale in Currency Nagar. 100% Loan. ✆ 86884 66789

4&3 BHK SITE OWNERS FLATS FOR SALE
NAVAH GATED COMMUNITY @ KANURU



కొద్దిఫ్లాట్లు మాత్రమే త్వరపడండి
అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న
HIGH RANGED (G+7) with 8 Blocks
3&4 బెడ్‌రూమ్ ఫ్లాట్లు అమ్మకానికి కలవు
గృహ ప్రవేశానికి సిద్ధం.
Contact 9849583838 9848641234

3BHK Flats for Sale. బందరు రోడ్‌కి కేవలం వంద అడుగుల దూరంలో, గోసాల సెంటర్‌కి దగ్గరలో 1700 SF.t. ✆ 94852 90846

VJA, LICకాలనీ, జయప్రకాష్‌నగర్ 1st లైన్ లగ్జరీ 3BHK ఫ్లాట్స్, ఏలూరురోడ్, సీతారామపురం చాపరాలవీధి, 3BHKఫ్లాట్స్ అమ్మకం. ✆ 90305 06249

1745 Sft East Facing and 3250 Sft sea view Flats for sale at Daspalla Hills, Visakhapatnam. Cont: 83390 45966

2 BHK (5 Years Old) 1200 Sft. Flat Near Ayush Hospital with Cup Boards, Lift & Car Parking for Sale. ✆ 99896 34786.

3&4 BHK Deluxe Floorwise FLATS for SALE
Near Kennedy School, Kanuru.
G+2 Independent House for Sale in 154 Sq.yds
(Lift & 2 Car Parking) @ Tadigadapa.
✆ 7075017255

విజయవాడ- గొల్లపూడి వన్ సెంటర్ & అమరావతి బైపాస్ దగ్గర, 3BHK, 1341 చ.అ, అందమైన వ్యూ కలిగిన 1st ఫ్లోర్ అపార్ట్‌మెంట్. Ph: 83338 65529.

VJA- గన్నవరం గాంధీసెంటర్ హైవేకు కొన్ని గజాల దూరంలో ఎయిర్‌పోర్ట్ & HCLకు 1.5 కి.మీ, 3BHK కొత్త ఫస్ట్ ఫ్లోర్ అపార్ట్‌మెంట్, 1660 చ.అ. 83338 65529.

తాడేపల్లి లగ్జరీ రాయల్ అపార్ట్‌మెంట్స్‌లో, 5వఫ్లోర్ B-బ్లాక్, ఫ్లాట్ నెం:506, అన్నివసతులతో అమ్మకానికి కలదు. సంప్ర. Ph: 9000059583, 9000046605.

VJA,లబ్బీపేట,బందరురోడ్డు దగ్గర బృందావనకాలనీ న్యూ Luxury 3BHK (1764 S.Ft.) ఫ్లాట్స్ 2 Car పార్కింగ్‌తో అమ్మకం. 3,5 ఫ్లోర్. 9849410812

VJA, లబ్బీపేట, భవానిగార్డెన్స్, వైష్ణవి రెసిడెన్సీ, 2nd ఫ్లోర్, 3 BHK (1384 S.Ft.) ఫ్లాట్, ఈస్ట్‌ఫేస్, కార్‌పార్కింగ్, UDA 42గ||. ✆ 91600 02359,99481 48299.

PREMIUM LUXURY
3 BHK Apartments for Sale/ Lease at Prime Location Patamata. VJA- 10
✆ 94939 48909

విజయవాడ యనమలకుదురులో తూర్పు ఫేస్, 5th ఫ్లోర్, న్యూ 2BHK (1150 S.Ft.,) విత్ కబోర్డ్స్, లిఫ్ట్, కార్ పార్కింగ్‌తో అమ్మకానికి కలదు. ✆ 99483 44723

S.V. NILAYAM
CRDA Semi Gated Community
2 BHK (1250 S.Ft.) & 3 BHK (1450 S.Ft.) Flats.
నిడమానూరు సెంటర్‌లో ప్రైమ్ లొకేషన్‌లో అందుబాటు ధరలలో గృహప్రవేశమునకు సిద్ధముగా అన్ని సౌకర్యములతో ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు
Bank Loan Available
✆ 77024 67477 80744 99872

విజయవాడ భారతీనగర్ నందు గృహప్రవేశమునకు సిద్ధముగా న్యూ 3BHK (3100 S.Ft) సెంట్రల్ A/C, 3 కార్ల పార్కింగ్‌తో అమ్మబడును. ✆ 99497 46789

AISWARYA DIAMOND VAULT
CRDA Semi Gated Community
2 BHK & 3 BHK ఫ్లాట్స్
(UDS 50 గ||) (UDS 70 గ||)
నిడమానూరు సెంటర్‌లో ప్రైమ్ లొకేషన్‌లో గృహప్రవేశమునకు సిద్ధముగా అన్ని సౌకర్యములతో అందుబాటు ధరలలో అమ్మకమునకు కలవు
Bank Loan Available
✆ 91414 14915 63053 94419

సింగ్‌నగర్, ఆంధ్రప్రభ కాలనీ మారుతీ కార్ల షోరూం వెనుక, షిర్డీ సాయి హైట్స్‌లో3BHK ఫ్లాట్, ఫుల్లీ ఫర్నిష్డ్1431S.Ft, 4th ఫ్లోర్,W/F. Ready to Occupy.✆ 98492 42413

VJA రామవరప్పాడు రింగు కమర్షియల్ ఏరియా వీరమాచినేని రెసిడెన్సీ 2BHK ఫ్లాట్ నెం. 505 (1075చ||అ||) కారుపార్కింగ్‌తో అమ్మకము. ✆ 94410 25225.

HOUSE FOR SALE

KANURU

కానూరు మురళీనగర్‌లో W/F 135 చ||గ||లో G+1 ఇండివిడ్యువల్ బిల్డింగ్ గృహప్రవేశమునకు సిద్ధముగా ఉన్నది. ✆ 94403 27053, 88010 60777.

GENERAL

Indp. House for sale. Nethaji St, Sitharampuram, Next right to Visalandhra office- VJA, E/F, 279 Sq.Yd. Clear title, Prime location. Ph: 87902 77465, 79952 46632.

నవులూరు, మంగళగిరినందు, 300 గజాలలో పడమర ఫేసింగ్ గల G+1 ఇండిపెండెంట్ హౌస్ అమ్మకానికి కలదు. Phone: 94408 22781.

డ్యూప్లెక్స్ హౌస్ అమ్మకం. సింగ్‌నగర్‌లో, 60 చ||గ||లలో, ఉత్తరం ఫేస్‌తో స్వంతంగా నిర్మించిన హౌస్ అమ్మకం. (కబోర్డ్స్‌తో) ✆ 77802 04072.

కంకిపాడు లాకులు వద్ద 10సెంట్ల స్థలంలో 2అంతస్తుల బిల్డింగ్‌లో 6 పోర్షన్ల ఇల్లు, స్థలం అమ్మబడును. (ఇల్లు అద్దెలకు ఇచ్చుకోవచ్చు). ✆ 96198 61798.

గన్నవరం కరెంట్ ఆఫీస్ దగ్గర 211చ||గ||లలో సింగిల్ స్టేర్, 2BHK ఇండిపెండెంట్ హౌస్ అమ్మబడును (నో మీడియేటర్స్). ✆ 70303 33368

విజయవాడ, నిడమానూరు గ్రామంలో రామలయం వీధిలో గంగానమ్మ గుడి దగ్గర R.S.No.152/1, D.No: 4-136లో 453చ||గ||లు మరియు అందులో నిర్మించబడియున్న 946చ||అ||ల RCC బిల్డింగ్ అమ్మకమునకు కలదు. ఫోన్: 99080 80180

విజయవాడ, పడమట, న్యూ RTC కాలనీ, East, 324 చ.గ. G+1 INDP హౌస్, Rents: 30,000/-, No Brokers Pls. Ph: 90599 44440.

తూర్పుఫేసింగ్, 40అ||రోడ్,55చ||గ|| డూప్లెక్స్ G+1 బిల్డింగ్ మాస్టర్ ప్లాన్‌తో విజయవాడ సింగ్‌నగర్ ఫ్లైవుల్ రోడ్ శాంతినగర్ వద్ద అమ్మకం.45L. ✆ 78938 23222

విజయవాడ శ్రీనగర్ కాలనీ 1వ లైన్‌లో 111 చ||గ|| తూర్పుఫేస్ స్థలం SRWA 221\A రేకుల ఇంటితో అమ్మకానకు కలదు. సంప్ర ✆ 94411 48955

బందరు పోర్టుకు దగ్గరలో హైవే ప్రక్కన CRDA పరిధిలో పామర్రు నడిబొడ్డున బిల్డింగ్ & పాలిటెక్నిక్ కాలేజీ ఎదురుగా ప్లాట్లు కలవు. ✆ 98496 62899

రామవరప్పాడు రింగ్‌లో K హోటల్ వెనుక ఇంద్రలోక్ ఎస్టేట్‌లో 150చ||గ||లో 3BHK డ్యూప్లెక్స్ ఇండివిడ్యువల్ హౌస్ అమ్మకానికి కలదు. ✆ 98481 53136.

అజిత్‌సింగ్ నగర్ గంగానమ్మ గుడి ఎదురుగా 66.5గజాలలో కొత్తగా నిర్మించిన డూప్లెక్స్ హౌస్ అమ్మకానికి కలదు. సంప్ర ✆ 90596 72967

45L కే ఇండివిడ్యువల్ హౌసెస్ 1200 S.Ft. -167చ||గ||లు AP CRDA లేఅవుట్ ఉయ్యూరు విజయవాడ - మచిలీపట్నం హైవేకి దగ్గరగా ✆8247898188

LAND FOR SALE

కొంకేపూడి గ్రామం, పెడన మండలం, బందరు తాలూకా నందు 9.10 ఎకరాల మాగాణి వ్యవసాయ భూమి ఒకే చోట అమ్మకానికి కలదు. కరెంటుతో లిఫ్ట్ ఇరిగేషన్ సౌకర్యం కలదు. వడ్లమన్నాడు డ్రైనేజీ ప్రక్కన, పెడనకు 4 కి.మీ, (బందరు గుడివాడ రోడ్డు) ఫోన్: 9963674352, 9440138224.

Vizag City Centre 12Acres Commercial Land for Development Plz Call Serious Developers only. Ph : 9640034483

చల్లపల్లి- మచిలీపట్నం చెన్నై హైవే రోడ్ ఫేసింగ్ శారద గ్రాండ్యూర్ కళ్యాణ మండపం ప్రక్కన 93 సెంట్లు అమ్మకానికి కలదు. దిలీప్ గాజుల ✆ 79890 34247. 95055 88577.

గన్నవరం నుండి పురుషోత్త పట్నం రోడ్డులో 2.5 ఎకరములు Land అమ్మకమునకు కలదు Contact PH: 80085 08885.

కేసరపల్లి నుండి సావరిగూడెం రోడ్‌లో 2 ఎకరములు LAND అమ్మకమునకు కలదు Contact PH: 99088 52727.

పుట్రేల శివారు జొన్నలగడ్డ గట్టు తూతపురి మామిడి 9.10 యకరము సుమారు 450 చెట్లు గల తోట లీజుకు ఇవ్వబడును. వయసు 11సం||లు. ✆ 99666 86233

గుడివాడ మండలం, కొమరవోలు శివారు తటివర్రు గ్రామమునందు 10 ఎకరముల మాగాణి పొలము అమ్మకం. సంప్ర: ✆ 93462 81147, 83676 38755

ఆగిరిపల్లిలో గెస్ట్‌హౌస్ కట్టుకునేందుకు మామిడితోట రోడ్డు ఫేసింగ్ సెంటు 1,50,000/- కరెంటు కలదు. 5 సెంట్లు బిట్స్ కలవు. ✆ 7075344069, 93986 83813

PLOT FOR SALE

KANURU

కానూరు 100అ||రోడ్డుకి దగ్గరగా శ్రీకర హాస్పటల్ ఎదురుగా రోడ్డుకి 3వ బిట్టు 27 సెంట్లు (Sy No 93/7, 95/1) అమ్మకం. ✆ 98667 28580.

తాడిగడప చైతన్యకాలేజ్ 100అ|| కామినేని హాస్పిటల్ రోడ్డులో పంచమర్తి అనురాధగారి విల్లాస్ రోడ్డులో 200,250,300గ|| లేఔట్ ప్లాట్లు అం||. ✆ 9290763488

కానూరు, తాడిగడప, పోరంకి, గొల్లపూడిలలో రాఘవ ఎస్టేట్స్, జన చైతన్య, హరివిల్లు, శ్రీ భ్రమర, శ్రీ సిటి వెంచర్లలో ప్లాటు అమ్మదలచిన వారు. ✆ 93922 56567.

హరివిల్లువారి అన్ని CRDA లేఅవుట్లలో పెనమలూరు కంకిపాడు గండిగుంటలో 194, 240, 300, 400 గ|| మంచి ప్లాట్లు కంపెనీ డైరెక్ట్ సేల్.✆ 92464 73929.

PENAMALURU

పోరంకి పద్మావతి గార్డెన్స్ నందు పడమర ఫేస్ 198చ||గ||ల రెసిడెన్షియల్ ప్లాటు (38x46) అమ్మకం. చ||గ|| 42,000/- (నో బ్రోకర్స్) ✆ 93462 22427.

GOLLAPUDI

గొల్లపూడి ఖలీల్‌భాయ్ రెస్టారెంట్ దాటి రైట్‌సైడ్ CA కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ పక్కన ఉన్న L.P.No. 28/2008లో 50అ|| మెయిన్‌రోడ్డుకి 2వ ప్లాటు హైవేకి 600 మీ|| దగ్గరగా 250 చ||గ|| లేఔట్ ప్లాట్లు. గజం: 26000/- లకే. ✆ 92907 63488.

GENERAL

347గ||లు W/F, మెయిన్‌రోడ్‌కు ఫస్ట్‌బిట్, గేటెడ్ కమ్యూనిటీలకు అనుకొని, హైవేకి 1KM కేసరపల్లి గోడౌన్ రోడ్; ఉడా అప్రూవ్డ్ ప్లాట్ అమ్మకం. ✆ 99595 03455

NTR జిల్లా పెనుగంచిప్రోలు చైతన్య టెక్నో స్కూల్ ఎదురుగా పూట్లు నాగేశ్వరావు టౌన్‌షిప్‌లో 1121చ||గ||ల నివాస స్థలం అమ్మకం. ✆ 98482 74090.

కంకిపాడు దగ్గర పునాదిపాడు ఉలవచారు వెంచర్ ప్రక్క వెంచర్‌లో 36x60కొ|| 240చ||గ||ల ఉడా లేఅవుట్ తూర్పు ఫేస్ ప్లాటు అమ్మకం. ✆ 98482 39369

కమర్షియల్ స్థలము అమ్మకము. విజయవాడ To హైదరాబాద్ రోడ్డులో కంచికచర్ల వద్ద 66x98 = 720చ||గ||లు N/E/W ఫేస్‌తో లే అవుట్ ప్లాటు అమ్మకం. చ||గ|| 15,000/- ✆ 93939 62234.

గుడివాడ ఆటోనగర్, 4వ లైన్ నందు 500 గజాల కమర్షియల్ స్థలము అమ్మకము. Contact. 81212 10199, 70930 99961.

For Sale: 253 Sq Yds West Facing Site in Srinivasa nagar Bank Colony Near Novotel, VJA. ✆ 98490 02025, 93460 02025.

బందరు రోడ్ నేషనల్ హైవే ఫేసింగ్ నార్త్‌సైడ్ కంకిపాడు దగ్గరలో 450 చ||గ||ల ప్లాట్ అమ్మకమునకు కలదు. సంప్ర ✆ 98483 43355.

CRDA అప్రూవ్ లేఅవుట్ గజం ధర కేవలం 5999 అమరావతి క్యాపిటల్‌కు అతిదగ్గరలో డెవలప్ అవుతున్న ప్రైమ్ లొకేషన్ ఇన్వెస్ట్‌మెంట్‌కు సరైన, ఎంపిక. ✆ 85559 63700/ 96183 72028.

పటమట ఎలక్ట్రిసిటీ కాలనీ
ప్రైమ్ లొకేషన్‌లో
40 అ|| రోడ్డు తూర్పు ఫేస్
ఫ్లోర్‌కి ఒక్క 3 BHK డీలక్స్ ఫ్లాట్
అమ్మకమునకు కలదు
✆ 90000 40792

VJA, ఉయ్యూరు CRDA 75ఎ|| నూతనవెంచర్ ప్రారంభం- గ|| 10999/-. 75% లోన్ ★ ప్లాట్స్ ★ హౌసెస్ ★ విల్లాలు. ✆ 95531 29369, 97054 33765.

బందరురోడ్డుకు 900 మీటర్స్ రింగ్‌రోడ్‌కు 1KM ఆకునూరు దగ్గరలో CRDA LP40/25 గేటెడ్ కమ్యూనిటీలో 138, 165, 183, 222 చ||గ|| ప్లాట్స్ స్పాట్ రిజిస్ట్రేషన్ బ్యాంకులోన్ 70%తో Baburao. 91603 12999.

యనమలకుదురు పోరంకి డొంకరోడ్ పార్థసారధి ఫంక్షన్ హాల్ దగ్గర పడమర ఫేస్‌తో 310గజాల ఖాళీ స్థలం అమ్మకం. ✆ 99596 70859.

60అ|| రోడ్డుని ఆనుకుని 4ఎ|| గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి 12KM ఇండస్ట్రియల్ జోన్ వీరపనేని గూడెంకి 1KM 4 ఎకరాలు 5 కోట్లు. ✆ 83175 28192.

గన్నవరంలో నేషనల్ హైవే ప్రక్కన 5 సెంట్లు, 10 సెంట్లు బిట్లు; పొట్టిపాడు టోల్ గేట్‌కి 1/2 కి.మీ., తారు రోడ్డు ప్రక్కన సెంటు 2 లక్షలకే
✆ 78933 89194

రాజధాని అమరావతికి చేరువలో Vja-Hyd. ఎక్స్‌ప్రెస్ హైవేను ఆనుకొని ప్రపోజ్డ్ ఐకానిక్ బ్రిడ్జి వైకుంఠపురం బ్యారేజ్, ORR, కొత్తగా రాబోవుచున్న పరిటాల రైల్వే స్టేషన్, Logistic Hubకు అతి చేరువలో 30 ఎకరాల గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్ "The Royal"లో ఓపెన్ ప్లాట్స్ ఇండిపెండెంట్ హౌసెస్. సంప్ర: ప్రీలాంచింగ్ ఆఫర్. ✆: 77993 34555.

కంకిపాడు, మచిలీపట్నం హరివిల్లు వారి CRDA వెంచర్స్‌లో రీసేల్ ప్లాట్స్ రీజనబుల్ రేట్లలో అమ్మకానికి కలవు. బ్యాంక్‌లోన్ ★ స్పాట్ రిజిస్ట్రేషన్ ✆93945 31999.

VJA, పెనమలూరు CRDA LP No: 104/25, ప్లాట్లు, హౌసెస్, విల్లాలు ★ బ్యాంక్ లోన్ ★ స్పాట్ రిజి. ✆ 95531 29369, 97054 33765.

VJA, పోరంకి సీతాపురంకాలనీలో 387చ||గ||ల (43X80) కొ||తో పడమర ఫేసింగ్ గల 2ప్లాట్లు ప్రక్క ప్రక్కన (87X80) అమ్మకమునకు కలవు.✆ 88854 77888.

గన్నవరం ఎయిర్‌పోర్ట్ దగ్గరలో HCL సాఫ్ట్‌వేర్ కంపెనీ వెనుక గేటెడ్ కమ్యూనిటీ పక్కన ఉడా లేఅవుట్ 200 గజాల వెస్ట్‌ఫేసింగ్ ప్లాట్ అమ్మకం రియల్ ఎస్టేట్ మీడియేటర్ Y శ్రీనివాస్. ✆ 80998 36999.

కండ్రిక డీమార్ట్ దగ్గర 154 గా, నున్న ఇళ్ళ మధ్యలో 245గా, బందరు అశోక్‌నగర్ 100గా G+1 బిల్డింగ్, నున్న సూరంపల్లి మధ్య, గజం 13,500కే ✆ 99515 29026.

గూడవల్లిలో 10 ఎకరాలు, బందరు రోడ్ ఫేస్ పెనమలూరులో 700 గ||, మహానాడు రోడ్లో 3000గ||, స్టెల్లా కాలేజ్ RTC కాలనీలో ఒక ఫ్లోర్ ఉన్న ఫ్లాట్, సెంటినీ హాస్పిటల్ దగ్గర కమర్షియల్ బిల్డింగ్ ✆ 98493 48066

కంకిపాడు బస్టాండ్ దగ్గర, ఫ్యూజన్ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో B బ్లాక్, ప్లాట్ నెం. 463, W/F 187 గ|| ఖాళీస్థలం అమ్మబడును. ✆ 83099 08373.

పోరంకి to నిడమానూరు రోడ్డులో తారురోడ్డుకి 1KMలో 36x57 కొ||తో 229చ||గ||లు తూర్పు ఫేస్ 40అ|| రోడ్డు ఉడా లేఅవుట్ ప్లాటు అమ్మకం. ✆85558 71990

ఈడుపుగల్లు డాక్టర్స్ కాలనీ వెస్ట్ 200చ||గ|| నాన్ లేఅవుట్ ప్లాట్ అమ్మకం. ఈడుపుగల్లు, కంకిపాడు, పోరంకి, పునాదిపాడులో ప్లాట్లు అ||కొ|| సంప్ర: ✆ 88857 66889

Vja-1, అమ్మ హోటల్, Opp: అబ్దుల్ ఖాదర్ వీధిలో 180 చ. గ. ఈస్ట్ ఫేసింగ్ స్థలం అమ్మబడును. ✆ 77025 70866 .

200చ||గ|| ప్లాటు, వినుకొండ దగ్గర 1,00,000/- మాత్రమే, ఎర్రచందనం, శ్రీగంధం, మహాగని. ★ నిబంధనలు వర్తిస్తాయి. సంప్ర: ✆ 80191 73747.

అమరావతి పూలింగ్ ప్రక్కన స్టేడియం, న్యూరైల్వే లైన్ 3km లో 100 అ|| రోడ్, సిడ్‌యాక్సిస్ రోడ్‌కు 5 ని||లో సెంటు 12 లక్షలు లోన్ సౌ|| 95507 63551.

COMMERCIAL SPACE FOR SALE

AP NTR జిల్లా పెనుగంచిప్రోలు 6 ఎ|| మామిడి తోటతో మంచి ఆదాయం కలిగిన కళ్యాణ మండపాలు -2 (A/C, Non A/C) అన్నివసతులతో 12.5 Cr కే అమ్మకం. ✆ 77997 95599

మహానాడు రోడ్ KIA మోటార్స్ దగ్గరలో Rs.90K రెంటల్ అగ్రిమెంట్‌తో ఉన్న 2400 Sft Plug-Pay ఆఫీస్ స్పేస్ అమ్మబడును. ✆ 98482 54909.

IBM-మైలవరం హైవే, కట్టుబడిపాలెం Opp: BPCL,128x169, 2,420గ|| W/F స్థలం గ|| 15వేలకే అమ్మకం. ఖమ్మం గ్రీన్‌ఫీల్డ్ హైవేకి 200మీ|| అమరావతి రాజధానికి 12కి||మీ|| దగ్గరలో కలదు. ✆ 9848164353

LEASE/ RENT

తాడిగడప (కామినేని హాస్పిటల్ రోడ్) 100అ|| రోడ్‌లో పంచమర్తినగర్ నందు 5 ఫ్లోర్ల భవనము సుమారు 10000 చ||అ|| లీజుకు/ అద్దెకు కలదు. ✆94410 75333

అద్దెకు/ లీజుకు
ఎనికేపాడు SRK కాలేజీ వెనుక
16,000, 7,500, 6000, 2,000 S.Ft. గల గోడౌన్స్ అన్ని సౌకర్యములతో అద్దెకు/ లీజుకు ఇవ్వబడును.
94948 22288 80082 45555

గోడౌన్ లీజు/అద్దెకు
60000 చ||అ||ల గోడౌన్ అద్దెకు. హనుమాన్‌జంక్షన్ - నూజివీడు రోడ్డు, రెమల్లే గ్రామము, బాపులపాడు మండలం, కృష్ణా జిల్లాలో కలదు సంప్రదించగలరు.
ఫోన్:97044 45679

PROPERTY FOR SALE

మచిలీపట్నం ఈడేపల్లిలో 1069 sq.yds రెసిడెన్షియల్ స్థలం / ఇల్లు స్పష్టమైన మున్సిపల్ ట్యాక్స్ రికార్డులతో అమ్మకమునకు కలదు. ఫోన్: 9492218789

AGRICULTURE LANDS

7 acres, 50 meters of frontage with NH16, by the bridge on Eluru Canal in Kesarapalli. contact: 6304149506.

TO LET

1900 S.Ft., Anne Towers Posh Flat 3 BHK 1st Floor, Near Sentini Hospital, VJA, with Car Parking. Rent: 26,000/-. ✆ 88978 25678

2BHK ఇండివిడ్యువల్ హౌస్ గ్రౌండ్ ఫ్లోర్ # 5-124/1 మహాలక్ష్మీనగర్ పోరంకి వసంత నగర్ కాలనీ ప్రక్కన కప్‌బోర్డ్స్‌తో అద్దెకు. ✆ 98661 47977

3BHK 1920 Sq.Ft., at Sowbhagya Heights beside Metro Hospital. TV, A.Cs, Beds, Sofa, Dining Tables+ Chairs with all Amenities for Rent. ✆ 80082 91236

2BHK ఫ్లాట్ చిట్టినగర్ సిండికేట్ బ్యాంక్ కాలనీ 2వ ఫ్లోర్ N/E కార్నర్ ఫ్లాట్ రెసిడెన్షియల్/ కమర్షియల్‌గా అద్దెకు ఇవ్వబడును. ✆ 94903 65566

గుంటూరు-నల్లచెరువు బొమ్మల సెంటర్ దగ్గర, 8000 అడుగుల గోడౌన్ మొత్తంగా కాని విడివిడిగా కాని అద్దెకు కలదు. Ph: 9866315903, 9866315913.

COMMERCIAL

Patamata: Commercial Office space 1200 Sft in 2nd floor. 4 ACs, Furnished. Beside Nirmala Convent. ✆ 70368 82222.

2500 S.Ft Gr. & 1st Floors (Each) Posh Commercial Building, Behind Funtimes, VJA. Suitable for Boutique, Play Schools, Real Estate Office, Sarees Shop. 4 Car Parkings. Rent: 50,000/- Each Cont.: 88978 25678

3,500S.ft Commercial Space 1st Floor for Rent. Suitable Bank, Office, Godown Seetharampuram, VJA. No Brokers ✆ 70958 84402.

విజయవాడ సూర్యారావుపేట వేమూరి వారి వీధి విజయచంద్ర నర్సింగ్ హోమ్ గ్రౌండ్ 480, 1st ఫ్లోర్ 1400S.Ft. 40 సం|| రన్నింగ్‌లో ఉన్న హాస్పిటల్ (గైనిక్) డెలివరీ, గైనిక్ ఆపరేషన్, పూర్తి పరికరములతో గైనిక్ హాస్పిటల్స్‌కు మాత్రమే అద్దెకు ఇవ్వబడును. 95505 82984

గవర్నర్‌పేట ప్రకాశంరోడ్‌లో శ్రీగణేష్ ఎంటర్‌ప్రైజెస్ పైన 1, 2వ ఫ్లోర్ 400+ 400అ|| కమర్షియల్ ఏరియాలో ఆఫీస్/ గోడౌన్/ షాపులకు అద్దెకు 9848559944

2,500 S.Ft గ్రౌండ్‌ఫ్లోర్ 80HP కరెంటుతో ఇండస్ట్రీస్‌కు/ గోడౌన్‌లకు లేదా ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. కబేళా ఎదురు, 4వ రోడ్డు, విజయవాడ. ✆ 98490 97006.

2700 S.Ft., Office Space for Lease above IDFC Bank in Punnaiah & Vajramma Complex, Opp: Maris Stella College. ✆ 95507 17832, 98490 02025.

Spacious 2 Bedroom Flat at the Heart of the city on Bandar road (MG Road) for Offices Only, no Brokers. ✆ 98490 15616.

13000 S.Ft. Commercial Building for Rent
at SRI RAMACHANDRA NAGAR, MAHANADU ROAD.
Ready for EDUCATIONAL INSTITUTIONS, Also Suitable for CORPORATES, HOSPITALS & HOTELS
✆ 97013 63535 95177 73456

Lease: 343 Sq.yds open plot near MTM Station. 10 yrs lease for storage / godown. Call: 78738 48926

Commercial Shed For Rent 17000 sft, Autonagar, Old Gajuwaka, Visakhapatnam. Contact : 95422 07369

25,000 S.Ft. గల కమర్షియల్ స్పేస్
విజయవాడ, బందరు రోడ్డు ఫేసింగ్‌తో, అశోక్‌నగర్‌లో, VSR కాంప్లెక్స్ నందు
25,000 S.Ft. గల కమర్షియల్ స్పేస్
ఇన్సూరెన్స్, కార్పొరేట్ ఆఫీసులకు, బ్యాంక్ రీజనల్ ఆఫీసులకు, సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసులకు, కోచింగ్ సెంటర్లకు, IT కంపెనీలకు మొదలగు వాటికి మొత్తంగా/ విడివిడిగా గాని 2 లిఫ్ట్‌లు, కార్ పార్కింగ్ సౌకర్యంతో అద్దెకు ఇవ్వబడును.
Contact
93462 44888

Lease for Corporate Offices, Banks, 2500 Sft, 11 Cubicals Manager Cabin, 2 Conference Halls, Pantry, Reception. Contact ✆ 98494 91969.

Currency Nagar near Aayush Hospitals 2 Road bit available for Rent Warehouse/ Showroom 4500-6000 Sft. ✆ 94417 95555.

1500 S.Ft., Commercial Space Rent for Offices. Ground Floor, 2nd Line, Santhinagar, Moghalrajpuram, VJA. ✆ 93934 70333.

Vijayawada - Bharathinagar Road No:10, Modern Duplex Individual House with Servant Accomodation for Residence/ Guest House. For Lease/Rent. Cont: ✆ 83418 35845, 98661 92045.

విజయవాడ రామవరప్పాడు NH ఫేసింగ్ సెల్లార్ పార్కింగ్‌తో GF- 2300 S.Ft., FF-2500 S.Ft., కమర్షియల్ స్పేస్ అద్దెకు కలదు. ✆ 77318 10116.

విజయవాడ, సూరంపల్లి దగ్గర నూజివీడు రోడ్‌కి 100మీ|| దగ్గరలో 4,000గ|| 35x135 షెడ్డు మరియు 2,000గ|| స్థలం చుట్టూకాంపౌండ్ వాల్‌తో అద్దెకు కలదు వివరాలకు. 9440313198

ఆఫీసుల కొరకు అద్దెకు. 2nd ఫ్లోర్ 1025 S.Ft., యార్లగడ్డ భవన్ ఆంధ్రా హాస్పిటల్ ఎదురుగా, ప్రకాశం రోడ్, గవర్నరుపేట, VJA-2. ✆ 94403 73802

VJA, భవానీపురం ఐరన్ కాంప్లెక్స్‌లో, హైదరాబాద్ మెయిన్‌రోడ్‌కి దగ్గర, ప్లాటు నెం.45లో 1st ఫ్లోర్ 4,400SFt కమర్షియల్ స్పేస్ అద్దెకు. 94403 13198

ఎనికేపాడు హైవే ఆనుకుని ఉన్న రిలయన్స్ డవలపర్స్ బిల్డింగ్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో (ఇండిపెండెంట్) 4000SFt, ఆఫీస్ గెస్ట్‌హౌస్‌లకు అనుకూలం అద్దెకు. పార్కింగ్ కలదు. 89780 51456

విజయవాడ, గురునానక్ కాలనీలో స్టార్‌బక్స్‌కి ఎదురుగా SBH కాలనీలో (ప్లాట్ నెం.22) 4,000 చ||అ||లు విస్తీర్ణం ఉన్న కమర్షియల్ బిల్డింగ్ లీజుకు లేదా అమ్మకానికి కలదు. (Rs.5.2 Cr). ✆ 98481 21859

JOBS

నిరుద్యోగ యువతకి సువర్ణావకాశం. డా.రెడ్డీస్ ఫౌండేషన్ వారిచే కమ్యూనికేషన్ ఇంటర్వ్యూ, స్కిల్స్, కంప్యూటర్ కోర్స్‌లో 60రోజుల ఉచిత శిక్షణ, ఉద్యోగం కల్పించబడును. వ: 18-28, ✆ 90007 14836

శ్రీ సాయి అంజనా చిట్‌ఫండ్స్, గాంధీనగర్ నందు పనిచేయుటకు రికవరీ స్టాఫ్ (M) కావలెను. ✆ 76600 08326, 63034 19997.

విజయవాడ భవానీపురంలో ప్రముఖ కూల్‌డ్రింక్ షాపులో పనిచేయుటకు డోర్ ఆటో డ్రైవర్లు మరియు హెల్పర్లు కావలెను. ✆ 82970 68286, 95507 94793.

ఎనికేపాడు న్యూ ఆటోనగర్ ఏరియాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. PF, ESI కటింగ్ పోను శాలరీ: 16,000/- 12H డ్యూటీ 10th క్లాస్, 50Y లోపు. ✆ 97034 65118.

మంగళగిరి ఇంటిలో సుచిగా వంట చేయుటకు అనుభవంగల వైశ్య/ బ్రాహ్మణ వంటమనిషి కావలెను డ్యూటీ రోజుకి 4Hrs. ఆకర్షణీయమైన జీతం. ✆ 70325 99665

ప్రముఖ బ్యాంకింగ్ సంస్థలో పనిచేయడానికి రిటైర్డ్ వ్యక్తులు, గృహిణులు, వ్యాపార వ్యక్తులు, VRS, పార్ట్‌టైం/ ఫుల్‌టైం వెంటనే కావలెను. ✆ 75691 71738.

సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. విజయవాడలో ప్రముఖ షుగర్ హస్పిటల్ నందు పనిచేయుటకు కనీసం 5సం|| అనుభవం కలిగిన ల్యాబ్ టెక్నీషియన్ కావలెను. ✆ 90149 75729.

Photoshop & Corel draw Designer Experience Person Only for Sigh Industry Vijayawada ✆ 96664 77111.

Wanted English, Social, Hindi, Quran Teachers & Pre Primary Class Mother Teachers Iqraa Near Andhra Hospital, Gollapudi, W/A 90523 62816. Mail Resume : schooljobsvja@gmail.com

వాచ్‌మెన్ కావలెను
కంకిపాడు దగ్గర, ప్రొద్దుటూరు గ్రామంలో ఫామ్‌హౌస్ నందు ఆవులను, ఇంటిని చూసుకొనుటకు భార్యాభర్తలు కావలెను.
వసతి సౌకర్యం కల్పించబడును.
జీతం: 25,000/-
✆78421 42777

Experienced Tutors are Required to Teach Intermediate First and Second Year Mathematics and to Provide Short Term EAMCET Coaching. Contact ✆ 73868 09449

Wanted Experienced Receptionist for Hotel SK River Front, one-town, Vijayawada. ✆ 89783 00299.

MD General Surgeon Required Part-time position (10AM - 2PM) Light Home Hospital, Near Gannavaram. Qul. & Exp. ✆ 92810 06811

Wanted Graduates with One Year Experience in Service Industries to work in Banking Sector. Walk-in Call: AP- 73051 11758, TG- 73051 11748.

Wanted Female Telecallers, Counsellors & Hostel Wardens for a reputed College in Labbipet. Pay upto 15K + Incentives. Qual: Any Degree. Age: 25-40 Yrs. Min 2 Yrs Exp. Ph: 91542 10069.

Wanted a Male B.Com Graduate with Tally Knowledge & Knowledge in GST also towork in a Trading Business organisation at Vijayawada.✆:88852 89575.

Wanted Exp. Computer Operators to Work in SLRT Parcel Service at Nidamanuru, Vijayawada. ✆ 92481 93944 Mail: slrtvzam@gmail.com

కావలెను
ప్రముఖ ప్రింట్ & జిరాక్స్ షాప్ నందు వర్క్ చేయుటకు DTP & జిరాక్స్ ఆపరేటర్స్, అడ్మిన్ & మెయింటనెన్స్ స్టాఫ్ కావలెను.
Q: ఇంటర్ / డిగ్రీ.
✆ 9848075173

Wanted Office Assistant With Computer Knowledge in Vijayawada. ✆ 83411 39575.

Civil Engineers, Supervisors, Accountants, Stores for Road Projects at Vijayawada for Established Organisation. ✆ 8919163761

గుంటూరులోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వారి ఓపెన్ ప్లాట్లు, ఫామ్ ల్యాండ్స్ అమ్ముటకు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. మంచి కమీషన్ ఇవ్వబడును. ✆ 93915 26523.

Exp. నర్సులు/ ఆయాలు/ వార్డ్ బాయ్స్ కావలెను. జీతం: Rs: 20,000/- నుండి 25,000/- వరకు. కూకట్‌పల్లిలో Hyd ✆ 6302532832, 8019117633.

రామకృష్ణ ఓల్డేజ్ హోం - HYD కొరకు అకౌంటెంట్లు, సూపర్‌వైజర్లు కావలెను. భో+వ+ మంచి జీతం కలదు. నాగోల్. ✆ 94413 81122, 94406 71190.

ప్రముఖ బ్యాంక్ సంస్థలో పనిచేయుటకు లేడీ టెలీకాలర్స్ కావలెను జీతం: 14K- 20K + ఇన్సెంటివ్స్. EXP 1Yr Min. ✆ 99482 00553

మొగల్రాజ పురంలో వయో వృద్ధురాలను చూసుకొనుటకు ఏ బాదర బందీలేని ఆయా కావలెను. 24 గం. ఉండవలెను. నోబ్రోకర్స్. ✆ 95134 65954, 62813 65642

విజయవాడ ప్రముఖ హోటల్ నందు కంప్యూటర్ నాలెడ్జి గల రిసెప్షనిస్టులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 96180 88336.

రైస్ మిల్ & ప్లాంట్ ఆపరేటర్స్ కావలెను. అనుభవజ్ఞులైన వెల్డింగ్, రిపేర్ తెలిసిన ఆపరేటర్స్ కావలెను. Contact No: ✆ 80962 46099.

SVR ఎలక్ట్రికల్స్ ప్రై.లి. గుంటూరు & జడ్చర్ల బ్రాంచిలలో పని చేయుటకు అకౌంటెంట్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, ఎలక్ట్రికల్& మెకానికల్ ఇంజనీర్స్, డిప్లమో ఎలక్ట్రికల్& మెకానికల్ ఇంజనీర్స్, ఐటిఐ హెల్పర్స్, వెల్డర్స్, ఫిట్టర్స్ కావలెను. 91333 55781 (10 AM-5 PM) svrelectricalsgnt@gmail.com.

రామేశ్వరం సత్రంలో పనిచేయుటకు అనుభవం గల కంప్యూటర్ అవగాహన గల మేనేజర్., సూపర్‌వైజర్& వంట వారు కావలెను భోజనము+ వసతి గలదు. ఈ క్రింది అడ్రస్‌కు మీ బయోడేటా పాసుపోర్టు సైజు ఫోటో & ఆధార్ కార్డు కాపీ పంపగలరు, శ్రీ కాశీ రామేశ్వరం ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం ట్రస్ట్ నెం.6-1-91 వారణాసి బ్లాక్, వాసవీ సేవాకేంద్రం ఖైరతాబాద్ హైదరాబాద్- 500 004, T.G. ఉ:11.00 - సా: 5.00 ✆ 040-23234414

(విజయవాడ) ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు లీడర్స్‌కి స్వాగతం మంచి కమీషన్ & శాలరీ ఇవ్వబడును. ఫోన్: 9133574455.

కాలేజ్ Transport, Accounts & Calling చూసుకోవడానికి ఇంటర్ చదివిన లేడీస్ కావలెను. సుచిత్ర, ECIL, Hyd. ✆ 91212 11919

కనీసం ★ 1 year అనుభవం ఉన్న పెయింటర్ అవసరం. ★ విజయవాడ కేంద్రంగా ఉండాలి. ★ మంచి జీతం ★ TA & DA మరియు ఇతర ప్రోత్సాహకాలు అందించబడతాయి. వివరాల కోసం సంప్రదించండి: ✆ 81253 36519

MORE CLASSIFIEDS ON PAGES 11

గుణదల మేరీ మాత నవదిన ప్రార్థనలు ప్రారంభం


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు, గురువులు

గుణదల(పటమట), న్యూస్‌టుడే: ఆధ్యాత్మిక తల్లిగా నీరాజనాలు అందుకుంటున్న గుణదల లూర్దు మాత 102వ మహోత్సవాల నవదిన ప్రార్థనలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్లు మరియన్న, తోట సునీల్‌రాజు తదితర గురువుల గుణదల పుణ్య క్షేత్రం ప్రధాన చర్చి వద్ద మేరీ మాత పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బిషప్ తెలగతోటి రాజారావు భక్తులను సందేశమిస్తూ.. భారత దేశ వ్యాప్తంగా గుణదల మాత పుణ్య క్షేత్రం భక్తుల విశ్వాస శిఖరంగా వెలుగొందుతోందని అన్నారు. క్రీస్తు తల్లి అయిన మేరీమాతను గౌరవిస్తే.. దేవుడి అనుగ్రహం తప్పక లభిస్తుందని తెలిపారు. ఫాదర్ మువ్వల ప్రసాద్, రెక్టర్ విలియం జయరాజు మాట్లాడుతూ.. ఈ నెల 9, 10, 11 తేదీల్లో మేరీ మాత మహోత్సవాలను అశేష భక్తకోటి క్రమశిక్షణతో నిర్వహించుకోవాలని సూచించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే నవదిన ప్రార్థనల్లో లూర్దు మాత దివ్యానుగ్రహాలను భక్తులను సంసిద్ధులను చేస్తామని తెలిపారు. అనంతరం దివ్యబలిపూజ మందసంతో కొండపై మరియమాత స్వరూపం వద్దకు చేరుకున్నారు. మేరీమాత స్వరూపం వద్ద సమష్టి దివ్య పూజబలి సమర్పించారు. ఫాదర్లు జి.కిరణ్ బాబు, బి.వినయ్, జి.బాలస్వామి, కె.ప్రతాప్, బొద్దు ఆనంద్, రాజేష్, సంఘ పెద్దల ప్రెసిడెంట్ నువ్వుల విజయరాజ్, భక్తులు పాల్గొన్నారు.

ఈఎస్‌ఎల్ క్రికెట్ తుది సమరం నేడే

సందడిగా ఈనాడు క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు

జిల్లాపరిషత్తు(గుంటూరు), తాడికొండ, న్యూస్‌టుడే: గుంటూరు సమీపంలోని మోతడకలోని చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల మైదానంలో 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్) క్రికెట్ రాష్ట్ర స్థాయి పోటీలు ఐదు రోజులుగా ఉత్సాహంగా జరుగుతున్నాయి. శనివారం నాలుగు మ్యాచ్‌లు జరగాల్సి ఉండగా.. జూనియర్స్ విభాగంలో ఒక్క మ్యాచ్ మాత్రమే జరిగింది. మూడు జట్లు గైర్హాజరుతో ప్రత్యర్థి జట్లను అంపైర్లు విజేతలుగా ప్రకటించారు. హైదరాబాద్ హీరోస్ జట్టు బ్యాటర్ ఆదిత్య ఫోర్లు, సిక్సర్లతో వీర విహారం చేశాడు. ఆదిత్య సెంచరీతో పాటు బౌలర్ల సమష్టి రాణింపుతో జూనియర్స్ విభాగంలో హైదరాబాద్ హీరోస్ ఫైనల్‌కు చేరింది.

ఆ జట్లు గైర్హాజరుతో..: ● సీనియర్స్ విభాగంలో రాయలసీమ రాకర్స్ (సికామ్ డిగ్రీ కళాశాల), నార్త్ ఆంధ్రా నింజాస్ (గీతం డీమ్డ్ యూనివర్సిటీ) జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. నార్త్ ఆంధ్రా నింజాస్ జట్టు రాకపోవడంతో అంపైర్లు రాయలసీమ రాకర్స్‌ను విజేతగా ప్రకటించారు. ● సీనియర్స్ విభాగంలో తెలంగాణ టైగర్స్ (వాగ్దేవి డిగ్రీ-పీజీ కళాశాల), హైదరాబాద్ హీరోస్ (టీకేఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ) జట్ల మధ్య జరగాల్సి ఉంది. తెలంగాణ టైగర్స్ జట్టు గైర్హాజరవడంతో అంపైర్లు హైదరాబాద్ హీరోస్‌ని విజేతగా ప్రకటించారు. ● జూనియర్స్ విభాగంలో రాయలసీమ రాకర్స్ (శ్రీవిద్య జూనియర్ కళాశాల), నార్త్ ఆంధ్రా నింజాస్ (రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్) మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. నార్త్ ఆంధ్రా నింజాస్ జట్టు రాకపోవడంతో అంపైర్లు రాయలసీమ రాకర్స్‌ను విజేతగా ప్రకటించారు. అయితే పాయింట్లు తక్కువగా ఉండటంతో వెనుదిరిగింది.


నెట్ రన్‌రేట్ ఆధారంగా..: ● సీనియర్స్ విభాగంలో రాయలసీమ రాకర్స్, హైదరాబాద్ హీరోస్ ఫైనల్‌లో తలపడనున్నాయి. ● జూనియర్స్ విభాగంలో హైదరాబాద్ హీరోస్, సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్, తెలంగాణ టైగర్స్ జట్లు పాయింట్లలో సమానంగా ఉన్నాయి. నెట్ రన్‌రేట్ ఆధారంగా హైదరాబాద్ హీరోస్, సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్ ఫైనల్‌కు ఎంపికయ్యాయి. ● ఫైనల్‌కు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) ముఖ్య కార్యదర్శి ఎ. రాజమౌళి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ఎస్.భరణి హాజరుకానున్నారు. విజేతలకు ట్రోఫీలు, బహుమతులు ప్రదానం చేస్తారు.


విజయానందంలో హైదరాబాద్ హీరోస్ జట్టు

ప్రత్యర్థికి చుక్కలు చూపించిన ఆదిత్య

జూనియర్స్ విభాగంలో తెలంగాణ టైగర్స్ (ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల), హైదరాబాద్ హీరోస్ (భవన్స్ శ్రీఅరబిందో జూనియర్ కళాశాల) జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగశ్రీనివాసరావు టాస్ వేశారు. తెలంగాణ టైగర్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ హీరోస్ ఓపెనర్లు ఆదిత్య, ప్రణయ్ పోటీపడి ఫోర్లు, సిక్సర్లతో బౌలర్లను బెంబేలెత్తించారు. 174 పరుగులు చేసిన తర్వాత వీరిద్దరి భాగస్వామ్యానికి తెరపడింది. ఆదిత్య 54 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లతో 102 పరుగులు చేసి జట్టును పటిష్ఠ స్థితికి చేర్చిన తర్వాత ఔటయ్యారు. మరో ఓపెనర్ ప్రణయ్ 43 బంతుల్లో 54 పరుగులు చేశాడు. నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 241 పరుగులు చేసింది. అనంతరం భారీ విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన తెలంగాణ టైగర్స్ ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోవడంతో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ప్రణీత్ 33 బంతుల్లో 34 పరుగులు చేశాడు. జట్టు 15.5 ఓవర్లలో 98 పరుగులకే ఆలౌటైంది. నలుగురు డకౌటయ్యారు. ఇషాన్ 3 వికెట్లు, హర్ష, ప్రణవ్‌లు రెండేసి వికెట్లు తీసుకున్నారు. సెంచరీతో జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించిన ఆదిత్య మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు. ఈ గెలుపుతో హైదరాబాద్ హీరోస్ ఫైనల్‌కు చేరింది.

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్


ఆదిత్య


1న (నేడు) జరిగే మ్యాచ్‌ల షెడ్యూల్ ఇలా..

వేదిక: నంబూరులోని ఎం.ఎస్.కె.ప్రసాద్ క్రికెట్ అకాడమీ గ్రౌండ్
సీనియర్స్: రాయలసీమ రాకర్స్ x హైదరాబాద్ హీరోస్
జూనియర్స్: హైదరాబాద్ హీరోస్ x సెంట్రల్ ఆంధ్రా ఛాలెంజర్స్

ఏప్రిల్‌లో విజయవాడలో ఏఐవైఎఫ్ సమావేశాలు

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే: అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జాతీయ సమావేశాలు ఏప్రిల్ 14, 15, 16 తేదీల్లో విజయవాడలో నిర్వహిస్తున్నట్లు సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి సుఖజిందర్ మహేశరి తెలిపారు. శనివారం విజయవాడ దాసరిభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 12 సంవత్సరాలు గడుస్తున్నా.. ఇప్పటివరకు సాధించింది ఏదీ లేదన్నారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న ప్రధాని ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఏప్రిల్‌లో విజయవాడలో జరిగే సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 30లోపు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని, లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు లంకా గోవిందరాజులు, వై.బాబి, కొంగర శ్రీనివాసులు, నాగరాముడు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర అభివృద్ధికి జయరాం కృషి చేయాలి


జయరాంను సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఛైర్మన్ ఆంజనేయులు

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఉత్తర అమెరికాలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధిగా ప్రవాసాంధ్రులు కోమటి జయరాం నియమితులు కావడం అభినందనీయమని కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శనివారం నగరంలోని జయరాం నివాసంలో ఆయనను కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. కృషి, పట్టుదల, నిబద్ధత వల్లనే ఆయనకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. అమెరికాలోని తెలుగు వారిని సమన్వయం చేసుకుని పెట్టుబడులు ఆకర్షించడం వల్ల రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తారనే విశ్వాసం ఉందన్నారు. ఆదిశగా సాగాలని కోరారు.

జేఎన్‌టీయూకే ఖోఖో పోటీలు ప్రారంభం

గుడ్లవల్లేరు: స్థానిక ఎస్ఆర్‌జీఈసీలో శనివారం జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని కళాశాలల పురుషుల, మహిళల ఖోఖో పోటీలు ప్రారంభమయ్యాయి. డీఎస్పీ ధీరజ్‌వినీల్, గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ ఛైర్మన్, ఖోఖో జిల్లా అసోసియేషన్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని పోటీలను ప్రారంభించారు. క్రీడాజ్యోతిని వెలిగించి, క్రీడాకారుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి ప్రకాశం జిల్లా వరకూ 360 మంది పురుషులు 270 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూకే క్రీడా కార్యదర్శి శ్యాంకుమార్, సంస్థ కరస్పాండెంట్ వల్లూరుపల్లి రామకృష్ణ, డైరెక్టర్ సిద్ధయ్య, ప్రిన్సిపల్ కరుణకుమార్, గౌరవ సలహాదారు రవీంద్రబాబు, వైస్‌ప్రిన్సిపల్ శాస్త్రి పాల్గొన్నారు.

ముగిసిన సతీష్ కస్టడీ

భవానీపురం: పిల్లల విక్రయం కేసులో నిందితుడు సతీష్ పోలీసుల కస్టడీ శనివారం ముగిసింది. పోలీసుల విచారణలో పలు కీలకమైన విషయాలను రాబట్టారు. గుజరాత్ రాష్ట్రం వడోదరకు సతీష్ శిశువులను తీసుకొచ్చి రూ. 30 వేలు చొప్పున హైదరాబాద్, విజయవాడలో విక్రయించినట్లు పోలీసులు తెలిపారు. కస్టడీ ముగిసిన తర్వాత తిరిగి జైలుకు పంపించారు.

పీజీ మెడికల్ యాజమాన్య సీట్లకు అర్హుల జాబితా విడుదల

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: నీట్ పీజీ మార్కులు తగ్గించిన నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల్లో పీజీ మెడికల్ డిగ్రీ/ డిప్లొమా కోర్సుల్లో యాజమాన్య సీట్ల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థుల జాబితాను తాజాగా విజయవాడ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు వెల్లడించారు. మొత్తం 948 మంది అభ్యర్థులతో కూడిన తాత్కాలిక ప్రాధాన్య క్రమాన్ని విశ్వవిద్యాలయం ప్రకటించింది. కొన్ని పత్రాలు జత చేయని అభ్యర్థులకు జాబితాలో చోటు కల్పించలేదని, అటువంటి వారు ఫిబ్రవరి మూడో తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోగా ఆన్‌లైన్‌లో సమర్పిస్తే పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

డీఎన్‌బీ కోర్సుకు ఆప్షన్ల నమోదు

2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డీఎన్‌బీ మూడేళ్ల ఎంబీబీఎస్ డిగ్రీ, పోస్టు ఎంబీబీఎస్ రెండేళ్ల కోర్సుకు సంబంధించి ఇన్ సర్వీస్ అభ్యర్థులు ఆప్షన్లు ఇచ్చుకోవాలని విశ్వవిద్యాలయం అధికారులు పేర్కొన్నారు. ఫిబ్రవరి రెండో తేదీ సాయంత్రం 4 గంటల నుంచి నాలుగో తేదీ మధ్యాహ్నం ఒంటి గంట లోగా ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

విజయవాడ డివిజన్‌లో రైల్వే జీఎం తనిఖీలు


తణుకులోని రైల్వే ట్రాక్‌ను పరిశీలిస్తున్న జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ. చిత్రంలో విజయవాడ డీఆర్‌ఎం మోహిత్ సోనాకియా

విజయవాడ (రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శనివారం విజయవాడ డీఆర్ఎంతో కలిసి డివిజన్‌లో తనిఖీలు చేశారు. తణుకు నుంచి ప్రారంభమైన ఈ తనిఖీల్లో లెవల్ క్రాసింగ్ గేట్లు, రైల్వే ట్రాక్ భద్రతను పరిశీలించారు. అనంతరం నర్సాపూర్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, సర్క్యులేటింగ్ ఏరియా, కోచ్ డిపో, యార్డును తనిఖీ చేశారు. అమృత్ స్టేషన్ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం భీమవరం యార్డ్ వద్ద ట్రాక్ నిర్వహణ, భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌ను సందర్శించి అక్కడి ప్రయాణికుల సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. ఆ తర్వాత లెవల్ క్రాసింగ్ గేట్, ఉప్పుటేరు వంతెన పరిశీలించారు. గుడివాడ రైల్వే స్టేషన్ సమీపంలోని ట్రాక్షన్ సబ్‌స్టేషన్. . ఇటీవల పునరుద్ధరించిన వెయిటింగ్ హాల్ తనిఖీ చేశారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ కార్యాలయం పరిశీలించి అమృత్ స్టేషన్ పనుల పురోగతిని సమీక్షిస్తూ, నిర్మాణ ప్రదేశంలో భద్రతను కట్టుదిట్టంగా ఉంచాలని నిర్ణిత వ్యవధిలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైల్వే అభివృద్ధి పనులపై స్థానిక ప్రజాప్రతినిధులు అందించిన వినతిపత్రాలు స్వీకరించారు.

అ'పూర్వ' జ్ఞాపకాలన్నీ ఒక్కచోట చేరి!

'ఏఎన్ఆర్' కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఏఎన్ఆర్ కాలేజ్ పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

హైదరాబాద్, న్యూస్‌టుడే: కాలం గడిచిపోయినా స్నేహ బంధం మాత్రం మరువలేనిది. ఒకప్పుడు ఒకే తరగతి గదిలో చదువుకున్న వారంతా దాదాపు 47 ఏళ్ల తర్వాత మళ్లీ కలుసుకోవడంతో హైదరాబాద్ ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కళకళలాడింది. గుడివాడ ఏఎన్ఆర్ కాలేజీలో 1977-79లో ఎంకాం బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 47 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులు, గత స్మృతులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తరగతి గదుల్లోని ఆనాటి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. చిన్ననాటి మధుర క్షణాలను, తీపి గుర్తులతో ఆనందంలో మునిగిపోయారు. ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ కాలేజీ రోజులు గుర్తొచ్చాయి... ఇది జీవితాంతం గుర్తుండే రోజు అని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. చివరగా అందరూ గ్రూప్ ఫొటోలు దిగుతూ 'మళ్లీ త్వరలో కలుద్దాం' అంటూ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏఎన్ఆర్ కాలేజీ వజ్రోత్సవాలను పురస్కరించుకుని కళాశాలలో గది నిర్మాణానికి రూ.5 లక్షలను పూర్వ విద్యార్థులు అందించారు.

☛ తమ జీవితాలకు దారి చూపిన పూర్వ అధ్యాపకుడు అబ్దుల్ షుకూర్, శంషాద్ బేగం దంపతులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. మీ బోధనలే మాకు బలం అంటూ పూర్వ విద్యార్థులు భావోద్వేగంతో మాట్లాడారు. తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారంటూ కొనియాడారు. గురువులు అందించిన బోధన, విలువైన సలహాలు, సూచనలు తాము స్థిరపడటానికి తోడ్పడ్డాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వాణి, సుధాకర్‌బాబు, శివాజీ, పట్టా, ఆదినారాయణరావు, స్వరూపరాణి, ప్రసాద్ రావు, ఎస్వీ చౌదరి, నాగేశ్వర్‌రావు, రామకృష్ణ, శ్యాంప్రసాద్, బాబ్జి, రామలింగం, లక్ష్మీసుశీల, సూర్యరావు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధోవికాసం



ప్రథమ స్థానంలో నిలిచిన కేబీఎన్ కళాశాల విద్యార్థినులు

గుడివాడ, న్యూస్‌టుడే: చదరంగం పోటీలు వ్యక్తి ఆలోచనాశక్తిని, మేధను పెంచుతాయని గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు లింగం రామకృష్ణ ప్రసాద్, సెక్రటరీ, కరస్పాండెంట్ కేఎస్.అప్పారావు పేర్కొన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల మహిళల చదరంగం పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీలను అప్పారావు, ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్.కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ పోటీల్లో కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని 8 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. విజయవాడ కేబీఎన్ కళాశాల విద్యార్థినులు ప్రథమ, ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీ కళాశాల విద్యార్థినులు ద్వితీయ, కానూరు ఎస్‌వీడీ లా కళాశాల విద్యార్థినులు తృతీయ స్థానాలను కైవసం చేసుకొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బీఎస్ఎస్.పద్మజ, వ్యాయామ అధ్యాపకుడు వీర్ల గోపి, కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళల చెస్ టోర్నమెంట్ సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ ఎన్.హేమ వెంకట లక్ష్మి, ఎం.సాంబశివరావు, డాక్టర్ పర్చూరి గోవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా ఏడుకొండలరావు


బాధ్యతలను డా.ఏడుకొండలరావుకు అప్పగిస్తున్న డా.ఏవీ రావు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్ డా.ఏవీ రావు శనివారం ఉద్యోగ విరమణ చేశారు. స్థానిక సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.ఏడుకొండలరావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సూపరింటెండెంట్ పేషీలో ఏవీ రావు బాధ్యతలను ఏడుకొండలరావుకు అప్పగించారు.

☛ డా. ఏవీ రావు తన సర్వీసులో ఎంతో మంది రోగులకు మెరుగైన సేవలు అందించారని, మత్తు వైద్యుడిగా అంకితభావంతో విధులు నిర్వహించారని పలువురు వైద్యులు కొనియాడారు. డా.ఏవీ రావుకు శనివారం ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన విశ్రాంత జీవితమంతా కుటుంబంతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు.

గుట్కా, పాన్‌మసాలా గోదాములపై దాడులు

రూ.50 లక్షలకు పైగా విలువైన సరకు పట్టివేత


భవానీపురంలోని గోదాములో పట్టుకున్న సరకుతో విజిలెన్స్, వాణిజ్య పన్నులశాఖ అధికారులు

ఈనాడు, అమరావతి: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని పాన్‌మసాల, గుట్కా ఉత్పత్తుల రహస్య గోదాములపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు ముమ్మరంగా శనివారం దాడులు చేశారు. రెండు జిల్లాల్లోని నాలుగు ప్రాంతాల్లో దాడులు చేసి రూ.50లక్షలకు పైగా విలువైన సరకును పట్టుకున్నారు. విజయవాడలోని గొల్లపూడి, మచిలీపట్నంలోని రెండు గోదాములు, బాపులపాడు.. ఈ నాలుగు ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేశారు. పట్టుకున్న సరకును రాష్ట్ర పన్నులశాఖ అధికారులకు అప్పగించారు. సరకుపై పన్నుతో పాటు జరిమానా, సెస్‌ను పన్నులశాఖ అధికారులు భారీగా వసూలు చేశారు. ఈ సరకును ఎక్కడెక్కడ పట్టుకున్నారో. . అక్కడి రాష్ట్ర పన్నులశాఖకు చెందిన అసిస్టెంట్ కమిషనర్ల(ఏసీ)లకు అప్పగించారు. పట్టుకున్న సరకులో.. పాన్ మసాలా, పొగాకు, జర్దా లాంటివి ఉన్నాయి. ☛ భవానీపురంలోని రామరాజ్యనగర్ సచివాలయానికి వెళ్లేదారిలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఓ గోదాములో అత్యధికంగా రూ.40లక్షలకు పైగా విలువైన సరకు దొరికింది. గొల్లపూడి పరిధిలో మరోచోట రూ.90వేల విలువైన సరకును పట్టుకుని అక్కడి ఏసీకి అప్పగించారు.

అంబటి రాంబాబును శిక్షించాలి: మంత్రి కొల్లు

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: 'వైకాపా నేత అంబటి రాంబాబు బరితెగించి ముఖ్యమంత్రి చంద్రబాబును పరుష పదజాలంతో దూషించడం హేయమైన చర్య. అంబటిని వెంటనే శిక్షించాలి. వైకాపా నేతలు మతి భ్రమించి నోటికి హద్దు లేకుండా దూషణలు చేస్తున్నారు. జగన్ మీటింగులు పెట్టి తమ పార్టీ నేతలను ఉసిగొల్పుతున్నారు. వీరు బయటకు వచ్చి రెచ్చిపోయి అడ్డూ అపు లేకుండా అసభ్య పదజాలంతో నోరు చింపుకోవడం సిగ్గు చేటు. జగన్ సతీమణిని అసభ్యంగా మాట్లాడినందుకు తెదేపా కార్యకర్తను అరెస్టు చేయించాం. మహిళలను కించపరిచేలా ప్రవర్తిస్తే సొంత పార్టీ వారినీ తెదేపా సహించదు. మాజీ మంత్రి అయి ఉండి సభ్య సమాజం సిగ్గుపడేలా పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబును పార్టీ నుంచి తొలగించాలి. ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకోవాలి' అని మంత్రి కొల్లు రవీంద్ర శనివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు.

క్షమాపణ చెప్పాల్సిందే: గద్దె అనురాధ

పటమట: వైకాపా నేత అంబటి వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ అన్నారు. బాధ్యతాయుత రాజకీయ నాయకుడిగా వ్యవహరించాల్సిన వ్యక్తి, స్థాయి లేని వ్యక్తిగత దూషణలకు దిగడం చూస్తే.. వైకాపా రాజకీయ సంస్కృతి ఎంత దిగజారిందో స్పష్టంగా అర్థమవుతోందని అన్నారు. అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలకు ఆయనే కాకుండా, వాటిని అడ్డుకోలేని వైకాపా అధినేత జగన్ కూడా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటమి అనేది ఓటర్ల తీర్పు అయితే, వైకాపా ఓటమి మాత్రం ఆ పార్టీ నాయకుల తప్పిదాలకు శిక్ష అని పేర్కొన్నారు.

పశ్చిమ బైపాస్‌పై రోడ్డు ప్రమాదం

● నుజ్జయిన కారు ● స్వల్పగాయాలతో బయటపడిన ప్రయాణికులు


ధ్వంసమైన కారు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ పశ్చిమ బైపాస్‌లో శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బాధితుల కథనం మేరకు.. డా. బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఉన్న భూమిని విక్రయించేందుకు హైదరాబాద్‌లో నివసిస్తున్న తాడి దుర్గారావు, శ్రీదేవి, సాయి మరో ఇద్దరు కారులో బయలుదేరారు. విజయవాడ పశ్చిమ బైపాస్‌లోని గన్నవరం సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం వీరి కారును ఢీకొట్టింది. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కాగా.. అందులో ప్రయాణిస్తున్న శ్రీదేవి, సాయి, దుర్గారావుకు స్వల్ప గాయాలయ్యాయి. వెనుక నుంచి లారీ ఢీకొట్టినట్లు బాధితులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

కరెంట్ అఫైర్స్



◆ అమెరికాలోని నేషనల్ కాంప్రహెన్సివ్ క్యాన్సర్ నెట్ వర్క్ (ఎన్‌సీసీఎన్) నూతన చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (ఈమె నియామకం 2026,ఫిబ్రవరి 26 నుంచి అమలులోకి వస్తుంది.)

జ: డాక్టర్ రేణుకా అయ్యర్

◆ అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం (ఐసీఏడీ – ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ డే)ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? (2025లో ఐసీఏఓ 80వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఐసీఏఓ అంటే అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ.)

జ: డిసెంబరు 7

మాదిరి ప్రశ్నలు

◆ చెక్ రిపబ్లిక్ నూతన ప్రధాన మంత్రిగా 2025, డిసెంబరులో ఎవరు ప్రమాణ స్వీకారం చేశారు?

జ: ఆంద్రేజ్ బాబిస్

◆ 2025కి టైమ్ మ్యాగజైన్ ఎవరిని 'పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా ప్రకటించింది?

జ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆర్కిటెక్ట్స్ (టైమ్ మ్యాగజైన్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ సంచిక ముఖ చిత్రాన్ని ఎనిమిది మంది ప్రఖ్యాత వ్యక్తులతో రూపొందించింది. వారు: మార్క్ జుకర్ బర్గ్ (మెటా సీఈఓ), లిసా సు (ఏఎండీ సీఈఓ), ఎలాన్ మస్క్ (టెస్లా సీఈఓ), జెన్సెన్ హువాంగ్ (ఎన్‌విడియా సీఈఓ), సామ్ ఆల్ట్‌మన్ (ఓపెన్ ఏఐ సీఈఓ), డెమిస్ హస్సాబిస్ (గూగుల్ డీప్‌మైండ్ సీఈఓ), డారియో అమోడీ (ఆంత్రోపిక్ సీఈఓ), ఫీ-ఫీ లి (వరల్డ్ ల్యాబ్స్ వ్యవస్థాపకుడు-ఏఐ మార్గదర్శకుడు).

మరింత సమాచారం

విచ్ఛిన్నమై.. దండయాత్రలకు లక్ష్యమై!

మధ్యయుగంలో దిల్లీ సుల్తానుల సామ్రాజ్యం తుగ్లక్ వంశ పాలన తర్వాత బలహీనమై వేగంగా పతనమైంది. ఈ దశలో భారతదేశంలో బలమైన అధికార కేంద్రం లేకపోవడం పెద్ద లోపంగా పరిణమించింది. లోడీ వంశ పాలనలో సుల్తాన్ అధికారం దిల్లీ, పంజాబ్ వరకే పరిమితమైంది. చుట్టుపక్కల అనేక అఫ్గాన్ ముస్లిం రాజ్యాలు స్వతంత్రంగా ఉండేవి. ఉత్తరాదిన రాజపుత్రులు, దక్షిణాదిన విజయనగర పాలకులు బలమైన హైందవ శక్తులుగా మిగిలారు. ఈ విధంగా ఉపఖండం అంతా చిన్న, స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయి చిన్నాభిన్నమైన క్రమంపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. రాజకీయ అస్థిరత, అంతర్గత కలహాలతో నిండిన భారత్, బాబర్ దండయాత్రకు సులభమైన లక్ష్యంగా మారిన తీరును, అందుకు దోహదపడిన పరిణామాలను అర్థం చేసుకోవాలి.

జనరల్ స్టడీస్ – ఇండియన్ హిస్టరీ

మొగల్ సామ్రాజ్య స్థాపనకు ముందు భారతదేశ రాజకీయ పరిస్థితులు



ఇబ్రహీం లోడీ

దిల్లీ సుల్తానుల్లో చివరిది లోడీ వంశం (క్రీ.శ.1415-1526). అప్పటికే సుల్తానుల రాజ్య ప్రతిష్ఠ మసకబారిపోయింది. తుగ్లక్ కాలం నాటి విశాల సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. మహమ్మద్ బిన్ తుగ్లక్ మరణానంతరం కేంద్ర ప్రభుత్వం బలహీనపడి అనేక స్వతంత్ర రాజ్యాలు వెలిశాయి. ఆ తర్వాత వచ్చిన సయ్యద్, లోడీ వంశ సుల్తానులు రాజ్య విచ్ఛిన్నాన్ని అరికట్టలేకపోయారు. తమ అసమర్థతతో, పరమత ద్వేషంతో, అహంకారపూరిత విధానాలతో విచ్ఛిన్నానికి మరింత దోహదం చేశారు. దిల్లీని పాలించిన చివరి సుల్తాను ఇబ్రహీం లోడీ (1517-26) అసమర్థుడు, బలహీనుడు. దాంతో రాజ్యంలో అనేక మంది గవర్నర్లు ఎదురుతిరిగారు. ముఖ్యంగా రాజపుత్ర కూటమికి నాయకత్వం వహిస్తున్న మేవాడ్ రాజు రాణా సంగ సహా పంజాబ్ రాష్ట్ర గవర్నర్లు ఇబ్రహీం లోడీపై యుద్ధాలు ప్రకటించారు. ఆ విధంగా భారతావనిలో పలువురు రాజుల మధ్య నెలకొన్న అనైక్యత, పరస్పర వైరుధ్యాలు బాబర్ భారతదేశ దండయాత్రకు అనుకూలించాయి. ఫలితంగా బాబర్ క్రీ.శ. 1526లో మొదటి పానిపట్టు యుద్ధంలో లోడీ వంశ చివరి పాలకుడు ఇబ్రహీం లోడీని ఓడించి, వధించి భారతదేశంలో మొగల్ రాజ్య స్థాపన చేశాడు. క్రీ.శ.16వ శతాబ్ది ప్రారంభంలో అంటే బాబర్ దండయాత్రకు కొద్దిగా ముందు కాలంలో భారత్ అనేక చిన్న చిన్న రాజ్యాలుగా విడిపోయింది. అవన్నీ అంతర్గత కలహాలతో, స్వార్థపర, సంకుచిత వైరుధ్యాలతో సతమతమవుతున్నాయి. చిన్నాభిన్నంగా ఉన్న ఆ రాజ్యాలను చరిత్రకారులు నాలుగు ముఖ్య మండలాలుగా విభజించారు. అవి ఎ) మొదటి మహమ్మదీయ మండలం బి) రెండో మహమ్మదీయ మండలం సి) మొదటి హిందూ మండలం డి) రెండో హిందూ మండలం.



మొదటి పానిపట్టు యుద్ధం (1526)

ఎ) మొదటి మహమ్మదీయ మండలం

మొదటి మహమ్మదీయ మండలం సింధూ నది ముఖద్వారం నుంచి బంగాళాఖాతం వరకు వ్యాపించింది. ఇందులో ముఖ్య రాజ్యాలు సింధ్, పంజాబ్, దిల్లీ, జౌన్‌పుర్, బిహార్, బెంగాల్.

1) సింధ్: మహమ్మద్ బిన్ తుగ్లక్ పరిపాలనానంతరం సూమ్రా వంశ పాలనలో సింధ్ స్వతంత్ర రాజ్యమైంది. క్రీ.శ.1520లో కాందహార్ పాలకుడైన షాబేగ్, సూమ్రా వంశీయులను ఓడించి సింధ్‌ను ఆక్రమించాడు. బాబర్ దండయాత్ర నాటికి సింధ్ పాలకుడు షాబేగ్ కుమారుడైన హుస్సేన్ షా.

2) పంజాబ్: దిల్లీ సుల్తానత్‌లోని ఒక రాష్ట్రం. దీని పాలకుడు దౌలత్ ఖాన్. ఇబ్రహీం లోడీకి బంధువు, బద్ధశత్రువు. ఇబ్రహీం క్రూర విధానాలతో విసుగెత్తి సుల్తాన్‌ను ధిక్కరించాడు. అతడిని పదవి నుంచి దించేందుకు పినతండ్రి ఆలం ఖాన్‌తో చేతులు కలిపాడు. బాబర్‌ను భారతదేశంపై దండెత్తి రావాలని ఆహ్వానించాడు.



దౌలత్ ఖాన్

3) దిల్లీ: సుల్తానత్ ఆఖరి వంశంలో సుల్తానులు వరుసగా బహులాల్ లోడీ, సికందర్ లోడీ, ఇబ్రహీం లోడీ. ఇబ్రహీం పాలన నాటికి దిల్లీ సుల్తానత్ అధికారం దిల్లీ, ఆగ్రా, అంతర్వేది, పంజాబ్ వరకే పరిమితమైంది. ఇబ్రహీం లోడీ క్రూర విధానాలతో, ప్రజావ్యతిరేక పాలనతో రాజ్యంలోని అన్ని వర్గాలకు విరోధిగా మారాడు.

4) జౌన్‌పుర్: హుస్సేన్ షా (1458-1500) కాలంలో బహులాల్ లోడీ జౌన్‌పుర్‌ను ఆక్రమించాడు. ఇబ్రహీం లోడీ సోదరుడు జలాల్ ఖాన్ లోడీ దాని పాలకుడు. ఇబ్రహీం అతడిని చంపించాడు. ఈ దుశ్చర్య సర్దారుల్లో తిరుగుబాటుకు కారణమైంది.

5) బెంగాల్: ఫిరోజ్ తుగ్లక్ కాలంలో స్వతంత్రమైన బెంగాలును హుస్సేన్ వంశీయులు పాలించారు. అల్లాఉద్దీన్ హుస్సేన్ కుమారుడైన నస్రత్ బెంగాల్ పాలకుడు, బాబర్‌కు సమకాలీకుడు. ఈయన తన రాజ్యాన్ని సమర్థంగా నిర్వహించడమే కాకుండా కవులు, పండితులను ఆదరించి సారస్వతాభివృద్ధికి కృషి చేశాడు. ఈ కాలంలో బెంగాలీ భాష అభివృద్ధి చెందింది. రామాయణ, మహాభారతాలు బెంగాలీ భాషలోకి అనువాదమయ్యాయి.

బి) రెండో మహమ్మదీయ మండలం

రెండో మహమ్మదీయ మండలంలో గుజరాత్, మాళ్వా, ఖాందేష్, బహమనీ అనే నాలుగు ముస్లిం రాజ్యాలు ఉన్నాయి.

1) గుజరాత్: క్రీ.శ.1401లో జాఫర్ ఖాన్ గుజరాత్‌లో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. బాబర్ దండయాత్ర సమయంలో రెండో ముజఫర్ షా (క్రీ.శ.1511-1526) గుజరాత్‌ను పరిపాలించేవాడు.

2) మాళ్వా: ఫిరోజ్ షా తుగ్లక్ కాలంలో స్వతంత్ర రాజ్యమైంది. దీనిని ఖిల్జీ వంశీయుడైన రెండో మహమ్మద్ పాలించాడు. క్రీ.శ.1531లో మాళ్వాను గుజరాత్ పాలకుడైన బహదూర్ షా జయించాడు.

3) ఖాందేష్: బాబర్ దండయాత్ర నాటికి ఖాందేష్‌ను మిరన్ మహమ్మద్ పాలించేవాడు. గుజరాత్ సుల్తానుకు, ఖాందేష్‌కు మధ్య తరచూ సంఘర్షణలు జరిగేవి.

4) బహమనీ రాజ్యం: మహమ్మద్ బిన్ తుగ్లక్ పాలనా కాలంలో క్రీ.శ.1347లో అల్లా ఉద్దీన్ బహమన్ షా అనే బిరుదుతో హసన్ గంగూ దక్షిణాపథాన బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. తర్వాత కాలంలో బహమనీ రాజ్యం అయిదు స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయింది.

సి) మొదటి హిందూ మండలం



చిత్తోడ్ కోట

మేవాడ్: రెండు మహమ్మదీయ మండలాలకు మధ్య ఉత్తర భారతదేశంలో మొదటి హిందూ మండలం ఉండేది. ఇందులో అనేక చిన్నచిన్న రాజపుత్ర రాజ్యాలు ఉన్నాయి. వీటిలో బలమైంది, సుప్రసిద్ధమైంది చిత్తోడ్ రాజధానిగా ఉన్న మేవాడ్ రాజ్యం. మేవాడ్ లేదా మేవార్ పాలకుడు రాణా సంగ్రామ్ సింగ్ చరిత్రలో శౌర్యప్రతాపాలకు మారుపేరు.

డి) రెండో హిందూ మండలం

ఇందులోని ప్రముఖ రాజ్యాలు - తుళువ వంశ పాలనలోని విజయనగర సామ్రాజ్యం, గజపతుల రాజ్యం.

1) విజయనగర సామ్రాజ్యం: క్రీ.శ.16వ శతాబ్దం పూర్వార్ధంలో తుళువ వంశానికి చెందిన శ్రీకృష్ణదేవరాయలు పాలిస్తున్నాడు..ఇతడు బాబర్‌కు సమకాలీకుడు.

2) ఒడిశా: ఒడిశా గజపతుల పాలనలో ఉండేది. దీనిని ప్రతాపరుద్ర గజపతి పాలించేవారు. బెంగాల్‌లోని ముస్లిం రాజ్యం దక్షిణంగా విస్తరించకుండా గజపతులు అడ్డుగా నిలిచారు.



రచయిత: వి.వి.ఎస్.రామావతారం

పదో తరగతి – తెలుగు – ఉపన్యాస కళ

1. ఉపన్యాసకళ పాఠ్యభాగ ప్రక్రియ గురించి రాయండి. (4 మార్కులు)

జ: ఏదైనా ఒక విషయాన్ని తీసుకుని దాని పూర్వాపరాలను చర్చిస్తూ, విశ్లేషణాత్మకంగా విస్తరించి రాసేదే వ్యాసం. ఇందులో ఉపోద్ఘాతం, విషయ విస్తరణ, ముగింపు ఉంటాయి. ఇవే వ్యాసానికి ప్రధానాంగాలు. వ్యాసంలోని విషయాన్ని బట్టి చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక, శాస్త్ర, వైజ్ఞానిక, సాహిత్య, తాత్విక, ఆధ్యాత్మిక మొదలైన విభాగాలుగా విభజించవచ్చు.

1. ఉపన్యాసంలో భాష ఎలా ఉంటే బాగుంటుంది? (8 మార్కులు)

జ: ఉపన్యాసంలో భాష సరళంగా, వ్యవహారిక భాషలో ఉండాలి. తన పాండిత్య ప్రకర్ష చూపించకూడదు. పెద్ద పెద్ద పదాలు వేసి శ్రోతల మెప్పును పొందాలనుకోవడం తప్పు. కొన్ని సభల్లో అలాంటి భాషకు విలువ ఉండొచ్చు. కానీ, బహిరంగ సభల్లో మాట్లాడేటప్పుడు ఎంత గొప్ప పండితుడైన సరళ వ్యవహారిక భాషనే ప్రయోగించాలి. శ్రోతలు మనం చెప్పేది వినాలని వస్తారు. కానీ, మన నుంచి భాష నేర్చుకోవడానికి సభలకు రారు. కొన్ని మాటలను కొత్తగా వేదిక ఎక్కినవారు జాగ్రత్తగా పలకాలి. ప్రసంగించడం అనబోయి ప్రసవించడం అనకూడదు. ఆవిష్కరించడానికి బదులుగా బహిష్కరించడం అనకూడదు. ఇలా భాష విషయంలో తగిన శ్రద్ధ చూపిస్తే, ఉపన్యాసకుడు అందరి మెప్పు పొందుతాడు.

ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2. కొత్తగా ఉపన్యాసం చేసిన వ్యక్తి ఇంటికి వచ్చాక తనను తాను ప్రశ్నించుకోవాల్సిన అంశాలు ఏమిటి?

జ: మంచి వక్తగా ఎదగాలంటే కొత్తగా ఉపన్యాసం ఇచ్చిన వ్యక్తి కూడా ఇంటికి వచ్చాక తనని తాను ఆత్మ పరిశీలన చేసుకోవాలి. తను వేదికపై ఎలా ప్రవర్తించాడో గ్రహించాలి. బిగిసిపోయి కూర్చున్నానా? లేదా మామూలుగానే ఉన్నానా? అనే విషయాన్ని పరిశీలించుకోవాలి. తన గొంతు మైకుకు సరిగా సరిపోయేలా చూసుకున్నాడో లేదో అవగాహన చేసుకోవాలి. శ్రోతల మధ్య ఏర్పడాల్సిన స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టించగలిగాడో లేదో పరిశీలించుకోవాలి. సమయానికి ఉపన్యాసాన్ని ముగించాడా? లేదా ముందే ముగించాడా.. ఆలోచించుకోవాలి. అంశాలన్నింటిని ఉపన్యాసంలో చెప్పగలిగాడో లేదో కూడా పరిశీలించుకోవాలి. ముఖ్యమైన విషయాలను ఎందుకు మరిచిపోయాడో పరిశీలించుకోవాలి. మాట్లాడుతున్నప్పుడు శ్రోతలు శ్రద్ధగా వింటున్నారా లేదా గమనించాలి. ఉపన్యాసాన్ని ముందే ముగించి బతుకు జీవుడా అన్నట్లు కుర్చీలో కులబడ్డాడో లేదో గమనించుకోవాలి. శ్రోతలు అవగాహనకు గురై తాను మధ్యలో ఉపన్యాసం ముగించాడో లేదో గుర్తించాలి. ఇలా తన లోపాలను తానే పరిశీలించుకుని సవరించుకుంటే అత్యద్భుతమైన వక్తగా రాణించవచ్చు.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

జీవుల్లో ప్రాథమిక శక్తి జనకాలు!

శరీరానికి కావాల్సిన ప్రాథమిక పిండి పదార్థాలు, ప్రధాన శక్తివనరులే కార్బోహైడ్రేట్‌లు. ఇవి తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు తదితర ఆహార పదార్థాల్లో పుష్కలంగా ఉంటాయి. రోజువారీ పనులకు అవసరమైన గ్లూకోజ్‌ను అందిస్తాయి. తక్షణ శక్తిని ఇస్తూ, మెదడు, కండరాలు పని చేయడానికి సాయపడే ఈ స్థూల పోషకాల్లోని రకాలు, అవి లభ్యయ్యే తీరుపై పోటీ పరీక్షార్థులు ప్రాథమిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలి. దాంతోపాటు కార్బోహైడ్రేట్ల కణ నిర్మాణాన్ని, వాణిజ్య ప్రయోజనాలను, పారిశ్రామికంగా వాటి సంగ్రహణ పద్ధతులనూ తెలుసుకోవాలి.





జనరల్ స్టడీస్ - బయాలజీ

కార్బోహైడ్రేట్‌లు

1. కార్బోహైడ్రేట్‌ల గురించి కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   - ఎ) ఇవి స్థూల పోషక పదార్థాలకు ఉదాహరణ.
   - బి) వీటిని రోజుకు కిలో లేదా కొన్ని గ్రాముల్లో ఆహారంగా తీసుకుంటారు.
   - సి) ఇవి అన్ని జీవులకు శక్తి కోసం ఉపయోగపడతాయి.
   - డి) ఇవి కార్బన్, హైడ్రోజన్, ఆక్సిజన్ పరమాణువులతో నిర్మితమవుతాయి.
   - 1) ఎ, బి, సి, డి 2) ఎ, బి 3) బి, సి 4) ఎ, డి
2. కింది వాటిలో సరికాని వాక్యాలను గుర్తించండి.
   - ఎ) కార్బోహైడ్రేట్‌లు మన శరీరంలో నిల్వ ఉండవు.
   - బి) మొక్కల్లో కార్బోహైడ్రేట్‌లు సెల్యులోజ్ రూపంలో నిల్వ ఉంటాయి.
   - సి) గ్లూకోజ్ నేరుగా శ్వాసక్రియలో వినియోగమవుతుంది.
   - డి) జీవుల ప్రాథమిక శక్తి జనకాలు కార్బోహైడ్రేట్‌లు
   - 1) ఎ, బి, సి 2) ఎ, బి 3) బి, సి 4) సి, డి
3. కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.

ఎ) సెల్యులోజ్	1) జంతువుల్లో పిండిపదార్థం
బి) గ్లైకోజెన్	2) భూమిపై ఎక్కువగా ఉండే సేంద్రియ పదార్థం
సి) పిండిపదార్థం	3) కేంద్రకామ్లాల్లో ఉంటుంది
డి) గ్లూకోజ్ చక్కెర	4) మొక్కల్లో నిల్వ ఉండే కార్బోహైడ్రేట్
ఇ) రైబోజ్ చక్కెర	5) హెక్సోస్ చక్కెర

   1) ఎ-4, బి-3, సి-2, డి-1, ఇ-5
   2) ఎ-2, బి-4, సి-3, డి-1, ఇ-5
   3) ఎ-2, బి-1, సి-4, డి-5, ఇ-3
   4) ఎ-4, బి-5, సి-2, డి-3, ఇ-1

4. కింది వాటిలో సరికాని జతలు?
   - ఎ) గ్లూకోజ్ - రక్తంలోని చక్కెర అంటారు
   - బి) లాక్టోజ్ - అతి తియ్యటి చక్కెర
   - సి) డీ ఆక్సిరైబోజ్ చక్కెర - ఆర్ఎన్ఏలో ఉంటుంది
   - డి) పాలలో ఉండే చక్కెర - లాక్టోజ్
   - 1) ఎ, బి, సి 2) బి, సి 3) సి, డి 4) బి, డి



5. కార్బోహైడ్రేట్‌లకు సంబంధించి కింది వాక్యాలను పరిశీలించి, సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   - ఎ) కార్బోహైడ్రేట్‌లు... ధాన్యాలు, పండ్లు, కూరగాయల ద్వారా లభిస్తాయి.
   - బి) జంతువుల్లో ఉన్న కార్బోహైడ్రేట్‌లు మొక్కల్లో కూడా ఉంటాయి.
   - సి) మొక్కల్లో ఉన్న అన్నిరకాల కార్బోహైడ్రేట్‌లు జంతువుల్లో కూడా ఉంటాయి.
   - డి) పిండిపదార్థం కార్బోహైడ్రేట్‌కు ఉదాహరణ.
   - 1) ఎ, బి, డి 2) బి, సి, డి 3) ఎ, డి 4) సి, డి
6. కింది వాక్యాల ఆధారంగా సరైన సమాధానాన్ని ఎన్నుకోండి.
   - ఎ) మోనోశాఖరైడ్‌లలో ఒకే చక్కెర పరమాణువు ఉంటుంది.
   - బి) గ్లూకోజ్‌ను తక్షణ శక్తినిచ్చే చక్కెర అంటారు.
   - 1) ఎ, బి సరికావు. 2) ఎ సరైంది బి సరికాదు 3) బి సరైంది, ఎ సరికాదు 4) ఎ, బి సరైనవి
7. కింది జతల్లో సరికానివి?
   - ఎ) ఫ్రక్టోజ్ - అతి తియ్యనైన చక్కెర.
   - బి) గ్లూకోజ్ - క్రీడాకారులు వ్యాయామం తర్వాత తీసుకునే చక్కెర.
   - సి) రైబోజ్ చక్కెర - 6 కర్బన పరమాణువులతో ఉంటుంది.
   - డి) గాలక్టోజ్ చక్కెర - చెరకు రసంలో ఉంటుంది.
   - 1) బి, డి 2) బి, సి, డి 3) ఎ, బి 4) సి, డి
8. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   - ఎ) ఒకే చక్కెర అణువు ఉండే కార్బోహైడ్రేట్‌లను 'మోనోశాఖరైడ్‌లు' అంటారు.
   - బి) రెండు నుంచి పది చక్కెర అణువులున్న కార్బోహైడ్రేట్‌లను 'ఒలిగోశాఖరైడ్‌లు' అంటారు.
   - సి) అనేక చక్కెర అణువులున్న కార్బోహైడ్రేట్‌లను 'పాలిశాఖరైడ్‌లు' అంటారు.
   - డి) మాల్టోజ్ చక్కెర డైశాఖరైడ్ కార్బోహైడ్రేట్‌కు ఉదాహరణ.
   - 1) ఎ, బి, సి 2) ఎ, బి, సి, డి 3) సి, డి 4) ఎ, డి
9. కింది వాటిని జతపరచండి.

ఎ) ఫ్రక్టోజ్	1) మొక్కల కణకవచాల్లో ఉంటుంది
బి) గాలక్టోజ్	2) ఆర్ఎన్ఏలో ఉంటుంది
సి) రైబోస్ చక్కెర	3) అతి తియ్యనైన చక్కెర
డి) సుక్రోజ్ చక్కెర	4) లాక్టోజ్ చక్కెరలో భాగంగా ఉంటుంది
ఇ) సెల్యులోజ్	5) పంచదార

   1) ఎ-3, బి-4, సి-2, డి-5, ఇ-1
   2) ఎ-1, బి-2, సి-4, డి-3, ఇ-5
   3) ఎ-5, బి-3, సి-2, డి-1, ఇ-4
   4) ఎ-3, బి-5, సి-4, డి-2, ఇ-1

10. సుక్రోజ్ చక్కెరకు సంబంధించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
    - ఎ) దీనిలో రెండు చక్కెర పరమాణువులు ఉంటాయి.
    - బి) ఇది గ్లూకోజ్, ఫ్రక్టోజ్ చక్కెరల కలయిక.
    - సి) దీన్ని వాణిజ్య పరంగా చెరకు రసం నుంచి తయారుచేస్తారు.
    - డి) పంచదార రసాయనిక నామం సుక్రోజ్.
    - ఇ) దీన్ని కేన్ షుగర్, బీట్ షుగర్ అంటారు.
    - 1) ఎ, బి, సి, డి, ఇ 2) బి, సి, డి 3) సి, డి, ఇ 4) ఎ, డి, ఇ
11. కింది వాటిని సరైన క్రమంలో అమర్చండి.

ఎ) మాల్టోజ్ చక్కెర	1) ఫ్రక్టోజ్, గ్లూకోజ్ గాలక్టోజ్‌ల కలయిక
బి) లాక్టోజ్ చక్కెర	2) గ్లూకోజ్, గ్లూకోజ్‌ల కలయిక
సి) సుక్రోజ్ చక్కెర	3) గ్లూకోజ్, గాలక్టోజ్‌ల కలయిక
డి) రాఫినోజ్ చక్కెర	4) గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌ల కలయిక

    1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-2, బి-3, సి-4, డి-1 3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-3, బి-2, సి-1, డి-4

12. పిండి పదార్థం గురించి కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
    - ఎ) ఇది పాలిశాఖరైడ్ కార్బోహైడ్రేట్‌కు ఉదాహరణ.
    - బి) ధాన్యాలు, దుంపలు, విత్తనాల్లో నిల్వ ఉంటుంది.
    - సి) మొక్కల్లో నిల్వ ఉండే కార్బోహైడ్రేట్.
    - డి) మన జీర్ణవ్యవస్థలో చివరకు ఇది గ్లూకోజ్‌గా మారుతుంది.
    - 1) ఎ, బి 2) బి, సి 3) సి, డి 4) ఎ, బి, సి, డి



13. కింది వాక్యాలను పరిశీలించి సరైన సమాధానాన్ని గుర్తించండి.
    - ఎ) గ్లైకోజెన్‌ను 'ఎనిమల్ స్టార్చ్' అంటారు.
    - బి) మొక్కల కణకవచాల్లో ఉండే పాలిశాఖరైడ్ సెల్యులోజ్.
    - 1) ఎ సరైంది, బి సరికాదు. 2) బి సరైంది, ఎ సరికాదు. 3) ఎ, బి సరైనవి. 4) ఎ, బి సరికావు.
14. కింది వాటిని జతపరచండి.

చక్కెర రకం	ఉండే పదార్థం
ఎ) మాల్టోజ్	1) పాలు
బి) లాక్టోజ్	2) మాల్ట్స్
సి) సుక్రోజ్	3) పత్తి విత్తనాలు
డి) రాఫినోజ్	4) చెరకు



    1) ఎ-2, బి-1, సి-4, డి-3 2) ఎ-4, బి-2, సి-1, డి-3 3) ఎ-1, బి-4, సి-3, డి-2 4) ఎ-3, బి-2, సి-1, డి-4

15. అగార్ గురించి కింది వాక్యాల్లో సరైనవి ఏవి?
    - ఎ) ఇది హెటిరో పాలిశాఖరైడ్‌కు ఉదాహరణ.
    - బి) దీన్ని సముద్ర శైవలాల నుంచి వేరుచేస్తారు.
    - సి) వేడి నీటిలో కరుగుతుంది.
    - డి) దీన్ని జామ్స్, జెల్లీస్ తయారీలో వాడతారు.
    - 1) ఎ, సి 2) బి, సి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
16. గ్లైకోజెన్ గురించి కింది వాక్యాల్లో సరికాని వాటిని గుర్తించండి.
    - ఎ) దీన్ని జంతువుల పిండిపదార్థం అంటారు.
    - బి) ఇది నేరుగా శ్వాసక్రియలో ఉపయోగపడుతుంది.
    - సి) మన శరీరంలో ఇది కాలేయం, కండరాల్లో నిల్వ ఉంటుంది.
    - డి) ఫ్రక్టోజ్‌గా మారి నిల్వ ఉంటుంది.
    - 1) బి, డి 2) బి, సి 3) సి, డి 4) ఎ, డి
17. హెటిరో పాలిశాఖరైడ్‌ల గురించి కింది వాక్యాలను పరిశీలించి, సరైన క్రమంలో అమర్చండి.
    - ఎ) కణజాలవర్ధనంలో యానకాన్ని ఘనస్థితికి తేవడానికి అగార్‌ను వాడతారు.
    - బి) గమ్ అరాబిక్‌ను ఔషధ రంగంలో వినియోగిస్తున్నారు.
    - 1) ఎ, బి సరికావు. 2) ఎ, బి సరైనవి. 3) ఎ సరైంది, బి సరికాదు. 4) ఎ సరికాదు, బి సరైంది.
18. కింది జతలను సరైన క్రమంలో అమర్చండి.

ఎ) ఇన్సులిన్	1) మొక్కల బెరడు నుంచి సంగ్రహిస్తారు.
బి) అగార్	2) కీటకాల బాహ్య అస్థిపంజరంలో ఉంటుంది.
సి) గమ్ అరాబిక్	3) డాహ్లియా మొక్కల వేర్లలో ఉంటుంది.
డి) పెక్టిన్	4) నిమ్మజాతి ఫలాల గుజ్జులో ఉంటుంది.
ఇ) కైటిన్	5) జిలేడియం, గ్రాసిలేరియా శైవలాల నుంచి లభిస్తుంది.

    1) ఎ-2, బి-3, సి-4, డి-1, ఇ-5
    2) ఎ-5, బి-4, సి-2, డి-3, ఇ-1
    3) ఎ-3, బి-5, సి-1, డి-4, ఇ-2
    4) ఎ-5, బి-1, సి-2, డి-3, ఇ-4

19. సెల్యులోజ్‌కు సంబంధించిన కింది వాక్యాల్లో సరైన వాటిని గుర్తించండి.
    - ఎ) ఇది మానవుడి జీర్ణవ్యవస్థలో జీర్ణం కాదు.
    - బి) వృక్ష రాజ్యంలో అత్యధికంగా ఉండే పాలిశాఖరైడ్.
    - సి) పత్తి పోగులు, జనపనారలో ఎక్కువ సెల్యులోజ్ ఉంటుంది.
    - డి) ఇది పాలిశాఖరైడ్ కార్బోహైడ్రేట్‌కు ఉదాహరణ.
    - 1) ఎ, బి, సి, డి 2) సి, డి 3) ఎ, డి 4) బి, సి
20. కింది వాటిలో సరైన కార్బోహైడ్రేట్‌ను గుర్తించండి.
    - ఎ) జెన్షియానోజ్ ట్రైశాఖరైడ్
    - బి) మాల్టోజ్ డైశాఖరైడ్
    - సి) గ్లూకోజ్ మోనోశాఖరైడ్
    - డి) ఇన్సులిన్ పాలిశాఖరైడ్
    - 1) ఎ, బి, సి 2) బి, సి, డి 3) సి, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు

1-1, 2-2, 3-3, 4-2, 5-3, 6-4, 7-4, 8-2, 9-1, 10-1, 11-2, 12-4, 13-3, 14-1, 15-4, 16-1, 17-2, 18-3, 19-1, 20-4.

వసుంధర

vasundhara@eenadu.in

సాధించాలనే తపనకు శ్రమ, సహనం తోడైతే విజయం తప్పక వరిస్తుంది. అందుకు ఈ యువతులే ఉదాహరణ. ప్రతికూల పరిస్థితులను అధిగమించారు. తాజాగా ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల ఫలితాల్లో సత్తా చాటారు. తమ కలల కొలువుల్ని సాధించారు. వారేం చెబుతున్నారంటే...

గ్రూప్-1లో మెరిశారు!

నాన్న కల నెరవేరుస్తా... - వుస్సే లేఖన



నాలుగో తరగతి చదువుతున్నప్పుడు కలెక్టర్‌ని మొదటి సారి చూశా. ఆయనకు ప్రజల్లో ఉన్న గౌరవం, ఆ హోదా నన్నెంతగానో ఆకట్టుకున్నాయి. నాన్న కూడా పదిమందికీ మంచి చేయాలంటే కలెక్టర్ అవ్వాలని చెప్పిన మాటలు నాలో బలంగా నాటుకున్నాయి. దాంతో ఎప్పటికైనా ఐఏఎస్ కావాలనుకున్నా. మాది తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి. అమ్మా నాన్నలిద్దరూ ఉపాధ్యాయులు. నాకో చెల్లి. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవాలన్న ఆలోచనతో ఐఐటీ చెన్నైలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశా. ఆపై దిల్లీలోని మాస్టర్ కార్డ్‌లో రూ. 50 లక్షల ప్యాకేజీతో సీనియర్ డేటా సైంటిస్ట్‌గా ఎంపికయ్యా. మంచి ఉద్యోగం, ఏడంకెల జీతం. కానీ, అవి నాకు సంతృప్తినివ్వలేదు. నా లక్ష్యం ఇది కాదు. దాంతో ఉద్యోగం చేస్తూనే మరో పక్క గ్రూప్-1 పరీక్షకు సిద్ధమవడం ఆరంభించా. 2024లో ఇంటర్వ్యూ వరకు వెళ్లినా ఉద్యోగం రాలేదు. ఈసారి లోపాలను సరిదిద్దుకుంటూ ముందుకెళ్లా. తాజాగా విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో వాణిజ్య పన్నుల శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికయ్యా. రానున్న రోజుల్లో నిరుపేద విద్యార్థులకు నా వంతు సాయం చేసి ఉన్నత చదువులవైపు నడిపిస్తాను. సివిల్స్ కలనీ సాధిస్తా.

– చిటికిన వెంకటకృష్ణ, దేవరపల్లి

ఉద్యోగం చేస్తూనే సాధన చేశా... - పెనల ప్రియంవద



మాది నంద్యాల జిల్లా ఆత్మకూరు. అమ్మానాన్నలు హరిబాబు, లక్ష్మీదేవి కిరాణా దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని నడిపేవారు. నన్ను కలెక్టర్‌గా చూడాలన్నది నాన్న కల. అందు కోసం నన్ను హైదరాబాద్‌కు పంపించారు. ఇంటర్, డిగ్రీతోపాటే సివిల్స్‌కు శిక్షణ ఇచ్చే ఓ కార్పొరేట్ కళాశాలలో చేర్పించారు. డిగ్రీ పూర్తయ్యాక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంబీఏ చేశా. ప్రాంగణ నియామకాల్లో ఓ ప్రైవేట్ బ్యాంకులో మంచి ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది... కానీ కాదనుకున్నా. ఈలోగా నన్ను కలెక్టర్‌గా చూడాలనుకున్న నాన్న... ఆ కల నెరవేరకుండానే కొవిడ్ కారణంగా మాకు దూరమయ్యారు. ఎలాగైనా నాన్న ఆశయాన్ని నెరవేర్చాలనుకున్నా. అందుకే, మరెన్నో మంచి ఉద్యోగాలు వచ్చినా వదులుకున్నా. ఈ ప్రయాణంలో సివిల్స్, గ్రూప్స్ పరీక్షల్లో పలుమార్లు వైఫల్యాలు ఎదుర్కొన్నా. అయినా వెనకడుగు వేయలేదు. ఈ ప్రయత్నాల్లో ఉండగానే కేంద్ర మంత్రిత్వ శాఖలో ఉద్యోగాన్ని అందుకున్నా. విధులు నిర్వర్తిస్తూనే మరో పక్క గ్రూప్-1 పరీక్ష రాసి... డెప్యూటీ కలెక్టర్ పోస్టును సాధించా. ఈ ఉద్యోగంతో నా తండ్రి కోరుకున్న విధంగా భవిష్యత్తులో కలెక్టర్‌గా మారే అవకాశం కూడా దక్కినట్లైంది. నా తండ్రి సంకల్పం కొంతవరకు నెరవేర్చానన్న తృప్తి ఉన్నప్పటికీ ఆ విజయాన్ని పంచుకునేందుకు ఆయన లేకపోవడం నాకు ఒకింత బాధగా ఉంది. ఈ ప్రయాణంలో పెద్దనాన్న, పెద్దమ్మల ప్రోత్సాహమూ ఎంతో.

– బి.ఎస్.రామకృష్ణ, కర్నూలు

పట్టుబట్టారు.. సాధించారు - ద్రోణంరాజు శ్రీరమణి

జీవితం అనేది గమ్యం కాదు... గమనం మాత్రమే. అందుకే, ఎన్నిసార్లు ఓడినా గెలవడానికి మరో అవకాశం ఉంటుంది. ఆ నమ్మకమే నన్ను విజేతగా నిలిపింది. మాది నిడదవోలు మండలం డి. ముప్పవరం. సాధారణ మధ్యతరగతి కుటుంబం. నాన్న నరసింహారావు ప్రైవేటు ఉద్యోగి. అమ్మ సుధ. వాళ్లకి నేనొక్కదాన్నే సంతానం. నన్ను బాగా చదివించి స్థిరపడేలా చేయాలని వాళ్ల కోరిక.



దాన్ని అర్థం చేసుకుని చిన్నప్పటి నుంచీ ప్రణాళికాబద్ధంగా చదవడం ఆరంభించా. దాంతో స్కూల్, కాలేజీల్లో నేనే టాపర్‌ని. అయితే, ఎంత చదివినా మంచి ఉద్యోగం సాధించినప్పుడే సార్థకత. అందుకే, ప్రభుత్వోద్యోగం సాధించాలనే గోల్ పెట్టుకున్నా. చదువయ్యాక ఏడాదిపాటు హైదరాబాద్‌లో సివిల్స్ శిక్షణ తీసుకున్నా. సివిల్స్, గ్రూప్స్ పరీక్షలు రాసినా విఫలమయ్యా. నాతో చదువుకున్న వాళ్లంతా వివిధ స్థాయుల్లో స్థిరపడ్డారు. నేనెందుకు ఇంకా అమ్మానాన్నల మీద ఆధారపడాలి అన్న భావన నాలో కసిని పుట్టించింది. దాంతో ఈసారి ఇంటి వద్దే ఉండి గ్రూప్స్‌కి ప్రిపేరయ్యా. నా తప్పులను సరిదిద్దుకుంటూ ప్రణాళికాబద్ధంగా రోజుకి 7 నుంచి 8 గంటలు చదివా. ఈ ప్రయత్నం ఫలించింది. తాజాగా గ్రూప్-1 ఫలితాల్లో పన్నుల శాఖ సహాయ కమిషనర్‌గా ఎంపికయ్యా.

– బనిశెట్టి మోహన రావు, రాజమహేంద్రవరం

లక్ష్యం తెలిస్తే.. సాధించడం తేలికే - పొలిశెట్టి రిషిత



మనం ఎంత త్వరగా లక్ష్యం నిర్ణయించుకోగలిగితే అంతే వేగంగా దాన్ని సాధించడం తేలికవుతుంది. మా స్వస్థలం గుంటూరు జిల్లా మంగళగిరి. నాన్న కమల కిషోర్ విజయవాడ నగరపాలక సంస్థలో బిల్‌కలెక్టర్. అమ్మ రోజారాణి. అమ్మకి సివిల్స్ రాయాలని ఉండేదట. కానీ కుటుంబ పరిస్థితుల దృష్ట్యా సాధ్యం కాలేదు. నన్ను ఆ దిశగా ప్రోత్సహించింది. నా లక్ష్యం ఏంటో తెలుసు కాబట్టి, తగ్గట్టుగానే సబ్జెక్టులూ ఎంచుకున్నా. హిస్టరీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జాగ్రఫీ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేశా. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ తమిళనాడులో జాగ్రఫీలో పీజీ పూర్తిచేశా. తరవాత కొవిడ్ సమయంలో కొంత విరామం తీసుకుని, ఆపై సన్నద్ధత మొదలుపెట్టా. యూపీఎస్సీ మూడుసార్లు విఫలమయ్యా. ఈ క్రమంలో గ్రూప్స్‌నీ ప్రయత్నించా. అక్కడా తొలిసారి వైఫల్యమే. అయినా తిరిగి ప్రయత్నించా. గ్రూప్-1 రాష్ట్ర పన్నుల శాఖలో అసిస్టెంట్ కమిషనర్ కొలువుతోపాటు గ్రూప్-2లో లేబర్ ఆఫీసర్‌గానూ ఎంపికయ్యా. మూడేళ్లపాటు రోజుకు ఆరేడు గంటలు చదువుతూ సిద్ధమయ్యా. అయితే ఇంటర్, డిగ్రీ నుంచే స్పష్టమైన లక్ష్యంతో ఉండటం వల్లే నా ప్రయాణం కాస్త సులువైంది అనిపిస్తుంది. అమ్మ ప్రోత్సాహమూ సివిల్స్ శిక్షణా కలిసొచ్చాయి. ఇంతటితో ఆగాలని లేదు. యూపీఎస్సీకి ఇంకా అవకాశాలున్నాయి. ఈ విజయం ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో దాన్ని మళ్లీ ప్రయత్నిస్తా.

– మరిశర్ల జగదీష్‌కుమార్, అమరావతి

అమ్మానాన్నల కష్టానికి ప్రతిఫలం..! - జి. దివ్యశ్రీ



సమాజంలో గౌరవం పొందాలి... ప్రజలకు సేవ చేయాలి... ఈ రెండూ ప్రభుత్వ కొలువుతోనే సాధ్యమవుతుంది అనేది నా నమ్మకం. మాది ఉమ్మడి అనంతపురం జిల్లాలోని గోరంట్ల మండలం వానవోలు గ్రామం. నాకో అన్నయ్య... తను కెనడాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. అమ్మానాన్నలు రంగనాథం, కృష్ణమ్మ. మమ్మల్ని ఉన్నత స్థానాల్లో చూడాలని కలలు కన్నారు. నా చిన్నప్పుడు నాన్న వ్యవసాయం చేసేవారు. సాగు నష్టాలతో ఇల్లు గడవడం ఇబ్బంది కావడంతో మా కుటుంబం అనంతపురం వచ్చేసింది. నాన్న చిన్న ఉద్యోగంలో చేరారు. మాకోసం ఎన్నో కష్టాలపడ్డారు. పది అనంతపురంలో, ఇంటర్ విజయవాడలో చదివా. ఆపై హైదరాబాద్ అకాడమీలో బీఏతోపాటు ఐఏఎస్ కోచింగ్ తీసుకున్నా. రెండుసార్లు సివిల్స్‌లో, ఒకసారి గ్రూప్-1లో విఫలమయ్యా. అయినా నా ప్రయత్నం ఆపలేదు. చేసిన తప్పులు మళ్లీ జరగకుండా మరోసారి ప్రణాళిక వేసుకున్నా. రోజూ ఆంగ్ల దినపత్రికతోపాటు ఈనాడు ప్రతిభలో వచ్చే కరెంట్ అఫైర్స్ చదివేదాన్ని. వీటితోపాటు గతంలో జరిగిన పరీక్షా పేపర్ల రివిజన్ చేసుకుంటూ రోజుకు 12 గంటలు చదివేదాన్ని. అలా తాజా గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికయ్యా. గ్రామీణుల కష్టాలేంటో నాకు తెలుసు. విధుల్లో చేరాక ప్రజలకు సేవలు అందించాలి ఇదే ప్రస్తుతం నా ముందున్న లక్ష్యం.

– ఆర్ఏఎన్ ప్రసాద్, గోరంట్ల


బామ్మ చిట్కా



నూనె, నెయ్యి డబ్బాలు, పాత్రలు కడగడం పెద్ద సమస్యే కదూ! ఓ పట్టాన జిడ్డే వదలదు. ఈసారి కొంత కళ్లుప్పుకి సర్ఫ్ లేదా పాత్రలు కడగడానికి మీరు వాడే సబ్బు లేదా లిక్విడ్ చేర్చి రుద్దండి. ఆపై నీటితో మామూలుగా కడిగేయడమే. జిడ్డు ఒక్కసారికే పూర్తిగా వదులుతుంది.

సులువుగా వర్కవుట్ చేయొచ్చు!

మహిళల ఫిట్‌నెస్ ప్రపంచంలో పిలాటీస్‌ది ప్రత్యేక స్థానం. హై-ఇంపాక్ట్ వ్యాయామాలు చేయక్కర్లేకుండానే కండరాలు దృఢంగా మారతాయి. చక్కటి శరీరాకృతి సొంతమవుతుంది. ఇప్పుడు ఇందులోనే కొత్తగా వచ్చిన ట్రెండ్ రిఫార్మర్ పిలాటీస్. రిఫార్మర్ బెడ్ (ప్రత్యేక మెషీన్) మీద ఈ వర్కవుట్ చేస్తారు. ఈ మెషీన్‌లో స్ప్రింగ్స్, స్ట్రాప్స్, మూవబుల్ క్యారేజ్ వంటివి ఉంటాయి. ఇవి తగిన రెసిస్టెన్స్‌ను అందించి, కండరాలను స్ట్రెచ్ చేస్తూ బలాన్ని పెంచుతాయి. ముఖ్యంగా పొత్తికడుపు కండరాలు దీనివల్ల బలోపేతం అవుతాయి. కీళ్లపై తక్కువ ఒత్తిడి ఉండి... సౌకర్యంగా కదలగలుగుతారు. గాయాల బారిన పడే ప్రమాదమూ తక్కువే. ఫలితంగా ఎముకల ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు హార్మోన్లు సమతుల్యం అవుతాయి. ఒత్తిడి, ఆందోళనల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఈ కసరత్తులతో అతిగా డైట్స్, హెవీ వెయిట్స్‌పై ఆధారపడాల్సిన అవసరం లేకుండానే దీర్ఘకాలంలో మంచి ఫలితం అందుకోవచ్చు.



మందులు వాడుతున్నా జుట్టు రాలుతుంది!

వయసు 30 ఏళ్లు. నాకు ప్రసవమై 3 ఏళ్లు దాటింది. ఇప్పుడెందుకో జుట్టు విపరీతంగా ఊడుతోంది. డెర్మటాలజిస్ట్ దగ్గరకి వెళ్తే కొన్ని లోషన్స్, సీరమ్స్ రాసిచ్చారు. అప్పటి నుంచి సమస్య మరింత పెరిగింది. ఎందుకిలా? – ఓ సోదరి

అకస్మాత్తుగా జుట్టు ఎక్కువ రాలిపోవడానికి చాలా కారణాలు ఉండొచ్చు. ప్రసవమైన మూడేళ్ల తర్వాత ఈ సమస్య వచ్చిందంటున్నారు. అయితే, ఇది గర్భధారణ, ప్రసవం...వంటి వాటి వల్ల కాకపోయి ఉండొచ్చు. మీకు నెలసరి సక్రమంగా వస్తుందా? పీసీఓఎస్, థైరాయిడ్... వంటి ఇతర హార్మోన్ సంబంధిత సమస్యలు ఏమైనా ఉన్నాయా? లేదంటే విటమిన్ డి, బి12, ఐరన్‌లోపమూ, ఒత్తిడీ, డిప్రెషన్ వంటివాటి వల్లా ఇలా జరగొచ్చు. అంతేకాదు, ఈ మధ్యే మేజర్ సర్జరీ జరిగినా, తీవ్రమైన జ్వరం అంటే టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, కొవిడ్... వంటి వాటి బారిన పడ్డా... రెండు మూడు నెలల తర్వాత జుట్టు రాలుతుంది. ఈ మధ్య కనిపిస్తోన్న మరో కారణం అకస్మాత్తుగా బరువు తగ్గడం కూడా. అలానే ఈ మధ్య యువత ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్, కీటో డైట్ అంటూ... రకరకాల డైట్స్ ఫాలో అవుతున్నారు. ఒక్కో పద్ధతిలో ఒక్కోరకమైన పోషకాలు లోపిస్తుంది. దీంతో కూడా శిరోజాలు రాలిపోవచ్చు. ముందు రక్తపరీక్షల ద్వారా అలాంటి పోషక లోపం ఏమైనా ఉందేమో తెలుసుకోండి. ఆపై పోషకాహార నిపుణుల సాయం తీసుకోండి. ముఖ్యంగా ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. ఇందుకోసం పప్పుదినుసులు, పనీర్, చిక్కుళ్లు, గుడ్లు, నాన్‌వెజ్ వంటివి మీ ఆహారంలో చేర్చుకోవాలి. అలానే విటమిన్ల కోసం కూరగాయలు, పండ్లు, ఖనిజాల కోసం డ్రైఫ్రూట్స్, నట్స్ వంటివి ఉన్న బ్యాలెన్స్‌డ్ డైట్ తీసుకోవాలి. వైద్యులు ఇచ్చే మందుల వల్ల జుట్టు ఒక సైకిల్‌లో పెరుగుతుంది. ఈ క్రమంలో కొన్నిరోజులు జుట్టు రాలే సమస్య ఉంటుంది. దీన్ని ఫాలింగ్ ఫేజ్ అంటారు. తర్వాత స్టాటిక్‌గా ఉంటుంది. ఆపై ఎనజెన్ అనే గ్రోయింగ్ ఫేజ్‌లోకి అడుగుపెడుతుంది. దాంతో ఆరంభంలో మూడు వారాల నుంచి నెల వరకూ ఎక్కువ హెయిర్‌ఫాల్ ఉన్నట్లు అనిపిస్తుంది. తర్వాత దశల్లో జుట్టు పెరుగుదల కనిపిస్తుంది. ఇది చాలా సాధారణ విషయం. మీరు హెయిర్‌ఫాల్ మెడికేషన్ ఏదైనా 3 నుంచి 6 నెలల పాటు వాడాలి. వైద్యులు చెప్పినట్లుగా అవసరాన్ని బట్టి పరీక్షలు చేయించుకోవాలి. పౌష్టికాహారం తీసుకుంటే మీ సమస్య దూరమవుతుంది.


డియర్ వసుంధర



- సూరపనేని పద్మావతి
డెర్మటాలజిస్ట్

విటమిన్ ఎ ఎందుకంటే..

విటమిన్ ఎ అనేది కొవ్వులో కరిగే (ఫ్యాట్-సాల్యుబుల్) విటమిన్. ఇది మన శరీరానికి చాలా ముఖ్యమైన పోషకం. మహిళల ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చర్మ సంరక్షణని పట్టించుకునే యువతులు... అందరికీ ఇది అత్యవసరం. ఎందుకో తెలుసుకుందామా?



- విటమిన్ ఎ రాత్రిపూట స్పష్టంగా చూడటానికి సహాయపడుతుంది. ఇది రెటినాలోని రోడోప్సిన్ అనే పదార్థం ఏర్పడటానికి అవసరం. దీని లోపం ఉంటే రేచీకటి వస్తుంది.
- చర్మ కణాల పునరుత్పత్తికి సహాయపడుతుంది. మొటిమలు, పొడి చర్మం సమస్యలను తగ్గిస్తుంది. అందుకే దీన్ని రెటినాయిడ్ క్రీమ్‌లు, చర్మ సౌందర్య చికిత్సల్లోనూ వాడతారు.
- విటమిన్ ఎ తెల్ల రక్త కణాల ఉత్పత్తికి దోహదపడుతుంది. ఫలితంగా రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ముఖ్యంగా పిల్లలు ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతుంది. మీజిల్స్ వంటి వ్యాధులను తగ్గించడంలో సహాయపడుతుంది.
- శిశువు అవయవాలు (ముఖ్యంగా కళ్లు, ఊపిరితిత్తులు, గుండె) సరిగ్గా ఎదగడానికి విటమిన్ ఎ సహాయపడుతుంది. గర్భిణుల్లో రోగ నిరోధకతను పెంచుతుంది.

అంతేకాదు... పాలిచ్చే తల్లులకు ఈ పోషకం రోజువారీ అవసరం మరింత ఎక్కువ. ఎందుకంటే... శిశువుకు తల్లిపాల ద్వారానే విటమిన్ ఎ అందుతుంది. అంతేకాదు...ఇది బీటా-కెరొటిన్ రూపంలో క్యాన్సర్, గుండె జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తుంది.

విటమిన్ ఎ సాధారణంగా రెండు రూపాల్లో లభిస్తుంది:

1. **రెటినాల్:** దీన్ని శరీరం నేరుగా ఉపయోగించుకుంటుంది. లివర్, ఫిష్ ఆయిల్, గుడ్లు (పచ్చసొన), పాలు, పెరుగు, వెన్న, చీజ్ వంటివాటి నుంచి ఇది లభిస్తుంది.

2. **బీటా-కెరొటిన్:** ఇది శరీరంలో విటమిన్ ఎగా మారుతుంది. ఇది నారింజ, ఎరుపు, ఆకుపచ్చ రంగు కూరగాయలు/పండ్లు) అయిన క్యారెట్, బత్తాయి, పాలకూర, ఆకుకూరలు, మామిడి పండు, బొప్పాయి, బ్రొకలీ, క్యాప్సికం వంటివాటి నుంచి అందుతుంది.

ఈనాడు వెబినార్!



చట్టాల గురించి అవగాహన పెంచుకుందాం...

హింస/వేధింపులను అడ్డుకుందాం!

ఈనాడు వసుంధర

01.02.2026 (ఆదివారం) ఉ.11:00 - మ.12:30

మనకోసం ఎన్ని చట్టాలు ఉన్నా... గృహ హింస, లైంగిక వేధింపులు తప్పడం లేదు. ఆస్తిహక్కు గురించి పూర్తి అవగాహన ఉన్నవాళ్లూ అంతంతమాత్రమే. ఇవన్నీ మన విజయాన్ని అడ్డుకుంటున్నాయి. శారీరకంగా, మానసికంగా కుంగదీస్తున్నాయి. సమస్య వస్తే తక్షణ పరిష్కారం కోసం ఎక్కడికి వెళ్లాలో, ఎవరిని సంప్రదించాలో నేటికీ చాలామందికి తెలియదు. మౌనంగా బాధపడటం తప్ప... ధైర్యం చేసి కోర్టు మెట్లు ఎక్కే మహిళల సంఖ్యా తక్కువే.

అందుకే... ఈనాడు వసుంధర కుటుంబం- తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్తంగా నిర్వహించే ఉచిత వెబినార్‌లో పాల్గొందాం. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు చేపట్టిన చర్యలు, హక్కులు... వంటి అనేక అంశాల గురించి 01.02.2026 (ఆదివారం) నాడు ప్రముఖ న్యాయ నిపుణులు, పోలీస్ అధికారులు అందించే విలువైన సమాచారాన్ని తెలుసుకుందాం. మనల్ని మనం రక్షించుకుందాం. శక్తిమంతమైన మహిళగా ఎదుగుదాం.

వెబినార్‌లో పాల్గొనడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ లేదా వెబ్ లింక్ ఓపెన్ చేయండి.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా https://hov.to/2df2d074 వెబ్‌లింకు ఓపెన్ చేయండి. జూమ్ ఐడీ: 956 2822 7145 పాస్‌కోడ్: 917259 తోనూ జాయిన్ కావొచ్చు.

ఈ వెబినార్ యూట్యూబ్ లైవ్ కోసం స్కాన్ చేయండి.

కిడ్స్ కార్నర్

డిజిటల్ మాయాజాలం పిల్లల్ని ఎంతగా ఆకర్షిస్తోందంటే... అది లేకపోతే వేరే ప్రపంచమే లేదన్నట్లు భావిస్తున్నారు వాళ్లు. దీనివల్ల ఎన్ని అనారోగ్య సమస్యలో! ముఖ్యంగా ఏకాగ్రత కోల్పోతూ... దేనిమీదా దృష్టిని కేంద్రీకరించలేక బాధపడుతున్న పిల్లలే ఎక్కువ. అలాంటి వాళ్లలో అభిజ్ఞా నైపుణ్యాలు పెరగాలంటే ఈ పుస్తకాలు బహుమతిగా ఇవ్వాల్సిందే.

ఏకాగ్రతని పెంచే పుస్తకాలివి..!

నీళ్లు పోస్తే చాలు...





ఏకాగ్రత, దృష్టికేంద్రీకరణ, ఆందోళనలతో సతమతం అవుతున్న పిల్లలకు చిత్రలేఖనం కన్నా... విశ్రాంతినిచ్చే కళ మరొకటి ఉండదని నిపుణుల అభిప్రాయం. పిల్లలకూ బొమ్మలు గీయడం, రంగులు వేయడం అంటే ఇష్టమే. వాళ్ల ఇష్టానికి, ఇంకాస్త ఆసక్తిని జోడించాలంటే... ఈ 'రీయూజబుల్ మ్యాజిక్ డ్రాయింగ్ బుక్'ను ఇవ్వాల్సిందే. ఒక వాటర్ పెన్, బొమ్మలు గీసున్న పుస్తకం సెట్‌గా వస్తాయి. పెన్‌లో నీళ్లు పోసి... కాగితం మీద రుద్దితే దాగి ఉన్న చిత్రం క్రమంగా కనిపించడం మొదలవుతుంది. గీసిన కాసేపటికే చెరిగిపోయి... మళ్లీ తెల్లకాగితం వచ్చేస్తుంది. అంటే ఎన్నిసార్లు కావాలన్నా అదే బొమ్మను వేసుకోవచ్చన్నమాట. దీనివల్ల పిల్లలు స్క్రీన్ సమయానికీ దూరం అవుతారు.

మెదడుకు మేత...



అభిజ్ఞా, జ్ఞాపక శక్తి నైపుణ్యాలు మెరుగవ్వాలంటే... పిల్లలకు ఈ 'ఇన్‌స్టంట్ మెమరీ కార్డ్ గేమ్'ను బహుమతిగా ఇవ్వాల్సిందే. దీనిలో ఓ పజిల్ పుస్తకం, కార్డులూ, బొమ్మల డైస్‌లు సెట్‌గా వస్తాయి. కార్డుని ఐదు పది నిమిషాలు చూసి, పక్కన పెట్టేయాలి... దానిలో ఉన్నట్టుగా పుస్తకంలోని ఖాళీల్లో డైస్‌ని పేర్చాలి. అలా వీటన్నిటినీ కరెక్టుగా పెట్టాలి. తర్వాత కార్డ్ తిప్పి చూస్తే సరి. ఇద్దరు పిల్లలు కూర్చొని పోటాపోటీగా ఆడుకోవచ్చు ఈ ఆటని.

ఆకృతి ఆధారంగా...





పజిల్, ట్రెజర్ ఆటలు ఆడటం పిల్లలకు ఎంత సరదానో. వాళ్లకి ఈ 'మాగ్నెటిక్ టాన్‌గ్రామ్ పజిల్ బుక్'ను బహుమతిగా ఇవ్వండి. దీనిలో ఒక పుస్తకం, రకరకాల మాగ్నెటిక్ ఆకృతులు సెట్‌గా వస్తాయి. పుస్తకంలో వివిధ ఆకారాల్ని కలిపి ఒక డయాగ్రామ్ ఉంటుంది. దాన్ని అనుకరిస్తూ... మాగ్నెటిక్ ఆకృతుల్ని జోడించాలి. దీనివల్ల చేతి-కంటి సమన్వయం సాధ్యమవుతుంది. దృష్టికేంద్రీకరణకూ ఇది మంచి వ్యాయామం.

ఛాంపియన్

40 ఓవర్ల ఆటలో ఏకంగా 496 పరుగులు.. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 36 ఫోర్లు, 36 సిక్సర్లు.. కేవలం బౌండరీలతోనే వచ్చిన స్కోరు 360.. బ్యాటర్లలో ఒక శతకం, రెండు అర్ధశతకాలు.. అయిదు 30+ స్కోర్లు.. బౌలర్లలో అయిదుగురు అర్ధసెంచరీలు.. ఇదీ భారత్, న్యూజిలాండ్ చివరి టీ20లో గణాంకాల లెక్క! బ్యాటింగ్‌కు స్వర్గధామంగా మారిన పిచ్‌పై బ్యాటర్లు తాండవం ఆడేశారు. బుమ్రా, జేమీసన్ లాంటి మేటి ఫాస్ట్‌బౌలర్లు కూడా నిస్సహాయులుగా మారిన తిరువనంతపురంలో.. ఏకంగా 271 పరుగుల స్కోరు సాధించిన టీమ్‌ఇండియాదే పైచేయి అయింది. సిరీస్‌ను ఘనంగా ముగించిన టీమ్‌ఇండియా.. ప్రపంచకప్ వేటకు సిద్ధమైంది.



భారత్ 271/5.. కివీస్ 225

ఇషాన్ మెరుపు సెంచరీ

చివరి టీ20లో సూర్యసేనదే పైచేయి

హద్దుల్లేని విధ్వంసం


ఇషాన్ కిషన్ 103


సూర్యకుమార్ / అక్షర్ 3/33

తిరువనంతపురం

కివీస్‌తో టీ20 సిరీస్‌ను టీమ్‌ఇండియా 4-1 ఆధిక్యంతో ముగించింది. హ్యాట్రిక్ విజయాలతో సిరీస్ గెలిచాక, నాలుగో టీ20లో షాక్ తిన్న భారత్.. శనివారం చివరి టీ20లో 46 పరుగుల తేడాతో నెగ్గింది. మొదట 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాన్ కిషన్ (103; 43 బంతుల్లో 6×4, 10×6) విధ్వంసక శతకానికి.. కెప్టెన్ సూర్యకుమార్ (63; 30 బంతుల్లో 4×4, 6×6), హార్దిక్ పాండ్య (42; 17 బంతుల్లో 1×4, 4×6) మెరుపు ఇన్నింగ్స్‌లు తోడవడంతో భారత్ 5 వికెట్లకు 271 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఫెర్గూసన్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో కివీస్ కూడా దీటుగానే స్పందించినప్పటికీ.. లక్ష్యం అసాధ్యమైంది కావడంతో ఓటమి తప్పలేదు. ఆ జట్టు 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌటైంది. ఫిన్ అలెన్ (80; 38 బంతుల్లో 8×4, 6×6) చెలరేగాడు. అర్ష్‌దీప్ 5 వికెట్ల ప్రదర్శన చేసినప్పటికీ భారీగా పరుగులిచ్చేయగా.. బౌలర్లకు కాళరాత్రిలా మారిన మ్యాచ్‌లో అక్షర్ పటేల్ (3/33) అదరగొట్టాడు. సూర్య 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు.

8వ ఓవర్లోనే వంద: లక్ష్యాన్ని ఛేదించడం అసాధ్యంగా కనిపించినా.. కివీస్ మాత్రం పోరాటం ఆపలేదు. సిరీస్‌లో తొలి మ్యాచ్ ఆడిన ఫిన్ అలెన్, ఇప్పటిదాకా తనకు అవకాశం ఇవ్వనందుకు కివీస్ చింతించేలా రెచ్చిపోయి ఆడాడు. అతడి ధాటికి అర్ష్‌దీప్ తొలి 2 ఓవర్లలో 40 పరుగులు సమర్పించుకున్నాడు. అతను బుమ్రానూ వదిలిపెట్టలేదు. స్పిన్నర్ల బౌలింగ్‌లో మరింత చెలరేగాడు. మరో ఓపెనర్ సీఫర్ట్ (5) త్వరగా వెనుదిరిగినప్పటికీ.. రచిన్ (30; 17 బంతుల్లో 2×4, 2×6)తో కలిసి స్కోరు బోర్డును అలెన్ పరుగులు పెట్టించాడు. వీళ్లిద్దరి ధాటికి కివీస్ 8 ఓవర్లకే 100 దాటేసింది. ఈ ఊపు చూస్తే కివీస్ సంచలనం రేపుతుందా అనిపించింది. కానీ తర్వాతి ఓవర్లో అలెన్‌ను ఔట్ చేసి కివీస్‌కు బ్రేకులేశాడు అక్షర్. ప్రమాదకర ఫిలిప్స్ (7) ఎక్కువసేపు నిలవకపోవడం.. అర్ష్‌దీప్ ఒకే ఓవర్లో రచిన్, శాంట్నర్ (0)లను ఔట్ చేయడంతో కివీస్‌కు ఓటమి ఖాయమైపోయింది. తర్వాత మిచెల్ (26) కాస్త పోరాడాడు. 17 ఓవర్లకు 191/9 నిలిచిన కివీస్.. 200 మార్కును అందుకోవడం కష్టమే అనుకుంటే.. ఇష్ సోధి (33; 15 బంతుల్లో 1×4, 3×6) అనూహ్యంగా చెలరేగి స్కోరును 225 వరకు తీసుకెళ్లాడు.


అర్ష్‌దీప్ 5/51

బాదుడే బాదుడు: టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. కివీస్ బౌలింగ్‌ను మామూలుగా ఆడుకోలేదు. తన సొంతగడ్డపైనా ఫామ్ అందుకోలేకపోయిన సంజు శాంసన్ 6 పరుగులకే వెనుదిరిగినా.. అభిషేక్ (30; 16 బంతుల్లో 4×4, 2×6) జట్టుకు మెరుపు ఆరంభాన్నిచ్చాడు. అతణ్ని ఫెర్గూసన్ బౌల్డ్ చేసి బ్రేక్ ఇచ్చినప్పటికీ.. పరుగుల జోరు ఎంతోసేపు ఆగలేదు. ఇషాన్ కిషన్.. అభిషేక్‌ను మించిన దూకుడుతో కివీస్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కెప్టెన్ సూర్య కూడా భారీ షాట్లతో రెచ్చిపోయాడు. వీళ్లిద్దరూ సింగిల్స్ తీసినంత సులువుగా సిక్సర్లు, ఫోర్లు బాదేశారు. పదో ఓవర్లో సెంచరీ మార్కును దాటిన భారత్.. 13వ ఓవర్‌కే 150 దాటేసింది. 16 ఓవర్లకే 200 మార్కును చేరుకుంది. మధ్యలో సూర్య ఔటైనా.. కివీస్‌కు ఉపశమనం లేకపోయింది. ఇషాన్, హార్దిక్ బాదుడుతో స్కోరు ఎక్కడికో వెళ్లిపోయింది. 84 పరుగుల వద్ద ఒంటి చేత్తో ఇషాన్ కొట్టిన షాట్‌కు మిడ్ వికెట్‌లో బౌండరీ వద్ద ఫెర్గూసన్ క్యాచ్ అందుకునే ప్రయత్నం చేశాడు. కానీ బంతి అతడి చేతుల్లో పడి బౌండరీ అవతలికి వెళ్లడంతో సిక్సర్ అయింది. శాంట్నర్ వేసిన 17వ ఓవర్లో రెండు వరుస సిక్సర్లతో ఇషాన్ సెంచరీ పూర్తి చేయడం విశేషం. తర్వాతి ఓవర్లోనే అతను ఔటైనా.. హార్దిక్ చివరి ఓవర్లో వెనుదిరిగే వరకు విధ్వంసాన్ని కొనసాగించాడు. భారత ఇన్నింగ్స్‌లో ఫోర్లను (17) మించి సిక్సర్లు (23) నమోదవడం విశేషం.

భారత్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (బి) ఫెర్గూసన్ 30; సంజు శాంసన్ (సి) జాకబ్స్ (బి) ఫెర్గూసన్ 6; ఇషాన్ (సి) ఫిలిప్స్ (బి) డఫీ 103; సూర్యకుమార్ (స్టంప్డ్) సీఫర్ట్ (బి) శాంట్నర్ 63; హార్దిక్ (సి) జాకబ్స్ (బి) జేమీసన్ 42; రింకు నాటౌట్ 8; దూబె నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 12 **మొత్తం:** (20 ఓవర్లలో 5 వికెట్లకు) 271; **వికెట్ల పతనం:** 1-31, 2-48, 3-185, 4-233, 5-261; **బౌలింగ్:** డఫీ 4-0-53-1; జేమీసన్ 4-0-59-1; ఫెర్గూసన్ 4-0-41-2; ఇష్ సోధి 3-0-48-0; ఫిలిప్స్ 1-0-10-0; శాంట్నర్ 4-0-60-1

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: సీఫర్ట్ (సి) హార్దిక్ (బి) అర్ష్‌దీప్ 5; అలెన్ (సి) రింకు (బి) అక్షర్ 80; రచిన్ (సి) అక్షర్ (బి) అర్ష్‌దీప్ 30; ఫిలిప్స్ (సి) రింకు (బి) అక్షర్ 7; మిచెల్ (బి) అర్ష్‌దీప్ 26; శాంట్నర్ (సి) సూర్యకుమార్ (బి) అర్ష్‌దీప్ 0; జాకబ్స్ (బి) వరుణ్ 7; జేమీసన్ (బి) అర్ష్‌దీప్ 9; సోధి (సి) అర్ష్‌దీప్ (బి) రింకు 33; ఫెర్గూసన్ (బి) అక్షర్ 3; డఫీ నాటౌట్ 9; ఎక్స్‌ట్రాలు 16 **మొత్తం:** (19.4 ఓవర్లలో ఆలౌట్) **225; వికెట్ల పతనం:** 1-17, 2-117, 3-131, 4-137, 5-137, 6-166, 7-179, 8-180, 9-191; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-51-5; హార్దిక్ 2-0-15-0; బుమ్రా 4-0-58-0; వరుణ్ 4-0-36-1; అక్షర్ పటేల్ 4-0-33-3; అభిషేక్ 1-0-13-0; రింకు 0.4-0-7-1

సంజు.. వైఫల్యం పరిపూర్ణం

సంజు శాంసన్

టీ20 ప్రపంచకప్ ముంగిట చివరి సిరీస్‌ను భారత జట్టు బాగా ఉపయోగించుకుంది. 4-1తో బలమైన న్యూజిలాండ్‌ను ఓడించడం భారత్ ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే. ముఖ్యంగా బ్యాటింగ్‌లో భారత్‌కు తిరుగులేదు. ఈ సిరీస్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ అందుకోవడం అతి పెద్ద సానుకూలాంశం. అనుకోకుండా జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్ కూడా అదరగొట్టాడు. అభిషేక్ ఎప్పట్లాగే ఆకట్టుకున్నాడు. దూబె, హార్దిక్, రింకు కూడా సమయోచితంగా మెరుపులు మెరిపించాడు. కానీ ఒక్క సంజు శాంసన్ విషయంలో మాత్రం నిరాశ తప్పలేదు. అసలే అంతంతమాత్రం ఫామ్‌తో అతను సిరీస్‌లో అడుగు పెట్టాడు. అయిదు మ్యాచ్‌ల్లోనూ ఓపెనర్‌గా అవకాశాలు దక్కినప్పటికీ.. ఒక్కసారీ కనీసం 30 పరుగులు చేయలేదు. 10, 6, 0, 24, 6.. ఇవీ అతడి స్కోర్లు. 9.2 సగటుతో కేవలం 46 పరుగులు చేశాడు. ప్రపంచకప్ ముంగిట చివరి మ్యాచ్‌లో, సొంతగడ్డ అయిన తిరువనంతపురంలో అయినా రాణిస్తాడనుకుంటే.. ఇక్కడా ఘోరంగా విఫలమయ్యాడు.

పాపం బౌలర్లు

బ్యాటింగ్‌కు స్వర్గధామంగా మారిన తిరువనంతపురం పిచ్.. బౌలర్ల పాలిట శాపంగా మారింది. బ్యాటర్ల బాదుడుకు పాపం బౌలర్లు బెంబేలెత్తిపోయారు. ప్రపంచ క్రికెట్లో ఫార్మాట్ ఏదైనా పొదుపుగా బౌలింగ్ చేసే బౌలర్లలో బుమ్రా ఒకడు. అలాంటి బౌలర్ తన కెరీర్లోనే అత్యంత పేలవ గణాంకాలు నమోదు చేశాడు. 4 ఓవర్లలో వికెట్ లేకుండా ఏకంగా 58 పరుగులు సమర్పించుకున్నాడు. 5 వికెట్లు తీసినప్పటికీ, అర్ష్‌దీప్ 51 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇక కివీస్ బౌలర్ల పరిస్థితి అయితే దయనీయం. ఒక్క ఓవరే వేసిన గ్లెన్ ఫిలిప్స్ 10 పరుగులే ఇచ్చి బతికిపోయాడు కానీ.. మిగతా బౌలర్ల గణాంకాలన్నీ చెల్లాచెదురైపోయాయి. ఫిలిప్స్ కాకుండా అయిదుగురు బౌలర్లలో అతి తక్కువ ఎకానమీ 4 ఓవర్లలో 53 పరుగులు ఇచ్చిన జాకబ్ డఫీ (13.25)దే. ఇష్ సోధి ఏకంగా 16 ఎకానమీతో 3 ఓవర్లలో 48 పరుగులు సమర్పించుకున్నాడు. శాంట్నర్ 15 ఎకానమీతో 4 ఓవర్లలో 60 పరుగులతో అతడికి గట్టి పోటీ ఇచ్చాడు. జేమీసన్ 4 ఓవర్లలో 59 పరుగులు ఇచ్చుకున్నాడు. ఇష్ సోధి వేసిన 12 ఓవర్ ఒకదాంట్లోనే ఏకంగా 29 పరుగులు వచ్చాయి. ఆ ఓవర్లో ఆకాశమే హద్దుగా చెలరేగిన ఇషాన్ కిషన్.. వరుసగా 4, 4, 4, 6, 4, 6 బాదేశాడు.

3030

అంతర్జాతీయ టీ20ల్లో సూర్యకుమార్ పరుగులు. భారత్ తరఫున రోహిత్ (4231), కోహ్లి (4188)ల తర్వాత 3 వేల మైలురాయిని దాటింది అతనే.

271/5

భారత్‌కు టీ20ల్లో ఇది మూడో అత్యధిక స్కోరు. 2024లో బంగ్లాదేశ్‌పై 297/6, దక్షిణాఫ్రికాపై 283/1 స్కోర్లు తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

జ్ఞానేశ్వర్ ద్విశతకం

దీమాపూర్: నాగాలాండ్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ పట్టు సాధించింది. ఓవర్‌నైట్ బ్యాటర్ జ్ఞానేశ్వర్ (227 నాటౌట్; 268 బంతుల్లో 21×4, 4×6) అజేయ ద్విశతకంతో సత్తా చాటాడు. మూడో రోజు శనివారం 267/5తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 536/9 వద్ద డిక్లేర్ చేసింది. 170 పరుగుల ఆధిక్యం సంపాదించింది. శశికాంత్ (60), త్రిపురణ విజయ్ (58) అర్ధ సెంచరీలతో ఆకట్టుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నాగాలాండ్.. త్రిపురణ విజయ్ (3/29) ధాటికి తడబడింది. ఆట చివరికి 85/4తో నిలిచింది. ఆ జట్టు ఇంకా 85 పరుగుల వెనుకంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో నాగాలాండ్ 366 పరుగులకు ఆలౌటైంది.

హైదరాబాద్ 631: ఛత్తీస్‌గఢ్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ 348 పరుగుల భారీ ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 415/4తో మూడో రోజు శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ 631 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ ప్రజ్ఞయ్ రెడ్డి (126) సెంచరీతో జట్టుకు భారీ స్కోరు అందించాడు. కొడిమెల హిమతేజ (171) ఓవర్‌నైట్ స్కోరుకు మరో 46 పరుగులు జోడించి వెనుదిరిగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఛత్తీస్‌గఢ్ ఆట ముగిసేసరికి 100/2తో నిలిచింది. మహ్మద్ సిరాజ్, రక్షణ్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. ఛత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 283 పరుగులు చేసింది.

డబ్ల్యూపీఎల్‌లో ఈనాడు

దిల్లీ × యూపీ


వేదిక: వడోదర, రా॥ 7.30

ఈఎస్ఎల్ క్రికెట్ ఫైనల్స్ నేడు

EENADU SPORTS LEAGUE 2025

గుంటూరు (జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్) క్రికెట్ చివరి అంకానికి చేరుకుంది. గుంటూరు జిల్లా నంబూరులోని ఎం.ఎస్.కె. ప్రసాద్ స్పోర్ట్స్ అకాడమీ గ్రౌండ్‌లో ఆదివారం ఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. సీనియర్స్‌లో రాయలసీమ రాకర్స్, హైదరాబాద్ హీరోస్ జట్లు.. జూనియర్స్‌లో సెంట్రల్ ఆంధ్రా చాలెంజర్స్, హైదరాబాద్ హీరోస్ జట్లు అమీతుమీ తేల్చుకుంటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 1,047 జట్లు ఈ టోర్నీలో పోటీ పడ్డాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలు గుంటూరు సమీపంలోని మోతడక చలపతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జనవరి 27న మొదలయ్యాయి. ఇప్పుడు ఫైనల్స్‌కు రంగం సిద్ధమైంది.

రిబకినా అదరగొట్టింది. పోరాటపటిమను ప్రదర్శిస్తూ ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. రసవత్తరంగా సాగిన ఫైనల్లో ఆమె ప్రపంచ నంబర్‌వన్ అరీనా సబలెంకాను ఓడించింది. 2023 ఫైనల్లో బెలారస్ స్టార్ చేతిలో ఎదురైన ఓటమికి ప్రతీకారం తీర్చుకుంది. కెరీర్‌లో రిబకినాకు ఇది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్.


రిబకినా

ఛాంప్ రిబకినా

- ఆస్ట్రేలియన్ ఓపెన్ కైవసం
- ఫైనల్లో సబలెంకాపై విజయం

మెల్‌బోర్న్

ఎలెనా రిబకినా (కజకిస్థాన్) ఎట్టకేలకు తన రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలుచుకుంది. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆమె విజేతగా నిలిచింది. శనివారం ఆసక్తికరంగా సాగిన ఫైనల్లో అయిదో సీడ్ రిబకినా 6-4, 4-6, 6-4తో టాప్ సీడ్ అరీనా సబలెంకా (బెలారస్)పై విజయం సాధించింది. రిబకినా 2022 (వింబుల్డన్)లో తన తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను గెలుచుకుంది. సబలెంకా తన చివరి నాలుగు గ్రాండ్‌స్లామ్ ఫైనల్స్‌లో మూడు ఓడిపోవడం గమనార్హం. తుది పోరులో రిబకినా ఒత్తిడిని తట్టుకుని నిలిచింది. మ్యాచ్‌లో ఆమె 6 ఏస్‌లు, 28 విన్నర్లు కొట్టింది. మూడుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. సబలెంకా 26 అనవసర తప్పిదాలతో దెబ్బతింది.


సబలెంకా

హోరాహోరీగా..: మెల్‌బోర్న్ పార్క్‌లో 2023 ఫైనల్లో రిబకినాను ఓడించిన సబలెంకా.. ఈసారి కూడా ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. కానీ ఫైనల్ చేరే క్రమంలో ప్రపంచ నంబర్ 2 స్వైటెక్, ఆరో సీడ్ జెస్సికా పెగులాను ఓడించిన రిబకినా.. చాలా ఆత్మవిశ్వాసంతో కనిపించింది. బలంగా పోరును ఆరంభించింది. ప్రత్యర్థి పవర్ హిట్టింగ్‌ను సమర్థంగా ఎదుర్కొంది. రిబకినా తొలి సెట్ తొలి గేమ్‌లోనే సబలెంకా సర్వీసును బ్రేక్ చేసింది. ఆ తర్వాత సర్వీసు నిలబెట్టుకుంటూ సాగింది. తన తొలి మూడు సర్వీసుల్లో ఆమె మూడు పాయింట్లు మాత్రమే కోల్పోయింది. ఆ తర్వాత సబలెంకాకు రెండు బ్రేక్ పాయింట్లు లభించినా సద్వినియోగం చేసుకోలేకపోయింది. కడవరకూ ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న రిబకినా.. సెట్‌ను చేజిక్కించుకుంది. రెండో సెట్ ఆరంభంలో సబలెంకా ఒత్తిడి పెంచినా.. రిబకినా తట్టుకుంది. ఇద్దరూ సర్వీసులు నిలబెట్టుకుంటూ సాగడంతో 4-4తో సమంగా నిలిచారు. తొమ్మిదో గేమ్‌లో విజయవంతంగా సర్వీసు చేసిన సబలెంకా 5-4లోకి వెళ్లింది. కీలకమైన పదో గేమ్‌లో రిబకినా తడబడింది. మూడు బ్రేక్ పాయింట్లు సంపాదించిన సబలెంకా.. అలవోకగా గేమ్‌ను గెలిచి, 6-4తో సెట్‌ను సొంతం చేసుకుంది. అదే జోరులో మూడో సెట్లోనూ ఆమె 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రిబకినా బలహీన సర్వీసులను సొమ్ము చేసుకున్న సబలెంకా.. రెండో గేమ్‌లో బ్రేక్ సాధించింది. ఆమెకు మార్గం సుగమమైనట్లేనని అనిపించింది. కానీ 0-3తో వెనుకబడ్డ రిబకినా గట్టిగా పోరాడి నిలిచింది. వరుసగా రెండు బ్రేక్‌లు సాధించి 5-3తో ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాతి గేమ్‌లో సబలెంకా విజయవంతంగా సర్వ్ చేసినా.. పదో గేమ్‌లో రిబకినాను అడ్డుకోలేకపోయింది. రెండు భారీ సర్వీసులతో రిబకినా మ్యాచ్‌ను ముగించింది.

మెర్టెన్స్, జాంగ్ జోడీకి డబుల్స్ టైటిల్: మహిళల డబుల్స్‌లో మెర్టెన్స్ (జర్మనీ), జాంగ్ (చైనా) జంట విజేతగా నిలిచింది. ఫైనల్లో ఈ ద్వయం 7-6 (7-4), 6-4తో అనా డానిలినా (కజకిస్థాన్), అలెగ్జాండ్రా కుర్నిక్ (సెర్బియా) జోడీని ఓడించింది. క్రిస్టియన్ హారిసన్ (అమెరికా), నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్) ద్వయం పురుషుల డబుల్స్ టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఫైనల్లో ఈ జంట 7-6 (7-4), 6-4తో ఆస్ట్రేలియాకు చెందిన కుబ్లెర్, పోల్మాన్స్‌లపై గెలిచింది.


జకోవిచ్

ఎవరిదో టైటిల్

- జకోవిచ్ × అల్కరాస్ ఫైనల్ నేడు
- మధ్యాహ్నం 2 నుంచి

మెల్‌బోర్న్: మరొక్కటి గెలిస్తే చాలు టెన్నిస్ చరిత్రలో అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిళ్లు గెలిచిన ప్లేయర్‌గా అతడు రికార్డు సృష్టిస్తాడు. కానీ ఆ ఒక్కటి మాత్రం చాలా కాలంగా అతణ్ని ఊరిస్తూనే ఉంది. ఇప్పటికే 24 టైటిళ్లతో మార్గరెట్ కోర్ట్‌తో ఆల్‌టైమ్ రికార్డును పంచుకుంటున్న నొవాక్ జకోవిచ్, 25 కోసం చాలా కష్టపడుతున్నాడు. చివరగా 2023లో యుఎస్ ఓపెన్ గెలిచాక.. అతడు మళ్లీ గ్రాండ్‌స్లామ్ కొట్టలేకపోయాడు. ఆ తర్వాత అతడు ఒకే ఒక్కసారి మేజర్ టోర్నీ ఫైనల్ (2024 వింబుల్డన్) చేరాడు. అయితే ఆ ఒక్కటి కొట్టేయడానికి జకోవిచ్ (సెర్బియా)కు ఇప్పుడు సువర్ణావకాశం లభించింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఆదివారం అతడు.. ప్రపంచ నంబర్‌వన్ అల్కరాస్ (స్పెయిన్)ను ఢీకొంటాడు. మామూలుగా అయితే 38 ఏళ్ల జకోవిచ్‌తో పోరులో 22 ఏళ్ల అల్కరాస్‌నే ఫేవరెట్‌గా పరిగణించేవాళ్లు. కానీ రెండు సార్లు డిఫెండింగ్ ఛాంపియన్, రెండో సీడ్ సినర్‌ను సెమీస్‌లో ఓడించిన నొవాక్.. రెట్టించిన ఆత్మవిశ్వాసంతో పోరుకు సిద్ధమయ్యాడు. ఇంతకుముందు ఇక్కడ ఫైనల్ చేరిన పది సార్లూ అతడు విజేతగా నిలవడం విశేషం. మరోవైపు పురుషుల టెన్నిస్‌లో కెరీర్ గ్రాండ్‌స్లామ్ పూర్తి చేసిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాలని అల్కరాస్ తహతహలాడుతున్నాడు.


అల్కరాస్

మధ్యాహ్నం 1 నుంచి

ప్రతీకార పోరు

- పాక్‌తో భారత్ సూపర్ సిక్సెస్ మ్యాచ్ నేడు
- అండర్-19 వన్డే ప్రపంచకప్



బులవాయో: అండర్-19 వన్డే ప్రపంచకప్‌లో అపజయమే లేకుండా సాగిపోతున్న భారత జట్టు.. సూపర్‌సిక్సెస్‌లో కీలక పోరుకు సిద్ధమైంది. ఆయుష్ మాత్రే బృందం.. ఆదివారం చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడబోతోంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత్ నేరుగా సెమీస్‌లో అడుగు పెడుతుంది. పాక్ ఇంటిముఖం పడుతుంది. ఈ మ్యాచ్‌లో ఓడినా భారత్‌కు అవకాశముంటుంది. కానీ తక్కువ తేడాతో ఓడాలి. గ్రూప్-1 నుంచి ఇప్పటికే ఆస్ట్రేలియా, అఫ్గానిస్థాన్ సెమీస్ చేరాయి. గ్రూప్-2లో ఇంగ్లాండ్ బెర్తు ఖాయం చేసుకుంది. చివరి బెర్తు కోసం భారత్, పాక్ మధ్య పోటీ నెలకొంది. చివరగా పాక్‌తో తలపడ్డపుడు భారత్‌కు పరాభవం ఎదురైంది. డిసెంబరులో జరిగిన ఆసియా కప్ ఫైనల్లో ఏకంగా 191 పరుగుల తేడాతో ఓడింది యువ భారత్. ప్రపంచకప్‌లో పాక్‌ను ఇంటిముఖం పట్టించి, ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని కుర్రాళ్లు పట్టుదలతో ఉన్నారు. గ్రూప్ దశలో మూడుమ్యాచ్‌ల్లోనూ గెలిచి సూపర్‌సిక్స్ చేరిన భారత్.. ఈ దశలో తన తొలి మ్యాచ్‌లో 200కు పైగా పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. ఇదే ఊపులో పాక్‌నూ ఓడించాలని ఆయుష్‌సేన చూస్తోంది. కానీ సూపర్‌సిక్స్ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించిన పాక్.. అంత తేలిగ్గా లొంగకపోవచ్చు. ఫర్హాన్ యూసుఫ్ నేతృత్వంలోని ఆ జట్టు ఆల్‌రౌండ్ బలంతో కనిపిస్తోంది. భారత బ్యాటర్లలో ఆయుష్ మాత్రే, వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, అభిజ్ఞాన్ కుందు జోరుమీదున్నారు. ముఖ్యంగా ఓపెనర్లు వైభవ్, ఆయుష్ ఆరంభంలో క్రీజులో కుదురుకున్నారంటే భారత్‌కు తిరుగుండదు. బౌలింగ్‌లో అంబ్రిష్, ఉద్ధవ్, హెనిల్, ఖిలాల్ కీలకం.

టీ20 ప్రపంచకప్‌నకు కమిన్స్ దూరం

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా వన్డే, టెస్టు జట్ల కెప్టెన్ ప్యాట్ కమిన్స్ వెన్ను గాయం కారణంగా టీ20 ప్రపంచకప్‌నకు దూరమయ్యాడు. మొదట ప్రకటించిన జట్టులో అతడు ఉన్నాడు. ఇప్పుడు తన స్థానంలో పేసర్ బెన్ డ్వార్షుయిస్ జట్టులోకి వచ్చాడు. ఈ నెల 7న ప్రారంభం కానున్న పొట్టి ప్రపంచకప్‌నకు 15 మంది ఆటగాళ్లతో కూడిన తుది జట్టును ఆస్ట్రేలియా సెలక్టర్లు ప్రకటించారు. మరోవైపు షార్ట్ స్థానంలో రెన్‌షాకు అవకాశం లభించింది.

పాకిస్థాన్‌దే సిరీస్

లాహోర్: ఆస్ట్రేలియాతో మూడు టీ20ల సిరీస్‌ను ఆతిథ్య పాకిస్థాన్ మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో చేజిక్కించుకుంది. కెప్టెన్ సల్మాన్ ఆఘా (76; 40 బంతుల్లో 8×4, 4×6) చెలరేగడంతో శనివారం రెండో టీ20లో ఆ జట్టు 90 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆఘాతో పాటు ఉస్మాన్ ఖాన్ (53; 36 బంతుల్లో 4×4, 2×6) చెలరేగడంతో మొదట పాకిస్థాన్ 5 వికెట్ల నష్టానికి 198 పరుగులు చేసింది. ఛేదనలో ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. అబ్రార్ (3/14), షాదాబ్ ఖాన్ (3/26), ఉస్మాన్ ఖాన్ (2/16) ధాటికి 15.4 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటైంది. గ్రీన్ (35) టాప్ స్కోరర్.

ఫైనల్లో దేవిక

బ్యాంకాక్: భారత యువ షట్లర్ దేవిక సిహాగ్ తన కెరీర్‌లో తొలిసారి బీడబ్ల్యూఎఫ్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ ఫైనల్లోకి ప్రవేశించింది. థాయ్‌లాండ్ మాస్టర్స్‌లో శనివారం మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో దేవిక 22-20, 21-13తో అయిదో సీడ్ యు సూన్ (చైనీస్ తైపీ)ను ఓడించింది. టైటిల్ పోరులో ఆమె.. గాహ జిన్ వెయ్ (మలేసియా)ను ఢీకొంటుంది.

ఆసియా ఛాంపియన్‌షిప్ నుంచి సింధు ఔట్

దిల్లీ: ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ నుంచి స్టార్ షట్లర్ పీవీ సింధు వైదొలిగింది. గాయం కారణంగా ఆమె దూరమైనట్లు సమాచారం. నిరుడు గాయంతో కొంత కాలం ఆటకు దూరమైన ఆమె.. పునరాగమనంలో మలేసియా ఓపెన్‌లో సెమీస్, ఇండోనేసియా మాస్టర్స్‌లో క్వార్టర్స్‌తో సరిపెట్టుకుంది. ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ మంగళవారం ఆరంభం కానుంది. భారత్.. థాయ్‌లాండ్, మయన్మార్‌లతో కలిసి గ్రూప్-వైలో ఉంది.

రద్దీ ఎక్కువగా ఉన్న 12 రోడ్ల విస్తరణ

- పీపీపీ విధానంలో 709 కి.మీ. పనులు
- నిర్మాణ వ్యయం రూ.5,233 కోట్లని అంచనా
- భూసేకరణ తదితరాలకు మరో రూ.2,459 కోట్లు

ఈనాడు, అమరావతి: ఆర్‌అండ్‌బీ రహదారుల్లో.. వాహన రద్దీ అత్యధికంగా ఉన్న 12 రాష్ట్ర రోడ్లను విస్తరించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానం(పీపీపీ), హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హాం)లలో ఈ రోడ్ల విస్తరణకు అధికారులు రెండు ప్రతిపాదనలు ఇచ్చారు. పీపీపీ విధానంలో విస్తరణకు ప్రభుత్వం తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో 709 కి.మీ. పనులు చేపట్టనున్నారు. కొన్ని రోడ్లను 4 వరుసలుగా, మరి కొన్నింటిని 10 మీటర్ల వెడల్పుతో రెండు వరుసలుగా విస్తరించనున్నారు.

15 నుంచి 30 ఏళ్లపాటు నిర్వహణ

★ రోడ్లను విస్తరించాక 15 నుంచి 30 ఏళ్లపాటు గుత్తేదార్లు నిర్వహణ బాధ్యతలు చూడనున్నారు. ★ రోడ్ల విస్తరణకు రూ.5,233 కోట్లు నిర్మాణ వ్యయమవుతుందని అంచనా. ★ భూసేకరణకు, రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ లైన్లను పక్కకు జరపడం వంటి యుటిలిటీస్ షిఫ్టింగ్‌కు కలిపి రూ.2,459 కోట్లు అవుతుంది. ఈ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుంది. ★ 12 రోడ్ల విస్తరణ పనులు చేసిన గుత్తేదార్లు.. ఆయా చోట్ల టోల్ వసూలు చేస్తారు. అయినాసరే ఆ ఫీజులు సరిపోవు. దీంతో గుత్తేదార్లకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద రూ.1,691 కోట్ల మేర బీవోటీ(నిర్మించు, నిర్వహించు, బదలాయించు) గడువు ఉన్నంత కాలం కలిపి చెల్లిస్తారు. ఇందులో కేంద్రం రూ.1,069 కోట్లు, రాష్ట్రం రూ.622 కోట్లు చెల్లించనున్నాయి.

తొలుత 18 రోడ్లు అనుకున్నప్పటికీ..

పీపీపీ విధానంలో 18 రోడ్లను విస్తరించాలని తొలుత భావించారు. సలహా సంస్థ ద్వారా అధ్యయనం చేయించారు. వీటిలో 12రోడ్ల విస్తరణకు అవకాశం ఉందని తేలింది.

విస్తరించనున్న రహదారులివే.. (వ్యయం రూ.కోట్లలో)

రోడ్	కి.మీ.	వరుసలు	నిర్మాణ వ్యయం	భూసేకరణ, ఇతర వ్యయాలు
మంగళగిరి-తెనాలి-నారాకోడూరు, గుంటూరు-బాపట్ల (రెండు రోడ్లూ కలిపి)	89	4	865	508
నరసాపురం-తాడేపల్లిగూడెం	51	4	419	382
కాకినాడ-రాజమహేంద్రవరం కెనాల్ రోడ్	60	4	680	154
ఒంగోలు-పొదిలి-బెస్తవారిపేట	109	4/2	611	227
చిలకపాలెం-రామభద్రపురం-రాయగడ	131	4/2	1,172	363
సోమందేపల్లి-హిందూపురం-తూముకుంట	39	4/2	270	104
నర్సీపట్నం-తాళ్లపాలెం	31	2	101	122
కాకినాడ-జొన్నాడ	43	2	425	289
దామాజీపల్లి-నాయనపల్లి	60	2	338	193
ప్యాపిలి-బనగానపల్లి	54	2	171	73
జమ్మలమడుగు-కొలిమిగుండ్ల	42	2	181	44
మొత్తం	709	–	5,233	2,459

మిగిలిన ఆరు రోడ్లను విస్తరిస్తే.. గుత్తేదారులకు గిట్టుబాటు కాదని, వయబిలిటీ గ్యాప్ ఫండ్‌గా ప్రభుత్వం ఎక్కువ నిధులు వెచ్చించాల్సి ఉంటుందని, భూసేకరణకూ బాగా ఖర్చు చేయాల్సి వస్తుందని గుర్తించారు. దీంతో ఏలూరు-జంగారెడ్డిగూడెం 51కి.మీ., గుంటూరు-పర్చూరు 41కి.మీ., కళింగపట్నం-శ్రీకాకుళం-పార్వతీపురం రోడ్ 108కి.మీ., రాజంపేట-గూడూరు 94 కి.మీ., ఏలూరు-మేడిశెట్టివారి పాలెం 70 కి.మీ., విజయనగరం-పాలకొండ రోడ్ 70 కి.మీ. విస్తరణను ప్రస్తుతం చేపట్టబోవడం లేదు.

వెట్టిచాకిరీ నుంచి 21 మందికి విముక్తి


వెట్టిచాకిరీ నుంచి విముక్తి పొందిన కార్మికులతో అధికారులు

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా ఆదోని మండలం కపటి గ్రామ సమీపంలో ఉన్న ఇటుకల బట్టీలోని కార్మికులకు వెట్టిచాకిరీ నుంచి అధికారులు విముక్తి కల్పించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన కార్మికులతో మూడు నెలలుగా వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు ఫిర్యాదు రావడంతో ఆదోని ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ, కార్మిక శాఖ, పోలీసు, ఐసీడీఎస్ అధికారులు తనిఖీలు చేపట్టగా.. ఇటుకల బట్టీలో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన 16 మంది పెద్దలు, ఐదుగురు మైనర్లతో వెట్టిచాకిరీ చేయిస్తున్నట్లు తేలింది. వెంటనే వారిని విడిపించి, ప్రభుత్వం తరఫున రిలీజ్ సర్టిఫికెట్లు అందించామని అధికారులు తెలిపారు. అలాగే బాధితులకు రావాల్సిన బకాయి మొత్తం ఇప్పించి వారి సొంత ప్రాంతాలకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. పరిశ్రమ నిర్వాహకుడిని విచారిస్తామని చెప్పారు. వెట్టిచాకిరీ చేయించడం నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో చర్చిస్తున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

పార్టీ బలోపేతానికి భవిష్యత్ కార్యాచరణ

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

ఈనాడు, అమరావతి: క్షేత్రస్థాయిలో పార్టీబలోపేతం చేసేలా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సూచించారు. విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులతో శనివారం సమావేశమయ్యారు. స్థానికంగా పార్టీ కార్యక్రమాల ప్రగతి, కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రతి వారం కలెక్టర్ కార్యాలయాల్లో ప్రజల సమస్యలపై ఇస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కారం కోసం చేస్తున్న ప్రయత్నాలపై చర్చించారు. సంత్ రవిదాస్ జయంతి వేడుకలు అన్ని జిల్లాల్లో నిర్వహించాలన్నారు. మన్‌కీ బాత్‌పై విద్యార్థులకు క్విజ్ పోటీలు పెట్టాలని సూచించారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

పీసీబీల్లోని లోహాలను వేరు చేసిన ఐఐటీఎం బృందం

చెన్నై, న్యూస్‌టుడే: నిరుపయోగమైన ఎలక్ట్రానిక్స్ పరికరాల్లోని ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పీసీబీ)ల్లోని లోహాలను పర్యావరణానికి హాని లేకుండా వేరు చేయడంలో విజయం సాధించినట్లు ఐఐటీ మద్రాసు బృందం తెలిపింది. ఇలా వేరుచేసిన రాగిని నానో మెటీరియల్‌గా మార్చాలని నిర్ణయించామని ఐఐటీఎం కెమికల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.పుష్పవనం, పీహెచ్‌డీ విద్యార్థి సిను కురియన్ తెలిపారు. పీసీబీలోని రాగిని రసాయనాల ద్వారా వంద డిగ్రీల ఉష్ణోగ్రతలో వేడిచేసినప్పుడు రాగి కరిగి రాగి ఆక్సైడ్ లభిస్తుందన్నారు. ఎలక్ట్రానిక్స్ వ్యర్థాల్లోని ఇనుము, బంగారం వంటి వాటినీ ఇలాగే వేరుచేయగలమని వెల్లడించారు. ప్రస్తుతం ప్రయోగ స్థాయిలో ఉన్న ఈ విధానాన్ని భారీస్థాయిలో తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి రూ.20కే గోధుమ పిండి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని రేషన్ దుకాణాల్లో ఆదివారం నుంచి కిలో రూ.20కే గోధుమ పిండి పంపిణీ చేయనున్నట్లు పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. త్వరలోనే డివిజన్, మండల స్థాయి దుకాణాల్లోనూ అందుబాటులోకి తెస్తామన్నారు. శనివారం తెనాలిలో ఆయన మాట్లాడారు. దీపం పథకం కింద నాలుగో విడత గ్యాస్ సిలిండర్లను త్వరలో లబ్ధిదారులకు అందించనున్నట్లు వివరించారు.



ఆరోగ్యంగా ఉంటేనే విజయాలను ఆస్వాదించగలం

చాలామంది తమ ఆరోగ్యం పూర్తిగా దెబ్బతినేవరకు దాని గురించి పట్టించుకోరు. సమస్య తీవ్రమయ్యాక జాగ్రత్తలు పాటించినా అప్పటికే పరిస్థితి చేజారిపోయి ఉంటుంది. జీవితంలో మీరు ఏం సాధించాలనుకున్నా దానికి శరీరమే పునాది. ఇప్పుడు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో సాధించే విజయాలను ఆస్వాదించేందుకు కూడా మీకు శక్తి ఉండకపోవచ్చు.

– జస్టిన్ వాల్లెర్, ఆంత్రప్రెన్యూర్

పశువైద్య సేవలు గాడినపడేనా?

- డిసెంబరు నాటికి 30 మంది జేడీలు, డీడీల పదవీ విరమణ
- ఇప్పటికే 300కుపైగా పశువైద్యుల పోస్టులు ఖాళీ
- 250 పోస్టుల భర్తీ దస్త్రం ఆరు నెలలుగా పెండింగ్‌లోనే..

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పశువులు, పెంపుడు జంతువులకు నాణ్యమైన వైద్యసేవలు అందించే పరిస్థితులు రోజురోజుకూ సన్నగిల్లుతున్నాయి. అనేక పశువైద్యశాలల్లో అర్హులైన వైద్యులు అందుబాటులో లేక ఇప్పటికే సేవలు కుంటుబడ్డాయి. 300కుపైగా వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండగా కొన్ని చోట్ల మాత్రమే ఇన్‌ఛార్జిలతో నెట్టుకొస్తున్నారు. ఇలాంటి తరుణంలో పశుసంవర్ధక శాఖలో ఈ ఏడాది నుంచి పదవీ విరమణలు పెరగబోతున్నాయి. శనివారం ఏపీ వెటర్నరీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఈశ్వరరావు, విశాఖపట్నంలోని స్మైల్(స్టేట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) జేడీ డాక్టర్ కరుణాకరరావు, ఏలూరు జేడీ డాక్టర్ ప్రసాదరావు పదవీ విరమణ చేశారు. జులై ఆఖరులోపు మరో ఆరు జిల్లాల జేడీలు పదవీ విరమణ చేయనున్నారు. మొత్తంగా డిసెంబరు నాటికి 14 మంది సంయుక్త సంచాలకులు, 16 మంది ఉప సంచాలకులు రిటైర్ కానున్నారు. వీరే కాకుండా జులై 31న ప్రస్తుత ఏపీఎల్ఏడీఏ సీఈఓ(డైరెక్టర్ హోదా) డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పదవీకాలం కూడా ముగియనుంది. వీరంతా ఎప్పుడెప్పుడు పదవీ విరమణ చేయనున్నారనే వివరాలతో కూడిన ఆర్డర్‌ను పశు సంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ జారీ చేశారు. వచ్చే ఏడాది, తర్వాత కూడా పదవీ విరమణలు భారీగానే ఉన్నాయి.

ఏడేళ్లుగా నియామకాల్లేవు..

రాష్ట్రంలో 2019 ఎన్నికలకు ముందు చేసిన రిక్రూట్‌మెంట్ తర్వాత ఇప్పటివరకూ పశువైద్యుల నియామకాలే జరగలేదు. వైకాపా ఐదేళ్ల హయాంలో ఒక్కరంటే ఒక్క వైద్యుడిని నియమించకుండా పశువైద్య రంగాన్ని దెబ్బతీసింది. ఈ వైద్యం పట్ల కనీస అవగాహన లేని వారిని, కేవలం ఒకేషనల్ కోర్సు చేశారనే అర్హతను చూపించి సుమారు 6 వేల మందిని 2019-2020 మధ్య యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లు గా(ఆహా) గ్రామ/వార్డు సచివాలయాల్లో నియమించారు. వారిలో ఇప్పటికీ కనీసం ఇంజెక్షన్ కూడా సరిగా చేయడం రానివారు 60 శాతం మందికిపైగా ఉన్నారంటే వారితో పశువైద్య సేవలు ఎలా అందుతున్నాయనేదీ అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో నాలుగు పశువైద్య కళాశాలల నుంచి ఏటా సుమారు 300 మంది పశువైద్య పట్టభద్రులు బయటికొస్తున్నారు. ఏడేళ్ల నుంచి నియామకాలు చేపట్టనందున వారిలో 1500 మందికిపైగా నిరుద్యోగులుగా మిగిలిపోయారు. మరోవైపు పశువైద్యశాలల్లో 250 మంది వైద్యుల నియామకం కోసం ప్రతిపాదించిన దస్త్రం ఆరు నెలలుగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

పెళ్లి పేరుతో రప్పిస్తాడు.. ఆభరణాలతో ఉడాయిస్తాడు

పోలీసుల అదుపులో ఒంటరి మహిళలను మోసగిస్తున్న మాయగాడు


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌ఛార్జి డీఎస్పీ శ్రీకాంత్. చిత్రంలో నిందితుడు, పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

రాజమహేంద్రవరం (ఏవీఏ రోడ్డు), న్యూస్‌టుడే: వివాహ సంబంధాల కోసం మ్యాట్రిమోనీల్లో వివరాలు నమోదు చేసుకున్న ఒంటరి, వితంతు మహిళలను పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. వారి బంగారు ఆభరణాలను అపహరిస్తున్న ఘరానా మోసగాడిని ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో సెంట్రల్ జోన్ ఇన్‌ఛార్జి డీఎస్పీ శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం పి.వడ్డూరు గ్రామానికి చెందిన చల్లా నారాయణ ఎలియాస్ నారాయణ కృష్ణ వివిధ పేర్లతో మ్యాట్రిమోనీల్లోని వివరాలతో వితంతు, ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకునేవాడు. తాను గోవాలో బంగారు వ్యాపారినంటూ వారికి వివాహ ప్రతిపాదనలు పంపేవాడు. పరిచయం పెంచుకున్నాక.. నీ జాతకంలో దోషాలు ఉన్నాయని, రాజమహేంద్రవరం వస్తే గోదావరిలో పుణ్యస్నానమాచరించి పూజలు చేద్దామంటూ నమ్మించేవాడు. నగలు పెట్టుకుని వస్తే మా తల్లిదండ్రులకు కూడా నచ్చుతావంటూ మాయమాటలు చెప్పేవాడు. ఇలా విశాఖ, నెల్లూరు, కడప, శ్రీకాకుళం, హైదరాబాద్‌కు చెందిన పలువురు మహిళలు రాజమహేంద్రవరం వచ్చారు. స్నానమాచరించిన అనంతరం పూజాసామగ్రి తీసుకొస్తానని చెప్పి, వారు తెచ్చిన బంగారు ఆభరణాల బ్యాగులతో ఉడాయించేవాడు. తొమ్మిది నెలల కాలంలో ఇతడిపై రాజమహేంద్రవరం మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఐదు చీటింగ్ కేసులు నమోదయ్యాయని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడి నుంచి సుమారు రూ.75 లక్షల విలువచేసే 340 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు కార్లు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో పలు జిల్లాల్లోని పోలీస్ స్టేషన్లలో పోక్సో, చీటింగ్, మర్డర్, రౌడీషీట్ తదితర ఏడు కేసులున్నాయి. కర్ణాటకలోని చిక్‌భళ్లాపుర పరిధిలో నాన్ బెయిల్‌బుల్ వారెంట్ ఉంది.

గొట్టిప్రోలు కోటదిబ్బకు పురావస్తు ప్రాధాన్య స్థలంగా గుర్తింపు

అభిప్రాయాలు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్

ఈనాడు, దిల్లీ: తిరుపతి జిల్లాలోని నాయుడుపేటకు సమీపంలోని గొట్టిప్రోలు కోటదిబ్బ వద్ద పురావస్తు శాఖ తవ్వకాలు జరిపిన ప్రాంతాన్ని జాతీయ ప్రాధాన్యమున్న పురావస్తు స్థలంగా ప్రకటించాలనుకుంటున్నట్లు కేంద్ర సాంస్కృతిక శాఖ పేర్కొంది. ఈ మేరకు శనివారం నోటిఫికేషన్ జారీ చేసింది. పురాతన స్మారకాలు, స్థలాలు, అవశేషాల చట్టం 1958లోని సెక్షన్ 4(1) కింద ఉన్న అధికారాలను అనుసరించి ఈ ప్రాంతాన్ని జాతీయ ప్రాధాన్యమున్న పురావస్తు స్థలంగా ప్రకటించాలనుకుంటున్నామని, అభ్యంతరాలుంటే రెండు నెలల్లోపు డైరెక్టర్ జనరల్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, 24 తిలక్‌మార్గ్, న్యూదిల్లీ-11001 చిరునామాలో నేరుగా, పోస్టులో, dg.asi@gov.in మెయిల్‌లో పంపాలని సూచించింది.

ఇదీ నేపథ్యం: భారత పురావస్తు సర్వే విభాగం 2019లో చేపట్టిన తవ్వకాల్లో ఇక్కడ భారీ ఇటుకలతో నిర్మించిన ప్రాకారంతో కూడిన విశాలమైన నివాస సముదాయ అవశేషాలు వెలుగులోకి వచ్చాయి. ఈ తవ్వకాల్లో విష్ణుమూర్తి శిల్పం, మట్టిపాత్రలు బయటపడ్డాయి. ఇక్కడ లభించిన ఇటుకలు శాతవాహనులు/ఇక్ష్వాకుల కాలంలో అమరావతి, నాగార్జునకొండల్లో లభించిన వాటిని పోలి ఉన్నాయి. వీటి రూపురేఖలు, పరిమాణాన్ని బట్టి ఇవి రెండు వేల ఏళ్ల పూర్వం నాటివని అంచనా వేశారు.

రాతపరీక్షతో సమానంగా ఇంటర్వ్యూకు మార్కులా?

- ఆ రేషన్ డీలర్ ఎంపికను రద్దుచేసి, కొత్తగా చేపట్టండి
- గత ఆదేశాల ఉల్లంఘనపై హైకోర్టు ఆక్షేపణ



ఈనాడు, అమరావతి: చౌకధరల దుకాణాల కేటాయింపులో రాతపరీక్షతో సమానంగా ఇంటర్వ్యూకు 50 మార్కులు నిర్ణయించడాన్ని తప్పుపడుతూ హైకోర్టు సింగిల్ జడ్జి అంతకుముందు ఇచ్చిన ఆదేశాలకు భిన్నంగా అధికారులు పాత పద్ధతిలోనే ఎంపిక చేయడాన్ని హైకోర్టు ధర్మాసనం ఆక్షేపించింది. కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా జరిగిన దుకాణాల కేటాయింపు ప్రక్రియ.. చట్టం ముందు నిలవదని, వాటిని సమర్థించలేమని స్పష్టంచేసింది. 2013 ఏప్రిల్ 4న హైకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇంటర్వ్యూ మార్కులు నిర్ణయించి, మళ్లీ ఎంపిక ప్రక్రియ చేపట్టాలని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ఉమ్మడి విజయనగరం జిల్లా సాలూరు పట్టణంలోని రేషన్ దుకాణం-15 కేటాయింపునకు పార్వతీపురం ఆర్డీవో 2012లో నోటిఫికేషన్ ఇచ్చారు. రాత పరీక్షకు 50, ఇంటర్వ్యూకు 50 మార్కుల చొప్పున నిర్దేశించారు. ఈ డీలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకున్న కోట నాగమణి అనే మహిళ.. రాత పరీక్షలో 50 మార్కులు పొందినప్పటికీ, ఇంటర్వ్యూలో ఎంపిక కాలేదు. దీనిపై ఆమె హైకోర్టులో వ్యాజ్యం వేశారు. ఎంపిక ప్రక్రియను సవాలు చేయడంతో పాటు ఇంటర్వ్యూకు 50 మార్కులుగా నిర్ణయించిన జీవోను ప్రశ్నించారు. దీన్ని విచారించిన సింగిల్ జడ్జి.. పిటిషనర్ ఇంటర్వ్యూకు హాజరై, ఎంపిక కాలేదని తెలిశాక హైకోర్టును ఆశ్రయించడాన్ని తప్పుపట్టారు. ఆమె వ్యాజ్యాన్ని కొట్టేస్తూ 2014 జూన్ 19న తీర్పు ఇచ్చారు.

కొత్త మార్గదర్శకాలు లేకుండానే నియామకాలా?

ఈ తీర్పును సవాలుచేస్తూ ఆమె అదే ఏడాది ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. దీనిపై ఇటీవల ధర్మాసనం విచారించింది. నాగమణి తరఫు న్యాయవాది తడ్డి నాగేశ్వరరావు వాదించారు. 'ఇంటర్వ్యూకు 50 మార్కులు కేటాయించడాన్ని తప్పుపడుతూ హైకోర్టు సింగిల్ జడ్జి గతంలో స్పష్టమైన తీర్పు ఇచ్చారు. డీలర్ల నియామక పాలసీని సమీక్షించి ఇంటర్వ్యూ మార్కులు సముచితంగా ఉండేలా నిర్ణయించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. కానీ, ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు ఇవ్వలేదు. హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా డీలర్లను నియమిస్తోంది' అని పేర్కొన్నారు. ధర్మాసనం స్పందిస్తూ, 'ఎంపిక ప్రక్రియలో నాగమణి పాల్గొని ఫెయిల్ అయ్యాక పిటిషన్ వేసినందున.. సహజంగా అయితే మేం ఈ విషయంలో జోక్యం చేసుకోం. ఇంటర్వ్యూకు 50 మార్కులుగా పేర్కొంటూ 2011లో ఇచ్చిన జీవో 4ను కొట్టేయడంతో పాటు కొత్తగా మార్గదర్శకాలు రూపొందించాలని సింగిల్ జడ్జి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, వాటికి భిన్నంగా అధికారులు వ్యవహరించినందున జోక్యం చేసుకుంటున్నాం. సాలూరులోని రేషన్ షాపు-15కు తాజాగా ఎంపిక ప్రక్రియ చేపట్టండి' అని అధికారులను ఆదేశించింది.



దాత అందజేసిన వైద్య పరికరాలు ★ దాతను సత్కరించి జ్ఞాపిక అందిస్తున్న తితిదే వైద్య, విద్య జేఈవో డాక్టర్ ఏ.శరత్

రూ.90 లక్షల వైద్య పరికరాల విరాళం

శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి అందజేసిన దాత

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుపతిలోని తితిదే శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి ముంబయికి చెందిన అల్కెమ్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మధురిమ సింగ్ శనివారం రూ.90 లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను అందించారు. వాటిల్లో 4 హైఎండ్ వెంటిలేటర్లు, 4 పేషెంట్ మానిటర్లు, 4 హ్యుమిడిఫయర్లు, 4 హై ఫ్లో నాసల్ కేన్యులా (హెచ్ఎఫ్ఎన్‌సీ) పరికరాలు ఉన్నాయి. త్వరలో ప్రారంభం కానున్న పిల్లల ఆసుపత్రికి అవసరమైన పరికరాలను విరాళంగా అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని తితిదే విద్య, వైద్య జేఈవో డాక్టర్ ఎ.శరత్ అన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ శ్రీనాథరెడ్డి, ఆర్ఎంవో భరత్, అల్కెమ్ ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ బాల మహోత్సవ్-2026 ప్రారంభం


క్రీడా జ్యోతి వెలిగిస్తున్న లావు శ్రీకృష్ణదేవరాయలు, భవ్య వట్టికూటి

పొన్నూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు కలలు కని.. వాటిని పట్టుదలతో సాధించాలని విజ్ఞాన్స్ పూర్వ విద్యార్థి, ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీస్(ఐఆర్ఎంఎస్) అధికారిణి భవ్య వట్టికూటి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం 'బాల మహోత్సవ్-2026'ను అతిథులతో కలిసి ఆమె ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా హాజరైన విద్యార్థులకు 50కిపైగా పోటీలు నిర్వహించారు. భవ్య మాట్లాడుతూ.. 'విజ్ఞాన్స్‌లో చదివే సమయంలో సివిల్స్ సాధించాలనుకున్నాను. నిరంతరం శ్రమించి లక్ష్యం చేరుకున్నాను. సివిల్స్‌కు ఎంపికై మళ్లీ విజ్ఞాన్స్‌కు రావడం సంతోషంగా ఉంది' అని తెలిపారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. 'ప్రతి ఆట ఒక పాఠమే. విజయాన్ని ఆనందంగా స్వీకరించాలి. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా క్రీడల్లో భాగస్వాములు కావాలి. వ్యక్తిగత ప్రతిభతో పాటు జట్టు సభ్యులతో కలిసి పనిచేయడం చాలా అవసరం' అని పేర్కొన్నారు. విజ్ఞాన్స్ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, ఇన్‌ఛార్జి వీసీ కె.వి క్రిష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బోధనాసుపత్రుల్లో ఓపీ సేవల నిబంధన కఠినతరం

- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తప్పనిసరి
- భోజన విరామం పేరుతో సేవల నిలుపుదలపై డీఎంఈ అభ్యంతరం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధన, అనుబంధ ఆసుపత్రుల్లో ఇకపై ఓపీ రిజిస్ట్రేషన్, కన్సల్టేషన్ సేవలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విరామం లేకుండా కొనసాగాలని వైద్య విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు వైద్య విద్య సంచాలకులు అన్ని ప్రభుత్వ బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లు, వైద్యకళాశాలల ప్రిన్సిపాళ్లకు మెమో జారీచేశారు. పలు వైద్యశాలల్లో మధ్యాహ్నం 12.30 గంటలు/ఒంటి గంట నుంచి 3 గంటలవరకు భోజన విరామం పేరుతో ఓపీ సేవలు నిలిపివేస్తున్న విషయం అధికారుల దృష్టికి రావడంతో వైద్యులను అప్రమత్తం చేస్తూ మెమో జారీచేశారు. విధుల్లో ఉన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఓపీ సేవలకు ఆటంకం కలగకుండా దశల వారీగా భోజన విరామం తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి వైద్యుడు రోజుకు కనీసం 40 మంది రోగులకు ఓపీ సేవలు అందించాలని తెలిపారు. ఒక్కో రోగికి కనీసం 10 నిమిషాల సమయం కేటాయించి పూర్తిస్థాయిలో పరీక్ష చేసి, ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని కౌన్సెలింగ్ ఇవ్వాలని స్పష్టంచేశారు. అన్ని వైద్యశాలల్లో ఓపీ వేళల బోర్డులు ఏర్పాటుచేసి తక్షణమే అమలుచేయాలని స్పష్టంచేశారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణిస్తామని మెమోలో డీఎంఈ హెచ్చరించారు.

ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం అభ్యంతరం

డీఎంఈ జారీచేసిన మెమోపై ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) అభ్యంతరం తెలిపింది. ఈ ఉత్తర్వులను నిలిపివేయాలని వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డి.జయధీర్ కోరారు. అత్యవసర పరిస్థితులు లేని సమయంలో భోజన విరామం కూడా లేకుండా ఓపీ సేవలు కొనసాగించాలనడం సరికాదన్నారు. వైద్యులపై చర్యలు తీసుకుంటే సేవా నిబంధనల ఉల్లంఘన కింద భావించి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు

అంబటి వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా నిరసన సెగలు

పోలీసులకు ఫిర్యాదులు.. పలు ఠాణాల్లో కేసుల నమోదు




అనంతపురం జిల్లా ఎస్పీకి రాంబాబుపై ఫిర్యాదు చేస్తున్న తెదేపా నేతలు ★ చిలకలూరిపేట పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కూటమి నాయకులు

న్యూస్‌టుడే యంత్రాంగం: సీఎం చంద్రబాబుపై వైకాపా నేత అంబటి రాంబాబు చేసిన మురికి వ్యాఖ్యలపై తెదేపాతో పాటు కూటమి పార్టీల శ్రేణులు భగ్గుమన్నాయి. శనివారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలిపాయి. రాంబాబు తక్షణమే సీఎంకు క్షమాపణ చెప్పాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ డిమాండ్ చేశారు. వారు పార్టీ శ్రేణులతో కలిసి చిలకలూరిపేటలో నిరసన తెలిపారు. రాజుపాలెం మండలం కొండమోడు కూడలి వద్ద, అమరావతి మండలం ధరణికోటలో అంబటి దిష్టిబొమ్మలను దహనం చేశారు. నరసరావుపేట, రొంపిచర్ల ఠాణాల్లో అంబటి, జోగి రమేశ్‌లపై తెదేపా నేతలు ఫిర్యాదు చేశారు. బాపట్ల, చీరాల, పర్చూరులోనూ నిరసన తెలిపారు.

■ కృష్ణా జిల్లా మచిలీపట్నం, అవనిగడ్డ, నాగాయలంక తదితర చోట్ల పెద్ద సంఖ్యలో తెదేపా శ్రేణులు రోడ్లపైకి వచ్చి రాంబాబు దిష్టిబొమ్మలు తగలబెట్టారు. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అంబటి దిష్టిబొమ్మలను దహనం చేశారు. పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. 24 గంటల్లోగా రాంబాబు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే, తీవ్ర చర్యలు ఉంటాయని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య హెచ్చరించారు.

■ రాంబాబు తక్షణమే బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, తెదేపా విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సి.హెచ్.వి.పట్టాభిరామ్ డిమాండ్ చేశారు. విశాఖలో రాంబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంవీపీకాలనీ, కంచరపాలెం స్టేషన్‌లో ఫిర్యాదులు అందజేశారు.

■ కడపలోని కోటిరెడ్డి కూడలిలో రాంబాబు దిష్టిబొమ్మను తెదేపా నాయకులు దహనం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు భూపేశ్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యేలు మాధవి, వరదరాజులరెడ్డి పాల్గొన్నారు.

■ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లావ్యాప్తంగా అంబటి తీరును తెదేపా నేతలు ఎండగట్టారు. ఏలూరు జిల్లా తెదేపా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ అంబటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అంబటి వ్యాఖ్యలను ఖండించారు. తాడేపల్లిగూడెం పట్టణ స్టేషన్‌లో తెలుగు యువత నాయకుడు పసల వెంకటాచలం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు పెట్టారు. ఆకివీడులోనూ ఎస్సైకి ఫిర్యాదు అందజేశారు.

■ ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా తెదేపా శ్రేణులు, అభిమానులు ఆగ్రహించారు. నగరంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, నాయకులతో కలిసి అంబటి దిష్టిబొమ్మను తగలబెట్టారు. వైకాపా కుసంస్కారానికి రాంబాబు వ్యాఖ్యలే నిదర్శనమని ఆర్టీసీ కడప రీజినల్ ఛైర్మన్ నాగరాజు విమర్శించారు. తెదేపా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఎమ్మెల్యే బండారు శ్రావణితో కలిసి జిల్లాకు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.



డీఎస్పీ అరవింద్‌తో మాట్లాడుతున్న తెదేపా ఎమ్మెల్యే గళ్లా మాధవి

■ రాంబాబుపై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ తెదేపా జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా కోరంగి ఠాణాలో ఫిర్యాదులు అందాయి. రాంబాబు నోరు అదుపులో పెట్టుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు హెచ్చరించారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులను చూసి ఓర్వలేక వైకాపా నాయకులు ఇలా మాట్లాడుతున్నారని రాజమహేంద్రవరం అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మండిపడ్డారు.

■ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో తెదేపా శ్రేణులు నిరసన తెలిపాయి. రాంబాబు క్షమాపణ చెప్పాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని డిమాండ్ చేశారు. నాయుడుపేటలో అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు.



అంబటి వ్యాఖ్యలను ఖండిస్తూ గుంటూరులోని ఆయన నివాసం వద్ద చీపుర్లతో మహిళల నిరసన



గుంటూరులోని అంబటి ఇంటి వద్ద ధ్వంసమైన వాహనాలు

కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టును... ఏపీ పౌల్ట్రీ రైతులకే ఇవ్వాలి

- గత ప్రభుత్వం పొరుగు రాష్ట్రాలకూ అవకాశమిచ్చింది
- ఫలితంగా రాష్ట్రంలో పరిశ్రమ నష్టపోయింది
- పాత విధానాన్నే అమలు చేయాలి
- సీఎం చంద్రబాబుకు పౌల్ట్రీ ఫెడరేషన్ విన్నపం

ఈనాడు, అమరావతి: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్ట్‌ను రాష్ట్రానికి చెందిన రైతులకే ఇవ్వాలని 'ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్' ప్రతినిధులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు. చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం తులసినాయనపల్లెలో శనివారం రాత్రి వారు సీఎంను కలిసి వినతిపత్రం అందించారు. అంగన్వాడీలు, పాఠశాలలకు కోడిగుడ్ల సరఫరా కాంట్రాక్టు టెండర్లలో తమిళనాడు, కర్ణాటక, తెలంగాణకు చెందినవారూ పాల్గొనేందుకు గతంలో వైకాపా ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని, దాంతో రాష్ట్రంలోని పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోయారని, పరిశ్రమ కుదేలైందని వాపోయారు. వైకాపా విధానం వల్ల రైతుల కంటే కాంట్రాక్టర్లే ఎక్కువ లబ్ధి పొందారన్నారు. 'మీరు 2014-19 మధ్య పాఠశాలలు, అంగన్వాడీలకు కోడిగుడ్లు సరఫరా చేసే అవకాశం మాకే ఇచ్చి అండగా నిలిచారు. వైకాపా ఆ విధానాన్ని మార్చేసింది. కూటమి అధికారంలోకి వచ్చాక కూడా... 2025-26 సంవత్సరానికి గుడ్ల సరఫరాకు గత ప్రభుత్వ విధానాన్నే అనుసరించారు. అది రాష్ట్రంలోని కోళ్ల పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రభుత్వ విధానమైన రెండంకెల వృద్ధికి విఘాతం కలుగుతోంది' అని ఫెడరేషన్ ప్రతినిధులు వివరించారు. 2026-27 సంవత్సరానికి కోడిగుడ్ల సరఫరా కోసం ప్రభుత్వం మళ్లీ టెండర్లు పిలిచిందని, ఈసారైనా పాత ప్రభుత్వ విధానాన్ని మార్చి, రాష్ట్రానికి చెందిన రైతులకే టెండర్లలో పాల్గొనే అవకాశమివ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఒక జిల్లాకు ఒక సంస్థకే...

కార్పొరేట్ కోళ్ల ఫారాలు, కాంట్రాక్టర్లను కొంత మేర నియంత్రించేందుకు ఒక జిల్లాకు ఒక సంస్థకు మాత్రమే అవకాశమివ్వాలని సీఎంను పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. 'కోళ్ల పరిశ్రమ కష్టనష్టాలపై అవగాహన ఉన్న మీరు అన్నదాతలను ఆదుకోవాలి. టెండర్లలో పాల్గొనే అవకాశం రాష్ట్ర రైతులకే ఇవ్వడం వల్ల ప్రభుత్వానికి కొనుగోలు ధర తగ్గుతుంది. పరిశ్రమకూ మేలు ఒనగూరుతుంది. నిర్ణీత సమయానికి, నాణ్యమైన గుడ్లు సరఫరా చేస్తాం'అని ఫెడరేషన్ ప్రతినిధులు చెప్పారు.

ఈ ఆహ్వానం.. మహిళలకు ప్రత్యేకం!

గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నియంత్రించేందుకు ప్రభుత్వం వినూత్న ఆలోచన చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 30 ఏళ్లు పైబడిన మహిళలకు ఆహ్వాన పత్రిక అందించి ప్రత్యేక ఆరోగ్య పరీక్షలకు రావాలంటూ ఆహ్వానిస్తోంది. ఆ పరీక్షలు ఎక్కడ చేస్తారో ప్రదేశం, తేదీ, సమయాన్ని పత్రికలో ముద్రించారు. జిల్లాకు రెండు లక్షల చొప్పున వీటిని పంపించగా.. వైద్య సిబ్బంది మహిళలకు నేరుగా ఈ ఆహ్వాన పత్రికను ఇస్తున్నారు. - న్యూస్‌టుడే, సత్తెనపల్లి



పట్టణ ప్రాంతాల్లో భూముల విలువ పెంపునకు లభించని ఆమోదం

ఈనాడు, అమరావతి: ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువ పెంచాలని రెవెన్యూ శాఖ పంపించిన దస్త్రానికి సీఎం ఇంకా ఆమోదముద్ర వేయలేదు. పట్టణ ప్రాంతాల్లో ఏటా నిర్మాణ విలువను పెంచుకునే నిబంధన ఉంది. దీనికి అనుగుణంగా పెంపునకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ఆదేశించింది. ఫిబ్రవరి 1 నుంచి పెరుగుదల అమల్లోకి తెచ్చేలా ఇప్పటికే జిల్లా స్థాయి కమిటీలు కసరత్తు పూర్తిచేసి, సీఎం ఆమోదం కోసం దస్త్రం పంపారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఇంకా ఏ నిర్ణయమూ వెలువడలేదు.

ఉద్వేగ భరితం... సమ్మక్క వన ప్రవేశం

ముగిసిన నాలుగు రోజుల మహా జాతర

ఈనాడు, మేడారం: గద్దెపై కొలువై మేడారంలో మూడు రోజులపాటు పూజలందుకున్న సమ్మక్క తల్లిని భక్తుల జయజయధ్వానాల మధ్య పూజారులు వన ప్రవేశం చేయించారు. శనివారం సాయంత్రం నిర్వహించిన ఈ వేడుక ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అమ్మను సాగనంపే క్రతువులో గిరిజన సంగీత వాయిద్యాల చప్పుళ్లకు, కొమ్ముబూరల శబ్దాలకు భక్తులు నృత్యాలు చేశారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. మిగతా గద్దెలపై పూజలందుకున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను సైతం ఆయా గొట్ల పూజారులు తమ ప్రాంతాల్లోని ఆలయాలకు తీసుకెళ్లారు. ఆదివాసీ పూజారులు సమ్మక్కను గద్దె నుంచి తీసుకొని చిలకలగుట్టకు చేర్చే వరకు దారిపొడవునా భక్తులు వెంటనడిచారు. మరోవైపు సారలమ్మను రాత్రి సమయంలో కన్నెపల్లి, గోవిందరాజును ఏటూరునాగారం మండలం కొండాయికి చేర్చారు. పగిడిద్దరాజు కూడా రాత్రి సమయంలో బయలుదేరినా... మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని గుడిలోకి ఆదివారం ఉదయం ప్రవేశం చేయించనున్నారు.



శనివారం రాత్రి సమ్మక్కను మేడారం నుంచి వనప్రవేశానికి తీసుకెళ్తున్న గిరిజన పూజారులు

కవలలకు జన్మనిచ్చిన రామ్‌చరణ్, ఉపాసన దంపతులు

ఎక్స్‌లో చిరంజీవి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: రామ్‌చరణ్, ఉపాసన దంపతులు కవలలకు జన్మనిచ్చారు. ఈ విషయాన్ని నటుడు చిరంజీవి శనివారం అర్ధరాత్రి 12 గంటలకు ఎక్స్ ద్వారా వెల్లడించారు. 'అపార ఆనందంతో ఈ శుభవార్తను మీతో పంచుకుంటున్నాను. రామ్‌చరణ్, ఉపాసన దంపతులకు కవలలు(మగబిడ్డ, ఆడపిల్ల) జన్మించారు. తల్లీపిల్లలు ఆరోగ్యంగా, క్షేమంగా ఉన్నారు' అని తెలిపారు.

రాష్ట్రంలో ఇక చలి లేనట్లే

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గుముఖం పట్టింది. క్రమంగా పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫిబ్రవరిలో ఉత్తర కోస్తా జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా, దక్షిణ కోస్తా, రాయలసీమలో సాధారణంగా నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) పేర్కొంది. ఫిబ్రవరికి సంబంధించిన వాతావరణ అంచనాలను శనివారం ఐఎండీ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరగొచ్చని తెలిపింది.

సిట్ విచారణకు సహకరిస్తా

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారికి లేఖ రాసిన కేసీఆర్



ఈనాడు, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు హాజరవుతానని తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ నందినగర్‌లోని తన ఇంట్లో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు అందుబాటులో ఉంటానని.. సిట్ అధికారులు అక్కడికే వచ్చి తన వాంగ్మూలం సేకరించవచ్చని సూచించారు. ఈ మేరకు సిట్‌కు శనివారం ఆరుపేజీల సుదీర్ఘ లేఖ రాశారు. ఆ లేఖలో ఓవైపు కేసుల విచారణకు సంబంధించి పలు న్యాయస్థానాలు వెలువరించిన తీర్పులనూ ప్రస్తావిస్తూనే.. మరోవైపు తనకు నోటీసులు జారీ చేయడంలో సిట్ వ్యవహరించిన తీరును తప్పుబట్టారు.

జీవన పోరాటం.. గాల్లో ప్రాణం!



విద్యుత్ తీగలను తీసుకెళ్లే భారీ టవర్లను తలపైకెత్తి చూస్తేనే ఒక రకమైన భయం పుడుతుంది. అలాంటిది అంత ఎత్తులో పని చేయడమంటే సాహసమనే చెప్పాలి. వైఎస్సార్ కడప జిల్లా సీకేదిన్నె మండలంలోని ఎన్టీపీసీ నుంచి అనంతపురం జిల్లా వరకు 440 కేవీ లైన్‌లు వేస్తున్నారు. పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన కార్మికులు దాదాపు 30-55 మీటర్ల ఎత్తులో తీగలకు వేళ్లాడుతూ ఈ పనులు చేస్తున్నారు. మధ్య మధ్యలో సేదతీరడం, భోజనం కూడా పైనే చేసి.. సాయంత్రమే కిందకు దిగుతారు. – ఈనాడు, కడప

తెలుగు రాష్ట్రాల్లో గ్రూప్-1 టాపర్ లక్ష్మీదీపిక

- స్థానికేతర కోటాలో ఏపీలో మొదటి ర్యాంకు
- ఎంబీబీఎస్ పూర్తి చేసి.. సివిల్స్ లక్ష్యంగా అడుగులు



లక్ష్మీ దీపిక

ఈనాడు, అమరావతి: తెలంగాణ గ్రూప్-1లో మొదటి ర్యాంకు సాధించిన లక్ష్మీదీపిక కొమ్మిరెడ్డి ఏపీ గ్రూప్-1 ఫలితాల్లోనూ టాపర్‌గా నిలిచారు. స్థానికేతర కోటాలో ఏపీలో గ్రూప్-1 రాశారు. లక్ష్మీదీపిక పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లోనే అయినా ఆమె తల్లిదండ్రులది ఏపీ. తండ్రి కృష్ణది అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కాగా.. తల్లి పద్మావతి పశ్చిమ గోదావరి జిల్లా వాసి. ఇప్పటికే తెలంగాణ గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టర్ పోస్టు సాధించిన లక్ష్మీదీపిక అక్కడ శిక్షణలో ఉన్నారు. ఏపీలోనూ డిప్యూటీ కలెక్టర్ పోస్టు వచ్చినందున ఎక్కడ కొనసాగాలనే దానిపై నిర్ణయం తీసుకోలేదని తెలిపారు.

వైద్య విద్య నుంచి..

లక్ష్మీదీపిక పదో తరగతి వరకు హైదరాబాద్‌లో సఫిల్‌గూడలోని డీఏవీ పాఠశాలలో, ఇంటర్మీడియట్ నారాయణగూడలోని శ్రీచైతన్యలో చదివారు. 2013లో మెడిసిన్‌లో 119 ర్యాంకు సాధించి ఉస్మానియా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చేశారు. ఆ తర్వాత నుంచి సివిల్స్ లక్ష్యంగా సిద్ధమవుతున్నారు. అందుకే 2023లో ఏపీ గ్రూప్-1 ఫలితాల్లో ఎంపీడీఓ పోస్టు వచ్చినా చేరకుండా యూపీఎస్సీపై దృష్టిపెట్టారు. రెండు సార్లు ఇంటర్వ్యూ వరకూ వెళ్లారు. మరో రెండు అవకాశాలు ఉన్నందున ఆ దిశగా ప్రయత్నిస్తున్నారు. యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ సిలబస్‌ల్లో 80% కామన్‌గా ఉండడంతో ప్రత్యేక సన్నద్ధత లేకుండానే ఏపీ, తెలంగాణల్లో గ్రూప్-1 టాపర్‌గా నిలిచి చరిత్ర సృష్టించారు. గ్రూప్-1 పరీక్షలు రాయడం సివిల్స్ సన్నద్ధత ఉపయోగపడిందని ఆమె తెలిపారు. ''గ్రూప్-1 పరీక్ష తీరు పరిశీలించాక శిక్షణ తీసుకోకుండానే సన్నద్ధమయ్యా. గ్రూప్స్‌లో ఐచ్ఛిక సబ్జెక్టు ఉండకపోవడంతో జనరల్ స్టడీస్‌పై దృష్టి పెట్టా. పరీక్షల సమయంలో రోజుకు 6 గంటల చొప్పున సన్నద్ధకు కేటాయించా. ప్రజా సేవ చేయాలన్నదే నా ఆకాంక్ష. ఈ లక్ష్యంతోనే సివిల్స్‌కు ప్రయత్నిస్తున్నా''. అని లక్ష్మీదీపిక తెలిపారు.

వైఎస్సార్ కడప జిల్లాలో 227 తుపాకీ లైసెన్స్‌ల రద్దు

- గత వైకాపా ప్రభుత్వంలో అరాచక శక్తులకు లైసెన్స్‌లు

ఈనాడు, కడప: వైఎస్సార్ కడప జిల్లాలో 227 తుపాకీ లైసెన్సుల్ని ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఎర్రచందనం స్మగ్లర్లు, కబ్జాదారులు, కిరాయి రౌడీలు, గూండాలకు గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇష్టానుసారంగా తుపాకీ లైసెన్స్‌లు ఇచ్చేశారు. లైసెన్స్‌లు పొందిన వారిలో కొందరు అరాచకశక్తులు తుపాకులు చూపించి దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడ్డారు. దీనిపై 2025 నవంబరు 26న 'అరాచకశక్తుల చేతుల్లో తుపాకులు!' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ప్రత్యేక పోలీసు బృందాల్ని నియమించి.. జిల్లాలో జారీ చేసిన 854 తుపాకీ లైసెన్స్‌ల్లో అర్హులెవరు? అసాంఘిక శక్తులకు లైసెన్స్‌లు ఇచ్చారా? అన్నది విచారించారు. 227 మంది లైసెన్స్‌దారులు వివిధ నేరాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. వారిలో 11 మంది కరుడుగట్టిన నేరస్తులని, మరో ముగ్గురు నిబంధనలు ఉల్లంఘించి తుపాకులతో నేరాలకు పాల్పడ్డారని బయటపడింది. 227 మంది లైసెన్స్‌ల రద్దుకు ఎస్పీ జిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

మల్కిరెడ్డి హనుమంతరెడ్డితో సహా పలువురికి రద్దు

తుపాకీ లైసెన్స్‌లు రద్దయినవారిలో జమ్మలమడుగుకు చెందిన వైకాపా నేత మల్కిరెడ్డి హనుమంతరెడ్డి, పులివెందులలో కాల్పులు జరిపిన భరత్‌యాదవ్, వీరపునాయునిపల్లె మండలం పాయసంపల్లెకు చెందిన నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు. కమలాపురం మండలం అప్పాయపల్లి గ్రామానికి చెందిన గుత్తేదారు ఎం.శ్రీనివాసులరెడ్డి, కడప నగరం ఎస్‌బీఐ కాలనీకి చెందిన షేక్ జాకీర్ లైసెన్స్‌ను రద్దు చేశారు. పులివెందుల, కడప, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో ఎక్కువ లైసెన్స్‌లు రద్దయ్యాయి. వారిలో ఎక్కువ మంది గత ప్రభుత్వంలో వైకాపా నేతల అండతో తుపాకీ లైసెన్స్‌లు పొందినవారే.

రైతులే ఈ-పంటలో నమోదు చేసుకోవచ్చు

- వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఈనాడు, అమరావతి: సాగు చేస్తున్న పంటల వివరాలను 'ఈ-పంట' వెబ్‌సైట్‌లో అన్నదాతలే స్వయంగా నమోదు చేసుకునేలా ఏర్పాట్లు చేశామని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు 'ఈ-పంట'లో పంటల నమోదును రైతు సేవా కేంద్రం సహాయకులు చేసేవారు.

76% రైతులకే విశిష్ట గుర్తింపు సంఖ్య

'రాష్ట్రంలో విశిష్ట గుర్తింపు సంఖ్యను రైతులందరూ ఇంకా పొందలేదు. మొత్తం 60 లక్షల మంది రైతులు ఐడీ పొందేందుకు అర్హులని తేల్చారు. ఇందులో 47 లక్షల మందే ఆ సంఖ్యను పొందారు. విశిష్ట గుర్తింపు సంఖ్యను తీసుకోని రైతుల వివరాలను అన్ని జిల్లాలకు పంపాము. క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి వారితో ఆ ఐడీ పొందే ఏర్పాట్లు చేయాలి' అని డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. పీఎం కిసాన్‌లో నమోదు కాని 12 లక్షల మంది రైతులు 19వ విడత సాయం పొందారని, ఫార్మర్ రిజిస్ట్రీలో ఇప్పటికీ వారి వివరాలు నమోదు చేసుకోలేదని, ఇలాగైతే వారు తదుపరి విడతల సాయం పొందలేరని ఆయన వివరించారు. వ్యవసాయ సిబ్బంది తక్షణమే.. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదయ్యేలా చూడాలన్నారు. శనివారం ఆయన జిల్లాల వ్యవసాయాధికారులు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు.

నమోదు ఇలా ..

- ■ రైతులు వారి మొబైల్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి APAIMS 2.0 మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ■ ఆధార్ నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసి MPIN సెట్ చేసుకోవాలి.
- ■ ఆధార్ నంబర్ ఆధారంగా వెబ్‌ల్యాండ్‌తో అనుసంధానమైన రైతుకు చెందిన అన్ని భూ కమతాలు ఆ యాప్‌లో కనిపిస్తాయి.
- ■ ఇప్పటివరకు రైతు సేవా కేంద్రం సహాయకుడు పంట నమోదు చేయని భూములకు సంబంధించి కూడా రైతులే స్వయంగా నమోదు చేసుకోవచ్చు
- ■ పంట నమోదు సమయంలో 20 మీటర్ల జియో రిఫరెన్సు హద్దులతో కూడిన పొలంలో ఫొటో తీసుకోవాలి. ఇందుకోసం రైతు తప్పనిసరిగా తన పొలంలోనే ఉండాలి.
- ■ ఇలా నమోదు చేసిన సమాచారం సంబంధిత రైతు సేవా కేంద్రం సహాయకుడి ధ్రువీకరణకు వెళ్తుంది. పంట నమోదు స్థితిగతులపై ఆ రైతుకూ సమాచారం అందిస్తారు.
- ■ ఈ యాప్ సహకారంతో రైతు సేవా కేంద్రం సహాయకుడు నమోదు చేసిన పంట వివరాలు సరిగా ఉన్నాయో లేదో కూడా పరిశీలించుకోవచ్చు.
- ■ అవి సరిగా లేకపోతే ఫిర్యాదు చేసే అవకాశమూ రైతులకు కల్పించారు

సంపాదన మొదలయ్యాక ఈ తప్పు చేయొద్దు



డబ్బు సంపాదించడం మొదలయ్యాక చాలా మందికి ఓ కోరిక కలుగుతుంది. అదేంటంటే.. నచ్చిన వస్తువులన్నీ వెంటనే కొనేయాలని, తాము కూడా సంపాదిస్తున్నామన్న విషయం ఇతరులు గుర్తించాలని ఆరాటపడుతుంటారు. దీనివల్ల అవసరం లేని వస్తువులకు, ఆడంబరాలకు డబ్బు వెదజల్లుతుంటారు. ఈ కోరికను అధిగమించి, తొలి సంపాదన నుంచే మదుపు చేయడం అలవాటు చేసుకున్నవారే సంపన్నులవుతారు.

– షోలా, లైఫ్ కోచ్

రిటైర్డ్ జడ్జిలు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు

- ఏఐఆర్‌జేఏ సమావేశంలో విశాఖ జిల్లా కోర్టు ప్రధాన జడ్జి సీహెచ్ రాజు



సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో విశాఖ జిల్లా కోర్టు ప్రధాన జడ్జి సీహెచ్ రాజు, ఏఐఆర్‌జేఏ ఛైర్‌పర్సన్ సుకుమారన్, సెక్రటరీ జనరల్ జి.కుమరయ్య తదితరులు

విశాఖపట్నం (సాగర్‌నగర్), న్యూస్‌టుడే: సుదీర్ఘ సర్వీసులో అంకితభావంతో న్యాయవ్యవస్థకు విశేష సేవలందించిన రిటైర్డ్ జడ్జిలు.. సమాజంలో న్యాయమూర్తులకు ఉండే గౌరవాన్ని కాపాడుతూ భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తున్నారని విశాఖ జిల్లా కోర్టు ప్రధాన జడ్జి సీహెచ్ రాజు కొనియాడారు. విశాఖలోని రుషికొండలో శనివారం జరిగిన ఆలిండియా రిటైర్డ్ జడ్జిల అసోసియేషన్ (ఏఐఆర్‌జేఏ) జాతీయ సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇలాంటి కార్యక్రమాల్లో 67 నుంచి 97 ఏళ్ల వయసుగల వారు హాజరుకావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఏఐఆర్‌జేఏ ఛైర్‌పర్సన్ సుకుమారన్ మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంట్, క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌కు ప్రత్యేక జీవో విడుదల చేయాలన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు పెన్షన్లు ప్రతి నెలా ఒకటో తేదీన అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐఆర్‌జేఏ సెక్రటరీ జనరల్ జి.కుమరయ్య, ఏపీ రిటైర్డ్ జ్యుడీషియల్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఆర్‌జేఏ) ప్రెసిడెంట్ ఎం.లక్ష్మీనారాయణ, ఏపీఆర్‌జేఏ సెక్రటరీ వి.దత్తాత్రేయగౌడ్, ఆర్గనైజింగ్ కమిటీ (విశాఖపట్నం) ఛైర్మన్ పి.జగన్నాథంనాయుడు, అదనపు కార్యదర్శి దుంపల ధర్మారావు మాట్లాడారు. పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల విశ్రాంత జడ్జిలు దాదాపు 150 మంది పాల్గొన్నారు.

EENADU Vol: 52, Issue: 172 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

కేసర్ రైస్.. రోగన్ జోష్!

ఆదివారం ఆటవిడుపు. ఒక్కోసారి బంధుమిత్రుల్ని ఆహ్వానిస్తుంటాం. వాళ్లతో ముచ్చటిస్తుంటే సమయం సరదాగా గడిచిపోతుంది. మరి మెనూ ఏమిటని ఆలోచిస్తున్నారా?! ఈ రెసిపీలు చేసి చూడండి.. సంతృప్తిగా తినేస్తారు.

రుచీ ఆరోగ్యాల వెజిటబుల్ సూప్

ఆహారం ఆరోగ్యం



టీ, కాఫీల బదులు సూప్ తాగటం అలవాటు చేసుకుంటే ఎంతో మంచిది. అందులోనూ మిక్స్‌డ్ వెజిటబుల్ సూప్ మరీ శ్రేష్ఠం. ఒకసారి ఇలా చేసి చూడండి.. ఇది రుచే కాదు, ఆరోగ్యం కూడా.

ఉల్లి, టొమాటో, క్యారెట్, బీన్స్ - 6, గుమ్మడి, బ్రోకోలి - అర కప్పు చొప్పున, బఠాణీలు - 2 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, వెల్లుల్లి - 3 రెబ్బలు, మిరియాల పొడి - అర స్పూన్, నూనె - స్పూన్, కొత్తిమీర - చారెడు

తయారీ: కూరగాయలన్నింటినీ సన్నగా తరగాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో నూనె వేడి చేసి ఉల్లి, వెల్లుల్లి వేయాలి. అవి కాస్త వేగాక.. అన్ని కూరగాయ ముక్కలూ, ఉప్పు జతచేసి కలియతిప్పుతూ రెండు నిమిషాలు వేయించాలి. అందులో 3 కప్పుల నీళ్లు పోసి మూత పెట్టి ముక్కలు మెత్తబడే వరకూ ఉడికించి, దించేయాలి. చల్లారాక మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ మిశ్రమానికి మిరియాల పొడి చేర్చి మళ్లీ వేడిచేయాలి. చివర్లో కొత్తిమీర జోడించి సెగ తీసేయాలి.

ఎన్నో ప్రయోజనాలు

● ఈ సూప్ తాగటం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి. ● ఉల్లాసం, ఉత్సాహం చేకూరతాయి. ● రోగనిరోధకశక్తి పెరుగుతుంది. ● పీచు అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. ● ఊబకాయం రాదు. బరువు తగ్గాలనుకునేవారికి ఇదెంతో ఉపయుక్తం. ● గుండె ఆరోగ్యానికి మంచిది. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తుంది. కొవ్వు తక్కువగా ఉండటం వల్ల కొలెస్ట్రాల్ నియంత్రణకు తోడ్పడుతుంది. ● మధుమేహం నుంచి ఉపశమనం లభిస్తుంది. ● సులభంగా జీర్ణమై, పోషకాలు అందుతాయి కాబట్టి పిల్లలకు, వృద్ధులకు మరీ మంచిది. ● దీన్ని నూనె లేకుండా కూడా చేసుకోవచ్చు. మిరియాలు సరిపడవనుకుంటే.. జీలకర్ర పొడి వేసుకోవచ్చు.

నా వంట.. మావయ్యతో తంటా!

బ్యాచిలర్స్ కిచెన్





నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో అమ్మ ఊరెళ్లింది. అన్నం వండుకుని.. ప్రియా పచ్చళ్లు, పెరుగుతో లాగించేస్తున్నా. ఇంకా ఆకలేస్తే ఆఫీస్ క్యాంటీన్ ఉండనే ఉంది. ఇంతలో ఆదివారం వచ్చింది. అర్ధాంతరంగా మా మేనమామ వచ్చాడు. హోటల్లో తిందామంటే.. కాదు ఇంటి భోజనమే కావాలన్నాడు. 'ఇదెక్కడి చాదస్తం?' అని తిట్టుకుని అమ్మకి ఫోన్ చేశా. 'బెండకాయ వేపుడు, టొమాటో రసం సులువంది. అచ్చం అమ్మ చెప్పినట్లే కాదుగానీ.. నాకు అర్థమైన ప్రకారం రెండూ చకచకా చేసేశా. బెండకాయ వేసుకుని 'ఏంట్రా.. వడియాల్లా టకటకలాడుతున్నాయి?' అన్నాడు. 'నీ కోసం కష్టపడి చేశా.. వంకలు పెట్టకు' అన్నాను చిరాగ్గా. 'పకోడీల్లా వేయించినట్టున్నావు! కనీసం ఉప్పయినా వేయొద్దా?' అని డబ్బాలు వెతికి తనే తెచ్చుకుని వేసుకున్నాడు. రెండోదైనా మెచ్చుకుంటాడనుకుంటే.. 'ఇదేంట్రా కన్నా? ఎలా చేశావేంటి?' అన్నాడు. నేను వీరోత్సాహంతో 'టొమాటో ముక్కల్లో చెంబుడు నీళ్లు, చింతపండు, కారం, ఉప్పు, పసుపు వేసి మరిగించాను. కరివేపాకే దొరకలేదు' అన్నాను. 'మా నాన్నే! అదొక్కటే తక్కువైందంటావా? జీలకర్ర, మిరియాల సంగతి దేవుడెరుగు.. కనీసం తాలింపైనా వేయొద్దా? ఇట్లా అయితే నా కూతుర్నివ్వడం కష్టమే.. కొంచెం వంట నేర్చుకో' అన్నాడు. 'నానా యాతనాపడి వంట చేస్తే ఇంత ఘోరంగా అవమానిస్తాడా?' అని పిచ్చ కోపమొచ్చింది. కానీ.. ఆయనగారు అదేం పట్టించుకోకుండా, నా వంక చూడకుండా.. 'సర్లే.. పెరుగును నువ్వేం చేయలేవు కాబట్టి బతికిపోయా' అంటూ బెండకాయ ముక్కలను వెలేసినట్టు పక్కకు నెట్టేసి, మొత్తం పెరుగుతో తినేశాడు. ఆ సంగతి మావయ్య ఎందరికెన్నిసార్లు చెప్పి ఆట పట్టించాడో అంతులేదు. వంటరాదు కాబట్టి భరించక తప్పలేదు! కొసమెరుపు ఏంటంటే ఇప్పటికీ వంట రాదు నాకు.

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు, హైదరాబాద్

చికెన్ రోగన్ జోష్



కావలసినవి: బోన్లెస్ చికెన్ - కిలో, పెరుగు - కప్పు, నిమ్మరసం - టేబుల్ స్పూన్, ఉప్పు - తగినంత, నూనె - 4 టేబుల్ స్పూన్లు, జీలకర్ర - స్పూన్, ఉల్లి తరుగు - కప్పు, అల్లం-వెల్లుల్లి పేస్ట్ - 2 టేబుల్ స్పూన్లు, టొమాటో ప్యూరీ - కప్పు, మిరియాల పొడి - ఒకటిన్నర స్పూన్లు, ధనియాల పొడి - 2 స్పూన్లు, గరం మసాలా, కారం - స్పూన్ చొప్పున, ఆమ్‌చూర్ పౌడర్ - అర స్పూన్, దాల్చిన చెక్క - అంగుళం ముక్క, యాలకులు - 4, లవంగాలు - 6, పుదీనా - 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర - పావు కప్పు

తయారీ: చికెన్ ముక్కల్లో పెరుగు, నిమ్మరసం, ఉప్పు వేసి అరగంట మ్యారినేట్ చేయాలి. ఈలోగా ప్యాన్‌లో నూనె వేడి చేసి దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, జీలకర్రలను వేయించాలి. అవి వేగాక.. ఉల్లి తరుగును లేత గోధుమ రంగులోకి మారే వరకూ వేయించి.. అల్లం-వెల్లుల్లి పేస్ట్ జోడించాలి. అందులో టొమాటో ప్యూరీ జతచేయాలి. అది ఉడికాక.. మ్యారినేట్ చేసిన చికెన్, కొన్ని నీళ్లు, మిరియాలు, ధనియాల పొడులు, గరం మసాలా, కారం, ఆమ్‌చూర్ వేసి మూతపెట్టాలి. మధ్యస్థమైన సెగ మీద చికెన్ మెత్తగా అయ్యే వరకూ ఉడికించి.. కొత్తిమీర వేసి.. సెగ తీసేయాలి.

కేసర్ రైస్



కావలసినవి: బాస్మతి బియ్యం - కప్పు, పచ్చి బఠాణీలు, స్వీట్‌కార్న్, క్యారెట్ ముక్కలు, పుదీనా, కొత్తిమీర - 3 టేబుల్ స్పూన్ల చొప్పున, పచ్చిమిర్చి - 2, అల్లం-వెల్లుల్లి పేస్ట్, షాజీరా - స్పూన్ చొప్పున, కుంకుమపువ్వు (కేసర్) - కొన్ని రేకలు, వేడి పాలు - 3 టేబుల్ స్పూన్లు, నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు, లవంగాలు - 3, యాలకులు - 2, దాల్చిన చెక్క - అంగుళం ముక్క, ఉప్పు - తగినంత, పిస్తా, జీడిపప్పులు - చారెడు, క్రీమ్ - టేబుల్ స్పూన్

తయారీ: బియ్యం కడిగి అరగంట నానబెట్టాలి. కుంకుమపువ్వును పాలలో వేసి పక్కనుంచాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో నెయ్యి వేడి చేసి.. దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, షాజీరా వేసి.. మంచి సువాసన వచ్చే వరకూ వేయించాలి. అందులో పచ్చిమిర్చి, అల్లం-వెల్లుల్లి పేస్ట్, పుదీనా, పచ్చి బఠాణీలు, క్యారెట్, స్వీట్‌కార్న్, పిస్తా, జీడిపప్పులను ఒక నిమిషం వేయించి.. బియ్యం, తగినన్ని నీళ్లు, కుంకుమపువ్వు పాలు, ఉప్పు వేసి మూత పెట్టి ఉడికించాలి. చివర్లో కొత్తిమీర తరుగు, క్రీమ్ జోడించి దించేస్తే సరిపోతుంది.

టొమాటో-కొబ్బరి చట్నీ



కావలసినవి: కొబ్బరి తురుము - 2 కప్పులు, టొమాటోలు - పావు కిలో, పచ్చిమిర్చి - 8, అల్లం - అరంగుళం ముక్క, వెల్లుల్లి - 4 రెబ్బలు, ఉప్పు - తగినంత, నూనె - 3 స్పూన్లు, చింతపండు - నిమ్మకాయంత, శనగపప్పు, మినపప్పు, జీలకర్ర - స్పూన్ చొప్పున, ఆవాలు - ముప్పావు స్పూన్, కరివేపాకు - 2 రెబ్బలు, ఎండుమిర్చి - 1, ఇంగువ - పావు స్పూన్, కొత్తిమీర తరుగు, ఉల్లిపాయ ముక్కలు - గుప్పెడు చొప్పున

తయారీ: చింతపండును కడిగి నానబెట్టాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో కాస్త నూనె వేడిచేసి టొమాటో, పచ్చిమిర్చి ముక్కలను వేయించాలి. చల్లారాక.. అల్లం, వెల్లుల్లి, చింతపండు, ఉప్పు జతచేసి గ్రైండ్ చేయాలి. అందులో కొబ్బరి తురుము చేర్చాలి. ప్యాన్‌లో నూనె వేడయ్యాక ఆవాలు వేయాలి. అవి చిటపటలాడుతుండగా.. శనగపప్పు, మినపప్పు, జీలకర్ర, కరివేపాకు, ఎండుమిర్చి, ఇంగువ ఒక్కొక్కటిగా వేయాలి. ఈ తాలింపును పచ్చడిలో కలపాలి. అలాగే ఉల్లి, కొత్తిమీర జోడించాలి. అంతే.. అదిరిపోయే 'టొమాటో-కొబ్బరి చట్నీ' తయారైపోతుంది.

క్యాబేజీ కోఫ్తా కర్రీ



కావలసినవి: క్యాబేజీ - 2 కప్పులు, శనగపిండి - 3 టేబుల్ స్పూన్లు, బియ్యప్పిండి - టేబుల్ స్పూన్, అల్లం-వెల్లుల్లి పేస్ట్ - స్పూన్, పచ్చిమిర్చి - 2, ఉప్పు - తగినంత, పసుపు, జీలకర్ర - అర స్పూన్ చొప్పున, నూనె - వేయించడానికి సరిపడా, ఉల్లి తరుగు, టొమాటో గుజ్జు - అర కప్పు చొప్పున, అల్లం-వెల్లుల్లి పేస్ట్ - టేబుల్ స్పూన్, జీడిపప్పు పేస్ట్ - 2 టేబుల్ స్పూన్లు, కారం, ధనియాల పొడి - 2 స్పూన్ల చొప్పున, గరం మసాలా - అర స్పూన్, కొత్తిమీర - గుప్పెడు

తయారీ: క్యాబేజీ సన్నగా తరగాలి. అందులో శనగపిండి, బియ్యప్పిండి, అల్లం-వెల్లుల్లి పేస్ట్, పొడుల్లో సగభాగం వేసి కలపాలి. ఈ మిశ్రమంతో కోఫ్తాలు చేయాలి. అన్నీ అయ్యాక కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చే వరకూ వేయించి పక్కనుంచాలి. కడాయిలో 2 స్పూన్ల నూనె వేడి చేసి ఉల్లితరుగును వేయించాలి. అది వేగాక.. అల్లం-వెల్లుల్లి చేర్చి, పచ్చి వాసన పోయే వరకూ ఉంచాలి. అందులో టొమాటో గుజ్జు జతచేసి.. నూనె పైకి తేలే వరకూ ఉడికించాలి. ఇప్పుడు కొన్ని నీళ్లు, జీడిపప్పు పేస్ట్, పసుపు, మిగిలిన కారం, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు జోడించాలి. చిక్కగా అయ్యాక.. కోఫ్తాలు, కొత్తిమీర వేసి కలియబెట్టాలి. సన్న సెగ మీద రెండు నిమిషాలుంచి దించేస్తే.. 'క్యాబేజీ కోఫ్తా కర్రీ' సిద్ధమైపోతుంది. ఇది అన్నం, చపాతీ, ఫ్రైడ్ రైస్.. ఎందులోకైనా బాగుంటుంది.

ఖర్జూర లడ్డూ



కావలసినవి: గింజల్లేని ఖర్జూరాలు - కప్పు, బాదం, జీడిపప్పులు - పావు కప్పు చొప్పున, పిస్తా, ఎండుద్రాక్ష, వాల్‌నట్స్ - 2 టేబుల్ స్పూన్ల చొప్పున, నెయ్యి - రెండున్నర స్పూన్లు, యాలకుల పొడి - పావు స్పూన్, ఎండు కొబ్బరి పొడి - 3 స్పూన్లు

తయారీ: ఖర్జూరాలను చిన్న ముక్కలుగా తరగాలి. కడాయిలో రెండు స్పూన్ల నెయ్యి వేడి చేసి బాదం, వాల్‌నట్స్, జీడిపప్పు, పిస్తా, ఎండుద్రాక్షలను వేయించి.. కచ్చాపచ్చా దంచాలి. మరీ పౌడర్‌లా చేయకూడదు. అదే కడాయిలో ఖర్జూర ముక్కలు వేసి కలియబెడుతుండాలి. ఖర్జూరం మెత్తగా అయ్యాక.. యాలకుల పొడి, డ్రై ఫ్రూట్స్ పలుకులు జతచేసి.. సెగ తీసేయాలి. అందులో ఎండు కొబ్బరి పొడి జోడించి కలపాలి. మిశ్రమం గోరువెచ్చగా అయ్యాక.. చేతికి నెయ్యి రాసుకుని లడ్డూలు చేసుకోవాలి.


మష్రూమ్ టిక్కా



కావలసినవి: పెద్ద సైజ్ మష్రూమ్స్ - 15, ఉప్పు, నూనె - తగినంత, చిక్కటి పెరుగు - అర కప్పు, శనగపిండి - టేబుల్ స్పూన్, నిమ్మరసం - స్పూన్, అల్లం-వెల్లుల్లి పేస్ట్, కారం - 2 స్పూన్ల చొప్పున, కసూరీ మేథీ, ధనియాల పొడి, గరం మసాలా - స్పూన్ చొప్పున, పసుపు - చిటికెడు, పనీర్ - అర కప్పు, ఉల్లి తరుగు, కొత్తిమీర - గుప్పెడు చొప్పున, సన్నగా తరిగిన క్యాప్సికం - 2 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి ముద్ద, ఛాట్ మసాలా - అర స్పూన్ చొప్పున, గార్నిష్ చేసేందుకు ఉల్లి స్లైసులు

తయారీ: మష్రూమ్స్‌ను శుభ్రం చేసి, కాడభాగం తీసి కొద్దిగా ఉప్పు చల్లి పక్కనుంచాలి. ఒక పాత్రలో పనీర్, ఉల్లి, క్యాప్సికం తరుగు, పచ్చిమిర్చి, ఉప్పు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, పొడుల్లో సగభాగం, కొత్తిమీర వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని మష్రూమ్స్‌లో నింపి, పక్కనుంచాలి. పెరుగులో శనగపిండి, నిమ్మరసం, కసూరీ మేథీ, ధనియాల పొడి, పసుపు, మిగిలిన పౌడర్లు, అల్లం-వెల్లుల్లి పేస్ట్, రెండు స్పూన్ల నూనె జోడించి బాగా కలిపి.. నాననివ్వాలి. అరగంట తర్వాత.. స్టఫ్డ్ మష్రూమ్స్‌కు ఈ మసాలా పట్టించాలి. కడాయిలో కొద్దిగా నూనె వేసి.. సన్న సెగ మీద మష్రూమ్స్‌ను వేయించాలి. ఉల్లి స్లైసులతో గార్నిష్ చేయాలి.

అరటిపండ్లతో చిక్కటి పానీయం



యాపిల్, నారింజపండ్లతో పానీయం సాధారణమే కానీ అరటిపండ్లతో పెద్దగా చేయరు కదూ! వాటితో కాన్‌సన్ట్రేట్ ఇలా చేశారంటే ఇంటిల్లిపాదికీ నచ్చేస్తుంది.

కావలసినవి: అరటిపండ్లు - 6, పంచదార - ఒకటిన్నర కప్పులు, నిమ్మరసం - 3 టేబుల్ స్పూన్లు, నీళ్లు - కప్పు, యాలకుల పొడి, సిట్రిక్ యాసిడ్ - పావు స్పూన్ చొప్పున, ఉప్పు - చిటికెడు

తయారీ: అరటిపండ్ల తొక్క తీసి, ముక్కలుగా కట్ చేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ అరటిపండు ప్యూరీని అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో వేసి, నీళ్లు, యాలకుల పొడి, పంచదార చేర్చి మధ్యస్థమైన సెగ మీద కలియబెడుతూ ఉడికించాలి. పది నిమిషాలకు చిక్కటి సిరప్‌లా తయారయ్యాక.. సెగ తీసేయాలి. ఇప్పుడు నిమ్మరసం, ఉప్పు, సిట్రిక్ యాసిడ్ జతచేసి కలపాలి. పూర్తిగా చల్లారిన తర్వాత తడి లేని సీసాలోకి తీసి.. ఫ్రిజ్‌లో భద్రం చేసుకోవాలి. తాగదలచినప్పుడు గ్లాసు నీళ్లలో 2 టేబుల్ స్పూన్ల బనానా కాన్‌సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. కొన్ని పాలు, కాస్త వెనీలా ఐస్‌క్రీమ్ జోడిస్తే.. మరింత టేస్ట్ వస్తుంది. ఈ పానీయం కోసం బాగా పండిన అరటిపండ్లే తీసుకోవాలి. ఉడికించేటప్పుడు సెగ పెంచకూడదు.

చెఫ్ స్పెషల్

కేరళవారి రొయ్యల కర్రీ

మలబార్ రొయ్యల కర్రీ కేరళవారి సంప్రదాయ వంటకం. మసాలాల సువాసన, కొబ్బరి కమ్మదనం జతకలిసి రొయ్యల సహజ రుచిని మరింత పెంచుతాయి. దీన్ని ఇంట్లో సులువుగా చేసుకోవచ్చు. అతిథులు వచ్చినప్పుడు చేస్తే ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.



కావలసినవి: రొయ్యలు - అర కిలో, కొబ్బరి పాలు - ఒకటిన్నర కప్పులు, ఉల్లి తరుగు - ముప్పావు కప్పు, టొమాటో గుజ్జు - పావు కప్పు, ఉప్పు - రుచికి తగినంత, అల్లం-వెల్లుల్లి ముద్ద - 2 స్పూన్లు, పచ్చిమిర్చి - 3, కరివేపాకు - 2 రెబ్బలు, నూనె - 2 టేబుల్ స్పూన్లు, పసుపు - పావు స్పూన్, కారం - స్పూన్, ధనియాల పొడి - ఒకటిన్నర స్పూన్లు, జీలకర్ర పొడి, గరం మసాలా - అర స్పూన్ చొప్పున

తయారీ: రొయ్యలను శుభ్రంచేసి ఉప్పు నీళ్లతో బాగా కడగాలి. కడాయిలో నూనె వేడిచేసి కరివేపాకు, పచ్చిమిర్చి.. అవి వేగాక ఉల్లి తరుగులను వేయించాలి. అందులో అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి పచ్చివాసన పోయే వరకూ కలియతిప్పాలి. టొమాటో గుజ్జు, కారం, పసుపు, ధనియాలు, జీలకర్ర పొడులు జతచేసి తక్కువ సెగ మీదుంచాలి. నూనె పైకి తేలుతున్నప్పుడు రొయ్యలు జోడించి.. ఉడికించాలి. చివర్లో కొబ్బరి పాలు, గరం మసాలా చేర్చి.. మెల్లగా కలియబెట్టి సెగ తీసేయాలి. ఐదు నిమిషాలు కదిలించకుండా ఉంచితే.. రొయ్యలకు మసాలా బాగా పడుతుంది. ఇది అన్నం, అప్పం, పరోటా.. ఎందులోకైనా బాగుంటుంది. రొయ్యలను ఎక్కువ సేపు ఉడికిస్తే గట్టిపడతాయి.

సౌందర్య తునకలు

నారింజ తొనలతో జ్యూస్ చేసి తాగడమే మనందరికీ తెలుసు. వాటితోనూ కళాఖండాలు సృష్టించేవాళ్లున్నారు. రసహృదయం ఉండాలే గానీ.. ప్రతిదాన్నీ అందంగా మలచవచ్చని నిరూపిస్తుంటారు. ముచ్చటగొలిపేలా అమర్చిన ఈ నారింజ తొనలు.. సౌందర్య తునకలంటే అతిశయం కాదు.



చేపల బెసారు.. టేస్టు సూపరు!

పాఠక వంట

చేపలు ఆరోగ్యానికెంతో మంచిది. వాటితో వేపుడు సరే.. బెసారు ఎప్పుడైనా తిన్నారా.. ఒడిశావారి ఈ వంటకం సూపర్‌గా ఉంటుంది.



ఇందుకోసం.. చేపలు - అరకిలో, నూనె- 3 టేబుల్ స్పూన్లు, ఉప్పు - రుచికి తగినంత, ఆవాలు, జీలకర్ర, కారం, గరం మసాలా, పసుపు - టేబుల్ స్పూన్ చొప్పున, ఉల్లిపాయలు, టొమాటోలు, పచ్చిమిర్చి - 2 చొప్పున, మామిడికాయ - 1, వెల్లుల్లి రెబ్బలు - 5, అల్లం - అంగుళం ముక్క తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. ఉల్లి, మిర్చి, టొమాటోలను ముక్కలుగా కోసుకోవాలి. మామిడికాయను తురమాలి. చేప ముక్కలకు పసుపు, ఉప్పు పట్టించి పావుగంట పక్కనుంచాలి. ఈలోగా అల్లం, వెల్లుల్లి, సగం ఉల్లితరుగులను గ్రైండ్ చేయాలి. కడాయిలో కాస్త నూనె వేడిచేసి.. చేపముక్కలను లేత బంగారు రంగు వచ్చే వరకూ వేయించాలి. వాటిని పళ్లెంలోకి తీసి.. మిగిలిన నూనె జోడించి.. ఆవాలు, జీలకర్ర, పచ్చిమిర్చి, మిగిలిన ఉల్లితరుగు ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక.. టొమాటో ముక్కలు జతచేయాలి. అవి మెత్తగా అయ్యాక సిద్ధం చేసుకున్న బెసారు మిశ్రమం, తగినన్ని నీళ్లు, కారం, గరం మసాలా, పసుపు, ఉప్పు వేసి.. ఉడికించాలి. మధ్యమధ్యలో అడుగంటకుండా కలుపుతుండాలి. తర్వాత ఫ్రై చేసిన చేపముక్కలు, మామిడి తురుము చేర్చాలి. కూర చిక్కగా అయ్యాక.. సెగ తీసేయాలి. అంతే 'చేపల బెసారు' రెడీ. కొంతసేపు మూత తీయకుండా ఉంచేస్తే.. ముక్కలకు మసాలా పడుతుంది. ఇక వేడి అన్నంలో వడ్డించుకుంటే రుచి అద్దిరిపోతుంది.



– సాయిశ్రీ సాహు, పలాస, శ్రీకాకుళం జిల్లా

ఇలాచీ క్యాండీ.. ఇలా చేయండి!

పిల్లలకు చాక్లెట్లకు బదులు ఇంట్లో చేసిన క్యాండీలు ఇవ్వడం మంచిది కదా! ఈ వారం యాలకుల (ఇలాచీ) క్యాండీ చేసుకుందామా..



ఈ క్యాండీ కోసం.. పంచదార - కప్పు, పంచదార పొడి - స్పూన్, నీళ్లు - అర కప్పు, ఇలాచీ పొడి - ఒకటిన్నర స్పూన్లు, నెయ్యి - స్పూన్, బాదం, పిస్తా, జీడిపప్పులు - అన్నీ కలిపి అర కప్పు చొప్పున తీసుకోవాలి. ఎలా చేయాలంటే.. డ్రై ఫ్రూట్స్‌ను కడాయిలో దోరగా వేయించాలి. చల్లారాక.. మెత్తగా గ్రైండ్ చేసి ఉంచాలి. అడుగుభాగం మందంగా ఉన్న పాత్రలో అర కప్పు నీళ్లు వేడిచేసి పంచదార వేసి కలియతిప్పుతుండాలి. అందులో డ్రై ఫ్రూట్స్ పౌడర్, ఇలాచీ పొడి జోడించి కలుపుతుండాలి. చిక్కగా అయ్యాక.. దించేయాలి. ఈ మిశ్రమాన్ని చాక్లెట్ మౌల్డుల సాయంతో నచ్చిన ఆకృతులు చేసుకోవాలి. అవి లేకుంటే నెయ్యి రాసిన పళ్లెంలో సమంగా సర్ది.. కాస్త చల్లారిన తర్వాత నచ్చిన ఆకృతిలో ముక్కలుగా కట్ చేసుకోవాలి. పైన పంచదార పొడి చల్లితే.. ఒకదానికొకటి అంటుకోవు. తర్వాత తడి లేని సీసాలో భద్రం చేసుకోవాలి.

ఈనాడు సినిమా

94ఏళ్ల వయసులో దర్శకుడిగా సింగీతం కొత్త చిత్రం


దేవిశ్రీ, సింగీతం శ్రీనివాసరావు, నాగ్ అశ్విన్

ప్రయోగాలకు పెట్టింది పేరు.. వైవిధ్యతకు చిరునామా దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు. 'మయూరి', 'పుష్పక విమానం', 'విచిత్ర సోదరులు', 'ఆదిత్య 369'.. ఇలా ఆయన నుంచి వచ్చిన విజయవంతమైన ప్రయోగాలెన్నో. సుదీర్ఘ విరామం తర్వాత 94ఏళ్ల వయసులో ఆయన మళ్లీ మెగాఫోన్ అందుకున్నారు. యువ దర్శకుడు నాగ్ అశ్విన్ నిర్మాతగా వైజయంతీ మూవీస్ పతాకంపై ఓ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఇది సింగీతంకు 61వ చిత్రం. ఇటీవలే పూజా కార్యక్రమాలతో మొదలైంది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర నిర్మాణ సంస్థ ఓ వీడియో గ్లింప్స్‌ను విడుదల చేసింది. "సెంచరీలు కొట్టే వయసు మాది" అంటూ సింగీతం హుషారుగా ఈ చిత్ర పనుల్ని పరుగులు పెట్టించడం వీడియోలో కనిపించింది. "కథ చెబుతా.. కథ చెబుతా.. నిజమైన కథ చెబుతా.. అరుదైన, సరికొత్త ఓ వింత కథ చెబుతా" అంటూ ఆఖర్లో వినిపించిన పాట ఈ సినిమా ఎలా ఉండబోతుందన్నది తెలియజేసింది. మరి ఈసారి ఆయన చెప్పనున్న ఆ సరికొత్త వింత కథ ప్రేక్షకుల్ని ఎలా ఆశ్చర్యపరచనుందో తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు. ఇది పూర్తిగా కొత్త నటీనటులతో రూపొందిస్తున్నట్లు ప్రచార చిత్రాన్ని బట్టి అర్థమవుతోంది. త్వరలోనే టైటిల్‌తో పాటు మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయి. దీనికి దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. గతంలో మృణాల్ సేన్, శ్యామ్ బెనగల్, వి.శాంతారామ్ లాంటి దర్శకులు 70ఏళ్ల వయసులోనూ సినిమాలు చేసినప్పటికీ.. సింగీతం శ్రీనివాసరావులా 94ఏళ్ల వయసులో దర్శకత్వం చేసిన వాళ్లు మరొకరు లేరు. ఓరకంగా ఇది రికార్డే.

నన్ను నడిపించేది సినిమా పాఠాలే


శ్రుతి హాసన్

తనలో ఉన్న కళలన్నింటినీ బయట పెట్టాల్సిన అవసరం లేదని అంటోంది కథానాయిక శ్రుతి హాసన్. తనదైన నటనతో ఆకట్టుకుంటూనే.. గాయనిగా కూడా సినీప్రియుల్ని అలరిస్తుందీమె. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి మాట్లాడుతూ.. "నాకు విభిన్న మార్గాల్లో నడవడం ఇష్టం. ఒకే గుర్తింపులో నన్ను నేను బంధించాలనుకోవట్లేదు. నాకు సంగీతం, నటన, రచన అంటే చాలా ఇష్టం. అయినప్పటికీ అన్నింటి కన్నా ముందు నటిగా ఉండటానికే ఇష్టపడతా. నాకు అదే ఆనందాన్నిస్తుంది. శారీరక శ్రమతో కూడిన పాత్రలు చేయాలనే కోరిక ఉంది. సినిమా నా వృత్తి జీవితంలో ఒక భాగం. కానీ సంగీతం నా వ్యక్తిగత విషయం. సినిమా నాకు ప్రజలతో ఎలా ఉండాలో నేర్పించింది. ఆ పాఠాలే ఒక సంగీతకారిణిగా, మనిషిగా నన్ను ముందుకు నడిపిస్తున్నాయ"ని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె.. విజయ్ సేతుపతితో కలిసి నటించిన 'ట్రైన్' విడుదలకు సిద్ధంగా ఉంది. దీంతో పాటు 'ఆకాశంలో ఒక తార', 'సలార్ 2' లాంటి చిత్రాలు శ్రుతి ఖాతాలో ఉన్నాయి.


శ్రీరామ్, ప్రిన్స్, శివాజీ, లయ, సాయికృష్ణ

అలరించే క్రైమ్ కామెడీ

"సంక్రాంతికి కుటుంబంతో కలిసి సినిమా చూస్తే ఎలా ఉంటుందో అలాంటి చిత్రమే 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని" అన్నారు నటుడు శివాజీ. ఆయన.. లయ జంటగా నటించిన ఈ చిత్రాన్ని సుధీర్ శ్రీరామ్ తెరకెక్కించారు. శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మించిన ఈ క్రైమ్ కామెడీ థ్రిల్లర్.. ఈ నెల 12 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో రిలీజ్ డేట్‌ని ప్రకటించడంతో పాటు ఓ పాటని విడుదల చేశారు. ఈ సందర్భంగా నటుడు శివాజీ మాట్లాడుతూ.. "నేను చాలా కష్టాల్లో ఉన్నప్పుడు ఈటీవీనే నాకు మళ్లీ అవకాశమిచ్చింది. వాళ్ల ప్రోత్సాహంతోనే '#90స్' వెబ్‌సిరీస్ చేశాను. దీన్ని నేనెప్పటికీ మర్చిపోలేను. సుధీర్ కొత్త దర్శకుడైనప్పటికీ కథని అద్భుతంగా చెప్పాడు. ఒక మంచి కంటెంట్ ఈ నెల 12న మీ ముందుకొస్తుంది. 'దండోరా' లాగే ఈ చిత్రాన్నీ సూపర్ హిట్ చేస్తారని ఆశిస్తున్నా" అన్నారు. "మిస్సమ్మ'తో అందరూ నన్ను రత్నమాలగా గుర్తు పెట్టుకున్నారు. ఇక నుంచి ఈ సినిమాతో ఉత్తరగా గుర్తు పెట్టుకుంటారు. నా కెరీర్‌లోనే చాలా ప్రత్యేకమైన పాత్రిది" అన్నారు నటి లయ. ఈటీవీ విన్ బిజినెస్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ.. "ఇది మంచి క్రైమ్ కామెడీ సినిమా. మా గత సినిమాలు ఎలా అయితే అందర్నీ అలరించాయో.. ఈ చిత్రం కూడా మిమ్మల్ని అలాగే అలరిస్తుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో సుధీర్ శ్రీరామ్, ప్రిన్స్, రోహన్, భోలే షావలి తదితరులు పాల్గొన్నారు.

జానకి పరిణయం చూతము రారండి!

ఈ నెల 2 నుంచి సోమవారం - శనివారం వరకూ సా.6గం.లకు



వైవిధ్యమైన కథాంశాలతో, కుటుంబ విలువల కలబోతగా ధారావాహికలను అందించే ఈటీవీ.. తాజాగా మరో దృశ్యకావ్యాన్ని మీ ముందుకు తీసుకొస్తోంది. 'జానకి పరిణయం' పేరుతో రూపొందించిన ఈ మెగా డైలీ సీరియల్ ఈ నెల 2 నుంచి ప్రసారం కానుంది. బొబ్బిలి వంశంలోని ఆధిపత్య చిచ్చు.. ఆ ఇంటి వారసురాలి ఉనికిని చెరిపేసి తన వారందరికీ దూరం చేస్తే.. తిరిగి ఎలా సొంతవారి చెంతకు చేరి తన కుటుంబాన్ని నిలబెట్టుకుందనేదే కథాంశం. ఉత్కంఠభరితమైన మలుపులతో మనసును కదిలించే భావోద్వేగాలతో సాగిపోయే కథ ఇది. ధారావాహికలోని దాక్షాయణి, రుద్రాణి, భార్గవ్ రామ్, జానకి, భూమిజ లాంటి పాత్రలు కలకాలం ప్రేక్షకుల మదిలో నిలిచిపోతాయి. పల్లవి రామిశెట్టి, హరిత, వందన, సిద్ధార్థ వర్మ, హారిక తదితరులు నటించారు. ఈ సీరియల్‌కు కథ, మాటలు, స్క్రీన్ ప్లేను మురళీ రమేశ్ అందించగా.. చిరంజీవి దర్శకత్వం వహించారు.

టీజర్‌తోనే భయపెట్టేశారు


మురళీ మోహన్, శివ, ఎస్తేర్

"చిన్న చిత్రాలే ఇండస్ట్రీకి ప్రాణం" అన్నారు నటుడు, నిర్మాత మురళీ మోహన్. చిన్న సినిమాగా రూపొందిన 'అమరావతికి ఆహ్వానం' టీజర్‌తోనే భయం కలిగించిందని తెలిపారు. ఈ చిత్ర కంటెంట్‌ని చూస్తుంటే తప్పక విజయం సాధిస్తుందన్న నమ్మకం కలుగుతుందని అన్నారు. శివ కంఠమనేని, ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, హరీశ్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని జీవీకే తెరకెక్కించారు. ముప్పా వెంకయ్య చౌదరి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 13న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో మురళీ మోహన్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. "మంచి కంటెంట్‌తో రూపొందిన చిత్రమిది. వీఎఫ్‌ఎక్స్ పనుల వల్ల కాస్త ఆలస్యమైంది" అన్నారు దర్శకుడు జీవీకే. ఈ కార్యక్రమంలో అశోక్ కుమార్, జెమినీ సురేశ్, ప్రసన్న కుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం నవ్వించేలా 'ఫంకీ'


కయాదు, విష్వక్ సేన్

"కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా 'ఫంకీ'. ఇది అందరికీ మంచి అనుభూతిని అందిస్తుంది' అన్నారు హీరో విష్వక్ సేన్. ఆయన.. కయాదు లోహర్ జంటగా నటించిన ఈ సినిమాని కేవీ అనుదీప్ తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. నరేశ్, వీటీవీ గణేశ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 13న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ఈ చిత్ర రెండో గీతాన్ని విడుదల చేశారు. "రట్టాటటావ్.." అంటూ సాగిన ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చగా.. దేవ్ పవార్ సాహిత్యమందించారు. రామ్ మిరియాల ఆలపించారు. ఈ సందర్భంగా హీరో విష్వక్ సేన్ మాట్లాడుతూ.. "నా గత రెండు చిత్రాలు ప్రేక్షకుల్ని పూర్తి స్థాయిలో మెప్పించలేకపోయాయి. అందుకే అందరి ఫీడ్ బ్యాక్ తీసుకుని.. 'ఫంకీ'తో నా ప్రయాణాన్ని మళ్లీ ఒకటి నుంచి మొదలు పెడుతున్నా. అనుదీప్ రచన, హాస్యం భిన్నంగా ఉంటాయి. తను చాలా ప్రత్యేకమైన వ్యక్తి. ఆయనతో పని చేశాక నేను సినిమాని, జీవితాన్ని చూసే కోణం మారిపోయింది" అన్నారు. "ఆద్యంతం నవ్వించే సినిమా ఇది. దీంట్లో భాగమవ్వడం చాలా ఆనందంగా ఉంది" అంది నటి కయాదు లోహర్. దర్శకుడు అనుదీప్ మాట్లాడుతూ.. "ఇది మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ప్రారంభం నుంచి చివరి వరకు నవ్వులు పంచుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో దేవ్ పవార్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది.

ధనుష్‌కి జోడీగా శ్రీలీల

'పరాశక్తి'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన శ్రీలీల.. మరో తమిళ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా? ఈసారి ఇంకో అద్భుతమైన ప్రేమకథలో నటిస్తుందా?.. గత కొన్ని రోజులుగా సినీప్రియుల మదిలో మెదులుతున్న ప్రశ్నలివి. ఇప్పుడు వీటన్నింటికీ సమాధానమిస్తూ.. తన రాబోయే తమిళ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించింది శ్రీలీల. ధనుష్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ పెరియసామి ఓ సినిమా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. 'డీ55' (వర్కింగ్ టైటిల్) పేరుతో పట్టాలెక్కిన ఈ చిత్రంలో కథానాయికగా శ్రీలీల నటిస్తుంది. ఈ విషయాన్ని తెలుపుతూ.. శనివారం ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలను పంచుకుంది చిత్రబృందం. సాయి అభయంకర్ ఈ చిత్రానికి సంగీతమందించనున్నారు.


శ్రీలీల, ధనుష్

నటన కంటే దర్శకత్వమే ఇష్టం

"దర్శకుడిగా ఓ జానర్‌కే పరిమితం కావాలని అనుకోవట్లేదు. విభిన్నమైన కథలతో ప్రేక్షకుల్ని మెప్పించాలనుకుంటున్నా" అన్నారు దర్శకుడు తరుణ్ భాస్కర్. ఇప్పుడాయన హీరోగా 'ఓం శాంతి శాంతి శాంతిః' చిత్రంతో థియేటర్లలో సందడి చేస్తున్న సంగతి తెలిసిందే. దీన్ని ఏఆర్ సజీవ్ తెరకెక్కించారు. ఇది ఇటీవల విడుదలైన నేపథ్యంలో శనివారం విలేకర్లతో ముచ్చటించారు తరుణ్ భాస్కర్.


తరుణ్ భాస్కర్

"రీమేక్‌లు పూర్తిగా తగ్గిపోతున్న తరుణంలో ఈ సినిమాని ప్రేక్షకులు ఇంత గొప్పగా ఆదరిస్తుండటం ఆనందాన్నిస్తోంది. దీన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఒరిజినల్ సినిమాలాగే అనుభూతి చెందుతున్నారు. ఈ కథని తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా మార్చేందుకు మా చిత్ర బృందం చాలా కష్టపడింది. మలయాళ మాతృక నుంచి కేవలం మూల కథను మాత్రమే తీసుకుని గోదావరి జిల్లాల నేపథ్యానికి తగ్గట్లు పూర్తిగా కొత్త బ్యాక్‌డ్రాప్‌ను సిద్ధం చేసుకున్నాం. అది మంచి ఫలితాన్నిచ్చింది. ప్రస్తుతం ప్రేక్షకుల్ని అలరించడానికి ఒక మంచి కథ కావాలి. అలాంటి కథ ఇస్తే వాళ్లు కచ్చితంగా ఆదరిస్తారని ఈ సినిమాతో మరోసారి నిరూపితమైంది".

● "ఈ సినిమాలో నేను పోషించిన ఓంకార్ నాయుడు పాత్ర కోసం చాలా హోంవర్క్ చేశాను. యాస, బాడీ లాంగ్వేజ్, వ్యవహార శైలిలో ఇది నా నిజ జీవితానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. అందుకే ఈ పాత్రను పట్టుకోవడానికి చాలా వర్క్ చేశాను. నేనిప్పటి వరకు చేసిన పాత్రల్లో నాకు అత్యంత సంతృప్తినిచ్చిన, సవాల్ విసిరిన పాత్రిదే. ఈ సినిమా చేశాక నటన పట్ల మరింత గౌరవం పెరిగింది. ఈ చిత్రంలో ఈషా రెబ్బా అద్భుతమైన నటనను కనబరిచింది. తనకు మార్షల్ ఆర్ట్స్ కూడా తెలియడంతో అది మా చిత్రానికి బాగా కలిసొచ్చింది".

● "నా సినీ ప్రయాణం పట్ల నేను పూర్తి సంతృప్తిగా ఉన్నా. నటన కన్నా దర్శకత్వాన్నే ఎక్కువ ఇష్టపడతా. ఎందుకంటే మనం సృష్టించిన కథను తెరపై చూడటంలో ఉన్న ఆనందం ఇంకెందులోనూ రాదు. నేను నటించిన మరో రెండు సినిమాలు ఈ ఏడాదే విడుదల కానున్నాయి. ఆ తర్వాత పూర్తిగా దర్శకత్వంపైనే దృష్టి సారిస్తాను. నాకు దర్శకుడిగా ఇప్పటికే కామెడీపై పట్టు వచ్చిందని అనుకుంటున్నా. ఇకపై గ్యాంగ్‌స్టర్, క్రైమ్ డ్రామా, యాక్షన్ థ్రిల్లర్, రొమాంటిక్ కామెడీ.. ఇలా భిన్నమైన జానర్లు చేయాలనుకుంటున్నా. ప్రస్తుతం నా దర్శకత్వంలో 'ఈ నగరానికి ఏమైంది 2' సిద్ధమవుతోంది. ఇది తొలి భాగంతో పోల్చితే స్కేల్ పరంగా చాలా పెద్దగా ఉంటుంది. ఇందులో పాత్రలన్నీ చాలా ఆసక్తికరంగా ఉంటాయి. ఇక వెంకటేశ్‌తో చేయాల్సిన సినిమాకి ఇంకా చాలా టైమ్ పడుతుంది. ఆ కథపై ఇంకా వర్క్ చేయాల్సి ఉంది".

కమల్ సమర్పణలో 'లీడ్ ఆన్ గాంధీ'

గాంధీ సిద్ధాంతాల్ని.. అహింస విలువల్ని తిరిగి గుర్తు చేసుకునేలా కథానాయకుడు కమల్‌హాసన్ సమర్పణలో 'లీడ్ ఆన్ గాంధీ' పేరుతో ఓ డాక్యుమెంటరీ బయటకొచ్చింది. గోపాల కృష్ణ గాంధీ, కమల్ సందేశాలతో రూపొందిన ఈ డాక్యుమెంటరీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఇటీవల విడుదలైంది. గాంధీ హత్యను నేటి కాలంతో అనుసంధానిస్తూ.. కోపం, ప్రతీకారాల కన్నా ప్రేమ, సత్యం, ఆత్మ నియంత్రణకు ఎక్కువ ధైర్యం అవసరమని సందేశమిచ్చిన తీరు ఆలోచింపజేసేలా ఉంది.

సరికొత్త కాక్‌టెయిల్


రష్మిక

గతేడాది 'కుబేర', 'ఛావా' లాంటి వరుస సినిమాలతో మంచి విజయాల్ని అందుకున్న కథానాయిక రష్మిక.. ఈ సంవత్సరం కూడా అంతకు మించిన కథలతో తెరపై సందడి చేయడానికి సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'కాక్‌టెయిల్ 2' సినిమా ఉన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ హీరో షాహిద్ కపూర్, రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. హోమి అదజానియా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు తెలుపుతూ ఇన్‌స్టా వేదికగా ఓ ఫొటోను పంచుకున్నారు దర్శకుడు. "విజయవంతంగా 'కాక్‌టెయిల్ 2' షూటింగ్ ముగిసింది. నా అద్భుతమైన నటీనటులకు, బృందానికి ధన్యవాదాలు. చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ ఇది" అనే వ్యాఖ్యల్ని జోడించారు. 'కాక్‌టెయిల్'కు సీక్వెల్‌గా ఓ సరికొత్త ప్రేమ కథగా దీన్ని తీర్చిదిద్దుతున్నారని, ఈ ఏడాది ద్వితీయార్థంలో థియేటర్లలోకి రానుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

గాఢమైన ప్రేమతో సైకో


మురళీ, శ్రుతి

"ఓ గాఢమైన ప్రేమకథతో రూపొందిన సినిమా 'సైకో'. పాటలతో పాటు రసూల్ ఎల్లోర్ విజువల్స్ చాలా అందంగా ఉన్నాయి" అన్నారు నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి. ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు. మురళీ కృష్ణంరాజు, శ్రుతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమాని పృథ్వీ పెరిచర్ల తెరకెక్కించారు. నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ, పృథ్వీ నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 6న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకని నిర్వహించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ.. "అందర్నీ మెప్పించే మంచి ప్రేమకథతో ఈ సినిమా రూపొందింది. ఇప్పటికే విడుదలైన అన్ని పాటలకి మంచి ఆదరణ దక్కింది. థియేట్రికల్‌గానూ ఈ చిత్రాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నా" అన్నారు. నిర్మాత నాగిరెడ్డి మాట్లాడుతూ.. "మనసుల్ని హత్తుకునే కొత్త ప్రేమకథని ఈ సినిమాతో చూస్తార"న్నారు. ఈ కార్యక్రమంలో రసూల్ ఎల్లోర్, పృథ్వీ, శ్రుతి శెట్టి, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చిరు నా గురించి మాట్లాడారనగానే కళ్లలో నీళ్లు తిరిగాయి: నవీన్ పొలిశెట్టి



నాగవంశీ, బాబీ, మీనాక్షి చౌదరి, నవీన్ పొలిశెట్టి

"ఈ సంక్రాంతి అటు ఏడుతరాలు.. ఇటు ఏడుతరాలు గుర్తుండిపోతుంద"న్నారు కథానాయకుడు నవీన్ పొలిశెట్టి. ఈ పండక్కి పెద్ద చిత్రాలు పోటీలో ఉన్నా.. తమ 'అనగనగా ఒక రాజు' విడుదలై విజయాన్ని సొంతం చేసుకుందంటే అది తెలుగు ప్రేక్షకుల ఆశీర్వాదమేనని తెలిపారు. నవీన్, మీనాక్షి చౌదరి జంటగా నటించిన ఈ సినిమాని మారి తెరకెక్కించిన సంగతి తెలిసిందే. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలైన నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు బాబీ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. "ఈ సినిమా.. నవీన్ వన్‌మ్యాన్ షో. తను కచ్చితంగా నవ్విస్తాడన్న నమ్మకాన్ని ప్రేక్షకుల నుంచి పొందాడు. కష్టపడితే విజయం వస్తుందని చెప్పేందుకు 'అనగనగా ఒక రాజు' ఓ ఉదాహరణ" అన్నారు. "ఈ సినిమా విడుదలయ్యాక.. నా చిత్ర చర్చల్లో భాగంగా ఓసారి చిరంజీవిని కలిశా. 'అనగనగా ఒక రాజు' సినిమా బాగుందట కదా' అని అడుగుతూ.. 'ఈతరం వారిలో నాకు బాగా నచ్చిన హీరో నవీన్' అని చిరు చెప్పారు" అన్నారు దర్శకుడు బాబీ. హీరో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ.. "నేను హీరో అవ్వడానికి స్ఫూర్తి చిరంజీవి. అలాంటిది ఆయన సినిమాతో పాటు విడుదలై, ఆయనతో పాటుగా విజయం సాధించడం సంతోషంగా ఉంది. చిరు నా గురించి మాట్లాడారని బాబీ చెప్పినప్పుడు నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈ పరిశ్రమలో హీరో కావడం చాలా కష్టం. ఆ ప్రయాణం చేస్తే గానీ దాని గురించి అర్థం కాదు. 'యూట్యూబర్ నుంచి హీరో అయిన వాళ్లు ఎవరున్నార'ని నన్ను నిరుత్సాహపరిచారు. ఓ దశలో ఇండస్ట్రీని వదిలేసి వెళ్లిపోదామనుకున్నా. కట్ చేస్తే.. తెలుగు ప్రేక్షకులు నాకు వరుసగా నాలుగు విజయాలు అందించారు" అన్నారు. ఈ కార్యక్రమంలో నాగవంశీ, మీనాక్షి చౌదరి, మారి, చిన్మయి, చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.

నేడే వార్షిక బడ్జెట్

కళ్లన్నీ..

ఈ కీలక అంకెలపై



దిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు ప్రవేశపెట్టనున్న 2026-27 వార్షిక బడ్జెట్‌లో కొన్ని కీలక గణాంకాలను మార్కెట్ నిశితంగా గమనించనుంది. అవేమిటంటే..

ద్రవ్యలోటు: ప్రభుత్వ ఆదాయ, వ్యయాల వ్యత్యాసమైన ద్రవ్యలోటును ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 4.4 శాతానికి నియంత్రించాలని గత బడ్జెట్లో ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈసారి బడ్జెట్లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు లక్ష్యాన్ని జీడీపీలో 4 శాతంగా ప్రతిపాదించొచ్చని అంచనా వేస్తున్నారు.

మూలధన వ్యయాలు: గత బడ్జెట్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయాలుగా రూ.11.2 లక్షల కోట్లను కేటాయించింది. ఈసారి దీనికి 10-15 శాతం అధికంగా మూలధన వ్యయ లక్ష్యాన్ని నిర్దేశించుకునే అవకాశం ఉంది.

పన్నుల ఆదాయం: 2025-26 బడ్జెట్లో స్థూల పన్నుల ఆదాయాన్ని రూ.42.70 లక్షల కోట్లుగా కేంద్రం అంచనా వేసింది. ఇందులో ప్రత్యక్ష పన్నుల రూపంలో రూ.25.20 లక్షల కోట్లు, పరోక్ష పన్నుల ద్వారా రూ.17.5 లక్షల కోట్లు రావొచ్చని ప్రతిపాదించింది. మరి ఈ అంచనా లక్ష్యంలో ఇప్పటివరకు ఎంత మేర వచ్చాయి? 2026-27కు పన్నుల ఆదాయ అంచనాలు ఎలా ఉండొచ్చు? అనే అంశాలనూ గమనిస్తారు.

జీఎస్‌టీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం పెరిగి రూ.11.78 లక్షల కోట్లు పెరగొచ్చని గత బడ్జెట్లో ప్రభుత్వం అంచనా వేసింది. ఇటీవలి జీఎస్‌టీ రేట్ల కోత నేపథ్యంలో ఈ బడ్జెట్లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రకటించే జీఎస్‌టీ ఆదాయ అంచనాలు కీలకం కానున్నాయి.

రుణాలు: 2025-26కు ప్రభుత్వ స్థూల రుణాలను రూ.14.80 లక్షల కోట్లుగా గత బడ్జెట్లో ప్రతిపాదించారు. ఈ గణాంకాల ద్వారా దేశ ఆర్థిక స్థితి, పన్నులు- పన్నులేతర ఆదాయాలపై ఒక అవగాహనకు రావొచ్చు. అందువల్ల 2026-27కు బడ్జెట్లో ప్రతిపాదించే స్థూల రుణాల గణాంకాలనూ మార్కెట్ పరిశీలించే అవకాశం ఉంది.

జీడీపీ వృద్ధి: వచ్చే ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి 6.8-7.2 శాతంగా ఉండొచ్చని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఈ నేపథ్యంలో బడ్జెట్లో అంచనా వేసే జీడీపీ వృద్ధి గణాంకాల పైనా ప్రధానంగా మార్కెట్ దృష్టి సారిస్తుంది. అలాగే ఈ గణాంకాల ద్వారా ముున్ముందు ద్రవ్యోల్బణం ఎలా ఉండొచ్చన్న దానిపై మార్కెట్ ఒక అంచనాకు వచ్చే అవకాశం ఉంది.

జీడీపీ-రుణ నిష్పత్తి

2026-27 నుంచి జీడీపీలో కేంద్ర ప్రభుత్వ రుణాల నిష్పత్తిని తగ్గించే దిశలో ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని గత బడ్జెట్ ప్రసంగంలో మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అందువల్ల రుణాలు- జీడీపీ నిష్పత్తిని తగ్గించే దిశగా ఈ బడ్జెట్లో చేసే ప్రకటనలు, నిర్దేశించుకునే లక్ష్యాలను మార్కెట్ వర్గాలు గమనిస్తాయి.

ఈనాడు బిజినెస్ వారాంతం

ఈ బడ్జెట్ రోజున

మార్కెట్ ఎటు?



ఊగిసలాటలకే ఎక్కువ అవకాశం

బడ్జెట్ నేపథ్యంలో ఆదివారం రోజున అంటే నేడు స్టాక్ మార్కెట్లూ పనిచేయనున్నాయి. వివిధ రంగాలపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పలు విధానాలను ప్రకటిస్తారన్న అంచనా ఉన్న నేపథ్యంలో మార్కెట్లు ఊగిసలాటకు గురికావొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ద్రవ్య స్థిరీకరణ లక్ష్యాన్ని కేంద్రం కొనసాగించవచ్చన్న భావనల మధ్య ఏవైనా సానుకూల వార్తల కోసం మదుపర్లు ఎదురుచూడవచ్చు. అలాగే ఫెడ్ రిజర్వ్ కొత్త ఛైర్‌గా ట్రంప్ నామినేట్ చేసిన కెవిన్ వార్ష్ వడ్డీ రేట్లపై వ్యక్తం చేసే అభిప్రాయంపైనా దృష్టి సారించొచ్చు. ఇక ఎన్‌ఎస్‌ఈ ఐపీఓకు సెబీ అనుమతులివ్వడం, శుక్రవారం విడుదలైన ఆర్థిక ఫలితాల వంటివి నేటి మార్కెట్‌పై ప్రభావం చూపొచ్చు. నేడు విడుదల అయ్యే నెలవారీ కార్ల తయారీదార్ల విక్రయ గణాంకాలూ కీలకం. ఇక నిఫ్టీ-50కి 25,500 వద్ద కీలక నిరోధం, 25200 వద్ద కీలక మద్దతు కనిపిస్తోంది.

ఈ రంగాలపై దృష్టి

బడ్జెట్‌లో వ్యయాలు పరిమితంగానే ఉండొచ్చని ఎక్కువ శాతం విశ్లేషకులు అంటున్నారు. మూలధన వ్యయాలు, తయారీ ప్రోత్సాహకాలు, సులభతర వాణిజ్యంపై దృష్టి కొనసాగిస్తూ క్రమంగా స్థిరీకరణ దిశగా వెళ్లేందుకు కేంద్రం మొగ్గుచూపొచ్చని ఓ బ్రోకరేజీ అంటోంది. అయితే రక్షణ, ప్రజా రవాణా వంటి రంగాల్లో మూలధన వ్యయాల విషయంలో ఆశ్చర్యకర నిర్ణయాలు తీసుకోవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఇతర అంచనాలిలా..

- ✦ సెమీకండక్టర్లు, విద్యుత్ వాహనాలు(ఈవీలు), పునరుత్పాదక ఇంధనం, రక్షణ, ఏరోస్పేస్, డీప్-టెక్, ఏఐ వంటి వర్ధమాన రంగాలను కేంద్రం లక్ష్యంగా చేసుకోవచ్చు.
- ✦ కొన్ని రంగాల్లోని ప్లాంట్లు, మెషినరీలకు డివిడెండ్లపై తక్కువ కార్పొరేట్‌పన్నును తిరిగి ప్రవేశపెట్టవచ్చు
- ✦ అమెరికా-భారత్ మధ్య వాణిజ్య చర్చల ఆలస్యం కారణంగా కార్మిక ఆధారిత ఎగుమతులకు నిధుల మద్దతు ప్రకటించొచ్చు. ముఖ్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా కంపెనీ(ఎమ్ఎస్ఎమ్ఈ)లకు సులభతర రుణాలను అందించొచ్చు. ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌కు కేటాయింపులు పెంచొచ్చు.

జెన్ టెక్నాలజీస్ లాభం రూ.54.77 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: రక్షణ రంగంలోని జెన్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.193.44 కోట్ల ఆదాయంపై రూ.54.77 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మొత్తం 9 నెలల కాలానికి ఆదాయం రూ.572.33 కోట్లు, నికర లాభం రూ.161.92 కోట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో ఆదాయం రూ.174.25 కోట్లు, నికర లాభం రూ.39.72 కోట్లుగా ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం అక్టోబరు-డిసెంబరు మధ్య కాలంలో రూ.586 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయని సంస్థ తెలిపింది. డిసెంబరు 31 తర్వాత మరో రూ.345 కోట్ల ఆర్డర్లు వచ్చాయి. దీంతో గత నాలుగు నెలల కాలంలో మొత్తం రూ.931 కోట్ల ఆర్డర్లను దక్కించుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. మార్చి 31 నాటికి మరికొన్ని ఆర్డర్లను సంపాదించే అవకాశం ఉందని తెలిపింది.

హెచ్‌బీఎల్‌కు రూ.575 కోట్ల పనులు

ఈనాడు, హైదరాబాద్: రైల్వే భద్రతా వ్యవస్థల తయారీలో నిమగ్నమైన హైదరాబాద్ సంస్థ హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్ భారీ కాంట్రాక్టును చేజిక్కించుకుంది. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నుంచి రూ.575 కోట్ల విలువైన పనులు లభించినట్లు సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. ఈ ఒప్పందంలో భాగంగా వందే భారత్ సహా ఇతర రైళ్లలో వినియోగించే అత్యాధునిక 'కవచ్' ఆన్‌బోర్డ్ పరికరాలను హెచ్‌బీఎల్ సరఫరా చేయాల్సి ఉంటుంది. వాటి పరీక్షలు, ఏర్పాటు బాధ్యతలనూ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టును వచ్చే 12 నెలల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుందని సంస్థ వెల్లడించింది.

కోడి గుడ్లు

ఫిబ్రవరి 1న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	515
వరంగల్	517
విజయవాడ	515
తూ/ప గోదావరి	515
విశాఖపట్నం	515
చిత్తూరు	573

పసిడిలో విక్రయాల ఒత్తిడి!



కమొడిటీస్ ఈ వారం

బంగారం: పసిడి కాంట్రాక్టుకు విక్రయాల ఒత్తిడి ఎదురుకావచ్చు. అమెరికాలో ద్రవ్యోల్బణ గణాంకాలు వంటివి ప్రభావం చూపొచ్చు. ఒకవేళ అంతర్జాతీయ ఉద్రిక్తతలు పెరిగితే సానుకూల ప్రభావం కనిపించొచ్చు. గురువారం నమోదు చేసిన రూ.1,93,096 ధరతో పోలిస్తే జనవరిలో పసిడి ధర 38.92% పెరిగింది. అయితే రెండు రోజుల వ్యవధిలోనే 21.88% తగ్గింది. కొత్తగా పసిడి కొనుగోళ్లకు దిగేవారు తొందరపడకపోతే మేలు. ఫిబ్రవరి కాంట్రాక్టు 4 రోజుల్లో ముగియనుండటం కూడా ఒత్తిడి పెంచొచ్చు. ఏప్రిల్ కాంట్రాక్టు విక్రయాల ఒత్తిడికి లోనైతే రూ.1,37,764 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయి కోల్పోతే రూ.1,23,183; రూ.95,517 వరకు దిగిరావచ్చు. ఒకవేళ సానుకూలంగా కదలాడితే రూ.1,72,720 వద్ద నిరోధం ఉంది. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,93,844; రూ.2,14,967 వరకు పెరగొచ్చు.

వెండి: వెండి మార్చి కాంట్రాక్టుకు అంతర్జాతీయ పరిణామాలే దిశానిర్దేశం చేయనున్నాయి. ఈవారం ప్రతికూల ధోరణి కొనసాగితే రూ.2,49,213 వద్ద మద్దతు ఉంది. దీని కంటే కిందకు వెళితే రూ.2,06,504; రూ.1,21,087 స్థాయులను పరీక్షించే అవకాశం ఉంది. ఒకవేళ పైకి వెళితే రూ.3,77,339 వద్ద నిరోధం ఉంది. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.4,62,756; రూ.5,05,465 వరకు రాణించొచ్చు.

ప్రాథమిక లోహాలు

- ✦ రాగి ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.1,366 కంటే పైకి వెళ్లకుంటే.. రూ.1,286; రూ.1,256 వరకు దిద్దుబాటు కావచ్చు.
- ✦ సీసం ఫిబ్రవరి కాంట్రాక్టుకు లాంగ్ పొజిషన్లున్న ట్రేడర్లు రూ.192.65 సమీపంలో లాభాలు స్వీకరించొచ్చు.
- ✦ జింక్ ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.333 కంటే పైన ట్రేడ్ కాకుంటే దిద్దుబాటు కావచ్చు. రూ.306.30 వద్ద మద్దతు ఉంది. ఇది కోల్పోతే రూ.290.20; రూ.263.10 వరకు తగ్గొచ్చు.
- ✦ అల్యూమినియం ఫిబ్రవరి కాంట్రాక్టుకు రూ.295.95 వద్ద మద్దతు లభించొచ్చు. ఇది కోల్పోతే రూ.278.15; రూ.245.55 వరకు దిగిరావచ్చు. ఒకవేళ పైకి వెళితే రూ.346.45 వద్ద నిరోధం ఉంది.

ఇంధన రంగం

- ✦ ముడి చమురు ఫిబ్రవరి కాంట్రాక్టు రూ.5,704 కంటే దిగువన ట్రేడ్ కాకుంటే.. లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అయితే రూ.5,561 వద్ద స్టాప్‌లాస్ పరిగణించాలి.
- ✦ సహజ వాయువు ఫిబ్రవరి కాంట్రాక్టుకు రూ.345.65 వద్ద మద్దతు లభించొచ్చు. ఒకవేళ పైకి వెళితే రూ.418.85 వద్ద నిరోధం ఎదురుకావచ్చు.

> నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కమొడిటీల ట్రేడింగ్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది.

వ్యవసాయ ఉత్పత్తులు

- ✦ పసుపు ఏప్రిల్ కాంట్రాక్టు రూ.16,758 కంటే కిందకు వస్తే రూ.16,375; రూ.15,611 వరకు దిద్దుబాటు కావచ్చు. ఒకవేళ రూ.17,906 కంటే పైకి వెళితే రూ.18,671; రూ.19,055 వరకు పెరగొచ్చు.
- ✦ జీలకర్ర మార్చి కాంట్రాక్టు కిందకు వస్తే రూ.23,041 వద్ద మద్దతు లభించొచ్చు. ఈ స్థాయిని కోల్పోతే రూ.22,538; రూ.21,721 వరకు దిగిరావచ్చు. సానుకూల ధోరణిలో చలిస్తే రూ.24,362 వద్ద నిరోధం ఎదురుకావచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

బీడీఎల్ ఆదాయం రూ.664 కోట్లు

ఒక్కో షేరుపై రూ.4.50 డివిడెండ్

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ రంగ రక్షణ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో రూ.663.80 కోట్ల ఆదాయాన్ని, రూ.72.92 కోట్ల నికర లాభాన్నీ ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.1.99గా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.916.56 కోట్లు, నికర లాభం రూ.147.13 కోట్లు, ఈపీఎస్ రూ.4.01గా ఉన్నాయి. ఏప్రిల్-డిసెంబరు మధ్య కాలానికి మొత్తం ఆదాయం రూ.2,266.19 కోట్లు, లాభం రూ.307.16 కోట్లకు చేరింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే సమయానికి ఆదాయం రూ.1,818.91 కోట్లు, నికర లాభం రూ.276.87 కోట్లుగా నమోదయ్యాయి. 9 నెలల కాలానికి ఈపీఎస్ 8.38గా ఉంది. కొత్తగా వచ్చిన వేతన నిబంధనల కారణంగా ఉద్యోగుల ప్రయోజనాల కోసం రూ.4.47 కోట్లు కేటాయించినట్లు బీడీఎల్ వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను, రూ.5 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై రూ.4.50 మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. రికార్డు తేదీ ఫిబ్రవరి 9.

మాస్‌చిప్ ఆదాయం రూ.150 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో మాస్‌చిప్ టెక్నాలజీస్ రూ.150.68 కోట్ల ఆదాయంపై రూ.4.34 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.127.42 కోట్లు, నికర లాభం రూ.11.06 కోట్లుగా ఉన్నాయి. లేబర్ కోడ్ నేపథ్యంలో రూ.5.82 కోట్లను ఉద్యోగుల ప్రయోజనాలకు కేటాయించడంతో నికర లాభంపై ప్రభావం పడిందని కంపెనీ పేర్కొంది. మొత్తం 9 నెలల కాలంలో ఆదాయం రూ.435.21 కోట్లు, నికర లాభం రూ.27.38 కోట్లుగా ఉన్నాయి.

అమెరికా ఎస్ఈసీ నుంచి లీగల్ నోటీసులు స్వీకరిస్తాం

అంగీకారం తెలిపిన గౌతమ్, సాగర్ అదానీ



న్యూయార్క్/ దిల్లీ: మోసం, లంచం ఆరోపణల కేసు వ్యవహారంలో అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (యూఎస్ ఎస్ఈసీ) నుంచి లీగల్ నోటీసులను తీసుకునేందుకు అదానీ గ్రూపు ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన సోదరుడి కుమారుడు సాగర్ అదానీ అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. ఈ మేరకు గౌతమ్, సాగర్ తరపున వాదిస్తున్న అమెరికాకు చెందిన న్యాయవాదులు, ఎస్ఈసీలు సంయుక్తంగా కోర్టుకు ఒక దరఖాస్తును సమర్పించాయి. ఈ దరఖాస్తుకు కోర్టు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. లీగల్ నోటీసులు తీసుకునేందుకు గౌతమ్, సాగర్ అదానీ అంగీకారం తెలపడంతో.. వీరికి ఎస్ఈసీ ఏవిధంగా నోటీసులను పంపించాలనే విషయంలో న్యాయమూర్తి ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం తొలగినట్లు అయ్యింది. ఎస్ఈసీ, అదానీ తరపు న్యాయవాదులు సమర్పించిన సంయుక్త దరఖాస్తుకు న్యాయమూర్తి అంగీకారం తెలిపితే.. ఆరోపణలను ఖండించేందుకు లేదంటే వాదనను వినిపించేందుకు అదానీలకు 90 రోజుల సమయం ఉంటుంది. ఆ తర్వాత ఈ వాదనలపై మరో 60 రోజుల్లోగా ఎస్ఈసీ స్పందించాల్సి ఉంటుంది. ఈ స్పందనపై మళ్లీ 45 రోజుల్లోగా ప్రతివాదులు తమ వివరణను తెలియజేయొచ్చు. కాగా.. అదానీ గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి చేసిన విద్యుత్ కొనుగోలు కోసం భారత్‌లో ప్రభావం చూపే నాయకులు, అధికారులకు లంచాలు ఇచ్చారని, ఇందుకోసం అమెరికన్ల వద్ద పెట్టుబడి రూపంలో చేసిన నిధులు వినియోగించారన్నది ఆరోపణ. ఈ ఆరోపణలన్నీ 'నిరాధారమైనవ'ని అదానీ గ్రూప్ ఖండిస్తూ వస్తోంది.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ లాభం రూ.503 కోట్లు

దిల్లీ: ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో రూ.503 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంత క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాల లాభం రూ.339 కోట్లతో పోలిస్తే ఇది 48 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ.11,123 కోట్ల నుంచి రూ.12,542 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.9,343 కోట్ల నుంచి రూ.10,417 కోట్లకు పెరిగింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.4,902 కోట్ల నుంచి రూ.5,492 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 6.04 శాతం నుంచి 5.76 శాతానికి తగ్గింది. ఆస్తుల నాణ్యతకొస్తే స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 1.94 శాతం నుంచి 1.69 శాతానికి పరిమితమైంది. నికర ఎన్‌పీఏల నిష్పత్తి 0.52 శాతం నుంచి 0.53 శాతానికి స్వల్పంగా పెరిగింది. బ్యాంక్ కనీస మూలధన నిష్పత్తి 16.11 శాతం నుంచి 16.22 శాతానికి మెరుగైంది.

నేటి నుంచి పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం

దిల్లీ: సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై అదనపు ఎక్సైజ్ సుంకం, పాన్ మసాలాపై ఆరోగ్య సెస్ నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. జీఎస్‌టీ రేటుకు మించి అత్యధికంగా 40 శాతం వీటిపై సుంకం విధించారు. 2017 జులై 1న జీఎస్‌టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఈ వస్తువులపై ఉన్న 28 శాతం జీఎస్‌టీ, పరిహార సెస్‌ను ఎక్సైజ్ సుంకాలు, ఆరోగ్య సెస్ భర్తీ చేయనున్నాయి. పొగాకు ఉత్పత్తులకు (నమిలే పొగాకు, ఫిల్టర్ ఖైనీ, జర్దా సెంటెడ్ పొగాకు, గుట్కా) కొత్త ఎంఆర్‌పీ ఆధారిత మూల్యాంకన విధానం ప్రవేశపెట్టనున్నారు. దీని ద్వారా ప్యాకేజీపై ప్రకటించిన రిటెయిల్ అమ్మకపు ధర ఆధారంగా జీఎస్‌టీ నిర్ణయిస్తారు. పాన్ మసాలా తయారీదార్లు నేటి నుంచి ఆరోగ్య, జాతీయ భద్రతా సెస్ చట్టం కింద కొత్త రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. అటువంటి ఉత్పత్తుల తయారీదార్లు అన్ని ప్యాకింగ్ యంత్రాలను కవర్ చేసే క్రియాత్మక సీసీటీవీ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. కనీసం 24 నెలల పాటు ఫుటేజీని భద్రపరచాలి.

వినియోగదారుల ధరల సూచీ

తయారీకి కొత్త లెక్కలు

నిపుణుల కమిటీ సిఫార్సు



ఈనాడు, దిల్లీ: ద్రవ్యోల్బణ అంచనాకు ఉపయోగించే వినియోగదారుల ధరల సూచీ(సీపీఐ) లెక్కింపునకు కేంద్ర ప్రభుత్వం కొత్త సూత్రాన్ని అనుసరించడానికి సిద్ధమైంది. వినియోగదారుల వ్యవహార శైలిలో వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకొని ఈ సూచికను కచ్చితంగా నిర్ధారించేందుకు అవసరమైన కొత్త విధాన రూపకల్పన కోసం కేంద్ర గణాంకాల శాఖ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ తాజాగా ఇందుకు సంబంధించిన నివేదికను కేంద్రానికి సమర్పించింది. సీపీఐ లెక్కింపునకు ఇప్పటివరకూ ప్రామాణిక సంవత్సరంగా ఉన్న 2011-12కు బదులు 2023-24ను తీసుకోవాలని సిఫార్సు చేసింది. సీపీఐ లెక్కింపు కోసం మొత్తం 12 డివిజన్లు, 43 గ్రూపులు, 62 తరగతులు, 192 ఉప తరగతులనుంచి 358 వస్తువులను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని 434 పట్టణాల పరిధిలో ఉన్న 1465 గ్రామీణ, 1395 పట్టణ మార్కెట్ల నుంచి సేకరిస్తారు. వినియోగ వస్తువుల ధరలను ఆన్‌లైన్, ఈకామర్స్ వేదికల నుంచి ప్రతి వారం తీసుకుంటారు. ఈ కొత్త సూచీ ప్రకారం తొలి గణాంకాలను ఫిబ్రవరి 12న విడుదల చేయనున్నారు. గతంతో పోలిస్తే కొత్త విధానంలో ఆహారం, పానీయాలు, దుస్తులు, పాదరక్షలు, విద్యా సంబంధ సేవలకు వెయిటేజీ తగ్గించారు. మిగిలిన వాటికి పెంచారు. నిపుణుల కమిటీ సిఫార్సుల ప్రకారం వినియోగదారుల ధరల సూచీలో మార్పులు పైవిధంగా ఉండనున్నాయి.

వస్తువులు	ప్రస్తుత వెయిటేజీ	కొత్త వెయిటేజీ
ఆహారం, పానీయాలు	45.86	36.75
పాన్, పొగాకు, మద్యం	2.38	2.99
దుస్తులు, పాదరక్షలు	6.53	6.38
గృహ, నీరు, విద్యుత్తు, గ్యాస్, ఇతర ఇంధనాలు	16.91	17.66
ఫర్నిషింగ్, ఇంటికి కావాల్సిన వస్తువులు, సాధారణ ఇంటి నిర్వహణ	3.80	4.47
వైద్యం	5.89	6.10
రవాణా, సమాచారం, కమ్యూనికేషన్	8.59	12.41
వినోదం, క్రీడలు, సాంస్కృతికం	1.68	4.86
విద్యాసేవలు	4.46	3.33
వ్యక్తిగత వినియోగం, సామాజిక రక్షణ, ఇతరత్రా సేవలు, వస్తువులు	3.89	5.04
మొత్తం	100.00	100.00

ఫ్యూజీఫిల్మ్ నుంచి అత్యాధునిక ఉత్పత్తులు

ఈనాడు, హైదరాబాద్: ఆరోగ్య పరీక్షలకు ఉపయోగపడే అత్యాధునిక డయాగ్నోస్టిక్ ఉత్పత్తులను ఫ్యూజీఫిల్మ్ ఇండియా ఆవిష్కరించింది. వీటిలో ఎఫ్‌సీటీ ఐ-స్ట్రీమ్ పేరుతో కొత్త సీటీ స్కానర్‌ను తీసుకొచ్చింది. ఇది కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో పనిచేస్తుంది. దీనివల్ల రోగులకు తక్కువ రేడియేషన్ ముప్పు ఉంటుంది. అత్యంత స్పష్టమైన స్కానింగ్ రిపోర్టులు వస్తాయని సంస్థ పేర్కొంది. మహిళలలో రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు అమ్యులెట్ షోఫిసిటీ, చిన్న ఆసుపత్రులు, డయాగ్నోస్టిక్‌ల కోసం ఎఫ్‌డీఆర్ స్మార్ట్ ఎక్స్ ఎసెన్షియల్ ఎక్స్‌రే మెషీన్లను ఆవిష్కరించింది. దీంతోపాటు ఆసుపత్రుల డేటా నిర్వహణ కోసం దేశీయంగా రూపొందించిన 'ఫెనిక్స్' ఐటీ ప్లాట్‌ఫాంనూ తీసుకొచ్చింది. రోగులకు మెరుగైన, వేగవంతమైన ఫలితాలు అందించే సాంకేతికతను తీసుకొచ్చామని ఈ సందర్భంగా ఫ్యూజీఫిల్మ్ ఇండియా ఎండీ కోజి వాడా తెలిపారు.

నకిలీ డిగ్రీలతో

సంస్థలకు గుబులు



జీనియస్ హెచ్ఆర్ టెక్ నివేదిక

ఈనాడు - హైదరాబాద్

ప్రస్తుతం కార్పొరేట్ రంగంలో హైబ్రిడ్ పని విధానం, వివిధ నగరాల నుంచి ఉద్యోగులను నియమించుకోవడం సర్వసాధారణమైంది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల ఎంపిక ప్రక్రియలో సంస్థలు తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. కేవలం ఉద్యోగంలో చేరేటప్పుడు ఒకసారి చేసే నేపథ్య తనిఖీలు ఏమాత్రం సరిపోవడం లేదని తాజా నివేదిక వెల్లడించింది. సుమారు 74 శాతం మంది యాజమాన్య ప్రతినిధులు నకిలీ డిగ్రీలు, ఫోర్జరీ పత్రాలే తమ ప్రధాన ఆందోళనగా పేర్కొన్నట్లు జీనియస్ హెచ్ఆర్ టెక్ తమ నివేదికలో స్పష్టం చేసింది.

సంస్థలు తమ నియామకాలను భౌగోళికంగా విస్తరించడం, హైబ్రిడ్ వర్క్ మోడల్‌ను ప్రామాణికంగా మార్చుకోవడంతో, పాత పద్ధతిలో చేసే తనిఖీలతో ఇబ్బందులు వస్తున్నాయి. సర్వేలో పాల్గొన్న వారిలో 74 శాతానికి పైగా.. ఉద్యోగుల ప్రవర్తనా విశ్లేషణ, గిగ్ వర్కర్లు, మూన్‌లైటింగ్ వంటి సమస్యల కంటే.. నకిలీ డిగ్రీలు, ఫోర్జరీ పత్రాలే ప్రమాదకరమైన అంశాలని పేర్కొన్నారు.

ఏఐతో ఏమారుస్తున్నారు..

సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న కొద్దీ, గుర్తింపు చౌర్యం వంటి మోసాలు మరింత తీవ్రమవుతున్నాయి. ముఖ్యంగా జనరేటివ్ ఏఐ అందుబాటులోకి వచ్చాక, డీప్‌ఫేక్ ద్వారా సృష్టించే నకిలీ గుర్తింపులు, ఏఐ సహాయంతో తయారు చేసే రెజ్యూమ్‌లు, పత్రాల విషయంలో తాము తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు 77 శాతం మంది ఈ సర్వేలో వెల్లడించారు. ఈ పరిస్థితులు బలమైన ధ్రువీకరణ యంత్రాంగం, సాంకేతిక ఆధారిత రక్షణ చర్యల అవసరాన్ని చాటి చెబుతున్నాయని నివేదిక పేర్కొంది.

వ్యూహాత్మకంగా

జీనియస్ హెచ్ఆర్ టెక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌పీ యాదవ్ ఈ నివేదికను విశ్లేషిస్తూ.. 'నేపథ్య తనిఖీ అనేది ఇకపై కేవలం హెచ్ఆర్ విభాగానికి సంబంధించిన సాధారణ ప్రక్రియ కాదు. ఇది ఒక వ్యూహాత్మక బాధ్యతగా మారింది. నియామక ప్రక్రియ వేగవంతం కావడం, డిజిటలైజేషన్ పెరగడం, ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్న నేపథ్యంలో.. సంస్థలు సురక్షితమైన, సాంకేతికతతో కూడిన ధృవీకరణ విధానాలపై పెట్టుబడి పెట్టాలి. అప్పుడే యజమానులకు, ఉద్యోగులకు రక్షణ ఉంటుంది' అని వివరించారు.

నిరంతర పర్యవేక్షణతో


సంప్రదాయ తనిఖీలకు భిన్నంగా, ఉద్యోగుల పనికాలం మొత్తం కొనసాగే నిరంతర తనిఖీ విధానం చాలా ప్రభావం చూపిస్తుందని 50 శాతం మంది ప్రతినిధులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మరో 22 శాతం మంది ఇది ఓ మోస్తరుగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

అంతర్జాతీయ నియామకాల్లో

మరోవైపు, దేశం దాటి ఉద్యోగులను నియమించుకునే క్రమంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. దాదాపు సగం మంది (49%) న్యాయపరమైన, నియంత్రణ నిబంధనలను పాటించడమే అతిపెద్ద అవరోధంగా పేర్కొన్నారు. ఆ తర్వాత స్థానంలో 32 శాతం మంది డేటా లోకలైజేషన్ నిబంధనలను ప్రధాన సమస్యగా గుర్తించారు. వీటితో పోలిస్తే నిర్వహణ వ్యయం, తనిఖీలకు పట్టే సమయం వంటివి ద్వితీయ ప్రాధాన్య సమస్యలుగానే ఉన్నాయని నివేదిక తెలిపింది.

బ్యాంకు డిపాజిట్లు, ఈక్విటీ పెట్టుబడుల రాబడిపై పన్నులో సమానత్వం ఉండాలి

ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి



ముంబయి: బ్యాంకు డిపాజిట్లు, ఈక్విటీ పెట్టుబడుల నుంచి వచ్చే రాబడిపై పన్ను విషయంలో సమానత్వం ఉండాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి అభిప్రాయం వ్యక్తం చేశారు. ముంబయిలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, 'పొదుపు సాధనాల విషయంలో ప్రపంచంలో ఎక్కడా అసమానతలు లేవు. భారత్‌లోనూ ఇదే విధానం ఉండాలి. ప్రస్తుతం బ్యాంకు డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయంపై పన్ను శ్లాబు ప్రకారం 30 శాతం వరకు పన్ను ఉంది. అదే లిస్టెడ్ ఈక్విటీలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (రూ.1.25 లక్షలు దాటాక) 12.5 శాతం, స్వల్పకాలిక మూలధన లాభాలపై 20 శాతం పన్ను పడుతోంది. ఈ కారణంగా మదుపర్లు ఎక్కువ ప్రతిఫలం కోసం ఈక్విటీ మార్కెట్లవైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో బ్యాంకుల్లో డిపాజిట్లు తగ్గుముఖం పడుతున్నాయి. రుణాల జారీకి నిధులు కొరత ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఈక్విటీ, బ్యాంకు డిపాజిట్లను ఒకే విధంగా పరిగణించాలి. ఈక్విటీ పెట్టుబడులకు గతంలో ఇచ్చిన పన్ను ప్రోత్సాహకాలు అప్పటి పరిస్థితులకు సరైనవే కావొచ్చు. ఇప్పుడు ఈక్విటీ మార్కెట్లపై ఆసక్తి పెరిగిన నేపథ్యంలో ప్రత్యేకంగా చూడాల్సిన అవసరం లేద'ని వెల్లడించారు. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ఒక రోజు ముందు ఎస్‌బీఐ ఛైర్మన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకున్నాయి.


అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
పవర్‌గ్రిడ్ కార్పొరేషన్[1]	4,185	3,861.63	12,599	11,743.06
సన్‌ఫార్మా[2]	3,369	2,903	15,520	13,675
చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్	1,288	1,087	7,985	6,812
ఈఎస్ఏఎఫ్	7	(211)	1,163	1,062
బిర్లా కార్పొరేషన్	52.76	31.19	2,158.74	2,256.65

1 రూ.3.25 రెండో మధ్యంతర డివిడెండు 2 రూ.11 మధ్యంతర డివిడెండు

హర్మూజ్ జలసంధి.. ఎందుకంత కీలకం?

ఇరాన్, అమెరికా ఉద్రిక్తతల వేళ హర్మూజ్ జలసంధిపై ఇప్పుడందరి దృష్టి నెలకొంది. ఎందుకంటే ఈ రెండు దేశాల మధ్య యుద్ధం జరిగితే ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన ఈ జలసంధి మూతపడే పరిస్థితి ఉంది. అదే జరిగితే ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. పలు దేశాల ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమయ్యే ప్రమాదమూ ఉంది.



ఇరుకైన మార్గమే కానీ..

హర్మూజ్ జలసంధిని ప్రపంచ ఇంధన సరఫరాకు జీవనాడిగా భావిస్తారు. ఎందుకంటే పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు ట్యాంకర్లు బాహ్య ప్రపంచానికి వెళ్లాలంటే ఈ జలసంధిని దాటాల్సిందే. ప్రపంచ ఇంధన సరఫరాలో 20 నుంచి 25 శాతం చమురు, 20 శాతం సహజవాయువు ఈ ఇరుకైన జలమార్గం నుంచే అంతర్జాతీయ మార్కెట్లకు రవాణా అవుతోంది. ఒమన్‌లోని ముసాండమ్, ఇరాన్‌లోని మహమ్మది ప్రాంతాల మధ్య ఈ జలసంధి వెడల్పు కేవలం 33 కిలోమీటర్లే. దీంతో భద్రతాపరంగానూ ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు ఇరాన్ నుంచి ప్రమాదం పొంచి ఉంది. గతంలో కొన్ని వాణిజ్య నౌకలను పలు కారణాలతో దిగ్బంధించిన చరిత్ర కూడా ఇరాన్‌కు ఉంది. కీలక చమురు ఉత్పత్తిదారులైన సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ, కువైట్‌ల అంతర్జాతీయ వ్యాపారానికి ఈ జలసంధే ఆధారం.

ఇరాన్ మూసివేస్తుందా..

గతేడాది ఇరాన్‌కు చెందిన మూడు అణుస్థావరాలపై అమెరికా దాడి చేసింది. దీంతో ఆ జలసంధిని మూసివేయాలని జూన్ నెలలో ఇరాన్ పార్లమెంటు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అయితే దీనిపై తుది నిర్ణయాన్ని ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనికే పార్లమెంటు అప్పగించింది. ఒక వేళ అమెరికా దాడి చేస్తే ఈ జలసంధి మూసివేతకు సుప్రీం నేత ఆదేశాలిచ్చే అవకాశాలను పూర్తిగా తోసిపుచ్చలేం. అయితే ఇరాన్ గతంలో ఎన్నడూ దీన్ని మూయలేదు. ఎందుకంటే హర్మూజ్‌ను మూసివేస్తే ఎక్కువగా ప్రభావితమయ్యేది ఆ దేశమే. టెహ్రాన్ ఉత్పత్తి చేసే చమురు కూడా ఈ మార్గం ద్వారే వెళ్లాలి. గతంలో ఇరాక్‌తో కొనసాగిన సుదీర్ఘ యుద్ధ సమయంలోనూ ఈ జలసంధిని ఇరాన్ తెరిచే ఉంచింది.

భారత్‌పై ప్రభావం ఏ మేరకు?

ఒకవేళ హర్మూజ్‌ను పూర్తిగా లేదా పాక్షికంగా మూసివేసినా, ఆ ప్రభావం భారత్‌పై తీవ్రంగానే పడే అవకాశం ఉంది. ఈ మధ్య కాలంలో రష్యా నుంచి చమురును భారత్ కొనుగోలు చేస్తున్నా.. 50 శాతంపైగా ఇంకా పశ్చిమాసియా నుంచే దిగుమతి అవుతోంది. మనకు చమురు సరఫరా చేసే ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, యూఏఈలకు ఈ మార్గమే ఆధారం. దీన్ని మూసివేస్తే.. భారత్‌కు రోజుకు రావాల్సిన 2 మిలియన్ బ్యారెళ్ల చమురు నిలిచిపోతుంది. అంతేకాదు భారీస్థాయిలో (50 నుంచి 54 శాతం) సహజవాయువు దిగుమతులూ ఆగిపోతాయి. అత్యధిక ప్రభావం చైనాపై ఉండనుంది. ఎందుకంటే అమెరికా ఆంక్షలు విధించిన తర్వాత టెహ్రాన్ ఉత్పత్తి చేసే చమురులో 80 శాతాన్ని ఈ దేశమే కొనుగోలు చేస్తోంది. ఈ జలసంధి పాక్షికంగా మూతపడినా.. చైనా పరిశ్రమలు భారీ నష్టాలు ఎదుర్కొనే అవకాశం ఉంది.

భారీగా సైనిక విన్యాసాలు

ఇరాన్‌పై దాడి చేస్తామన్న సంకేతాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పంపుతూనే ఉన్నారు. ఆయన కేవలం మాటలతోనే సరిపెట్టడం లేదు. భారీస్థాయిలో యుద్ధనౌకలను కీలక క్షిపణులను పశ్చిమాసియాలో మోహరిస్తున్నారు. విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ కూడా అరేబియా సముద్రంలోకి అడుగుపెట్టింది. దీంతో యుద్ధ మేఘాలు అలముకున్నాయి. ఈ నేపథ్యంలో హర్మూజ్ జలసంధి దగ్గర భారీగా సైనిక విన్యాసాలు చేయాలని ఇరాన్ నిర్ణయించింది. ఈ మేరకు ఆ మార్గం గుండా ప్రయాణించే నౌకలకూ హెచ్చరికలు పంపింది. ఈ సైనిక విన్యాసాలపై అమెరికా ఘాటుగానే స్పందించింది. అంతర్జాతీయ గగనతలం, సముద్ర జలాల్లో అంతర్జాతీయ నౌకలకు ప్రయాణించే హక్కు ఉందని పేర్కొంది. అంతేకాదు.. సైనిక విన్యాసాల్లో భాగంగా తమ యుద్ధనౌకలు, వాణిజ్య నౌకలు సమీపానికి వస్తే.. చర్యలు ఉంటాయని అమెరికా తీవ్రంగా హెచ్చరించింది.

- నేషనల్ డెస్క్



ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో తాజా హిమపాతం కారణంగా బద్రీనాథ్ ఆలయ పరిసరాల్లో పేరుకుపోయిన మంచు

మోదీ సర్కారుకు సంప్రదింపులంటే గిట్టదు: సిబల్

దిల్లీ: నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014లో అధికారం చేపట్టినప్పటి నుంచీ ఎవరినీ సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవాలన్న నియమం ప్రాతిపదికన పనిచేస్తున్నట్టు కనిపిస్తోందని రాజ్యసభ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ శనివారం ఆరోపించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తెచ్చిన సమానత్వ నిబంధనావళి మీద విద్యార్థులు, పౌర సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఒక వార్తాసంస్థకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. యూజీసీ సమానత్వ నిబంధనావళి ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది కాబట్టి, దాని గురించి తాను మాట్లాడటం సబబు కాదని సిబల్ అన్నారు. ఈ నిబంధనావళిపై సుప్రీంకోర్టు గురువారం స్టే ఇచ్చింది. యూజీసీ నిబంధనలు సందిగ్ధంగా ఉన్నాయనీ, అవి దుర్వినియోగమయ్యే అవకాశం లేకపోలేదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడుకున్న ధర్మాసనం పేర్కొంది. ఉన్నత విద్యాసంస్థల ప్రాంగణాలలో కులపరమైన భేదభావం అంటే షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఓబీసీలపై వివక్ష చూపడమేనని తాజా యూజీసీ నిబంధనలు నిర్వచించాయి. అన్ని ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ కమిటీలను ఏర్పాటు చేయాలనీ, వాటిలో షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఓబీసీలు, మహిళలు, దివ్యాంగులను సభ్యులుగా నియమించాలని జనవరి 13న నోటిఫై చేసిన యూజీసీ నిబంధనలు పేర్కొంటున్నాయి. అవి ప్రమాదకర స్థాయిలో సమాజాన్ని విభజించవచ్చని ఆందోళన వ్యక్తంచేస్తూ మూడు పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. వీటిపై కేంద్ర ప్రభుత్వం, యూజీసీ తమ స్పందనను మార్చి 19కల్లా తెలియజేయాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. విధానాల రూపకల్పనలో, వాటి అమలులో సమాజంలోని అన్ని వర్గాల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకోవాలని సిబల్ వ్యాఖ్యానించారు.

క్షిపణి పరీక్షకు భారత్ సన్నద్ధం!

- బంగాళాఖాతంపై 'నోటమ్' జారీ

దిల్లీ: బంగాళాఖాతంపై ఒక క్షిపణి పరీక్ష చేపట్టేందుకు భారత్ సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఫిబ్రవరి 5-6 తేదీల్లో బంగాళాఖాతంపై 3,190 కిలోమీటర్ల పరిధిలో విమానాలను అనుమతించబోమంటూ విమానయాన సంస్థలకు నోటీసులు (నోటమ్) ఇచ్చింది. ఆ తేదీల్లో నిర్దేశిత పరిధిలో పౌర విమానాల గగనవిహారానికి అనుమతి ఉండదు. గతంలో 2,530 కిలోమీటర్లు ఉన్న నోటమ్ పరిమితిని సుమారు 3,190 కిలోమీటర్లకు పెంచినట్లు తెలుస్తోంది. క్షిపణి పరీక్షల కోసమే నోటమ్‌ను జారీ చేసినట్లు వార్తలు వస్తున్నాయి. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పెద్ద మొత్తంలో ఆయుధాలను సమకూర్చుకుంటున్న భారత్.. స్వదేశీ ఆయుధాల తయారీని వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పలు క్షిపణి పరీక్షలను నిర్వహిస్తోంది.

ఏకపక్షంగా బంగ్లా ఎన్నికలు

ఢాకా: బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12న పార్లమెంటు ఎన్నిక, రాజ్యాంగ సంస్కరణలపై ప్రజాభిప్రాయ సేకరణ (రెఫరెండం) ఒకేసారి జరగనున్నాయి. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం మాజీ ప్రధాని షేక్ హసీనాకు మరణ శిక్ష విధించి, ఆమె నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీని నిషేధించిన నేపథ్యంలో పోటీ ప్రధానంగా బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బి.ఎన్.పి), జమాతే ఇస్లామీ పార్టీల మధ్యనే ఉంటుంది. గతంలో ఈ రెండు పార్టీలూ షేక్ హసీనాకు వ్యతిరేకంగా జట్టుకట్టినా నిరుడు ఆగస్టులో పొత్తు తెంచుకున్నాయి. అవామీ లీగ్ ఓటర్లను ఆకట్టుకోవడానికే బి.ఎన్.పి ఈ ఎత్తుగడ వేసిందని విశ్లేషకులు అంటున్నారు. అందుకు తగ్గట్టే ఆ పార్టీ మద్దతుదారులు లౌకిక పార్టీ అయిన తమకే ఓటు వేయాలంటూ బి.ఎన్.పి ప్రచారం చేస్తోంది. ప్రధాన రాజకీయ పార్టీ అయిన అవామీ లీగ్ లేకుండా జరుగుతున్న ఎన్నికల న్యాయబద్ధతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అవామీ లీగ్ మద్దతుదారులు పోలింగ్‌లో పాల్గొనకపోవచ్చని మాజీ ప్రధాని షేక్ హసీనా భారతీయ, అంతర్జాతీయ వార్తా సాధనాలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. కొన్ని బంగ్లాదేశీ వార్తాపత్రికల్లో ప్రచురితమైన సర్వే ప్రకారం అవామీ లీగ్ మద్దతుదారుల్లో 41.3 శాతం మంది పోలింగ్‌లో పాల్గొనాలా వద్దా అనే విషయమై ఎటూ తేల్చుకోలేదు. 32.9 శాతంమంది బి.ఎన్.పికి ఓటు వేయదలచుకున్నారు. 13.2 శాతం మంది జమాతే ఇస్లామీకి ఓటు వేయదలిచారు. కీలక పార్టీలు పాలుపంచుకోనిదే ప్రజాస్వామ్యం నిలబడదని ప్రముఖ ఆర్థికవేత్త, విద్యావేత్త రహమాన్ శోభన్ హెచ్చరించారు. ఆయన ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్‌కు ఆరు దశాబ్దాల క్రితం ఢాకా విశ్వవిద్యాలయంలో పాఠాలు చెప్పిన గురువు.



పేలుడు ధాటికి దెబ్బతిన్న ఓ భవనం

ఇరాన్ పోర్టులో భారీ పేలుడు

ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టులో భారీ పేలుడు సంభవించింది. దీని ప్రభావంతో సమీప నివాస భవనాలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఐదుగురు మరణించినట్లు సమాచారం. పేలుడుకు గల కారణాలు తెలియలేదు. అయితే ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ నేవీ కమాండర్ లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నప్పటికీ.. స్థానిక అధికారిక మీడియా వాటిని ఖండించింది. ప్రస్తుతం అమెరికా, ఇరాన్‌లు యుద్ధానికి సై అంటున్న వేళ పేలుడు కలకలం రేపింది. బందర్ అబ్బాస్ నౌకాశ్రయం హోర్ముజ్ జలసంధిలో ఉంది. ఇరాన్, ఒమన్‌ల మధ్య కీలక జలమార్గం. ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు ఈ మార్గం ద్వారానే సరఫరా అవుతుంది. గతేడాది ఏప్రిల్‌లోనూ బందర్ అబ్బాస్ సమీపంలోని పోర్టులో భారీ పేలుడు సంభవించిన ఘటనలో వందిలాది మంది గాయపడినట్లు అప్పట్లో వార్తలొచ్చాయి.

న్యాయవాదిగా నమ్మించి మోసం..

- ఆస్ట్రేలియాలో భారత విద్యార్థికి జైలు

ఇంటర్నెట్‌డెస్క్: ఆస్ట్రేలియాలో ఓ భారతీయ విద్యార్థి జైలు పాలయ్యాడు. న్యాయవాదిగా నమ్మించి ఓ వ్యక్తిని ఆర్థికంగా మోసగించడంతో అతనికి రెండేళ్ల జైలు శిక్ష పడింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. భారత్‌కు చెందిన 28 ఏళ్ల ప్రదీప్.. విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియాలో నివసిస్తున్నాడు. ఉబర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సిడ్నీకి చెందిన ఒక ప్రముఖ న్యాయసంస్థ పేరిట నకిలీ సంస్థ ఏర్పాటుచేశాడు. ఈ క్రమంలో న్యాయసేవల కోసం తన వద్దకు వచ్చిన ఓ వ్యక్తిని మభ్యపెట్టి.. 2 లక్షల ఆస్ట్రేలియా డాలర్ల (రూ.1.28 కోట్లు) మేర డబ్బు గుంజాడు. అతడి ప్రవర్తనపై అనుమానం వచ్చి బాధితుడు మరో న్యాయవాది వద్దకు వెళ్లడంతో ప్రదీప్ మోసం బయటపడింది. బాధితుడు చేసిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అయితే మోసగించిన సొమ్ములో 900 ఆస్ట్రేలియా డాలర్లను మాత్రమే స్వాధీనం చేసుకోగలిగారు. మిగతా సొమ్ముతో అతడు బంగారం కొనుగోలు చేసినట్లు గుర్తించారు. ఈ కేసులో ప్రదీప్ దోషిగా తేలడంతో లివర్‌పూల్ స్థానిక న్యాయస్థానం అతడికి రెండేళ్ల జైలు శిక్ష విధించింది.

అమెరికాలో పడవ గల్లంతు

- తెలియని ఏడుగురి జాడ

బోస్టన్: అమెరికాలోని మసాచూసెట్స్ రాష్ట్రంలో ఏడుగురితో చేపల వేటకు వెళ్లిన ఓ పడవ కనిపించకుండా పోవడంతో కోస్ట్‌గార్డ్ గాలింపు చర్యలు ప్రారంభించింది. కేప్ యాన్ తీరానికి 25 మైళ్ల దూరం నుంచి తమను కాపాడాలని లిలీ జీన్ అనే బోట్ నుంచి శుక్రవారం ఉదయం అధికారులకు సందేశం అందింది. తమకు సిగ్నల్ వచ్చిన ప్రాంతానికి రక్షణ సిబ్బంది వెళ్లి చూడగా సముద్రంలో కొన్ని వస్తువులు, అచేతన స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని గుర్తించారు. ఆ బోట్‌ను సంప్రదించడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఎంహెచ్-60 జె హాక్ హెలికాప్టర్, బోట్లతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. లిలీ జీన్, దాని కెప్టెన్ గస్ శాన్‌ఫిలిప్పో 2012లో వచ్చిన ప్రఖ్యాత హిస్టరీ ఛానల్ షో నార్‌ఈస్టర్ మెన్‌లో కనిపించారు. ఫిలిప్పో ఆ ఎపిసోడ్‌లో సముద్రంలో ప్రమాదకర వాతావరణ పరిస్థితుల్లో 10 రోజుల పాటు ప్రయాణిస్తూ వేటాడటాన్ని చూపించారు.

పాక్ ఆక్రమిత కశ్మీర్ 'అధ్యక్షుడి' కన్నుమూత

ఇస్లామాబాద్: పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ సీనియర్ నేత, పాక్ ఆక్రమిత్ కశ్మీర్ (పీవోకే) 'అధ్యక్షుడు' సుల్తాన్ మెహమూద్ చౌదరీ (71) శనివారం కన్నుమూశారు. కాలేయ క్యాన్సర్‌తో ఆయన కొన్నాళ్లుగా ఇస్లామాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన చౌదరీని 2021 ఆగస్టులో పీవోకే 'అధ్యక్షుని'గా ఎన్నుకున్నారు. ఆయన కన్నుమూతపై పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ సంతాపం వ్యక్తంచేశారు.

మోదీ మాట.. సిద్ధార్థ్ నోట

- రిపబ్లిక్ డే కార్యక్రమ అనువాదకుడిపై నెటిజన్ల ఆరా
- అంతర్జాతీయ వ్యవహారాల్లో ఆసక్తితో ఐఎఫ్ఎస్‌లోకి



ఇంటర్నెట్‌డెస్క్: రిపబ్లిక్ కవాతులో సైనిక విన్యాసాలు, శకటాలను అబ్బురంగా వీక్షించాం. అయితే ఆ సమయంలో ఓ యువకుడు మోదీకి, అతిథులుగా వచ్చిన ఐరోపా నేతలకు మధ్య వారధిగా వ్యవహరించారు. సంభాషణలను ఎలాంటి తడబాటు లేకుండా వారికి అర్థమయ్యే భాషలో వివరించడాన్ని దేశం మొత్తం చూసింది. ఆయన ఎవరా..? అని నెటిజన్లు ఆరా తీయడం మొదలుపెట్టారు. ఆయనొక ఐఎఫ్ఎస్ అధికారి. పేరు సిద్ధార్థ్ బాబు. స్వస్థలం- కేరళలోని కొచ్చిన్. మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేసి, ఈ-కామర్స్ రంగంలో కొంతకాలంపాటు పనిచేశారు. ఆ సమయంలో చూసిన సినిమాలు, థ్రిల్లర్స్, టెలివిజన్ షోలు అంతర్జాతీయ వ్యవహారాలపై ఆసక్తిని పెంచాయి. ప్రపంచ రాజకీయాలు, అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రాతినిధ్యాన్ని మరింత అర్థం చేసుకునేందుకు పుస్తకాలు చదవడం మొదలుపెట్టారు. ఆ అలవాటే కార్పొరేట్ ఉద్యోగం వదిలేసి, యూపీఎస్సీ పరీక్షలు రాయాలన్న నిర్ణయానికి వచ్చేలా చేసింది. అనుకున్నట్టుగానే చదివి, తొలిసారి పరీక్ష రాశారు. విజయం మాత్రం పలకరించలేదు. లోపాలను సరిచేసుకుంటూ మరో ప్రయత్నం చేసి.. యూపీఎస్సీ-2016లో జాతీయస్థాయిలో 15వ ర్యాంకు సాధించారు. అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఐఏఎస్‌ను కాదని ఐఎఫ్ఎస్ (ఇండియన్ ఫారిన్ సర్వీస్) ఎంచుకున్నారు. కాలిఫోర్నియాలోని మిడిల్బరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్‌లో తన నైపుణ్యాలను మెరుగుపర్చుకున్నారు. పలు భాషల్లో ప్రావీణ్యం సంపాదించుకున్న సిద్ధార్థ్ ప్రశాంతంగా కనిపిస్తారు. వీటివల్లే దౌత్య వ్యవహారాల్లో కీలకంగా మారారు. అందుకే అంతర్జాతీయ వేదికలపై ఉన్నతస్థాయి సమావేశాల్లో నేతల మధ్య సంభాషణలను సమన్వయం చేస్తుంటారు. ప్రస్తుతం విదేశీ వ్యవహారాల శాఖలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

ఆటిజం బాలుడిపై అత్యాచారం కేసులో కేరళ టీచరుకు 161 ఏళ్ల జైలు

ఈటీవీ భారత్: తిరువనంతపురంలో పదేళ్ల ఆటిజం బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన కీచక టీచరుకు ఏకంగా 161 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కేరళ న్యాయస్థానం శనివారం సంచలన తీర్పు వెలువరించింది. రూ.87,000 జరిమానా కూడా విధించింది. జరిమానా కట్టకపోతే అదనంగా మరో ఎనిమిదిన్నర ఏళ్ల జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తిరువనంతపురం ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి అంజు మీరా బిర్లా ఈ మేరకు తీర్పు చెప్పారు.



సమాజంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో కోర్టు ఈ శిక్ష విధించింది. కన్నూర్ ప్రాంతానికి చెందిన పదేళ్ల బాలుడిపై 2019 జులై నెలలో ఈ అఘాయిత్యం జరిగింది. ఆటిజం చికిత్స కోసం బాలుడిని తిరువనంతపురానికి తీసుకొచ్చిన తల్లిదండ్రులు అక్కడే ఓ ప్రత్యేక పాఠశాలలో చేర్పించారు. ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంతోష్‌కుమార్ (56) బాలుడికి బిస్కెట్లు, మిఠాయిలు ఇచ్చి మచ్చిక చేసుకొని మరుగుదొడ్లోకి తీసుకువెళ్లి అఘాయిత్యానికి పాల్పడేవాడు. సరిగా మాట్లాడలేని ఆ బాలుడు అరిచినా ఎవరికీ అర్థం కాదు. ఒకవేళ ప్రతిఘటించి శబ్దం చేస్తే, నిందితుడు ఆ చిన్నారి తలను గోడకేసి బలంగా కొట్టేవాడు. ఎవరికైనా చెబితే తల్లిని చంపేస్తానని బెదిరించేవాడు.

బయటపడింది ఇలా..

బాలుడి ప్రవర్తనలో వచ్చిన మార్పులను, శరీరంపై గాయాలను తల్లిదండ్రులు గమనించారు. సరిగా మాట్లాడలేకపోయినా ఆ బాలుడికి ఒక అలవాటు ఉంది. తాను చూసినవి, విన్నవి పుస్తకంలో రాయడం లేదా బొమ్మలు గీయడం చేసేవాడు. ఇలా తనపై జరిగిన ఘోరాన్ని ఆ చిన్నారి పుస్తకంలో రికార్డు చేశాడు. ఆ చిత్రలేఖనాలు చూసి తల్లిదండ్రులు, థెరపిస్టులు షాక్ అయ్యారు. మానసిక వైద్యులతో కూడిన ముగ్గురు సభ్యుల ప్యానెల్ బాలుడి వాంగ్మూలాన్ని రికార్డు చేసింది. దీని ఆధారంగా పోలీసులు ఆధారాలు సేకరించి, నిందితుడి నేరాన్ని కోర్టులో నిరూపించారు. నిందితుడి మొత్తం శిక్షా కాలం 161 ఏళ్లు కాగా.. వివిధ సెక్షన్ల కింద శిక్షలు ఏకకాలంలో అమలవుతాయి కాబట్టి, కనీసం 20 ఏళ్లపాటు జైలులో గడపాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది.

కాఫీ చైన్లపై దాడులకు ఎర్రకోట ఉగ్ర ముఠా కుట్రలు

ఇంటర్నెట్‌డెస్క్: దిల్లీలోని ఎర్రకోట పేలుడు కేసుకు సంబంధించిన మరిన్ని విషయాలను దర్యాప్తు అధికారులు తాజాగా వెల్లడించారు. ఈ దాడికి పాల్పడిన వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్.. ప్రఖ్యాత కాఫీ చైన్లను లక్ష్యంగా చేసుకుని ఉగ్రదాడికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. తమ అదుపులో ఉన్న ఉగ్రవాదులు గత నాలుగేళ్లుగా ఈ వ్యవహారంలో చురుగ్గా ఉన్నారని, భారీ స్థాయిలో పేలుడు పదార్థాలను తయారుచేసుకున్నారని పేర్కొన్నారు. విదేశీ ఆయుధాలను కూడా నిందితులు కొనుగోలు చేశారని అధికారులు తెలిపారు. వీటి కొనుగోళ్లకు పుల్వామా దాడి కుట్రదారుడు ఉమర్ ఫరూఖ్ భార్య అఫ్రా బీబీ సాయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్, హరియాణాల్లోని ముఖ్య నగరాల్లో రద్దీగా ఉండే ప్రాంతాల్లో నవంబరు, డిసెంబరు నెలల్లో పలు ఉగ్ర దాడులకు ప్రణాళికలు వేశారని అధికారులు వెల్లడించారు. అయితే అంతకుముందే నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం వల్ల దాడులను నివారించగలిగారు.



మాఘ పూర్ణిమ సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో శనివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆధ్యాత్మిక నేత ప్రదీప్ మిశ్ర ప్రవచనాలు వినేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు

మోదీని కలిసిన అరబ్బు మంత్రులు

దిల్లీ: అరబ్బు దేశాల విదేశాంగ మంత్రులు శనివారం ప్రధాని మోదీని కలిశారు. పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాల కోసం కృషి చేస్తున్నందుకు వారిని మోదీ అభినందించారు. రెండో భారత-అరబ్ విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు మంత్రులు దిల్లీకి వచ్చారు. భారతీయులకు, అరబ్బులకు మధ్య ఉన్న అనుబంధానికి సుదీర్ఘ చరిత్ర ఉందని ప్రధానమంత్రి ఈ సందర్భంగా అన్నారు. ఈ పరస్పరానుబంధం ఏళ్లుగా బలపడుతూనే ఉందని ఆయన అన్నట్టు ప్రధానమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రానున్న కాలంలో భారత్- అరబ్బు భాగస్వామ్యం ఎలా ఉండబోతోందన్న అంశంపై తన ఆలోచనల్ని ప్రధాని పంచుకున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, సాంకేతిక పరిజ్ఞానం, వైద్యం తదితర ప్రాధాన్య రంగాల్లో ఇరు పక్షాలకూ ప్రయోజనం కలిగేలా సహకారాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పాలస్తీనా ప్రజలకు భారత్ మద్దతును ప్రధాని పునరుద్ఘాటించారని, గాజాలో శాంతి స్థాపనకు జరుగుతున్న ప్రయత్నాలపై హర్షం వ్యక్తం చేశారని అధికారిక ప్రకటన పేర్కొంది. భారత- అరబ్బు విదేశాంగ మంత్రుల సమావేశంలో ప్రారంభోపన్యాసం చేసిన భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ.. పశ్చిమాసియా అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, సుస్థిరతకు దోహదం చేసే శక్తుల్ని బలోపేతం చేయడంలోనే సమష్టి ప్రయోజనం ఉందని అన్నారు. గాజా వివాదాన్ని ముగించే ప్రణాళికను ముందుకు తీసుకెళ్లడమే అందరి ప్రాధాన్యంగా మారిందని ఆయన పేర్కొన్నారు. సుడాన్, యెమెన్, లెబనాన్, సిరియాలలో కొనసాగుతున్న సంఘర్షణలు ఆయా ప్రాంతాలపై చూపుతున్న ప్రతికూల ప్రభావాన్ని ఆయన ప్రస్తావించారు.

✦ పాలస్తీనా సమస్యకు రెండుదేశాల గుర్తింపే పరిష్కారమని భారత్-అరబ్బు లీగ్ దేశాలు ఉద్ఘాటించాయి. ఇజ్రాయెల్, పాలస్తీనా పరస్పర మనుగడకు సార్వభౌమాధికార పాలస్తీనా ఏర్పాటు కీలకమని, ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరుతూ.. దిల్లీలో జరిగిన రెండో అరబ్బులీగ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం సంయుక్త డిక్లరేషన్ వెలువరించింది.

మా దేశం చెప్పే ప్రతిదానికీ భారత్ తలాడించదు

- అమెరికా రిటైర్డ్ కర్నల్ వ్యాఖ్య

ఇంటర్నెట్‌డెస్క్: భారత్-అమెరికాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలపై ఆ దేశ రిటైర్డ్ కర్నల్, రక్షణ రంగ నిపుణుడు డగ్లస్ మక్‌గ్రెగర్ స్పందించారు. వాణిజ్య ఒప్పందాల కోసం అమెరికా చెప్పే ప్రతిదానికి భారత్ తలాడించదని అన్నారు. ఎందుకంటే సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశమూ ఇతర దేశాలతో చర్చలు జరపబోదన్నారు. మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యాతో వ్యాపారం చేస్తుందన్న కారణంతో భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు 50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖపు మనస్తత్వాన్ని తెలియజేస్తోందని విమర్శించారు. భారత్‌తో సంబంధాలపై మాట్లాడుతూ.. అమెరికా ఎప్పుడూ ప్రపంచదేశాలు తమతోనే ఉండాలి.. లేదా తమకు వ్యతిరేకంగా ఉండాలనే సిద్ధాంతాన్ని పాటిస్తుందన్నారు. ఎన్నో ఏళ్లుగా భారత్-రష్యాలు మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని.. ఇప్పుడు వాటిని కలిసి వ్యాపారం చేయొద్దంటే అవి అమెరికాను వ్యతిరేకించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

బల్ల రిక్షాపై 12 కి.మీ. మహిళ మృతదేహం తరలింపు



ఫరీదాబాద్: హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల బాద్‌షా ఖాన్ సివిల్ ఆసుపత్రిలో అనురాధా దేవి (35) అనే మహిళ క్షయవ్యాధికి చికిత్స పొందుతూ మృతిచెందగా ఆమె కుటుంబసభ్యులు 12 కి.మీ. దూరాన ఉన్న తమ గ్రామానికి మోటారుతో నడిచే బల్ల రిక్షాపై మృతదేహాన్ని తరలించాల్సి వచ్చింది. ఆసుపత్రి సిబ్బంది అంబులెన్సు ఏర్పాటుకు ససేమిరా అనడంతో గత్యంతరం లేక అలా చేశామని మృతురాలి భర్త ఝున్‌ఝున్ ఆవేదన వ్యక్తం చేశారు. "అప్పటికే నా దగ్గరున్న డబ్బులన్నీ ఖర్చయిపోగా.. ఆసుపత్రి అంబులెన్సు సిబ్బంది సొంత రవాణా ఏర్పాటు చేసుకోమన్నారు. ప్రైవేటు ఆపరేటర్లు రూ.700 దాకా అడిగారు" అన్నారు. ఈ వీడియో వైరల్‌గా మారడంతో చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో) స్పందించి విచారణకు ఆదేశించారు.

అందమైన రాతలో అతిపెద్ద ఖురాన్!




ఇస్తాంబుల్: ఇరాకీ నగిషీ రాత నిపుణుడు అలీ జమాన్ (54) ప్రపంచంలో అతి పెద్ద ఖురాన్ ప్రతిని స్వదస్తూరీలో వెలువరించారు. అయితే ఆయన రూపొందించిన ఖురాన్ ప్రపంచంలో అతిపెద్దదని అధికారిక గుర్తింపు ఇంకా అందాల్సి ఉంది. ప్రపంచంలో అతిపెద్ద ముద్రిత ఖురాన్ ప్రతిని నిరుడు మార్చిలో సౌదీ అరేబియాకు చెందిన మక్కాలోని హోలీ ఖురాన్ మ్యూజియం ప్రచురించినట్లు గిన్నిస్ ప్రపంచ రికార్డులలో నమోదైంది. జమాన్ వెలువరించిన ఖురాన్ అందుకు భిన్నంగా చేతిరాతతో సిద్ధమైంది. ఇస్తాంబుల్‌లోని మిహిరిమా సుల్తాన్ మసీదులోని గదిలో జమాన్ ఆరేళ్లపాటు శ్రమించి నగిషీ రాతలో ఖురాన్ ప్రతిని రాశారు. అందులో రెండు వైపులా రాసిన మొత్తం 302 పుటలు ఉన్నాయి. ఒక్కో పుట 13 అడుగుల పొడవు, 4 అడుగుల 11 అంగుళాల వెడల్పు కలిగి ఉంది. ఈ పుటల తయారీకి పటిక, కోడి గుడ్ల సొన, మొక్కజొన్న పిండి మిశ్రమాన్ని వినియోగించారు. నగిషీ రాతతో కూడుకున్న ఖురాన్ ప్రతులకు తుర్కియేలో ఓటోమాన్ పాలనా కాలం నుంచీ ఎంతో ఆదరణ లభిస్తోంది. తన కృతిని నగిషీ రాతకు పట్టంకట్టే దేశంలో కానీ, మ్యూజియంలో కానీ, మరేదైనా గొప్ప స్థలంలో కానీ అందరికోసం అందుబాటులో ఉంచాలని ఆశిస్తున్నట్టు అలీ జమాన్ తెలిపారు. ఈ పని చేయగల దాత కోసం ఎదురుచూస్తున్నారు.

ప్రాథమిక హక్కులు

స్వేచ్ఛా స్వాతంత్ర్యపు హక్కు (19 - 22 నిబంధనలు)

రాజ్యాంగంలోని మూడో భాగంలో 12 నుంచి 35 వరకు ఉన్న అధికరణలు ప్రాథమిక హక్కుల గురించి తెలియజేస్తాయి. రాజ్యాంగ లక్షణాల్లో ప్రాథమిక హక్కులు కీలకమైనవి. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చే నాటికి 7 ప్రాథమిక హక్కులు ఉండేవి. ప్రస్తుతం 6 ప్రాథమిక హక్కులు ఉన్నాయి. 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల నుంచి తొలగించారు. రాజ్యాంగంలోని 14 - 18 నిబంధనలు సమానత్వపు హక్కుల గురించి పేర్కొంటే, 19 - 22 నిబంధనలు స్వేచ్ఛా స్వాతంత్ర్యపు హక్కు గురించి తెలుపుతాయి.

భావ ప్రకటన స్వేచ్ఛపై.. హేతుబద్ధ పరిమితులు



19వ నిబంధన

ఈ నిబంధన వివిధ రకాల స్వేచ్ఛలు, వాటిపై ఉన్న పరిమితులను తెలియజేస్తుంది. ఈ నిబంధనలో పేర్కొన్న స్వేచ్ఛలు భారత పౌరులకు మాత్రమే లభిస్తాయి.

19(1)(ఎ): వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వాతంత్ర్యం.

❖ పౌరులు తమ భావాలను, ఆలోచనలను, వివిధ ప్రక్రియల ద్వారా వెల్లడించే స్వేచ్ఛలన్నీ ఈ నిబంధన కిందకే వస్తాయి. ఈ నిబంధనలో అంతర్గతంగా పత్రికా స్వేచ్ఛ, వాణిజ్య ప్రకటన స్వేచ్ఛ, ప్రసారాల స్వేచ్ఛ, నాటకాలు, రేడియో, టీవీ లాంటి ప్రసార సాధనాలు, బహిరంగ సభల్లో ఉపన్యాసాలు, చర్చలు, మొదలైనవి భావ ప్రకటన స్వేచ్ఛలో ఇమిడి ఉంటాయి.

19(1)(బి): శాంతియుతంగా, ఆయుధాలు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించుకునే స్వాతంత్ర్యం.

❖ సిక్కులు వారి మత సంప్రదాయాన్ని అనుసరించి ప్రార్థనా మందిరాల్లో వారివెంట కృపాణాన్ని (చిన్నకత్తిని) ధరించి శాంతియుతంగా సమావేశం కావచ్చు.

❖ శాంతిభద్రతలకు, జాతీయ సమైక్యతకు భంగం వాటిల్లే సందర్భాలు, హింసను ప్రేరేపించే సూచనలు ఉన్నప్పుడు ప్రభుత్వం పరిమితులు విధించవచ్చు.

❖ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో శాంతిభద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదముందని భావిస్తే 144వ సెక్షన్ విధించవచ్చు.

19(1)(సి): వివిధ సంస్థలు, వివిధ సంఘాలు ఏర్పాటు చేసుకునే విషయంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యం.

❖ ప్రతి పౌరుడు సర్వతోముఖాభివృద్ధిని సాధించేందుకు ఇతర పౌరులతో కలిసి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో తగిన సహకారం కోసం అవసరమైన సంస్థలు, సంఘాలు స్థాపించుకోవచ్చు.

ఉదా: రాజకీయ పార్టీలు, ఉపాధ్యాయ సంఘాలు, కార్మిక సంఘాలు, మొదలైనవి.

19(1)(డి): దేశవ్యాప్తంగా స్వేచ్ఛగా సంచరించే హక్కు.

19(1)(ఇ): భారత పౌరులు దేశంలో ఎక్కడైనా నివసించే, స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ.

19(1)(ఎఫ్): ఈ నిబంధన ఆస్తి స్వేచ్ఛకు (ఆస్తిని సంపాదించడం, పొందడం) సంబంధించింది. ప్రస్తుతం దీన్ని తొలగించారు.

19(1)(జి) నిబంధన: ఏ వృత్తినైనా, వ్యాపారాన్నైనా చేసుకునే స్వాతంత్ర్యం.

❖ 1951లో మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా 19వ నిబంధనలో రెండో భాగాన్ని చేరుస్తూ భావ ప్రకటన స్వేచ్ఛపై హేతుబద్ధమైన పరిమితులను 19(2)లో పేర్కొన్నారు.

❖ 19(1)వ నిబంధనలో పేర్కొన్న స్వేచ్ఛలను 19(2)లో పేర్కొన్న పరిమితులకు లోబడి ఉపయోగించుకోవాలి.

- దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు భంగం కలిగించకూడదు
- దేశ రక్షణ/దేశ భద్రతలకు భంగం వాటిల్లకూడదు
- విదేశాలతో స్నేహ సంబంధాలు
- శాంతిభద్రతలను పరిరక్షించాలి. హింసను ప్రోత్సహించకూడదు
- సభ్యత, మర్యాద, నైతికతకు భంగం కలిగించకూడదు
- కోర్టు ధిక్కరణ చేయరాదు
- పరువు నష్టం కలిగించరాదు
- ఏదైనా అపరాధ ప్రేరణకు, నేరానికి పురిగొల్పడం నిషేధం.

● పత్రికా రంగాన్ని ఫోర్త్ ఎస్టేట్‌గా అభివర్ణిస్తారు.

20వ నిబంధన

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం - ఇండియన్ పాలిటీ

ఈ నిబంధన నేరం, శిక్ష నుంచి రక్షణ పొందే హక్కును కల్పిస్తుంది.

20(1): కార్యానంతర శాసనాలపై రక్షణ/protection against Ex post facto laws

✦ ఈ నిబంధన ప్రకారం చట్టాన్ని ఉల్లఘించి నేరం చేసిన సందర్భాల్లో మాత్రమే నేరస్థుడిని శిక్షించాల్సి ఉంటుంది. శిక్షించే సమయానికి ఆ నేరానికి సంబంధించి చట్టంలో పేర్కొని ఉండాలి. చట్టంలో నిర్దేశించిన దానికంటే ఎక్కువ శిక్ష విధించరాదు.

20(2): ఒక వ్యక్తిని ఒకే నేరానికి ఒకసారి కంటే ఎక్కువసార్లు విచారించి శిక్షించకూడదు.

✦ ఒక వ్యక్తి చేసిన తప్పునకు ఒక పర్యాయం శిక్షపడి ఉంటే అదే



నేరానికి మరోసారి శిక్షించకూడదు. రెండు శిక్షలను న్యాయ పరిభాషలో 'డబుల్ జియోపార్డీ' అంటారు.

20(3): నేరారోపణకు గురైన వ్యక్తిని తనకు తాను వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పమని బలవంతం చేయరాదు.

21వ నిబంధన

వ్యక్తి ప్రాణం, స్వేచ్ఛకు రక్షణ హక్కు/జీవించే హక్కు.

◆ చట్టం ద్వారా నిర్ధారించిన పద్ధతి (procedure established by the law)లో కాకుండా ఇతర విధానాల్లో ఒక వ్యక్తి స్వేచ్ఛకు, ప్రాణానికి హాని తలపెట్టరాదు. ఈ అంశాన్ని జపాన్ నుంచి గ్రహించారు. ఈ పద్ధతి బ్రిటన్, ఐర్లాండ్ దేశాల్లోనూ అమల్లో ఉంది.

◆ దేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించినప్పుడు కూడా జీవించే హక్కును రద్దు చేసే అవకాశం రాష్ట్రపతికి లేదు.

ప్రముఖుల వ్యాఖ్యానాలు

◆ ఏ వ్యక్తికైనా ఎలాంటి వాతావరణంలో అయితే పరిపూర్ణ అభివృద్ధి సాధించే అవకాశం ఉంటుందో, ఆ వాతావరణమే స్వేచ్ఛ - హెచ్.జే. లాస్కి

◆ స్వాతంత్ర్యపు హక్కు భారత రాజ్యాంగానికి ఆత్మ లాంటిది. - జస్టిస్ సిక్రీ

21 (ఎ) నిబంధన: 6-14 ఏళ్ల బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను అందించాలని ఈ నిబంధన తెలియజేస్తుంది.

◆ 86వ రాజ్యాంగ సవరణ ద్వారా 2002లో ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా 21(ఎ) నిబంధన కింద రాజ్యాంగంలో పొందుపర్చారు.

◆ 2009లో విద్యాహక్కు చట్టాన్ని ప్రవేశపెట్టారు. 2010 ఏప్రిల్ 1 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది.

◆ 6-14 ఏళ్ల బాలబాలికలకు విద్యావకాశాలు కల్పించడం తల్లి లేదా తండ్రి లేదా సంరక్షకుడి బాధ్యత అనే అంశాన్ని ప్రాథమిక విధుల్లో 51(ఎ)(కె) అనే నిబంధన ద్వారా చేర్చారు.

22వ నిబంధన

ఈ నిబంధన నిర్బంధ నివారణ హక్కును కల్పిస్తుంది. అంటే అక్రమ అరెస్టులు, నిర్బంధాల నుంచి ఒక వ్యక్తి రక్షణ పొందే హక్కును తెలియజేస్తుంది.

22(1): అరెస్టు చేసిన ఏ వ్యక్తికైనా ఆ అరెస్టుకు సంబంధించిన కారణాలు తెలపాలి. అదేవిధంగా ప్రతి వ్యక్తికి తన వాదనను వినిపించుకునే అవకాశం కల్పించాలి.

22(2): అరెస్టైన వ్యక్తిని 24 గంటల్లోగా సమీపంలోని మెజిస్ట్రేట్ ఎదుట కోర్టులో హాజరుపర్చాలి. మెజిస్ట్రేట్ అనుమతి లేకుండా ఏ వ్యక్తిని 24 గంటలకు మించి నిర్బంధంలో ఉంచడానికి వీల్లేదు.

22(3): ఈ నిబంధన ప్రకారం 22(2) ద్వారా పొందిన హక్కుల నుంచి కింది వారికి మినహాయింపు ఉంది.

- అరెస్టయిన వ్యక్తి శత్రుదేశస్థుడు/తీవ్రవాది
- నివారక నిర్బంధ చట్టం కింద అరెస్టయిన వ్యక్తి.

22(4): సాధారణ పరిస్థితుల్లో పీడీ యాక్ట్ కింద అరెస్టయిన వ్యక్తిని సలహా బోర్డు అనుమతి లేకుండా 3 నెలలకు మించి నిర్బంధంలో ఉంచరాదు.

◆ హైకోర్టు న్యాయమూర్తులు లేదా దానికి సమాన హోదా ఉన్న వ్యక్తులతో ఏర్పాటైన సలహా సంఘం ఆ వ్యక్తిని నిర్బంధంలో కొనసాగించడం సమంజసమేనని ప్రభుత్వానికి నివేదిక పంపితే ఆ వ్యక్తిని 3 నెలలకు మించి కూడా నిర్బంధంలో ఉంచవచ్చు.

22(5): నిర్బంధ చట్టాల ప్రకారం అరెస్టయిన వ్యక్తికి అందుకు గల కారణాలను ప్రత్యేక చట్టాల ప్రకారం మాత్రమే తెలియజేయాలి.

22(6): కొన్ని సందర్భాల్లో ప్రజాశ్రేయస్సు దృష్ట్యా, చట్టం ఉన్నప్పటికీ కారణాలను వివరించాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు.

22(7): సలహాబోర్డు అనుమతి లేనప్పటికీ పార్లమెంట్ ప్రత్యేక చట్టం ద్వారా 3 నెలలకు మించి ఒక వ్యక్తిని నిర్బంధంలో ఉంచవచ్చు.

◆ కొన్ని రకాల కేసుల విషయంలో గరిష్ఠంగా పీడీ యాక్ట్ కాలపరిమితికి సంబంధించి శాసనాలు చేయవచ్చు. ఈ అధికారం పార్లమెంట్‌కు ఉంది.



రచయిత
డా. వి.కుమారస్వామి
విషయ నిపుణులు

Word of the Day — 908

Rescind

Telugu meaning: తిరస్కరించు, ఉపసంహరించు

English meaning: The word rescind (రిసిండ్) is a verb that means to officially cancel, withdraw, or revoke a law, decision, or agreement.

Synonyms: Revoke, Withdraw; ***Antonyms:*** Enforce, Approve

Usage: 1. The authorities decided to rescind the controversial order after widespread public criticism.

2. The company rescinded its earlier decision once new evidence came to light.



భారత రైల్వే మంత్రిత్వ శాఖ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) దేశవ్యాప్తంగా అన్ని రైల్వే జోన్లలో సుమారు 22,195 లెవల్-1 గ్రూప్ డి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు 2026 జనవరి 31 నుంచి మార్చి 2లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రి-రికార్డెడ్ వీడియో పాఠాలు, ఈబుక్స్, ప్రాక్టీస్ టెస్ట్స్‌తోపాటు డైలీ కరెంట్ అఫైర్స్ ఈనాడు ఈప్రతిభ 'రైల్వే పరీక్షల ప్రత్యేకం' కోర్సులో అందుబాటులో ఉన్నాయి. పూర్తి వివరాల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

నోటిఫికేషన్స్

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాలికట్ (ఎన్ఐటీసీ) ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ గ్రేడ్-II పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 15. అర్హులైన అభ్యర్థులు 2026 ఫిబ్రవరి 20లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..? కింది ఉద్యోగాలకు నేడే (ఫిబ్రవరి 1) చివరి తేదీ

- భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు ఉద్యోగాలు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులు అర్హులు.
- ఎగ్జిమ్ బ్యాంక్‌లో 40 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు. డిగ్రీ, సీఏ, పీజీ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

ఇండియన్ కోస్ట్ గార్డ్ డే

ఫిబ్రవరి 1 — చరిత్రలో ఈనాడు

భారతదేశం చుట్టూ మూడువైపులా సముద్రంతో అతిపెద్ద తీర రేఖను కలిగి ఉంది. దీంతో సముద్ర ప్రయోజనాలను కాపాడటం, మారిటైం (అడ్మిరల్టీ) చట్టాలను కచ్చితత్వంతో అమలు చేయడం ముఖ్యం. ఇందుకోసం ఏర్పాటైందే భారత తీర రక్షక దళం (ఇండియన్ కోస్ట్ గార్డ్). భారత తీరాలను సురక్షితంగా ఉంచడంలో, సముద్ర మండలాల్లో నిబంధనలను అమలు చేయడంలో ఇది ముఖ్యపాత్ర పోషిస్తోంది. దీని ఏర్పాటుకు గుర్తుగా ఏటా మన దేశంలో ఫిబ్రవరి 1న 'భారత తీర రక్షక దళ దినోత్సవం'గా (ఇండియన్ కోస్ట్ గార్డ్ డే) నిర్వహిస్తున్నారు. సముద్ర సమగ్రతను కాపాడటంతోపాటు జాతీయ భద్రతను ప్రోత్సహించడంలో కోస్ట్ గార్డ్ పాత్రను గౌరవించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.



సముద్ర చట్టం (Maritime law) అంటే?

మహాసముద్రాలు, సముద్రాల వినియోగాన్ని నియంత్రించే అంతర్జాతీయ నియమాలను సముద్ర చట్టం అంటారు. ఇందులో ముఖ్యంగా ప్రైవేట్ సముద్ర వ్యాపారం, షిప్పింగ్, నేరాలకు సంబంధించిన సమస్యలకు నియమాలు, ఒప్పందాలు ఉంటాయి. ఇది వివాదాలకు చట్టపరమైన చట్రాన్ని (ఫ్రేమ్‌వర్క్) అందిస్తుంది. ప్రపంచ వాణిజ్యానికి, సముద్ర వనరులు - నౌకల్లోని సిబ్బంది రక్షణకు ఈ చట్టం చాలా కీలకం.

చారిత్రక నేపథ్యం:

సముద్ర మార్గాల ద్వారా జరుగుతోన్న అక్రమ రవాణాను అడ్డుకోవడం, తీర ప్రాంతాల రక్షణే ధ్యేయంగా భారత ప్రభుత్వం 1977, ఫిబ్రవరి 1న భారత తీర రక్షక దళాన్ని ఏర్పాటు చేసింది. 1978, ఆగస్టు 18న భారత పార్లమెంట్ కోస్ట్ గార్డ్ చట్టం, 1978కి ఆమోదం తెలిపింది. తద్వారా దాని కార్యకలాపాలకు చట్టబద్ధమైన ఫ్రేమ్‌వర్క్ లభించింది. ఇండియన్ కోస్ట్ గార్డ్ ఏర్పాటుకు గుర్తుగా ఏటా ఫిబ్రవరి 1న 'ఇండియన్ కోస్ట్ గార్డ్ డే'గా నిర్వహించాలని 1978లో భారత ప్రభుత్వం తీర్మానించింది.

ఇండియన్ కోస్ట్ గార్డ్ ఏర్పాటు, విధులు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

రవాణా సౌకర్యాలు రైలు రవాణా



భారతదేశ రవాణా రంగంలో రైల్వే వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉంది. బ్రిటిష్ వారు తమ అవసరాల కోసం దేశంలో మొదటిసారి రైల్వే మార్గం వేశారు. తొలిసారిగా ఆవిరి ఇంజిన్‌తో నడిచిన రైలు నేడు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ముందుకు సాగుతోంది. రవాణా, ఆర్థిక రంగాల్లో బాసటగా నిలుస్తోంది. భారతీయ రైల్వే సుదూర ప్రాంతాలను కలుపుతూ, ప్రయాణికులను, సరకులను గమ్యస్థానాలకు చేర్చడంలో తోడ్పడుతోంది. దేశంలోని రైల్వే వ్యవస్థ, అనుబంధ సంస్థలు, జోన్లు, వంతెనలు, మార్గాలు, మెట్రో వ్యవస్థ తదితరాలపై అభ్యర్థులు అవగాహన కలిగి ఉండాలి.

ప్రపంచ రైల్వే పితామహుడిగా స్టీఫెన్‌సన్‌ను అభివర్ణిస్తారు. ఈయన 1814లో రైలు ఇంజిన్‌ను కనిపెట్టారు.

✦ ప్రపంచంలో మొదటి రైలుమార్గాన్ని 1825లో ఇంగ్లండ్‌లోని స్టాక్టన్, డార్లింగ్‌టన్ పట్టణాల మధ్య సుమారు 9 మైళ్ల దూరం నిర్మించారు. మొదటి రైలు వేగం 5 మైళ్లు/గంట.

భారతదేశ రైల్వే వ్యవస్థ

భారతదేశ రైల్వే పితామహుడిగా లార్డ్ డల్హౌసీని పేర్కొంటారు.

✦ భారత్‌లో మొదటి రైలు 1853 ఏప్రిల్ 16న గ్రేట్ ఇండియన్ పెనిన్సులర్ రైల్వే ఆధ్వర్యంలో బొంబాయి నుంచి థానే వరకు 34 కిలోమీటర్లు ప్రయాణించింది. నాటి గవర్నర్ జనరల్‌గా లార్డ్ డల్హౌసీ ఉన్నారు.

✦ దేశంలో రెండో రైలు హౌరా, హుగ్లీల మధ్య నడిచింది.

ముఖ్యమైన సొరంగ మార్గాలు


● పిర్‌పంజాల్/ బనిహాల్ రైల్వే టన్నెల్ ● కర్బుడే టన్నెల్

రైలు గేజుల వర్గీకరణ, ముఖ్యమైన రైల్వే వంతెనలు, మెట్రోరైల్ లేదా మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్, భారతదేశంలోని రైల్వేజోన్లు మొదలైన అంశాలు సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs



The National Commission for Women (NCW) organised 'Shakti Samvaad', an interactive and capacity-building meeting with State Women's Commissions (SWCs) at the Bharat Mandapam in New Delhi on 29 January 2026. All State Women's Commissions across the country were participated in this meeting.



The Reserve Bank of India (RBI) has signed a Memorandum of Understanding (MoU) with the European Securities and Markets Authority (ESMA) during the recent visit of the President of the European Council and the President of the European Commission to India. The Ministry of Finance stated that the primary objective of the MoU is to enable formal recognition of the Clearing Corporation of India Limited (CCIL) and other RBI-regulated Central Counterparties (CCPs) by ESMA. The MoU is effective from the date of signing by the Authorities and will remain operative for an unlimited period.

The Indian Navy and the Japan Maritime Self-Defence Force (JMSDF) discussed ways to enhance maritime cooperation and inter-operability, while promoting a collaborative approach towards a free and open Indo-Pacific, at the 11th edition of the Staff Talks in New Delhi on 30 January 2026. The talks were co-chaired by Assistant Chief of Naval Staff (Foreign Cooperation and Intelligence) Rear Admiral Srinivas Maddula and JMSDF Director General (Operations and Plans) Rear Admiral Toshiyuki Hirata.

For more Current Affairs: Scan QR code

Grid

1.

6	4	3	27
9	2	1	19
8	9	2	?
4	5	6	26

A) 44 B) 56 C) 74 D) 68

2.

6	7	2	26
9	8	4	?
11	3	1	14
4	8	3	36

A) 68 B) 74 C) 88 D) 34

3.

4	8	12	24
9	3	8	?
6	2	2	10
10	12	20	42

A) 56 B) 44 C) 34 D) 20

4.

4	5	9	11
6	2	2	4
3	1	3	6
M	?	N	U

A) L B) J C) H D) G

5.

14	16	20	50
32	3	4	?
40	1	5	46
16	6	3	25

A) 50 B) 32 C) 12 D) 39

Railway Exams

Reasoning

6.

32	40	52	64
12	10	8	12
3	6	3	6
23	36	?	58

A) 82 B) 63 C) 58 D) 47

7.

6	3	2	16
14	4	5	?
12	2	6	18
10	1	3	7

A) 66 B) 51 C) 72 D) 81

8.

4	8	12	40
11	3	6	63
15	10	8	?
22	14	6	118

A) 161 B) 184 C) 110 D) 113

9.

2	8	9	109
6	11	4	174
7	4	3	?
8	3	6	116

A) 714 B) 002 C) 113 D) 815

10.

4	5	8	3
2	6	11	9
3	9	2	6
18	40	?	36

A) 31 B) 62 C) 42 D) 56

11.

5	6	9	51
3	11	10	41
8	4	12	?
9	6	10	96

A) 64 B) 48 C) 120 D) 100

12.

6	4	1	11
7	3	8	2
8	2	9	3
U	?	R	S

A) I B) K C) Z D) V

13.

A	C	D	8
F	G	K	24
M	L	P	?
N	O	T	49

A) 34 B) 66 C) 41 D) 56

14.

4	5	6	120
7	8	9	504
11	3	6	198
5	8	4	?

A) 316 B) 420 C) 128 D) 160

15.

4	5	1	1010
3	2	11	1616
6	8	5	1919
3	2	3	?

A) 88 B) 1034 C) 9999 D) 66

16.

C	A	P	?
L	M	G	32
K	I	T	40
F	R	P	40

A) 38 B) 44 C) 16 D) 20

17.

14	3	2	40
22	6	3	?
31	7	8	209
12	3	4	32

A) 141 B) 129 C) 113 D) 126


18.

20	30	16	17
10	12	14	18
4	5	6	5
?	37	24	30

A) 26 B) 37 C) 24 D) 30

Scan the QR code for Key

These model questions were prepared by subject experts



ఒక్క ఊరు..

‘గ’ అక్షరంతోనే 1600 మంది పేర్లు

నిర్మల్ జిల్లా కుంటాల గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. అక్కడి జనాభా 4,000పైగా ఉండగా అందులో దాదాపు 1600 మంది పేర్లు ‘గ’ అనే అక్షరంతోనే మొదలవుతాయి. ఎందుకంటే ఈ గ్రామంలో దశాబ్దాల చరిత గల గజ్జలమ్మ ఆలయం ఉంది. ఊరిలో పుట్టిన వారికి అమ్మవారి పేరు పెడితే మంచి జరుగుతుందని స్థానికుల నమ్మకం. దీంతో గజ్జారాం, గజ్జన్న, గజ్జయ్య, గజేందర్, గజ్జవ్వ, గజలవ్వ, గజక్క అనే పేర్లు ఆనవాయితీగా అన్ని ఇళ్లలో ఉంటాయి. ఇంట్లో ముగ్గురుంటే పెద్ద గజ్జారాం, నడిపి గజ్జారాం, చిన్న గజ్జారాం, ఆడవారైతే కూడా పెద్ద గజ్జవ్వ, నడిపి గజ్జవ్వ, చిన్న గజ్జవ్వ అని సంబోధిస్తుంటారు. ప్రస్తుతం పుట్టిన ఆడ, మగ బిడ్డలకు ముందుగా అమ్మవారి నామకరణ చేసి తర్వాత పాఠశాలలో చేరిన సమయంలో కొందరు పేరులో మార్పు చేసుకుంటున్నారు. –న్యూస్‌టుడే, కుంటాల

ఉద్యోగుల సమస్యలపై పోస్టుకార్డు ఉద్యమం: యూటీఎఫ్


ఈనాడు, అమరావతి: వేతన సవరణ కమిషన్ ఛైర్మన్‌ను నియమించాలని, మధ్యంతర భృతి 29% ప్రకటించాలనే డిమాండ్ల సాధనకు ‘పోస్టు కార్డు’ ఉద్యమం నిర్వహించనున్నట్లు ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు పంపించడంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సమస్యలతో కూడిన వినతిపత్రాలు సమర్పించనున్నట్లు వెల్లడించారు. శనివారం విజయవాడలో సీఎంకు పంపించనున్న పోస్టుకార్డుల నమూనాను ఆవిష్కరించి వారు మాట్లాడారు. ‘జులై 2023 నుంచి 12వ పీఆర్సీ అమలు కావాల్సి ఉంది. కానీ, ఇంత వరకు కమిషన్ ఏర్పాటు చేయలేదు. అధికారంలోకి రావడానికి ముందు సకాలంలో డీఏలు, మెరుగైన పీఆర్సీ ఇస్తామని చెప్పినా.. ఇంతవరకూ ఇవ్వలేదు’ అని చెప్పారు. ప్రభుత్వం స్పందించకపోతే ఫిబ్రవరి 17న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.

గద్దర్‌కు పవన్‌కల్యాణ్ నివాళులు

ఈనాడు, అమరావతి: ప్రజా గాయకుడు గద్దర్ జయంతి సందర్భంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శనివారం ఒక ప్రకటనలో నివాళులు అర్పించారు. ‘గద్దర్ కేవలం ఒక గాయకుడు మాత్రమే కాదు. సమాజానికి ఆత్మలాంటి వారు. గొంతులేని వారి తరఫున ఆయన ధైర్యంగా గొంతెత్తారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర ఎనలేనిది. గద్దర్ చివరి రోజుల్లో ఆయనతో సన్నిహితంగా మెలగడం ఎన్నటికీ మరిచిపోలేను’ అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై పోరాడి.. మృత్యు ఒడికి

- నిమ్స్‌లో చికిత్స పొందుతూ ఎక్సైజ్ కానిస్టేబుల్ కన్నుమూత



గాజుల సౌమ్య

నిమ్స్, న్యూస్‌టుడే: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకునేందుకు ప్రాణాల్ని సైతం లెక్కచేయలేదామె. ఆ ప్రయత్నంలో తీవ్రంగా గాయపడ్డారు. మృత్యువుతో పోరాడి చివరికి ఓడిపోయారు. తెలంగాణలోని నిజామాబాద్‌లో జనవరి 23న గంజాయి అక్రమ రవాణాదారులు. . వాహనంతో ఢీకొట్టి, తొక్కించేసిన ఘటనలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య(25) పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. సౌమ్యను తొలుత నిజామాబాద్‌లోనే ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా.. చికిత్సలో భాగంగా అక్కడే ఓ కిడ్నీని తొలగించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం అందించేందుకు జనవరి 25 అర్ధరాత్రి నిమ్స్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ఆర్ఐసీయూలో చేర్చుకొని వైద్యం అందించారు. అత్యవసర విభాగం, నెఫ్రాలజీ, కార్డియాలజీ, మెడికల్ గ్యాస్ట్రో, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాల ప్రత్యేక వైద్య బృందం పర్యవేక్షణలో వెంటిలేటర్‌పై చికిత్స అందించారు.

సౌమ్య పరిస్థితిపై మంత్రులు దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ఇతర ప్రముఖులు ఆరా తీస్తూ ఆమె కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. ఆమెను కాపాడేందుకు వైద్యబృందం తీవ్రంగా శ్రమించినా ఫలితం దక్కలేదు. 2024 బ్యాచ్ కానిస్టేబుల్ జి.సౌమ్య (22) స్వగ్రామం నిజామాబాద్ జిల్లాలోని మోస్రా మండల కేంద్రం. ఆమె తల్లిదండ్రులు మసాలా దినుసులు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. కుమార్తెను కష్టపడి చదివించారు. ఎక్సైజ్ శాఖలో చేరి.. సుమారు ఏడాది కాలంలోనే సౌమ్య దుండగుల దౌర్జన్యానికి బలైపోయారు.

‘ఆపరేషన్ స్మైల్’లో 5,582 మంది చిన్నారులకు విముక్తి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, తప్పిపోయిన చిన్నారుల గుర్తింపు కోసం జనవరి నెలంతా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా 5,582 మంది చిన్నారులకు విముక్తి కలిగించినట్లు రాష్ట్ర మహిళా భద్రత విభాగం అదనపు డీజీపీ చారుసిన్హా శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ‘విముక్తి పొందిన వారిలో 5,108 మంది బాలురు, 474 మంది బాలికలున్నారు. మొత్తం మందిలో 2,292 మంది బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ సహా 15 రాష్ట్రాలకు చెందినవారున్నారు. 4,567 మంది బాల కార్మికులుగా, 486 మంది వీధిబాలలుగా, 38 మంది భిక్షాటన చేస్తున్నట్లు, మరో 491 మంది ఇతర పనుల్లో మగ్గినట్లు గుర్తించాం. వీరిలో 4,978 మంది చిన్నారులను తల్లిదండ్రుల వద్దకు చేర్చి.. మరో 604 మందిని రక్షణ గృహాల్లోకి తరలించాం. చిన్నారులతో పనులు చేయిస్తున్న నేరాల్లో 1,480 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి 1,483 మందిని అరెస్టు చేశాం’ అని అదనపు డీజీపీ పేర్కొన్నారు.

రాబట్టాల్సిన నిధులకు బేరాలా!

- వైకాపా ప్రభుత్వంలో ‘ఉపాధి’లో అక్రమాలు రూ.43 కోట్లు
- బాధ్యులపై చర్యలు తీసుకోకుండా డ్వామా పీడీల నిర్లక్ష్యం

ఈనాడు, అమరావతి: ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన అధికారులు, సిబ్బంది నుంచి నిధులు రికవరీ చేయడంలో జిల్లా జలయాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్లు కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అక్రమాలపై క్షేత్రస్థాయిలో ఆడిట్ చేసి సామాజిక తనిఖీల విభాగం నివేదికలు ఇచ్చినా అధికారుల్లో కదలిక లేదు. వైకాపా ప్రభుత్వంలో రూ.43.13 కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయి. వీటిలో 30% కూడా రికవరీ చేయలేదు. అక్రమార్కులకు పీడీలు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో శ్రామికులకు పని కల్పించే క్రమంలో 2019-20 నుంచి 2023-24 మధ్య పెద్దఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయి. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, సిబ్బందిని వైకాపా నేతలు భయపెట్టి వారి ద్వారా అవకతవకలకు తెగబడ్డారు. దొంగ మస్తర్లు వేయడం, తక్కువ పనికి ఎక్కువ కొలతలు చూపడం, శ్రామికులతో చేయించాల్సి పనులకు యంత్రాలు వినియోగించి నిబంధనలకు పాతరేశారు. అడ్డుకోవాల్సిన అప్పటి మండల, జిల్లా స్థాయి అధికారుల నుంచి రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారుల వరకు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారు. పనులు తనిఖీ చేసిన సోషల్ ఆడిట్ బృందాలు వీటిలో అక్రమాలు గుర్తించాయి. ఐదేళ్లలో 43,928 కేసుల్లో నిబంధనలు ఉల్లంఘించడం ద్వారా రూ.43.13 కోట్లు దుర్వినియోగమైనట్లు తేల్చారు. గ్రామ సభలు, ప్రజాభిప్రాయ సేకరణలోనూ వీటిని నిర్ధారించారు.

ఇప్పటికీ అదే పీడీల కొనసాగింపు

- అవకతవకలకు పాల్పడిన వారి నుంచి నిధులు రికవరీ చేయాల్సిన డ్వామా పీడీల్లో కొందరికి పట్టడం లేదు. అక్రమార్కులతో కుమ్మక్కై దస్త్రాలు పక్కన పెడుతున్నారు. వైకాపా ప్రభుత్వంలో పీడీలుగా పని చేసిన వారే ఇప్పటికీ కొన్ని జిల్లాల్లో కొనసాగుతున్నారు. ఇంకొందరికి జిల్లాలు మాత్రమే మారాయి. రికవరీల విషయంలో వీరు నిర్లిప్తంగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వంలో పీడీలుగా నియమితులైన వారిలోనూ కొందరు క్రమంగా పక్కదారి పడుతున్నారన్న ఫిర్యాదులున్నాయి. అవకతవకలకు పాల్పడ్డ వారిలో పలువురు క్షేత్ర, సాంకేతిక సహాయకులు, సహాయ పథక సంచాలకులు ఉన్నారు. నిధుల రికవరీ ఊసెత్తకుండా పీడీలతో వీరు బేరాలు కుదుర్చుకున్నారని తెలుస్తోంది.

ఉపాధి హామీ పనుల్లో నిధుల దుర్వినియోగం ఇలా..

ఏడాది	కేసుల సంఖ్య	దుర్వినియోగమైన నిధులు (రూ.కోట్లలో)
2019-20	6,290	4.78
2020-21	4,382	2.29
2021-22	12,533	7.89
2022-23	8,788	4.86
2023-24	11,935	23.31
మొత్తం	43,928	43.13

కేసులు డ్రాప్ చేసేస్తున్నారు...

- కొందరు పీడీలు మరో అడుగు ముందుకేసి రికవరీలే అవసరంలేదని కేసులు డ్రాప్ చేసేస్తున్నారు. పర్సనల్ హియరింగ్‌లో బాధ్యులు తగిన ఆధారాలు సమర్పించారని చెప్పి క్లీన్ చిట్ ఇచ్చేస్తున్నారు. ఈ విధంగా గత 18 నెలల్లో కోట్ల రూపాయిల రికవరీలను పీడీలు డ్రాప్ చేశారు.
- ఉత్తరాంధ్రలో ఒకరు, ఉభయ గోదావరి జిల్లాల్లో మరొకరు, మధ్య ఆంధ్రలో ఇద్దరు, రాయలసీమ జిల్లాలో ఇంకో ఇద్దరు పీడీలు అక్రమార్కులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వీటి వెనుక భారీగా ముడుపుల వ్యవహారం నడుస్తోంది.
- కొందరు పీడీల విషయంలో ఫిర్యాదులొస్తున్నా మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిడితో అలాంటి వారిని ఉన్నతాధికారులు కూడా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పీడీలు డ్రాప్ చేస్తున్న కేసులపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేయిస్తే చాలామంది అవినీతి బాగోతం వెలుగులోకి రానుంది.

తలమానికంగా వైమానిక ప్రదర్శన



బేగంపేట విమానాశ్రయంలో అంతర్జాతీయ వైమానిక ప్రదర్శన.. వింగ్స్ ఇండియా-2026 శనివారంతో ఘనంగా ముగిసింది. ప్రదర్శనకు ఉంచిన విభిన్న రకాల విమానాలు, హెలికాప్టర్లను... రోమాలు నిక్కబొడుచుకునేలా ఆకాశంలో మార్క్ జెఫ్రీ బృందం నిర్వహించిన విమాన విన్యాసాలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.
–ఈనాడు, హైదరాబాద్

వస్త్ర వ్యాపారిపై కాల్పులు.. రూ.6 లక్షలతో పరారీ

- కోఠి ఎస్బీఐ ఏటీఎం వద్ద దుండగుల ఘాతుకం







వ్యాపారి రిన్షాద్ ★దోపిడీకి ముందు మాట్లాడుకుంటున్న నిందితుల సీసీ ఫుటేజీ చిత్రం ★ కాల్పులు చోటు చేసుకున్న కోఠి ఎస్బీఐ ఏటీఎం కేంద్రం వద్ద రక్తపు మరకలు

ఈనాడు, హైదరాబాద్-న్యూస్‌టుడే, సుల్తాన్‌బజార్, అంబర్‌పేట, బేగంబజార్: హైదరాబాద్‌లోని కోఠి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) ఏటీఎం కేంద్రం వద్ద శనివారం ఉదయం తుపాకీ కాల్పులు కలకలం సృష్టించాయి. డిపాజిట్ మిషన్‌లో నగదు జమ చేసేందుకు వెళ్లిన వస్త్ర వ్యాపారిపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపి రూ.6 లక్షల సొమ్మున్న బ్యాగు లాక్కొని పారిపోయారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కేరళలోని కోజికోడ్‌కు చెందిన వస్త్ర వ్యాపారి రిన్షాద్(26) తరచూ హైదరాబాద్ వచ్చి హోల్‌సేల్‌గా రెడీమేడ్ దుస్తులు కొనుగోలు చేస్తుంటారు. ఇందు కోసం నాంపల్లిలోని జనతా అపార్ట్‌మెంట్స్‌లో ఫ్లాట్ తీసుకొని నివాసం ఉంటున్నారు. జనవరి 7న రూ.6లక్షలతో నగరానికి వచ్చారు. వ్యాపారులతో బేరం కుదరకపోవటంతో కొనుగోలు కుదరలేదు. శనివారం ఉదయం 6:40 గంటలకు ద్విచక్రవాహనం తీసుకొని నాంపల్లి నుంచి డబ్బులున్న బ్యాగుతో బయల్దేరారు. 7 గంటలకు కోఠి బ్యాంక్‌స్ట్రీట్‌లోని ఎస్బీఐ ఏటీఎం కేంద్రం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడి బస్టాప్‌లో కూర్చున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు రిన్షాద్‌కు దగ్గరగా వెళ్లాడు. డబ్బు బ్యాగును గమనించి మరో వ్యక్తిని కూడా రమ్మని సైగ చేశారు. ఇద్దరూ మాస్కులు పెట్టుకొని, వ్యాపారి కడుపులో తుపాకీ పెట్టి చేతిలో నగదు బ్యాగును, ద్విచక్రవాహనం తాళాలు లాక్కున్నారు. అనంతరం బైకు ఎక్కి పారిపోతుండగా.. వ్యాపారి పట్టుకునేందుకు ప్రయత్నించారు. నిందితులు అతనిపై రెండురౌండ్లు కాల్పులు జరపడంతో కుడికాలికి తూటా తగిలి గాయమైంది. ఆపై నిందితులిద్దరూ కోఠి మీదుగా చాదర్‌ఘాట్ వైపు, అక్కడ నుంచి నింబోలీఅడ్డా వైపు నుంచి కాచిగూడ చేరారు. సమీపంలోని దుకాణంలో వస్త్రాలు కొనుగోలు చేసి మార్చుకున్నారు. బాధితుడి ద్విచక్రవాహనం అక్కడే వదిలేసి ఆటోలో కాచిగూడ రైల్వేస్టేషన్ చేరారు. కొద్దిసేపటి తరువాత బయటకొచ్చి ఆటోలో పాతబస్తీ వైపు వెళ్లినట్టు సీసీ టీవీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు తేల్చారు. అదనపు సీపీ శ్రీనివాసులు, ఖైరతాబాద్ డీసీపీ శిల్పవల్లి, అదనపు డీసీపీ ఆనంద్, ఏసీపీ మట్టయ్య, ఇన్‌స్పెక్టర్ నరసింహ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని నగర సీపీ వీసీ సజ్జనర్ తెలిపారు.


అంతర్రాష్ట్ర ముఠా పనేనా?

వస్త్ర వ్యాపారిపై కాల్పులకు తెగబడింది అంతర్రాష్ట్ర దోపిడీదారులుగా పోలీసులు భావిస్తున్నారు. దిల్లీ, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దొంగలు దేశవాళీ పిస్తోలుతో ఇలానే భయపెట్టి దోపిడీలకు పాల్పడుతుంటారు. నిందితులను ఆటోలో తీసుకెళ్లిన ఆటోడ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా.. వారి యాసను బట్టి దిల్లీకి చెందిన వారిగా అనిపించిందని చెప్పినట్లు సమాచారం. పోలీసులను ఏమార్చేందుకు దుస్తులు మార్చుకోవడంతోపాటు కాచిగూడ రైల్వేస్టేషన్ వరకూ వెళ్లి రైల్లో పారిపోయినట్టు నమ్మించే ప్రయత్నం చేశారు. కేరళలో వ్యాపారం చేస్తున్న రిన్షాద్ ఇక్కడ నివాసం ఉండటం, అంత పెద్దఎత్తున నగదును జమ చేసేందుకు వెళ్లటంపైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. వ్యాపారి కదలికలను గమనిస్తూ దుండగులు ముందుగానే ఏటీఎం బస్టాప్‌లో పాగావేశారా! అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న బాధితుడు కోలుకున్నాక పూర్తి వివరాలు రాబడతామని పోలీసులు తెలిపారు.

‘అహింసా పట్టు’.. జాతీయ ట్రెండు

పట్టు వస్త్రాలంటే అందరికీ మక్కువే. అందులోనూ బెనారసీ, కంచి, మైసూర్.. తదితర పట్టుచీరలంటే మహిళలకు మరింత ప్రియం. ఈ వస్త్రాల తయారీలో వేర్వేరు నైపుణ్యాలున్నా.. పట్టు సేకరణలో ఒకే విధానం ఉంటుంది. పట్టు తంతువు పొడవుగా లభించాలంటే పురుగు బయటకు రాకముందే మరిగే నీటిలో పట్టుగూడు (కకూన్)ను వేసి దారం (తంతువు) తీస్తారు. వేడి నీటిలో వేయడంతో పురుగు చనిపోతుంది. దీనికి భిన్నంగా పురుగును చంపకుండా తీసే పట్టుకు ‘అహింసా పట్టు’ అని పేరొచ్చింది. దీన్ని ఎరి పట్టు అంటారు. ఈ ప్రక్రియలో చిమ్మట (పురుగు)ను పట్టుగూడు నుంచి వేరుచేసి గూడును మాత్రమే వేడినీటిలో మరిగించి దారం తీస్తారు. ఈ ప్రక్రియలో పొడవైన తంతువు రాదు. చిన్న ముక్కలుగా విరిగిపోతుంది. వీటిని మెలివేసి పట్టు నూలు తయారు చేస్తారు. ఇది సాధారణ పట్టు కంటే కాస్త గట్టిగా, మృదువుగా ఉంటుంది. గూడు నుంచి వేరుచేసిన పురుగులు మళ్లీ గుడ్లు పెడతాయి.

ఎరి అంటే.. ఆముదం (హిందీలో ఎరండీ అంటారు) ఆకులను ఈ పట్టుపురుగులకు ఆహారంగా వేస్తారు. అందుకే వీటిని ఎరి పట్టు పురుగులంటారు. ఈ పట్టు రకాన్ని ‘ఎరి పట్టు’ అని పిలుస్తారు. ఈ వస్త్రాలను ఎక్కువగా ఈశాన్య రాష్ట్రాలైన అరుణాచల్



ప్రదేశ్, అస్సాం, మణిపుర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, త్రిపుర, సిక్కింలలో తయారు చేస్తుంటారు. తరాలుగా ఈ కళను (విధానాన్ని) పరిరక్షిస్తున్న మేఘాలయలోని ఖాసీ సమాజాన్ని ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రశంసించారు. గణతంత్ర దినోత్సవంలో... ముఖ్య అతిథులుగా విచ్చేసిన యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లెయన్, కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ పట్టుతో తయారు చేసిన కండువాలు ధరించిన విషయం తెలిసిందే.
– ఈనాడు ప్రత్యేక విభాగం

ప్రియుడి భార్య, కుమారుడిపై పెట్రోలు పోసి నిప్పంటించిన మహిళ

తల్లి, ఆరునెలల బిడ్డ మృతి..



మృతులు అద్విక్, మమత

నాంపల్లి, న్యూస్‌టుడే: వివాహేతర బంధానికి అడ్డొస్తున్నారని, ఎలాగైనా తొలగించుకోవాలనే దురుద్దేశంతో ఓ మహిళ..ప్రియుడి భార్య, ఆమె బిడ్డ(ఆరు నెలల పసికందు)పై పెట్రోల్ పోసి నిప్పంటించింది. ఈ దారుణ ఘటన తెలంగాణలోని నల్గొండ జిల్లా కేతేపల్లిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుందేళ్ల నగేశ్, మర్రిగూడ మండలం సరంపేటకు చెందిన మమత(25)లకు 2019లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. కొన్నేళ్లుగా నగేశ్‌కు అదే గ్రామానికి చెందిన మీసాల సుజాత(40)కు మధ్య వివాహేతర సంబంధం నడుస్తోంది. ఈ నేపథ్యంలో నగేశ్ భార్యను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న సుజాత శనివారం సంచిలో కత్తి, కారం డబ్బా, పెట్రోల్ సీసాతో నగేశ్ ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అతడు ఇంట్లో లేడు. ఇంట్లో మమత తన చిన్న కుమారుడు అద్విక్‌కు పాలు పడుతుండగా సుజాత వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను వారిపైపోసి నిప్పంటించింది. మంటలు వ్యాపించి మమత అగ్నికి ఆహుతవ్వగా..అద్విక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని హైదరాబాద్ నిలోఫర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

మురికి మాటలు తగవు

- అంబటి బూతుల వెనుక జగన్
- రాష్ట్రంలో అశాంతిని సృష్టించాలనే కుట్ర
- వైకాపాపై తెదేపా, జనసేన నేతల ధ్వజం

ఈనాడు, అమరావతి, దిల్లీ: సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు దారుణమని పలువురు నేతలు ధ్వజమెత్తారు. ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అంబటి నీచత్వానికి నిదర్శనం

– వర్ల రామయ్య, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు

వైకాపా రాజకీయ పార్టీనా.. రౌడీల గ్యాంగా? సీఎం చంద్రబాబును దూషించడం అంబటి రాంబాబు నీచత్వానికి నిదర్శనం. అంబటి అశ్లీల భాష మాట్లాడుతుంటే జగన్ ఏం చేస్తున్నారు? రాష్ట్రంలో అశాంతిని సృష్టించాలనేది వైకాపా ప్రణాళిక.

జగనే నడిపిస్తున్నారు

– గోరంట్ల బుచ్చయ్యచౌదరి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు

రంకెలేయడం అంబటి రాంబాబుకు అలవాటే. ఆయన మంత్రిగా పని చేసిన వ్యక్తా?.. లేదంటే వీధి రౌడీనా? అంబటి వ్యాఖ్యలతో వైకాపా బూతుల పార్టీ అని మరోసారి రుజువైంది. దిక్కుమాలిన చర్యలతో.. పనికిమాలిన చేష్టలతో రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని వైకాపా ప్రయత్నిస్తోంది. జగన్ ముందుండి నడిపిస్తున్నారు.

క్షమాపణ చెప్పకపోతే బడితె పూజ

– నాదెండ్ల బ్రహ్మం, తెదేపా రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి

అంబటి రాంబాబు రాజకీయ పతనం మొదలైంది. తప్పుచేసిన ఏ ఒక్కరినీ కూటమి ప్రభుత్వం వదలదు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్షమాపణ చెప్పకపోతే తెదేపా కార్యకర్తలు బడితె పూజ చేస్తారు.

సభ్యసమాజం అసహ్యించుకుంటోంది

– కలిశెట్టి అప్పలనాయుడు, ఎంపీ, విజయనగరం

అంబటి వ్యాఖ్యలు సభ్యసమాజం అసహ్యించుకునేలా ఉన్నాయి. వైకాపా బరితెగింపు విధానానికి, నిర్లజ్జతనానికి అద్దంపడుతున్నాయి. చంద్రబాబును ప్రధాని మోదీతోపాటు దేశ, విదేశీ నాయకులు, పారిశ్రామికవేత్తలు గౌరవిస్తుంటే వైకాపా వారు తట్టుకోలేకపోతున్నారు. దిగజారుడు భాష ప్రయోగిస్తున్నారు. 11 సీట్లకే పరిమితం చేసినా గుణపాఠం నేర్చుకున్నట్లు లేదు.

రాజకీయ సంస్కృతికి మచ్చ

– సీఎం రమేశ్, ఎంపీ, అనకాపల్లి

వ్యక్తిత్వ హననం చేసే భాషను ప్రజాస్వామ్యం ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. సీఎం చంద్రబాబుపై అంబటి దిగజారి మాట్లాడటం రాజకీయ సంస్కృతికి మచ్చ. బహిరంగ క్షమాపణ చెప్పకపోతే ప్రజల ఆగ్రహంతోపాటు చట్టపరమైన చర్యలు తప్పవు.

వైకాపా డీఎన్ఏలోనే లోపం

– పి.హరిప్రసాద్, ఎమ్మెల్సీ, జనసేన

అంబటి రాంబాబు ప్రజాజీవితంలో ఉండే అర్హత కోల్పోయారు. సీఎం చంద్రబాబు గౌరవ మర్యాదలకు భంగం కలిగించేలా మాట్లాడిన అతనిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. వైకాపా డీఎన్ఏలోనే లోపం ఉంది. ఆ పార్టీ అధ్యక్షుడూ దిగజారి, కనీసం మర్యాద, సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారు.

‘బాకీకి భూమి’ పేరుతో... ఉద్యోగులకు నివాస స్థలాలివ్వాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్

ఈనాడు, అమరావతి: ‘ఉద్యోగులకు పేరుకుపోయిన రూ.వేల కోట్ల బకాయిల చెల్లింపునకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. లేనిపక్షంలో ప్రత్యామ్నాయంగా ‘‘బాకీకి భూమి’’ పేరుతో నివాస స్థలాలు ఇవ్వాలి’ అని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేఆర్ సూర్యనారాయణ, ఎం.రమేశ్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పింఛన్‌దార్ల బకాయిల చెల్లింపు, పీఆర్సీ, డీఏ, ఈఎల్ మంజూరు తదితర అంశాలపై ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు ఉద్యోగులు, పింఛన్‌దార్ల సమస్యలపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. ‘ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛన్‌దార్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ.35 వేల కోట్లు. నాలుగు విడతల డీఏ, సరెండర్ లీవ్‌లు, వేతన సవరణ తదితర ప్రయోజనాలకు మరిన్ని వేల కోట్లు చెల్లించాల్సి వస్తుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఈ చెల్లింపు ప్రభుత్వానికి అసాధ్యంగా మారింది. ప్రత్యామ్నాయ పరిష్కార మార్గంగా ‘‘బాకీకి భూమి’’ అనే ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించాం. వేతన సవరణ కమిషన్‌ను వెంటనే నియమించాలి’ అని కోరారు.

ఇంటి పెద్ద కర్కశత్వం!

- తల్లి, రెండో కుమారుడి తలలపై బాది హత్య
- కుమారులకు వివాహాలు కావడం లేదని ఘాతుకం
- ఆపై తానూ ఉరేసుకొని ఆత్మహత్య



సురేశ్



యశోద



సత్తయ్య

బెజ్జంకి, న్యూస్‌టుడే: కుమారులకు వివాహాలు కావడం లేదని ఓ ఇంటిపెద్ద కిరాతకంగా మారాడు. జన్మనిచ్చిన తల్లిని, కన్న కొడుకునే దారుణంగా హతమార్చి ఆపై తానూ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తెలంగాణలోని సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం వడ్లూర్‌లో శనివారం జరిగిన ఈ ఘటన కలకలం రేపింది. బాధితులు, పోలీసుల సమాచారం ప్రకారం.. గ్రామానికి చెందిన జక్కని సత్తయ్య(65), దేవవ్వ దంపతులు హోటల్ నడిపిస్తూ ఉపాధి పొందుతున్నారు. వారికి నరేశ్, సురేశ్(35), రాజేశ్ సంతానం. నరేశ్‌కు 12 ఏళ్ల క్రితం వివాహం కాగా భార్య, ఇద్దరు బిడ్డలతో కరీంనగర్‌లో ఉంటున్నారు. రెండో కుమారుడు సురేశ్ అక్కడే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా, మూడో కుమారుడు రాజేశ్ సిరిసిల్లలో ఆటో మెకానిక్‌గా పని చేస్తున్నారు. సురేశ్‌కి కొన్నేళ్లుగా పెళ్లి సంబంధాలు చూస్తుండగా ఎక్కడా కుదరడం లేదు. హోటల్ బంద్ చేసి ఏడాది పాటు సత్తయ్య.. కుటుంబంతో సహా సిరిసిల్లకు వెళ్లి ఉంటూ అక్కడా పెళ్లి సంబంధాలు చూసినా ఖాయం కాలేదు. దీంతో రాజేశ్‌కు సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. ఏడాదైనా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో సత్తయ్యకు.. కుటుంబసభ్యులకు పలుమార్లు గొడవలు తలెత్తాయి. శనివారం దేవవ్వకు పంటినొప్పి ఎక్కువ కావడంతో ఉదయమే సిరిసిల్లలోని ఆస్పత్రికి వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో భర్త సత్తయ్య, ఆయన తల్లి యశోద(96), రెండో కుమారుడు సురేశ్ ఉన్నారు. సాయంత్రం రాజేశ్‌తో కలిసి దేవవ్వ ఇంటికి రాగా యశోద, సురేశ్ మృతిచెంది కన్పించారు. తలలకు బలమైన గాయాలు కాగా తీవ్ర రక్తస్రావమైంది. సత్తయ్య మరో గదిలో ఉరేసుకొని కనిపించాడు. అతడి వద్ద లభించిన ఓ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్, ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ శ్రీను, ఎస్సై సౌజన్య చేరుకొని విచారణ చేపట్టారు.

రెండో కొడుకు దగ్గర నుంచి వచ్చి.. విగతజీవిగా మారి..

వృద్ధాప్యంతో బాధపడుతున్న యశోదకు ఇద్దరు కుమారులు ఉండగా సత్తయ్య పెద్దవాడు. చిన్న కుమారుడు రవీందర్ కరీంనగర్‌లో మందుల దుకాణంలో పని చేస్తూ అక్కడే కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. యశోద పోషణ బాధ్యతలను ఇద్దరు కుమారులు నెల రోజుల చొప్పున పంచుకోగా శుక్రవారమే రవీందర్ ఆమెను వడ్లూర్‌లోని ఇంటి వద్ద దించి వెళ్లాడు.